శ్రీమదాంధ్రవచన సామవేద సంహిత

—అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య

యస్య నిః శ్వసితం వేదా యోవేదేభ్యో2ఖిలం జగత్!
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థ మహేశ్వరమ్ ||

ఛంద అర్చిక ఆగ్నేయ పర్వము

మొదటి అధ్యాయము

మొదటి ఖండము

ఋషులు :- 1,2,4,7,9,10 భరద్వాజుడు. 3 మేధాతిథి. 5,6 ఉశనసుడు. 8. వత్సుడు.

1. ఆగ్న ఆ యాహి వీతయే గృణానో హవ్యదాతయే | నిహోతా సత్సి బర్హిషి ||

అగ్నీ! హవిస్సులు ఆరగించుటకు విచ్చేయుము. మా స్తుతులు ఆలకించుటకు విచ్చేయుము. నీవు దేవతల ఆహ్వాతవు. దేవతలకు హవ్య వాహనుడవు. దర్భాసనముపై ఆసీనుడవగుము.

2. అగ్నీ! నీవు సమస్త యజ్ఞముల హోతవు. మానవ యజమానుల హితము కోరువాడవు. నిన్ను ఋత్విజులు గార్హపత్యాది రూపములుగా స్థాపించుచున్నారు.

3. అగ్ని దేవతల ఆహ్వాత. సర్వజ్ఞుడు. ఈ యజ్ఞమును సిద్ధింప చేయువాడు. హవ్యవాహనుడు. అట్టి అగ్నిని అర్పించుచున్నాము.

4. అగ్ని తనను ఉపాసించు వారికీ ధనదాత. సమిధలచే ప్రజ్వలితుడగు వాడు- ప్రకాశించువాడు. ఆహుతుల స్వీకర్త. అగ్ని మా స్తుతులు వినవలెను. బలశాలి కావలెను. రాక్షసులను సంహరించవలెను.

5. అగ్ని తనను స్తుతించు వారికి ధనములిచ్చువాడు. అతిథిసముడు. మిత్రుని వంటి ప్రియతముడు. రథము వంటి లాభకారి. అట్టి అగ్నిని స్తుతించుచున్నాము. ప్రసన్నుని చేయుచున్నాము.

6. అగ్నిదేవా! మాకు అనంత ధనము ప్రసాదించుము. మమ్ము లోభుల నుండి రక్షింపుము. ద్వేషించు వారి నుండి పాహి.

7. అగ్నిదేవా! విచ్చేయుము. చక్కని ఉచ్చారణలచే నిన్ను నుతించుచున్నాము. ఆలకించుము. సోమ రసమును వర్ధిల్ల చేయుము.

8. అగ్నిదేవా! నేను వత్సుడను. నిన్ను స్తుతించుచున్నాను. నీ మనసునకు ఆనందము కలిగించుచున్నాను. ద్యులోకము నుండి ఆకర్షించదలచినాను.

9. అగ్నిదేవా! నీవు అథర్వుడవు. సకల లోకములు నీకు శిరము వంటివి. వానిని భరించుచున్నావు. నిన్ను కమలపత్రములందు పుట్టించుచున్నాము. అరణులు మథించియు రగిలించుచున్నాము.

10. అగ్నిదేవా! నీవు మా రక్షకుడవు. ఈ యజ్ఞము స్వర్గ కారకము. దీనిని పూర్తి చేయించుము. నీవే కదా మాకు కనిపించు దేవతవు.

రెండవ ఖండము

ఋషులు :- 1 అయుంక్ష్వుడు. 3,8,9 ప్రయోగుడు. 2 వామదేవుడు. 4 మధుచ్ఛందుడు. 5,7 శునశ్శేపుడు. 6 మేధాతిథి. 10 వత్సుడు.

1. అగ్నీ! నరులు బలమును కోరి నీకు నమస్కరించుచున్నారు. ఆ కారణముననే నీకు నమస్కరించుచున్నాను. బలముచే శత్రువును వధించుము.

2. అగ్నిదేవా! నీవు సర్వజ్ఞుడవు. హవ్యవాహనుడవు. అమరుడవు యజ్ఞ సాధనమవు. దేవదూతవు. నిన్ను స్తుతించుచున్నాను. వర్ధిల్ల చేయుచున్నాను.

3. అగ్నిదేవా! యజమాని చేయు స్తుతులు ఆడపడుచుల వంటివి. అవి నిన్ను కీర్తించును. నీ దరికి చేరును. వాయువు వలె ప్రజ్వలింప చేయును. స్థిరపడును.

4. అగ్నిదేవా! మేము నిత్యము రాత్రింబవళ్ళు నీకు మనసా నమస్కరించుచున్నాము. నీ వద్దకు చేరుచున్నాము.

5. అగ్నిదేవా! నీవు స్తుతులు విని మేల్కొనువాడవు. యజమానిని అనుగ్రహించు వాడవు. యజ్ఞ ప్రదేశమున

ప్రవేశించుము. యజమాని భయంకరుడవగు నిన్ను దర్శించ దలచినాడు. స్తుతించుచున్నాడు.

6. అగ్నిదేవా! ఈ యజ్ఞము దోషరహితము. ఈ యజ్ఞమున సోమపానమునకు ఆహ్వానించుచున్నాము. దేవతల సహితుడవై విచ్చేయుము.

7. అగ్నిదేవా! నీవు యజ్ఞస్వామివి గుర్రము తన తోకతో తనను బాధించు వారిని తోలినట్లు నీ జ్వాలా వాలమున శత్రువులను పారద్రోలుము.

8. ఔర్వభృగునితో సమానుడును, అప్నువానుని అంతటివాడును, సముద్ర మధ్యమున ఉన్నట్టి బడబాగ్నిని ఆహ్వానించుచున్నాను.

9. నరులు సమిధలచే అగ్నిని ప్రజ్వలింప చేయుదురు గాత. పరిశుద్ధ మనస్కులై క్రతువులు నిర్వహింతురు గాత. ఋత్విజులు అగ్నిని జ్వలింపచేయుదురు గాక.

10. వైశ్వానరాగ్ని సూర్య రూపమున ఆకసకమున అవతరించిన తరువాతనే సకల ప్రాణిజాలము - నిరంతరగామియు, నివాస హేతువగు - మహా జ్యోతిని దర్శించుచున్నారు.

మూడవ ఖండము

ఋషులు :- ప్రయోగుడు. 2,5 భరద్వాజుడు. 3,10 వామదేవుడు. 4,6 వశిష్టుడు. 7.విరూపుడు. 8. శునశ్శేనుడు. 9 గోపవనుడు. 11 కణ్వుడు. 12 మేధాతిథి 13 అంబరీషుడు. 14 ఉశనుడు.

1. అగ్ని హింసకు అశక్యుడు బలవ్మతుల బంధువు. బలశాలి జ్వాలలచే వర్ధిల్లువాడు. మహామహుడు ఋత్విజులారా! అట్టి అగ్నిని అర్చించండి.

2. ఈ అగ్ని మండి పడు మంటలవాడు. అతడు సమస్త రాక్షసాది హింసకులను వధించును గాక. మాకు ధనములు ప్రసాదించును గాక.

3. అగ్నిదేవా! నీవు మహానుభావుడవు. మాకు సుఖములు కలిగించుము. ఈ యజమాని దేవతల దర్శనము అర్థించుచున్నాడు. అతని వద్దకు విచ్చేయుము. దర్భాసనమున ఆసీనుడవు అగుము.

4. అగ్నిదేవా! నీవు ప్రకాశమానుడవు. జరా రహితుడవు. మమ్ము పాపముల నుండి రక్షింపుము. మమ్ము హింసించు శత్రువులను నీ మంటలతో బూడిద చేయుము.

5. అగ్నిదేవా! నీవు అశ్వములు శీఘ్రగాములు సాధువులు వాహకములు వానిని నీ రథమునకు పూన్చుము.

6. అగ్నిదేవా! నీవు అర్చనీయుడవు. ధనస్వామివి అనేక యజమానులచే ఆహ్వానించ బడువాడవు. దీప్తివంతుడవు. ఉపాసకులకు శుభములు కూర్చువాడవు. మేము నిన్ను స్థాపించుచున్నాము.

7. అగ్నిదేవతలందు శ్రేష్టుడు. ద్యులోకమున కన్న ఉన్నతుడు. భూమికి ప్రభువు. అట్టి అగ్ని జలములకును జంగమములకును ప్రేరణ కలిగించుచున్నాడు.

8. అగ్నిదేవా! ఇవి మా హవిస్సులు. ఇవి మా స్తుతి వచనములు వీనిని దేవతలకు అందించుము.

9. అగ్నిదేవా! నేను గోపవనుడను. నిన్ను స్తుతించుచున్నాను. ఆవిర్భవింప చేయుచున్నాను. వర్దిల్ల చేయుచున్నాను. సర్వగమనుడవు, పాపకుడవగు నీవు నా ఆహ్వానమును ఆలకించుము.

10. అగ్ని అన్నపాలకుడు. కవి హవి అర్పించు వారికి రత్నాదులు ఇచ్చువాడు. అతడు హవిస్సులను వ్యాప్తము చేయుచున్నాడు.

11. సూర్యుడు సకల భువన ద్రష్ట ప్రసిద్దుడు. సకల భూతజ్ఞాత అట్టి సూర్యుని, కిరణములు పైన నిలిపి ఉంచినవి.

12. అగ్ని యజ్ఞ విద్వాంసుడు. సత్యధర్ముడు. ద్యోతమానుడు. శత్రు నాశకుడు. అట్టి అగ్ని దేవుని స్థాపించండి. స్తుతించండి.

13. జలములు శాంతములు, సుఖప్రదములు అగును గాత. దేవతలకు ప్రీతి కరములు అగునుగాత. మేము సేవించినంత సుఖప్రదములు అగును గాత. కలిగిన వ్యాదులను శాంతింప చేయునుగాత. కలుగని వ్యాధులను దూరము చేయును గాక. మాకు అమృత బిందువులై రాలునుగాత.

14. అగ్నీ! సజ్జన పాలకుడవగు నీవు ఇప్పుడు ఏ యజ్ఞమునకు సిద్ది కలిగించుచున్నావు? మేము నిన్ను స్తుతించుచున్నాము. మాకు గోవులను కలిగించుము.

నాలుగవ ఖండము

ఋషులు :- 1,3 శంయుడు. 2 భర్గుడు. 4. వసిష్ఠుడు. 5. భరద్వాజుడు. 6. ప్రస్కణ్వుడు. 7. తృణపాణి. 8. విరూపుడు. 9. శునశ్శేపుడు. 10. సౌభరి.

1. అగ్నిని వర్ధిల్ల చేయుటకు సర్వ యజ్ఞములందు స్తుతులచే నుతించండి. అమరుడు, మిత్రసముడు, అనుకూలుడు, సకల భూతజ్ఞాతయగు అగ్నిని ప్రార్ధించుచున్నాము.

2. అగ్నిదేవా! మమ్ము ఒక ఋక్కుచే **పాహి** రెండు ఋక్కులచే **పాహి** అన్నముల స్వామీ! మమ్ము మూడు ఋక్కులచే **పాహి.** అగ్నీ! మమ్ము నాలుగు స్తుతులచే **పాహి.**

3. అగ్నిదాత. యువకుడు. పావకుడు. అగ్నిదేవా! భరద్వాజుడనగు నా సోదరుని నిమిత్తము ప్రజ్వరిల్లుము. నీవు మహా తేజస్సున ధనయుక్తుడవై మాకు జ్యోతిని ప్రసాదించుము.

4. అగ్నిదేవా! నీవు యజమానులచే హవనము చేయబడువాడవు. నిన్ను స్తుతించు వారు సుఖింతురు గాక. మా జనులకు గోసమూహములనిచ్చు ధనికులు సుఖింతురు గాక.

5. అగ్నిదేవా! నీవు స్తుత్యుడవు. ప్రజాపాలకుడవు. రాక్షస నాశకుడవు. గృహపతివి. యజమాని గృహమును వీడని వాడవు. పరమ పూజ్యుడవు. ద్యులోక రక్షకుడవు. నీవు యజమాని గృహమున నిత్య నివాసము చేయుచున్నావు.

6. అగ్నిదేవా! నీవు అమరుడవు. సర్వజ్ఞుడవు. ఉషాదేవికి చెందిన విశిష్ట ధనమును - హవిస్సులు అర్పించు-యజమానులకు అందించుము. ఉషః కాలమున మేల్కొని ఉన్న దేవతలను ఆహ్వానించుము.

7. అగ్నీ! నీవు వ్యాపకుడవు. దర్శనీయుడవు. రక్షకుడవు. ఈ లోకమున ధనములకు ప్రేరణ కలిగించు వాడవు. ధనములను మా వైపు తరలించుము. వెంటనే మా పుత్రులకు కీర్తి కలిగించుము.

8. అగ్నీ! నీవే రక్షకుడవు. నీవే సత్యము. నీవే జ్ఞానము నీవే మహా మహుడవు. ప్రజ్వలించువాడవు. దీవించువాడవు. విప్రులు నిన్ను స్తుతించుచున్నారు ఉపాసించుచున్నారు.

9. పావక అగ్నీ! నీవు అన్న వర్ధకుడవు. స్తుతి యోగ్యుడవు. మాకు ధనము తెచ్చిఇమ్ము. నీతి యుక్తమును, పలువురు ప్రశంసించు నట్టి కీర్తి రూపధనమును మాకు ప్రసాదించుము.

10. దేవతల ఆహ్వాత, ఆనందప్రదాత అగ్ని జనులకు సంపదలు ప్రసాదించును. అట్టి అగ్నికి మాదకసోమ పూర్ణప్రథమ దషకము వంటి స్తోత్రములు చెందును గాక.

అయిదవ ఖండము

ఋషులు :- 1. వామదేవుడు. 2. భర్గుడు. 3, 7. సౌభరి. 4. మనువు. 5. సుదీతి 6. ప్రస్కణ్వుడు. 8. మేధాతిథి. 9. విశ్వామిత్రుడు. 10. కణ్వుడు.

1. అగ్ని బలపుత్రుడు. మాకు ప్రియుడు. పరిపూర్ణజ్ఞాత. స్వామి. సుయజ్ఞుడు. విశ్వస్యదూత. నిత్యుడు. అట్టి అగ్నిని స్తుతించుచున్నాము. ఆహ్వానించుచున్నాము.

2. అగ్నిదేవా!నీవు అరణ్యములందు, మాతలందు నివసించుచున్నావు. నరులు నిన్ను మథించి సృష్టించుచున్నారు. అట్టి నీవు పూర్ణరూపము దాల్చి శీఘ్రముగ యజమాని హవిస్సులను దేవతలకు అందించుచున్నావు. తదుపరి దేవతలందు శోభిల్లుచున్నావు.

3. ఏ అగ్నిని యజమానులు తమ వ్రతముల కొరకు స్థాపించుచున్నారో, ఎవనికి పరిపూర్ణ మార్గజ్ఞానము కలదో అట్టి అగ్ని దర్శనమిచ్చినాడు. ఎంతో స్పష్టముగా వెలువడినాడు. ఆర్యులను వర్ధిల్లచేయు అగ్నిని మాయొక్క స్తుతివాక్కులు చేరును గాత.

4. సోమరసము తీయుటకు శిలలను ఉంచినట్లు, కుశలను ఉంచినట్లు, స్తోతవ్యుడు, అధ్వర్యుడు అగు అగ్నిని ఋత్విజులు యజ్ఞమునకు ముందు, ఉత్తరవేది మీద స్థాపించినారు.

బహ్మణస్పతీ! ఇంద్రాది దేవతలారా! మమ్ము రక్షించుమని స్తుతించి మిమ్ము అర్థించుచున్నాము.

5. పరివ్యాప్తమగు జ్యోతి రూప అగ్నిని రక్షణార్థము, ధనార్థము గాథలతో స్తుతించుచున్నాము. అది విన్న నరులు అగ్నిని తమ కోరికలు తీరుటకు స్తుతించుచున్నారు. అట్టి అగ్ని మాకు నివాసము ప్రసాదించును గాత.

6. అగ్నిదేవా! నీవు వినగలవాడవు. మా మనవి వినుము. మిత్ర, ఆర్యములు ఉదయకాల యజ్ఞములకు యేగువారు. వారితో కూడ నీవు యజనములకు విచ్చేయుము. కుశాసనమున ఆసీనుడవగుము.

7. అగ్ని దీప్తిమంతుడు. ఐశ్వర్యవంతుడు. దేవా భక్తులచే ఆహ్వానించబడువాడు. యజమాని గట్టిగా కేకవేసి అగ్నిని పిలిచి స్వర్గమున తనస్థానము స్థిరపరుచు కొనును. అప్పుడు అగ్ని హవిస్సులు వహించుటకు భూమాత మీదకు దిగును.

8. ఇంద్రదేవా! నీవు పృథ్వినుండి అంతరిక్షము నుండి, బృహత్ నక్షత్ర మండలము నుండి వచ్చి నా తనువును రక్షించుము. మా స్తుతులు గొప్పవి. వానివలన నీవు వర్థిల్లుము. మా జనులకు కోరిన వరములు ప్రసాదించుము.

9. అగ్నిదేవా! నీకు అరణ్యములు ప్రియములు అట్లయ్యు మాతృరూప జలములందు వసించుచున్నావు. నీవు నాథ దూరమున ఉండుటను మేము సహింప జాలకున్నాము. అందుకే అదృశ్యుడవయ్యును అరణులందు మాకు ప్రత్యక్షమగుచున్నావు.

10. అగ్నిదేవా! నీవు జ్యోతివి నిన్ను మనువు నరుల కొరకు స్థాపించినాడు. యజ్ఞము నిమిత్తము ఆవిర్భవించిన నీవు హవిస్సులచే తృప్తి చెందువాడవు. కణ్వుని వలన దీప్తి వంతుడవైన నీకు నరులు నమస్కరించుచున్నారు.

ఆరవ ఖండము

ఋషులు :- 2,3,5. కణ్వుడు. 1,7 వసిష్ఠుడు. 4. సౌభరి. 6. ఉత్కీలుడు. 8. విశ్వామిత్రుడు.

1. ధనదాతవగు అగ్నీ! నీకు నలువైపుల నిండిన స్రుక్కులు నిలిచి ఉన్నవి. వానిని వరింపుము. సోమమును సేవింపుము. తరువాతనే ఆహుతులను అందించుము.

2. మాకు బ్రాహ్మణస్పతి లభించును గాత. సత్యప్రియ వాగ్దేవి లభించును గాత. దేవతలు మా శత్రువులను నిశ్శేషముగ నిర్మూలింతురు గాక. నరుల హితము కోరు దేవతలు మమ్ము యజ్ఞాభి ముఖముగ నియమింతురు గాత.

3. అగ్నిదేవా! మమ్ము రక్షించుటకు పైన సూర్యదేవతవై నిలిచినావు. నీవు అన్నదాతవు. మాకు అన్నము ప్రసాదించుమని ప్రార్థించుచున్నాము.

4. అగ్నిదేవా! నెవెఉ వ్యాపకుడవు. తనకు ధనము లభించవలెనని నిన్ను ప్రసన్నుని చేయుటకు నీకు హవిస్సులు అర్పించు మానవుడు వేలమందిని పోషించగల ధనవంతుడు అగుచున్నాడు. పుత్రవంతుడు అగుచున్నాడు.

5. దేవతల శరణుకోరువారు - సమస్త ప్రజను అనుగ్రహించుమని - అగ్ని దేవుని స్తుతి వచముల ప్రార్దింతురు. అన్యులు సహితము అగ్నిని ప్రదీప్తుని చేయుదురు.

6. ఈ అగ్ని సువీర్యుడు. సర్వ సౌభాగ్యములకు ప్రభువు. అతడు గోవులకు, సంతానమునకు, ధనములకు వాస్తవస్వామి. శత్రువులను హతమార్చు వారల ఈశ్వరుడు.

7. అగ్నిదేవా! నీవే మా యజ్ఞమునకు గృహపతివి. హోతవు. సకల జగములకు ఆరాధనీయుడవగు నీవు 'పోత' యను ఋత్విజుని ఉత్తమ హవిని యజించుము. మాకు ధనము ప్రసాదించుము.

8. అగ్నిదేవా! నీవు నరులకు మిత్రుడవు. జలముల పౌత్రుడవు. మంగల ధనయుక్తుడవు. సత్పురుషులకు

సుఖప్రదుడవు. ఉపద్రవ రహితుడవు. మమ్ము రక్షించుమని నిన్ను ప్రార్ధించుచున్నాము.

ఏడవ ఖండము

ఋషులు :- 1 శ్యావాశ్వుడు. 2. వార్షిహవ్యుడు. 3. బృహదుక్థుడు. 4. కుత్సుడు. 5,6. భరద్వాజుడు. 7. వామదేవుడు. 8,10. వసిష్ఠుడు. 9.త్రిశిరుడు.

1. ఋత్విజులరా! అగ్నిదేవుని ఆహ్వానించండి. హవితో సుఖింపచేయండి. అగ్ని దేవతల ఆహ్వాత గృహపతి అతనిని ఉత్తరవేది మీద స్థాపించండి. నమస్కరించండి. యజ్ఞగృహమున యజనీయ అగ్నిని ఆరాధించండి.

2. బాలగ్ని, యువాగ్ని హవి అందించుట చిత్రము! అతడు పుట్టగనే తల్లుల చన్ను కుడవలేదు. పుట్టగనే మహా దూత అయినాడు. హవిస్సులను దేవతలకు అందించుచు సంచరించినాడు.

(ద్యావాపృథ్వులు అగ్నికి తల్లులు.)

3. మృతజీవీ! నీలోని ఒక అంశము అగ్ని. దానిని బాహిరాగ్నిలో లీనము చేయుము. మరొక అంశము వాయువు. దానిని బయటి వాయువులో లీనము చేయుము. మూడవ అంశము ఆదిత్యుడు. దానిని ఆదిత్యునియందు లీనము చేయుము. నీవు మరల తనువును దాల్చుము. కళ్యాణ రూపివగుము. ఉత్పాదక సూర్యుని యందు ప్రవేశించుము.

4. అగ్నిదేవా! నీవు ఆరాధనీయుడవు. సర్వజ్ఞుడవు. నీ కొరకు మేము మంచి మనసుతో స్తుతులు రచించినాము. వానిని - రథమును సంస్కరించిన రీతి - శ్రద్ధగా ఆరాధించినాము. నిన్ను సేవించుచున్న మాకు మంచి బుద్ధిని చక్కని మనసును కలిగించుము. మాకు మిత్రుడవై సర్వత్ర రక్షింపుము.

5. అగ్ని ద్యులోకమునకు తల. భూమండలమునకు స్వామి. వైశ్వానరుడు. ఋతము. కవి. ప్రకాశకుడు. అతిథివంటి ఆదరణీయుడు. దేవతల నోళ్ళలో ఉన్నవాడు.

అట్టి అగ్నిని మా యజ్ఞమందు ఋత్విజులు ఆవిర్భవింప చేసినారు.

6. అగ్నిదేవా! స్తోతలు నీ సోత్రము లందు తమ మనో రథములను - పర్వతము మీది మేఘము తనయందు వర్షమును వలె - ధరించి ఉన్నారు.

స్తుతులను అనుసరించి సాగు అగ్నీ! అన్నమును అర్ధించు నీ భక్తులు అశ్వము యుద్ధమును వశపరచుకొను రీతి స్తుతించి నిన్ను వశపరచు కొనుచున్నారు.

7. అగ్ని యజ్ఞముల అధిపతి. హోత. రుద్రుడు. ద్యావాపృథ్వులకు అన్నప్రదాత. హిరణ్యరూపి. ఋత్విగ్యజమానులారా! అట్టి అగ్నిని మీ రక్షణల కొరకు వజ్రము వంటి మృత్యువాత పడక మున్నే హవిస్సులు అర్పించి ఆరాధించండి.

8. అగ్ని సామ్రాట్టు. ఆర్యుడు. స్తుతుల వలన ప్రదీప్తుడు. అతని రూపము ఘృతాహుతము. నరులు ఎన్నో బాధలకు ఓర్చి హవిస్సులతో అతనిని అర్చింతురు. అట్టి అగ్ని ఉషస్సునకు ముందే సకల దిశల ప్రకాశించును.

9. అగ్ని మహా జ్ఞాన స్వరూపుడు. అతడు రోదసిని చేరి దేవతలను పిలుచుటకు గాను వృషభము వలె నినదించును. అంతరిక్షమున మేఘమధ్యమున వెలుగొందును. వృష్టి రూపమున జలములందు విద్యుద్రూపమున వర్ధిల్లును.

10. అగ్ని ప్రశస్తుడు. దూరదర్శి. గృహపతి. ఆగమ్యుడు. చేతిలో మొలుచువాడు. నరులు అట్టి అగ్నిని అంగుళులతో కల్పించుచున్నారు.

ఎనిమిదవ ఖండము

ఋషులు :- 1 బుధ, గవిష్టరులు. 2,5. వత్సుడు. 3. భరద్వాజుడు. 4,7. విశ్వామిత్రుడు. 6. వసిష్ఠుడు. 8. పాయువు.

1. ఈ అగ్నిని జనులు సమిధలచే ప్రజ్వరిల్ల చేసినారు. ఉషః కాలమున అగ్ని అవతరించినపుడు గోవులు మేల్కొన్నట్లు జనులు సావధానులు అగుదురు. మహావృక్షముల శాఖలవలె ప్రజ్వలించు అగ్ని కిరణము ఒకటి తరువాత మరొకటిగా వ్యాపించుచు నాకమునకు వెలుగులు వ్యాపింప చేయుచున్నవి.

(చెట్లు కొమ్మపై కొమ్మను పెంచుచు ఎదుగును. సూర్యకిరణములు అట్లే క్రమక్రమముగ వ్యాపించునని చెప్పుట ఎంతో సహజము.)

2. అగ్ని విజేత. మహానుడు. విప్రపోషకుడు. సుఖముల అధిష్టాత. తనువులను సాదరమున రక్షించువాడు. స్తోతలారా! అట్టి అగ్నిని స్తుతించు యోగ్యత సాధించండి.

అగ్ని ధనదాత. కవచము వంటి జ్వాలా యుక్తుడు. హరితవర్ణ కేశ సదృశుడు. అగ్నిని ప్రసన్నుని చేయుటకు అతనిని స్తుతులతో ఆరాధించండి.

3. పూషదేవా! నీ ఒక రంగు తెలుపు మరొక రంగు నలుపు అగుచున్నవి. నీ మహిమచే తెలుపు రంగులు పగళ్ళు, నలుపు రంగులు రాత్రులు అగుచున్నవి. అన్నవంత పూషదేవా! నీవు ఆదిత్యుడవు. సకల ప్రజ్ఞల రక్షకుడవు. నీ కళ్యాణ

రూపము, దానగుణము మాకు వర్తించును గాక.

4. అగ్నిదేవా! నీవు బహువిధ కర్మలవాడవు. ఇడాదేవి గోవులను ప్రసాదించునది. నేను నిరంతరము ఇడా హవనము చేయుచున్నాను. నాకు సాధన కలిగించుము. పుత్రపౌత్రులను కలిగించుము. నీ సహృదయము, నీకు కలుగు విజయములు మా పరములు అగును గాత.

5. హోతల ముందున్న అగ్ని మేఘగర్భము నందలి విద్యుత్తు అయినది. ఆ అగ్ని హోతలకు సిద్ది కలిగించుచున్నాడు.

అగ్ని గుణసంపన్నుడు. అంతరిక్షజ్ఞాత. వేది యందు ప్రసన్నుడు. హవ్యవాహకుడు అట్టి అగ్ని వేది మీద చక్కగా స్థాపించబడినాడు. స్తోతలారా! అగ్నిని ఉపాసించండి. అతడు మీకు అన్నములను, దనములను ఇచ్చును గాత. మీ తనువులను రక్షించును గాక.

6. అగ్ని మహా బలిశాలి. వీరులచే స్తుతించదగిన వాడు. ఇంద్రుని వంటి బలశాలి. వెలుగుల నీను ఆ అగ్నిని స్తుతించండి. నమస్కరించండి. కర్మ ఫలములను అర్థించండి.

7. అగ్ని సర్వజ్ఞుడు. గర్భిణులు గర్భము దాల్చినట్లు అగ్ని అరణులందున్నాడు. అట్టి అగ్నిని నరులు యజ్ఞములు చేసియు, హవిస్సులు అర్పించియు నిత్యము అర్చించుచున్నారు.

8. అగ్నిదేవా! కలకాలముగ నీవు రాక్షసులను హింసించుచున్నావు. అట్లయ్యు యుద్ధమున నిన్ను గెలిచిన రాక్షసుడు లేడు. ఇక నీవు హింసావ్యాపారులు, మాంస భక్షకులగు రాక్షసులను నీ తేజస్సున భస్మము చేయుము. వాడి యగు నీ ఆయుధము ఒక్కనినైన విడువరాదు.

తొమ్మిదవ ఖండము

ఋషులు :- 2,10. వామదేవుడు. 1. గాయత్రి. 3,4. భరద్వాజుడు. 5. మృత్కవాహోద్వితుడు. 6. వసూయవ. 7,9. గోపవనుడు. 8. పూరురాత్రేయ.

1. అగ్నిదేవా! నీవు ఎంతో బలవంతుడవు. తేజోవంతుడవు. మాకు ధనము తెచ్చిఇమ్ము. నిరాటంక గతిగల అగ్నీ! ప్రశంసనీయమగు ధనమును ప్రసాదించుము. అన్నపు మార్గములను చూపుము.

2. నరునకు పుత్రుడు కలిగినపుడు అగ్నిని ప్రజ్వరిల్లచేయవలెను. అవిచ్ఛిన్నమగు హవితోడ అగ్నికి అభిముఖుడై యజించవలెను. దివ్యసుఖములను అనుభవించవలెను.

3. అగ్నీ! నీవు ప్రజ్వలితుడవైనావు. నిర్మలమగు నీ ధూమము వెడలినది. అంతరిక్షమున వ్యాపించినది. మేఘముగా పరిణమించినది.

పావక అగ్నీ! ఈ స్తుతులు సూర్యసమములు. అవి నిన్ను ప్రశంసించుచున్నవి. ప్రకాశింప చేయుచున్నవి. ఆ ప్రకాశముచే నీవు ప్రదీప్తుడవు అగుము.

4. అగ్నిదేవా! నీ భోజనము శుష్క కాష్టమగును. అది నీకు సూర్యునకు పగటి వెలుగు వలె లభించుచున్నది. సర్వద్రష్టవు, వ్యాపకుడవగు అగ్నీ! యజమాని ఇంట పుష్టిని వర్ధిల్లచేయుము.

5. అగ్ని బహుజన ప్రియుడు. సంపదలు ఇచ్చువాడు. అతిథి వంటి పూజనీయుడు. అతనిని ప్రాతః కాలము స్తుతింతురు. అమర్త్యుడగు అగ్నిని మర్త్యులగు నరులు హవిస్సులు అర్పించి అర్చింతురు!

6. ఈ స్తుతి వాహకము. దీనిని అగ్నికి అర్పించబడుచున్నది. అగ్ని అధిక ధనములు ప్రసాదించువాడు. అతడు ఈ స్తుతిని అందుకొని మాకు మరింత ధనము ప్రసాదించును గాత.

7. అగ్ని జనప్రియుడు. అతిథి వంటి పూజ్యుడు. గృహ హితకారి. మీకు సుఖములు కలుగుటకు గాను అగ్నిని స్తుతించండి.

8. యజ్ఞములందు ప్రదీప్తమానుడగు అగ్నికి మహాహవి సమర్పించబడును. మానవులు అగ్నిని తమ మిత్రునిగ భావింతురు. అతనిని స్తుతింతురు. సత్కరింతురు. కావున మీరు సహితము అన్నము కోరి అగ్నిని అర్చించండి.

9. అగ్ని శత్రుహంత ప్రశంసనీయుడు. జనహితకారి. ఋక్షపుత్రుడగు 'శృతర్వు'ని నిమిత్తము అగ్ని జ్వాలారూపమున ప్రజ్వరిల్ల చేయబడినాడు. అటువంటి అగ్ని మాకు లభించినాడు.

10. అగ్నిదేవా! నీవు సత్కార్యములు చేయుటకు అవతరించినావు. నీవు ఋత్విజులతో కూడ యజ్ఞములందు ఉండువాడవు. నీ తండ్రి కశ్యపుడు, తల్లి శ్రద్ధ, స్తోత మనువు అగుచున్నారు.

పదవ ఖండము

ఋషులు :- 1 అగ్నిస్తాపసుడు. 2. వామదేవుడు. 3. కశ్యప అసితుడు లేక దేవలుడు. 4. భార్గహతి కాని సోముడు కాని. 5. పాయువు. 6. ప్రస్కణ్వుడు.

1. ఈశ్వరుని, సోముని, వరుణుని, అగ్నిని, అదితి పుత్రుడగు విష్ణువును, సూర్యుని, బ్రహ్మను, బృహస్పతిని మమ్ము

రక్షించుడని ఆహ్వానించుచున్నాము.

2. హవిస్సుల అంగిరసులు మార్గము ఏర్పరచుకొని ద్యులోకమునకు చేరినట్లు - నరులు దారులు ఏర్పరచుకొని గ్రామములకు చేరినట్లు యజ్ఞకర్తలు ఈ భూమి పైకి ఎగిరి స్వర్గస్థానమును ఆరోహించినారు.

3. అగ్నిదేవా! గొప్ప ధనములు ప్రసాదించుమని నిన్ను వెలిగించుచున్నాము. నీవు మాకు వారములు ఇచ్చుటకును, హవనార్ధమును ద్యావాపృథ్వులను ఆరాధించుము.

4. ఈ యజ్ఞమునందు అధ్వర్యాదులు స్తుతులు ఉచ్చరించుచున్నారు. అగ్నికి ఈ విషయము తెలియును. చక్రములను ఇరుసు తన అధీనమందు ఉంచుకొనును. అట్లే అగ్ని ఋత్విజుల కర్మలను తన అధీనమందు ఉంచుకొనును.

5. అగ్నిదేవా! నీవు నీ తేజమునకు, క్రోధమునకు రాక్షసులను హరింపచేయువాడవు. రాక్షసులు సకల దిశలందు వ్యాపించి ఉన్నారు. వారిని హతమార్చుము. వారి పరాక్రమమును త్రుంచి వేయుము.

6. అగ్నిదేవా! ఈ యజ్ఞమునందు వసువులను, రుద్రులను, ఆదిత్యులను యాగయుక్తులును, ప్రజాపతి సృష్టించిన వారును, జలములను ప్రసాదించగల అన్య దేవతలను యజింపుము.

పదకొండవ ఖండము

ఋషులు :- 1. దీర్ఘతముడు 2,4. విశ్వామిత్రుడు. 3. గోతముడు. 5. త్రితుడు. 6. ఇరిమిరి. 7,8,10. వైయశ్వుడు. 9. భరద్వాజుడు.

1. అగ్నిదేవా! నీవు నాకు స్వామివి. నేను నీ శరణు జొచ్చినాను. నిన్ను అనేక మంది పుత్రులను, బహు ధనములను ప్రసాదించుమని ప్రార్ధించుచున్నాను.

2. అగ్ని ఋత్విజుల క్రతువులను అందుకొనువాడు. తేజస్సులచే వెలుగొందు జగములకు విధాత. దేవతల ఆహ్వానకర్త. ఋత్విజులారా! అట్టి అగ్ని కొరకు గొప్ప గొప్ప ప్రాచీన స్తోత్రములు రచించండి.

3. అగ్నిదేవా! నీవు బలపుత్రుడవు. గోవులకు, అన్నములకు స్వామివి. సకల భూతములకు అంతర్యామివి. మాకు ఎంతో అన్నమును ప్రసాదించుము.

4. అగ్నిదేవా! నీవు యజిష్టుడవు. యజ్ఞములందు దేవతలను అభిలషించువాడవు. దేవతలను యజింపుము.

హోతయగు యజమాని శత్రువులను వధించుము. విరాజిల్లుము.

5. స్థిరుడును, ధన శాసకుడును అగు అగ్ని తన సప్తజిహ్వల జ్వాలలతో ప్రత్యక్షమైనాడు. అతడు కర్మలను నిర్దేశించు సోమమును శాసించుచున్నాడు.

6. అదితి స్తుతియోగ్య ఆమె పగలు మమ్ము రక్షించును గాత, మావద్దకు విచ్చేసి మాకు శాంతియు సుఖమును కలిగించును గాత. శత్రువులను దూరము చేయును గాత.

7. శత్రువును వధించు అగ్నిని యజించండి.. ఎవని ధూమము సర్వత్ర వ్యాపించునో, ఎవని తేజస్సును రాక్షసులు సహితము నిలువరింపజాలరో, ఎవడు సకల భూతజ్ఞాత అగునో అట్టి అగ్నిని అర్చించండి.

8. శత్రువు తన సకల మాయల చేతను అధిగమించ జాలనివాడు అగ్ని. హవ్యా దాతలను అనుగ్రహించువాడు అగ్ని. అట్టి అగ్నికి మానవులు హవిస్సులు అర్పింతురు.

9. అగ్నిదేవా! కుటిలురను, పాపులను, దుష్ట బుద్ధులను, హింసకులను దూరమునకు విసరివేయుము. సజ్జనపాలకా! మమ్ము సుఖవంతులను చేయుము.

10. శత్రువినాశక, విశ్వపాలక అగ్నీ! ఇది నేను రచించిన నవతమ స్తోత్రము. దీనిని ఆలకించుము. మాయావులగు రాక్షసులను నీ మంటలలో కాల్చి బూడిదచేయుము.

పన్నెండవ ఖండము

ఋషులు :- 1,3,4 ప్రయోగ భార్గవుడు. 2,5,6,7. సౌభరి. 8. విశ్వమనుడు.

1. అగ్ని మహాదాత సత్యవంతుడు తేజోవంతుడు. స్తోతలారా! అట్టి అగ్ని స్తుతులను చక్కగా గానము చేయండి - "ప్రగాయత".

2. అగ్నిదేవా! నీ స్నేహము కలిగిన వాడు వీరపుతుర్లు, అన్నరాసులు, పటిష్ట రక్షణలు కలవాడగు చున్నాడు - వర్ధిల్లుచున్నాడు.

3. స్తోతలారా! హవ్యవాహక అగ్నిని స్తుతించండి. దానాది గుణయుక్తుడగు అగ్నిని ఉపాసించండి. అగ్ని ద్వారా దేవతలకు హవిస్సులు చేర్చండి.

4. ఋత్విజులారా! మా యజ్ఞములందు అగ్ని అతిథివంటి ప్రియతముడు. అతనిని తొలగించకండి. అగ్ని మంచి హోత. మంచి అధ్వరుడు. అతనిని అనేకులు ఉపాసించుచున్నారు. అగ్ని నివసింపచేయువాడు.

5. అగ్నిదేవా! హవిస్సులచే తృప్తిచెందుము. మాకు మంగళకరుడవు అగుము. చక్కని ధనముల వాడా! మాకు మంగళమయ దానము కలిగించుము. మా యజ్ఞములు మంగళకరములు అగును గాత. మా స్తుతులు మంగళ మయములు అగును గాత.

6. అగ్నిదేవా! నీవు యజిష్టవు. దేవతలందు అధిక దానకర్తవు. దేవతల ఆహ్వాతవు. అమరుడవు. ఈ యజ్ఞమును నిర్వహించువాడవు. అట్టి నిన్ను ఆరాధించుచున్నాము.

7. అగ్నిదేవా! యజ్ఞమును మ్రింగు రాక్షసాదులను పారద్రోలుము. పాప బుద్ధిగల శత్రువుల క్రోధమును అణచివేయుము. ఆ కీర్తి మాకు కలిగించుము.

8. అగ్ని విశ్వపతి. హవిస్సుల అందుకొని మండి పడువాడు. అతడు ఇంటనున్న రాక్షసాది పీడలను తొలగించును. ఇది ప్రసిద్ధము.

శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత యందలి ఆగ్నేయకాండము సమాప్తము.

ఐంద్ర కాండము

రెండవ అధ్యాయము

మొదటి ఖండము

ఋషులు :- 1. శంయు బార్హస్పత్యుడు. 2. శ్రుతకక్షి. 3. హర్యతుడు. 4,5. శ్రుతకక్షి. 6. ఇంద్రమాతలు దేవయాజమా ఋషికలు. 7,8. కాణ్వయనులు. 9. ఆంగిరస మేధాతిథి 10. కాణ్వప్రియమేధ.

1. స్తోతలారా! సోమము అభిషుతమైనంత పురుహూతుడు, శత్రుహంతయగు ఇంద్రుని గూర్చి సమూహగానము చేయండి. ఆ స్తోత్రము ఇంద్రుని శక్తి వంతుని చేయునదియు, గోవువలె సుఖము కలిగించునది అగును గాక.

2. శతక్రతు ఇంద్రా! యశోవంతమగు సోమము అభిషుతమైనది. సిద్ధముగా ఉన్నది. దానిని సేవింపుము. ప్రసన్నుడవగుము. మాకు ధనము నిమ్ము. ప్రసన్నులను చేయుము.

3. గోవులారా! యజ్ఞమునకు విచ్చేయండి. యజ్ఞమునకు పాలు అవసరము. పాలు పుష్కలముగ ప్రసాదించండి. మీ చెవులకు బంగారు, వెండి ఆభరణములు ఉన్నవి.

4. శృతకక్షా! అశ్వములను గురించి పూర్తిగా పాడుము. గోవులను గురించి పూర్తిగా పాడుము. ఇంద్రుని ధామములను గురించి పూర్తిగా పాడుము, గానము చేయుము.

(ఋషి తనే సంబోధించు కొనుచున్నాడు.)

5. ఋత్విజులారా! ఇంద్రుడు మహా వృత్రహంత. అతనికి మీరు బలము కలిగించుచున్నారు. అట్టి ధనదాత యగు ఇంద్రుడు మాకు ధనములు కలిగించును గాత.

6. ఇంద్రదేవా! నీవు సాహసివి. గుండె బలమునకు ప్రసిద్ధుడవు. వరదా! శ్రేష్ఠుడవగు నీవు ఫలప్రదుడవు అగుచున్నావు.

7. యజ్ఞము ఇంద్రుని వర్ధిల్లచేసినది. ఇంద్రుడు అంతరిక్షమున వ్యాపించిన మేఘము నుండి భూమి మీద వర్షము కురిపించినాడు.

8. ఇంద్రా! నీవు ఒక్కడవే ధనములకు స్వామివి. నన్ను ధనవంతుని చేయుము. నేను స్తోతలను గోవంతులను చేయుదును.

9. అభిషోతలారా! ఇంద్రుడు వీరుడు. శూరుడు. అతనికి అడుగడుగున సోమము అర్పించండి.

10. ఇంద్రదేవా! నీవు అంతర్యామివి. ఇదిగో ఈ సోమము నీకు అర్పితము. దీనిని కడుపు నిండ త్రావుము.

రెండవ అధ్యాయము

ఋషులు :- 1. సుతకక్షుడు. 2. శౌనకుడు. 3. భరద్వాజుడు. 4. శ్రుతకక్షి. 5. మధుచ్ఛందుడు. 7. విశోకుడు. 8. వసిష్ఠుడు. 9,10.త్రిశోకుడు.

1. సూర్యరూప ఇంద్రా! నీ ధనము నిత్య దానయోగ్యము. నీవు వరుదుడవు. మానవ హితకారివి. నీ ఉదారత సకల దిశలందు ప్రసిద్ధము.

2. ఇంద్రా! నీవు వృతహంతవు. సూర్యరూపివి. నేడు ఆకసమున ప్రకాశించుచున్న దంతయు నీ అధీనమున ఉన్నది.

3. యదు, తుర్వరుసులను రాజులను శత్రువులు దూరదేశములకు తరిమినారు. ఇంద్రుడు తన నీతి కౌశలమున

తిరిగి వారిని దేశములకు రప్పించినాడు. అట్టి యువతమా ఇంద్రుడు మాకు మిత్రుడు కావలెను.

4. ఇంద్రదేవా! రాక్షసులు సకల దిశల నుండి అస్త్రములు ప్రయోగింతురు. సర్వత్ర సంచరింతురు. వారు రాత్రులందు మా ముందునకు రాకుందురు గాత. వచ్చినచో నీ సాయమున మేము వారిని నష్టపరుతుము గాక.

5. ఇంద్రా! మా రక్షణకు గాను ధనమును ప్రసాదించుము. ఆ ధనము శత్రువును తిరస్కరించునట్టిది, శత్రువును ఓడించు నట్టిది కావలెను. అట్టి బహు ధనమును కలిగించుము.

6. ఇంద్రుడు శత్రు నాశనమునకు వజ్రము పట్టినవాడు. మేము కొలది ధనము కొరకును, మరింత ధనము కొరకును అట్టి ఇంద్రుని ఆహ్వానింతుము.

7. ఇంద్రుడు కద్రువుడు అను ఋషిచే అభిషుతము చేయబడిన సోమమును సేవించినాడు. 'సహస్ర బాహువు' అను శత్రువును వధించినాడు. అప్పుడు ఇంద్రుని పరాక్రమము ప్రశస్తమైనది.

8. వరప్రదఇంద్రా! నీవు వ్యాపకుడవు. మేము నిన్ను ఆశ్రయించినాము. నీ ముందు నిలిచినాము. నీకు ఎన్నో ప్రణామములు చేయుచున్నాము. మా కీర్తినములను గ్రహించుము.

9. మేము అభిముఖులము అయినాము. యువక ఇంద్రుడు అగ్నికి మిత్రుడు. అట్టి అగ్నిని వెలిగించుచున్నాము. అతనిని కుశలచే కప్పుచున్నాము.

10. ఇంద్రదేవా! ద్వేషించు శత్రువులను చెల్లాచెదరు చేయుము. వినాశము కల్పించు యుద్ధములను నష్ట పరచుము. అట్లు లబించిన ప్రశస్త, ప్రసిద్ధ ధనమును మాకు తెచ్చి ఇమ్ము.

మూడవ ఖండము

ఋషులు :- 1. ఘౌర కణ్వుడు. 2. త్రిశోక కాణ్వుడు. 3,9. వత్స కాణ్వుడు 4. కుసీద కాణ్వుడు 5. మేధాతిథి కాణ్వుడు. 6. శ్రుతకక్ష ఆంగీరసుడు. 7. శ్యావాశ్వ ఆత్రేయుడు. 8. ప్రగాథ కాణ్వుడు. 10. ఇరిమిరి కాణ్వుడు.

1. మరుత్తుల చేతులందు కొరడాలు ఉన్నవి. వాటి ధ్వని నాకు ఇచట వినిపించుచున్నది. ఆ ధ్వని సంగ్రామములందు చిత్ర విచిత్ర పరాక్రమములను ప్రదర్శించుచున్నది.

2. ఇంద్రా! నీ కొరకు సోమము చేతపట్టి నిలిచినా వారు - పగ్గము పట్టి పశువుల కొరకు వలె- నిరీక్షించుచున్నారు.

3. తలలు వంచిన విశ్వజనులు ఇంద్రుని అనుగ్రహము కోరి - సముద్రమునకు సాగు నదుల వలె - వినమ్రులై నిలిచి ఉన్నారు.

4. దేవతలారా! మీరు సమస్త దిశలందు తేజరిల్లువారు. వరదులు. మహాపాలకులు. మీ పాలన సమస్త దిశల నుండి మమ్ము రక్షించవలెనని ప్రార్థించుచున్నాము.

5. బ్రహ్మణస్పతీ! నేను సోమమును అభిషవించువాడను. ఉశిజ పుత్రుడగు 'కక్షీవంతుడు' దేవతలందు ప్రముఖుడు అయినట్లు నన్ను దేవతలందు ప్రకాశవంతుని చేయుము.

6. ఇంద్రుడు వృత్రుని వధించినాడు. అందువలన అతని కొరకు అనేక దేశములందు సోమము సిద్ధమైనది. అతడు మా కోరికలను తెలిసి కొనును గాత. **"శృణోతు శక్ర ఆసిషమ్"** శక్రా! మా స్తుతులను ఆలకింపుము.

7. సూర్యదేవా! మాకు సుపుత్ర సహిత ధనమును ప్రసాదించుము. మా దుస్స్వప్నములను దూరము చేయుము.

8. వరదుడు, యువకుడు, తలవంచని ఇంద్రుడు ఎచట ఉన్నాడు? ఇది ఎవరికి తెలియును? ఏ ఋత్విజుడు అతనిని పూజించగలడు?

9. పర్వత ప్రదేశములందును, నదుల సంగమ స్థానములందును స్తుతించినప్పుడు మేధావి ఇంద్రుడు ప్రత్యక్షమగును.

10. ఇంద్రుడు మానవులకు సామ్రాట్టు. స్తోతవ్యుడు. నేత. శత్రుహంత. పమదాత. అట్టి ఇంద్రుని అధికముగ కీర్తించండి.

నాలుగవ ఖండము

ఋషులు :- 1,6,7. శ్రుతకక్షి. 2.మేధాతిథి, 3. గోతముడు 4. భరద్వాజుడు. 5. బిందు పూత దక్షుడు. 8. వత్సుడు. 9,10. శునశ్శేపుడు.

1. ఇంద్రుడు సుందర శిరస్త్రాణము కలవాడు. "సుదక్షుడు' ను ఋషి యవలతో సోమము చేసినాడు. అట్టి సోమమును ఇంద్రుడు సోమపత్రముల నుండి రాలుచుండగా పానము చేసినాడు.

2. ఇంద్రా! నీవు అధిక ధనశాలివి. మా స్తుతులు నీ దిశగా - గోవులు దూడల వద్దకు వలె - పరుగులిడుచున్నవి.

3. కదలిక గల చంద్రుని యందు రాత్రులందు సహితము సూర్యకిరణములే ప్రకాశించుచున్నవని చెప్పుచున్నారు.

4. ఇంద్రుడు అధికతమ వర్షము కలిగించువాడు. అతడు భూమండలమునకు వర్షజలమును పంపుచున్నాడు. అప్పుడు పూషదేవత ఇంద్రునకు సహాయపడుచున్నాడు.

5. ధనవంతులగు మరుత్తుల తల్లి, వారి రథమును లాగు గోవు అన్నము అందించగోరి అందరి పూజలు అందుకొను చున్నది.

6. ఇంద్రా! నీవు సోమస్వామివి. సోమము సిద్ధముగా ఉన్నది. హర్యశ్వ సహితముగా విచ్చేయుము. **"ఉపవో హరిభిః సుతం"**

7. మా యజ్ఞమున ఇంద్రుని వర్ధిల్ల చేయదలిచినాము. మా హోతలు అవభ్రుత పర్యంతము తమ తేజమున-ఇంద్రునకు ఆహుతులు అర్పించుచున్నారు.

8. నేను పాలకుడగు ఇంద్రుని మనసును గ్రహించినాను. అందువలననే సూర్యుని వలె - ప్రకాశించుచున్నాను.

9. అన్నములు కలిగిన మేము మా గోవులతో మురియుచున్నాము. ఇంద్రుడు సహితము మావలె హర్షించిన మా గోవులు దుగ్ధవంతలు, బలవంతలు కాగలవు.

10. దేవతలందు రథికుడగు సోముడు, పూష, మానవులు అర్పించు హవిస్సులు గ్రహింతురు గాత.

అయిదవ ఖండము

ఋషులు :- 1,4. శ్రుత కక్షి 2. వసిష్ఠుడు. 3. మేధాతిథి 5. ఇరిమిరి. 6,10 మధుచ్ఛందుడు. 7. త్రిశోక కణ్వుడు. 8. కుసీదుడు. 9. శునశ్శేపుడు.

1. ఇంద్రుడు శత్రు తిరస్కర్త శతక్రతు నరులకు ధనదాత. సోమపాయి. ఋత్విజులారా! అట్టి ఇంద్రుని విశేషముగ స్తుతించండి.

2. మిత్రులారా! హర్యశ్వుడు, సోమపాయి అగు ఇంద్రుని ప్రసన్నుని చేయు స్తోత్రములను గొప్పగా గానము చేయండి - **"ప్రగాయత"**

3. ఇంద్రా! మేము నీ మిత్రులము. నీకు అంతేవాసులము కాదలచి నిన్ను మాత్రమే స్తుతించుచున్నాము.

కణ్వగోత్రజులు సహితము నిన్నే నుతింతురు.

4. ఇంద్రుడు ప్రసన్నస్వభావి. అతని కొరకు అభిషుత సోమమును, మా స్తుతులను సమర్పించుచున్నాము. తదుపరి స్తోతలు సోమమును పూజించుచున్నారు.

5. ఇంద్రదేవా! నీ కొరకు సోమము సిద్ధమైనది. పవిత్ర కుశలపై ఉంచబడినది. రమ్ము. అచటికి చేరుము. సోమపానము చేయుము.

6. ఇంద్రుడు చక్కని రూపము వాడు. చక్కని పనుల వాడు. పాలు పితుకుటకని గోవును పిలుతుము కదా! అట్లే రక్షించుమని ఇంద్రుని నిత్యము ఆహ్వానించుచున్నాము.

7. వరదా! ఇంద్రా! సోమము అభిషుత మైనది. విచ్చేయుము. సేవించుము. ఆనందించుము.

8. ఇంద్రా! నీవు ఈశ్వరుడవు. సోమము సిద్ధమైనది. చమస, గ్రహ పాత్రలందు నింపి ఉంచినాను. దానిని నీవు తప్పక సేవించుము.

9. ప్రతి ఆరంభమునకు, ప్రతి యుద్ధమునకు బలశాలియగు ఇంద్రుని మమ్ము రక్షించు మని మిత్రులముగా ఆహ్వానించుచున్నాము.

10. స్తోతలగు ఋత్విజులారా! రండి రండి. త్వరగా రండి. కూర్చోండి. ఇంద్రుని గొప్పగా స్తుతించండి.

ఆరవ ఖండము

ఋషులు :- 1. విశ్వామిత్రుడు. 2. మధుచ్ఛందుడు. 3. కుసీదుడు 4. ప్రియమేధ 5,8. వామదేవుడు 6,9. శ్రుత కక్షి 7. మేధాతిథి 10. బిందుఋషి.

1. ఇంద్రా! నీవు ధనస్వామివి. స్తుతి యోగ్యుడవు. బలశాలివి. బలమున పిండిన సోమమును వెంటనే పానము చేయుము.

3. ఇంద్రుడు మావాడు. అతడు బలవంతుడు. గుణవంతుడు. వజ్రవంతుడు. అతనికి మహిమలు కలుగును గాత. అతని ద్యులోక సేవ ప్రసిద్ధమగును గాక

4. గోపతి, యజ్ఞపుత్రుడు, పరిపాలకుడగు ఇంద్రుని అతనికి తెలియనట్లుగా గొప్పగా స్తుతించండి.

5. ఇంద్రుడు నిత్యము వర్ధిల్లువాడు. విచిత్ర గుణవంతడు. మిత్రుడు అతడు ప్రత్యక్షమగుటకు ఎట్టి కర్మలు ఆచరించవలెను? ఏ రీతిగా ప్రవర్తిల్లవలెను?

6. స్తోతలారా! ఎందరినో లెక్కచేయని వాడు, సకల స్తుతులందు వ్యాపించి ఉన్నవాడగు ఇంద్రుని మమ్ము రక్షించుటకు మాకు అభిముఖునిగ పంపండి.

7. మేధావి, అద్భుతుడగు ఇంద్రునాకు ప్రీతిపాత్రుడు, ఇంద్రుని అభిలషించు వాడగు సదసత్పతి దేవతను చేరుకున్నాను.

8. ఇంద్రా! ద్యులోకపు దిగువున ఉన్న దారులను తెలిసికొన్నాను. ఆ దారుల సకల లోకములను చేరుకున్నాను. ఆ మార్గమును, మేము ఉన్న చోటును యజమానులు తెలిసి కొందురు గాక.

9. ఇంద్రదేవా! శతక్రతూ! మాకు శుభములు, శుభములే కలిగించుము. బలము కలిగించు అన్నము ప్రసాదించుము. మాకు సుఖముల నిచ్చు ధనము నిమ్ము.

10. ఇది సోమము. దీనిని మేము సంస్కరించినాము. దీనిని స్వయంప్రకాశకులగు మరుత్తులు ప్రాతః కాలమున సేవింతురు. అశ్వినులు సహితము అప్పుడే సేవింతురు.

ఏడవ ఖండము

ఋషులు :- 1. ఇంద్రమాతలు దేవజామయ ఋషికలు 2. గోధుడు. 3. దధ్యంగుడు. 4. ప్రస్కణ్వుడు. 5. గోతముడు. 6. మధుచ్ఛందుడు. 7. వామదేవుడు. 8. వత్సుడు. 9. శునశ్శేపుడు. 10. వాతాయనుడు.

1. ఇంద్రుని స్తుతించు వారును, తమ కర్మఫలమును కోరువారును అగు ఇంద్రమాతలు ప్రత్యక్షమైనారు. వారు ఇంద్రుని ఉపాసింతురు. శౌర్య ధనమును పొందుదురు.

2. దేవతలారా! మీకు మేము ఎటువంటి హానియు తలపెట్టము. అతిగా పొగడి విసిగించము. మంత్రములందు ఉన్నట్లే కీర్తింతుము. కర్మలను ఆచరింతుము.

3. బృహద్గాయకుల వలనను, వెలుగు నడకల దధ్యంగ అధర్వణఋషి వలనను లోపము జరిగి ఉండవచ్చును. వాని నివారణార్ధము సవితా దేవుని స్తుతించుచున్నాము.

4. ఈమె ఉష. అందరిని అలరించునది. రాత్రులందు కనిపించినది. ఆమె దివి నుండి దిగి వచ్చినది. చీకట్లను తరిమినది. అశ్వినులారా! మిమ్ము మరింత స్తుతించుచున్నాను.

5. ఇంద్రుడు ఎదురు లేని వాడు. అతడు దధీచి వెన్నెముకతో అనేకమంది వృత్రులను వధించినాడు.

6. ఇంద్రా! ఈ కర్మకు విచ్చేయుము. సమస్త సోమములను సేవించుము. అన్నములను ఆరగించుము. ఆ బలముచే శత్రువులను తిరస్కరించుము.

7. వృత్రహంత ఇంద్రా! వడివడిగా మావద్దకు రమ్ము. మహా బలశాలుడవు అగుము. మాకు రక్షణ కలిగించుము.

8. ఇంద్రుని బలము ప్రఖ్యాతము. అతడు తేజస్వి. ఇంద్రుడు తోలు తిత్తిని వలె ద్యావాపృథ్వులను తనచేత పట్టినాడు.

9. ఇంద్రా! ఇదిగో సోమము. ఇది నీ కొరకు సిద్ధమైనది. కపోతము గర్భము ధరించు కపోతిని కలుసు కొనునట్లు ఆ సోమమును, మా స్తుతులను కలసి కొనుము.

10. వాయువు మాకు రోగశాంతి కలిగించునట్టియు, సుఖములు ప్రసాదించునట్టి ఓషధులను ప్రసాదించును గాత. మా ఆయుష్యములను పొడిగించును గాక.

ఎనిమిదవ ఖండము

ఋషులు :- 1. కణ్వుడు. 2,3,9 వత్సుడు. 4. శ్రుత కక్షి 5. మధుచ్ఛందుడు. 6. వామదేవుడు 7. ఇరిమిరి 8. సత్య ధృతి.

1. జ్ఞానియగు వరుణుడు, మిత్రుడు, ఆర్యమ రక్షణలుకల వానిని ఎంతటి వాడును హింసించజాలడు.

2. ఇంద్రదేవా! నీవు ఇంతకు ముందు వలెనే మాకు గోవులను ఇచ్చుటకు, అశ్వములను ఇచ్చుటకు, రథములు ఇచ్చుటకు, కీర్తి కరమగు ధనము ఇచ్చుటకు విచ్చేయుము.

3. ఇంద్రా! గోవులు నీకు సంబంధించినవి. యజ్ఞమును వర్ధిల్లచేయునవి. అవి పాలను చుక్కలుగా రాల్చుచు ధారలుగా ఈ బిందెను నింపును.

4. ఇంద్రదేవా! నీ పేర్లు అనేకములు. నిన్ను స్తుతించువారు అనేకులు. నీవు మేము చేఇస్న ప్రతి సోమయాగమునకు వచ్చినావు కదా! అప్పుడు మేము గోవులను ఇమ్మని కోరినాము.

5. సరస్వతి పావక. అన్నదాయక శక్తి. ధనదాత్రి. ఆ తల్లి అన్న సహితమై మా యజ్ఞములకు విచ్చేయును గాత.

6. ఏ మానవుడు ఈ ఇంద్రుని సంతృప్తుని చేయగలడు? అట్టి ఇంద్రుడు మా యజ్ఞమున సంతృప్తుడు అగును గాత. మాకు ధనములను అందించును గాక.

7. ఇంద్రా! రమ్ము రారమ్ము నీ కొరకు సోమమును అభిషవించినాము. నీ కొరకు కుశాసనము పరచినాము. ఆసీనుడవగుము. సోమపానము చేయుము.

8. మిత్రుడు, వరుణుడు, ఆర్యమ ఈ ముగ్గురి రక్షణలు ఎదురు లేనివి. మాకు వారి రక్షణలు లభించును గాక.

9. బహు ధనవంత, కర్మప్రేరక, హర్యశ్వవంత ఇంద్రా! మేము నీ వారలము అగుదుము గాక.

తొమ్మిదవ ఖండము

ఋషులు :- 1. ప్రగాథుడు. 2. విశ్వామిత్రుడు. 3,10. వామదేవుడు. 4,6. శ్రుతకక్షి. 5. మధుచ్ఛంధుడు. 7. గృత్సమదుడు. 8,9 భరద్వాజుడు.

1. ఇంద్రా! సోమము నీకు మహదానందము కలిగించును గాక. వజ్రధరా! మాకు ధనము లను ప్రసాదించుము. బ్రహ్మ ద్వేషులను హతమార్చుము.

2. ఇంద్రా! నీవు స్తవనీయుడవు. మేము సమకూర్చిన సోమమును సేవింపుము. నీవు మాదక సోమధారలచే తడుపబడువాడవు కదా! నీవు శుద్ధి చేసిన అన్నమే మమ్ము చేరుచున్నది.

3. ఋత్విగ్యజమానులారా! ఇంద్రుడు సర్వదా మీ వద్ద ఉండును. మీచే యజ్ఞకర్మలు చేయించును. మేము అర్చించు ఇంద్రుడు దేవతలందు శూరుడు అగుచున్నాడు.

4. ఇంద్రదేవా! మేము నీకు సమర్పించు సామములు, నదులు సముద్రమును వలె నిన్ను చేరుచున్నవి. అందు వలననే నిన్ను మించిన వాడు లేకున్నాడు.

5. గాయకులగు 'ఉద్గాత' లు బృహత్సామమున ఇంద్రుని స్తుతింతురు. అర్చించు హోతలు 'ఉక్థ' లచే స్తుతింతురు. మిగిలిన వారు 'యజస్సు' లచే నుతింతురు.

6. మాచే ఆవిధముగా స్తుతించబడిన ఇంద్రుడు సర్వశ్రేష్ఠ ధనదాత. మాకు అన్నము కలిగించుటకు గాను సోమపానమున దైవత్వము సాధించిన ఋభువులను మా వద్దకు పంపును గాక. బలశాలి ఇంద్రుడు మాకు బలము కలిగించుటకు తన తమ్ములను పంపును గాక.

7. ఇంద్రుడు నిశ్చలుడు. విశ్వద్రష్ట. అతడు మహా భయములను లెక్కచేయడు. వాటిని పారద్రోలును.

8. ఇంద్రా! నీవు స్తుతియోగ్యుడవు. మేము అభిషవించిన సోమములు, మా స్తుతులు దూడలను చేరు గోవుల వలె నిన్ను చేరుకొనుచున్నవి.

9. ఇంద్ర, పూష దేవతలను మేము ఆహ్వానించుచున్నాము. వారు మాకు శుభములు కలిగింతురు గాక. మిత్రులు అగుదురు గాత. మాకు అన్నపానములు కలిగింతురు గాక.

10. వృత్రహంత ఇంద్రా! నిన్ను మించిన వారు దేవలోకమున లేరు. నీకు సరివచ్చు ప్రఖ్యాతుడు లేనే లేడు.

పదవ ఖండము

ఋషులు :-1,4. త్రిశోకుడు. 2. మధుచ్ఛందుడు. 3. వత్సుడు. 5. సుకక్షి. 6,9 వామదేవుడు. 7 విశ్వామిత్రుడు. 8. గోషూక్యశ్వుడు. 10. శ్రుతకక్షి.

1. ఇంద్రుడు పుత్రపౌత్రాధులను తరింపచేయువాడు. శత్రువులను భయపెట్టువాడు. పశువంతుడు. అన్నవంతుడు. అట్టి ఇంద్రుని మేము నిరంతరము స్తుతింతుము.

2. ఇంద్రదేవా! నేను నీ స్తుతులను రచించినాను. నీవు స్వర్గవాసివి. వరదుడవు. సోమపాయివి. నా స్తుతులు నిన్ను చేరినవి. నీవు వానిని స్వీకరించినావు.

3. ద్రోహము ఎరుగని మరట్టులు, ఆర్యమ, వరుణుని రక్షణలుగల నరుడు చక్కని చూపు కలవాడు, ప్రసిద్ధుడు అగుచున్నాడు.

4. ఇంద్రదేవా! నీవు స్థిరపురుషుని యందు ఏ ధనమును, ఏ స్థిరత్వమును ఏ సహనమును స్థాపించినావో అట్టి అభిలషణీయ ధనమును మాకు ప్రసాదించుము.

5. ఇంద్రుడు ప్రసిద్ధుడు. వృత్రహంత, వేగవంతుడు. మహా ధనము ప్రసాదించుమని అట్టి ఇంద్రుని కీర్తించుచున్నాము.

6. ఇంద్రా! నీవు వీరుడవు. నీ యశస్సు వినదగిన చోటునకు మేము చేరుదుముగాక. ఇతరులను మించిన నీ కీర్తి గల చోటునకు చేరుదుముగాత.

7. ఇంద్రదేవా! మేము సమర్పించు హవియందు పేలాలున్నవి. పెరుగు కలిపినా సత్తు ఉన్నది. పురోడాశమున్నది. వానిని నీవు ప్రాతః కాలమున ఆరగించుము.

8. ఇంద్రా! నీవు సంస్థ అసురసేనలను గెలిచినావు. నీతి నురగతో 'నముచి' తలను నరికినావు. అజేయుడవు అయినావు.

9. ఇంద్రా! నీ కొరకు సముపార్జించిన సోమముల చేతను, సముపార్జించనున్న సోమముల చేతను విశేష ధనములు గల నీవు ప్రసన్నుడవగుము.

10. కాంతిరూప ధనము నిచ్చు ఇంద్రా! నీ కొరకు సోమము సిద్ధము చేసినాము. కుశాసనము పరచినాము. ఆసీనుడవగుము. సోమము త్రాగుము. మాకు సుఖములు కలిగించుము.

పదకొండవ ఖండము

ఋషులు :- 1. శునశ్శేపుడు. 2. శ్రుతకక్షి. 3.త్రిశోకుడు. 4,9 మేధాతిథి. 5. గోతముడు. 6. బ్రహ్మాతిథి. 7. విశ్వామిత్రుడు. 8. ప్రస్కణ్వుడు.

1. శునశ్శేపులమగు మేము అన్నము అభిలషించువారము. శతక్రతు, పరమపూజ్య ఇంద్రుని-పొలమును నీటితో నింపినట్లు - సోమముతో నింపి సంతోషపరుతుము.

2. ఇంద్రదేవా! ద్యులోకము నుండియే వందల బలములను, వేల అన్నములను, బహురుచులను వెంటపెట్టుకొని మాకు ఎదురై మా వద్దకు విచ్చేయుము.

3. ఇంద్రుడు బాణము పట్టియే పుట్టినాడు! ఈ లోకమున ఎవరెవరు వీరులున్నారని తల్లిని అడిగినాడు!!

4. లోక రక్షకుడును, దీర్ఘబాహువు, జగత్పాలకుడు, ధనదాత, బృహత్ స్తుతులు గల ఇంద్రుని ఆహ్వానించుచున్నాము.

5. మిత్రావరుణులు దివా రాత్రముల దేవతలు. వారు గమ్యమును ఎరింగిన వారు. వారు మమ్ము సన్మార్గమున గమ్యమునకు చేర్చెదరు గాక. ఆర్యమ సహితము అట్లే గమ్యమునకు చేర్చును గాత.

6. దూరమున - ఆకసమున - తూర్పున ఉషస్సు మనముందే ఉన్నట్లు ఉదయించును. తన వెలుగులను సకల దిశలందు పరచును.

7. సత్కర్మల మిత్రా వరుణులారా! మా గోవులను, మా గృహములను పాడితో నింపుడు. మా పరలోక ధామములను కూడ పాడితో నింపుడు.

8. మాటలు పుట్టించు మరుత్తులు యజ్ఞములందు జలములను విస్తరింపచేసినారు. విస్తరింపచేసిన జలమును త్రావించుటకు అంబారావములు చేయు గోవుల తలలు వంచినారు.

9. విష్ణువు త్రివిక్రముడు అయినాడు. ఈ సమస్త జగముల మీద మూడు అడుగుల వేసినాడు. ఈ జగములు విష్ణువు యొక్క పాదధూళి రేణువులు అయినవి.

పన్నెండవ ఖండము

ఋషులు :- 1,7,8 మేధాతిథి. 2. వామదేవుడు. 3,5. మేధాతిథి, ప్రియ మేధాతిథి. 4,9. విశ్వామిత్రుడు. 6. దుర్మిత్రుడు. 10. శ్రుతకక్షి.

1. ఇంద్రదేవా! క్రోధమున సోమరసము పిండు వానిని వదులుము. చక్కగా రసము పిండు వానిని పంపించుము. ఈ యజమాని సమకూర్చిన యజ్ఞసంబంధ సోమమును పానము చేయుము.

2. మహా జ్ఞానసంపన్నుడగు ఇంద్రుని స్తోత్రమున దోషములు ఉన్నను అని ప్రశంసలు అగును గాత. ఆ స్తుతులు యజమానిని వర్ధిల్లచేయును గాత.

3. ఇంద్రుడు తనను స్తుతించని వానిని శత్రువు గా భావించును. ఉక్థములు చదువు వారిని గుర్తించును. గాయత్రి సామ గాయకులను తెలిసికొనును.

4. ఇంద్రుడు అన్నవంతుడు. అన్నపతి. హర్యశ్వవంతుడు. అతడు హోతల స్తోత్రములకు ఆనందించును. సోమములకు మిత్రుడు అగును.

5. ఇంద్రదేవా! మేము సమకూర్చిన సోమముచే పరిగ్రహింపుము. భార్య గలవాడు ఇతర స్త్రీలను వలె - పరుల సోమమునకు ప్రలోభ పడకుము.

6. ఇంద్రా! నీవు వ్యాపకుడవు. మా స్తుతులను స్వీకరింపుము. ప్రవహించునదిని నిలిపినట్లు మేము సమర్పించు సోమము కొరకు ఎప్పుడు నిలుతువు? ఎప్పుడు స్వీకరింతువు?

7. ఇంద్రా! బ్రాహ్మణ ప్రశంసిత ధనభృత పాత్ర యందలి సోమమును త్రావుము. దానిని ఋతువులను అనుసరించి సేవించుము. ఋతువులు నీకు మిత్రులు కదా!

8. ఇంద్రా! నీవు స్తుతి వచన యోగ్యుడవు. మేము నిన్ను స్తుతించుచున్నాము. సోమ పాయి ఇంద్రా! నీవు మమ్ము సంతృప్తులను చేయుము.

9. ఇంద్రా! నీవు యుద్ధములందు శత్రు సంహారకుడవను విషయము జగత్ప్రసిద్ధము. నీవు శూరుడవై ఒకే చోట స్థిరముగా నిలిచి దూరపు శత్రువును సహితము వధించగలవు. అందువలననే నీ మనసు ఆరాధ్యము.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత పూర్వార్చికమున
రెండవ అధ్యాయము సమాప్తము

శం నో దేవీరభిష్టయే శంనో భవన్తు పీతయే |
శం యోరభిస్రవన్తునః ||

మూడవ అధ్యాయము

మొదటి ఖండము

ఋషులు :- 1,6,9. వసిష్ఠుడు. 2. భరద్వాజుడు. 3. వాలఖిల్యుడు. 4. నోధ. 5. కలి ప్రగాథ. 7. మేధాతిథి. 8. భర్గుడు. 10. ప్రగాథ కాణ్వుడు.

1. ఇంద్రా! నీవు శూరుడవు. లోకములకు స్వామివి. సర్వద్రష్టవు. పితుకకనే పాత్ర నింపు ధేనువు వలె చమసములందు సోమము పట్టి నీకు ప్రణమిల్లుచున్నాము.

2. ఇంద్రదేవా! మేము నీ స్తోతలము. అన్నము కలిగించుమని నిన్ను పిలుచుచున్నాము. నీవు సజ్జన పాలకుడవు. తమ శత్రువును వధించుమని ఇతరులు కూడ నన్ను పిలుతురు. అశ్వ సంబంధ సంగ్రామములకు కూడ నిన్ను పిలుతురు.

3. ఇంద్రుడు మహా ధనవంతుడు. మేము అతని స్తోతలము. అతడు మాకు సహస్ర సంఖ్యాక ధనములు ప్రసాదించును.

ఋత్విజులారా! శోభన ధనయుక్తుడగు ఇంద్రుని ముందు నిలిచి విశేషముగా స్తుతించండి.

4. ఇంద్రుడు దర్శనీయుడు. శత్రు తిరస్కర్త దుఃఖ నివారకుడు. సోమ పాయి. ప్రసన్నుడు. గోశాల యందలి ధేనువులు దూడలను చూచి అరచినట్లు స్తుతులు చదివి ఇంద్రునకు ప్రణమిల్లుచున్నాము.

5. ఋత్విజులారా! ఇంద్రుడు ఆశ్వవంతుడు. ధనవంతుడు. కష్టముల సహించి, రక్షణలు కలిగించుమని ఇంద్రుని బృహత్సామమున కీర్తించండి. మేము సహితము సోమము సంపాదించి తమను పోషించు తండ్రిని వలె ఇంద్రుని యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాము.

6. యుద్ధములందు ముందుండు వాడును, సాయము కలవాడును, బుద్ధిమంతుడును గెలుచుచున్నాడు. మంచి కర్రతో వడ్రంగి ఇరుసును తీర్చిదిద్దినట్లు పురుహూతుడగు ఇంద్రుని మీ కొరకని స్తుతించండి.

7. ఇంద్రదేవా! ఇది మేము సముపార్జించిన సోమము. ఇది రసవంతము. పాలు మున్నగునవి కలసినది. దీనిని సేవింపుము. ప్రసన్నుడవగుము.

ఇంద్రా! ఇది దేవతలు సంతసించు యజ్ఞము. నీవు ధనాదులందించు మా బంధువు వంటివాడవు. మా ప్రగతి విషయమున అప్రమత్తుడవగుము. నీ అనుగ్రహమున మాకు రక్షణలు కలుగును గాత.

8. ఇంద్రదేవా! నీవు ధనదాతవగుట నిశ్చయము. నేను సజ్జనుడను. నాకు ధనము నందించుటకు రమ్ము ధనము ప్రసాదించుము. నేను గోవులు కోరుచున్నాను. గోవులనిమ్ము. నేను ఆశ్వములను కోరుచున్నాను. అశ్వముల నిమ్ము.

9. మరుత్తులారా! నేను వసిష్ఠుడను. మిమ్ము ఏ ఒక్కరిని విడువకుండ స్తుతించుచున్నాను. ఇప్పుడు నేను సంపాదించిన సోమమును అభిలషించండి. అందరు కలసి సేవించండి.

10. మిత్రులారా! ఇంద్రుని తప్ప అన్యులను కీర్తించకండి. వృధాగా ఆయాస పడకండి. సోమము సమకూర్చండి. అందరు కలసి వరదుడగు ఇంద్రుని స్తుతించండి. ఇంద్ర స్తుతులనే మరల మరల ఉచ్చరించండి.

రెండవ ఖండము

ఋషులు :- 1. ఆంగీరస పునర్జన్మ. 2,3 మేధాతిథి, మేధ్యాతిథులు. 4. విశ్వామిత్రుడు. 5. గోతముడు. 6. నృమేధ, పురుమేధలు. 7,8,9 మేధ్యాతిథి. 10 దేవాతిథి.

1. ఇంద్రుడు నిత్యము వృద్ధి చెందించువాడు. విశ్వస్తుతి యోగ్యుడు. మహా బలశాలి. లొంగనివాడు. శత్రుభయంకరుడు. యజ్ఞములందు అట్టి ఇంద్రుని తనకు అనుకూలుని చేసికొన్న వానికి దుఃఖములు కలుగవు.

2. ఇంద్రుడు తెగిన వానిని అతికించగలవాడు. అతికించునవి లేకనే రక్తము వెడలక ముందే గ్రీవాదులను అతికించు సమర్థుడు. అతడు సంపన్నుడు. ధనవంతుడు. తెగి పడిన వానిని మరల జోడించగలవాడు.

3. ఇంద్రదేవా! నిన్ను స్తుతులచే కీర్తించుచున్నాము. హవిస్సులు అర్పించుచున్నాము. మేడమీద జూలు ఉన్న వందల, వేల అశ్వములు, నీ బంగారు రథము పూని నిన్ను సోమ పానమునాకు తీసికొని వచ్చును గాత.

4. ఇంద్రదేవా! నీ హర్యశ్వములు ఆనందదాయకములు. నెమలి పింఛముల వంటి జూలు కలవి. నీవు వాణి మీద బయలుదేరుము. పాంథులు మరు భూమిని దాటినట్లును, త్రాళ్ళతో పక్షులను నిలిపినట్లును నిరాటంకముగ విచ్చేయుము.

5. ఇంద్రా! నీవు జితేంద్రియులందు శ్రేష్ఠుడవు. ప్రకాశవంతుడవు. నిన్ను స్తుతించు మర్త్యులను ప్రశంసింతువు.

సంపన్న ఇంద్రా! సుఖములు కలిగించుటలో నిన్ను మించిన వాడు లేడు. కావున మేము నిన్ను స్తుతించుచున్నాము.

6. ఇంద్రా! నీవు బలములకు స్వామివి. సోమములకు ప్రభువవు. యజమానుల రక్షకుడవు. యశస్వివి. ఎంతటి వాడును నిన్ను ఎదిరించజాలడు. ఎటువంటి ప్రేరణ లేకనే వంటరిగా నీవు అనేకమంది రాక్షసులను హతమార్చినావు.

7. దేవయజ్ఞములకు - దేవతలందు ఇంద్రునే ఆహ్వానించుచున్నాము. యజ్ఞము జరుగుచున్నప్పుడు ఇంద్రునే ఆహ్వానించుచున్నాము. యజ్ఞసమాప్తి యందు ఇంద్రునే ఆహ్వానించుచున్నాము. ధనము కొరకు ఇంద్రునే ఆహ్వానించుచున్నాము.

8. బహు ధనవంత ఇంద్రా! నా యొక్క స్తుతిరూప వాక్కులు నిన్ను వర్ధిల్ల చేయును గాత. అగ్ని వంటి తేజస్సులును, పవిత్రులగు విద్వాంసులు నిన్ను స్తోత్రములచే స్తుతించుచున్నారు.

9. నిత్య శత్రుంజయములు, ధనవంతములు, అక్షయరక్షణలు గల రథములు అన్నము కొరకు అటునిటు తిరిగినట్లు ప్రసిద్ధములు, మధురములు, శ్రేష్ఠములగు స్తుతులు ఇంద్రుని నిమిత్తము ఉచ్చరించ బడుచున్నవి. పైపైకి వ్యాపించుచున్నవి.

10. గౌరమృగము దప్పిగొన్నపుడు - గడ్డి లేనట్టి, నీరునిండిన - కొలను వైపు సాగును. నీవును అట్లే బందు భావమున

మా వద్దకు రమ్ము. కాణ్వులము సముపార్జించిన సోమమును పానము చేయుము.

మూడవ ఖండము

ఋషులు :- 1. భర్గుడు. 2,8. రేభుడు. 3. జమదగ్ని. 4,9 మేధాతిథి. 5,6. నృమేధ, పురుమేధులు. 7. వసిష్టుడు. 10. భరద్వాజుడు.

1. ఇంద్రదేవా! శచీపతివి. శూరుడవు. మాకు సకల రక్షణల వారము ప్రసాదించుము. నీవు మా భాగ్యమునాకు తగిన యశస్సును, ధనమును ఇచ్చువాడవు. నిన్ను ఆరాధించుచున్నాను.

2. ఇంద్రా! నీవు స్వర్గవంతుడవు. అనుభవయోగ్య ధనమును రాక్షసులను వధించి గుంజుకున్నావు. దానితో నీ స్తోతలను వర్ధిల్లచేయుము. నిన్ను భజించు వారిని, నీ కొరకు కుశాసనము పరచువారికి ధనము కలిగించి వర్ధిల్లచేయుము.

3. ఋత్విజులారా! మిత్ర దేవత కొరకు యజ్ఞము నందు స్తుతులను గొప్పగా గానము చేయండి. ఆర్యమ కొరకు గానము చేయండి. యజ్ఞ గృహమందు విరాజిల్లు వరుణుని కొరకు గానము చేయండి.

4. ఇంద్రా! స్తోతలు దేవతలందరి కన్నముందు నిన్నే సోమ పానము చేయుమని స్తుతించుచున్నారు. సమూహముగా యుక్త కంఠమున నిన్నే స్తుతించుచున్నాము. రుద్ర పుత్రులు మరుత్తులు సనాతనుడవగు నిన్నే స్తుతించుచున్నారు.

5. స్తోతలారా! మీ మహాస్తోత్రములను ఇంద్రుని కొరకు ఆలాపించండి. శతక్రతు ఇంద్రుడు పాపనాశకుడు. శతధారల వజ్రమున పాపములను నశింపచేయును గాత.

6. మితభాషులగు స్తోతలారా! వృత్రహంతయగు మహా ఇంద్రుని కీర్తిగానము చేయండి. సత్యవర్ధనుడు, దీప్తుడు, దివ్యుడు, సకలమును మేల్కొల్పువాడగు సూర్యుని ఇంద్రుడు సృష్టించినాడు. అట్టి ఇంద్రునకు స్తుతి గానములు చేయండి.

7. ఇంద్రదేవా! తండ్రి పుత్రులకు వలె మా కార్యములను సఫలము చేయుము. మాకు ధనము నిమ్ము. మేము యజ్ఞములందు జీవింతుము గాక. నిత్యము సూర్యుని దర్శింతుము గాత.

8. ఇంద్రదేవా! మేము హవిస్సులు అందించు వారము. మమ్ము విడువకుము. మాకు ఆనంద దాయక యజ్ఞమున సోమపానము చేయుము. మమ్ము నీ రక్షణలందు ఉంచుకొనుము. మేము నీ బంధువులము. మమ్ము విడువకుము.

9. వృత్రహంతా! మేము నీ కొరకు సోమము సంపాదింతుము. జలములకు వలె నమస్కరింతుము. సోమము పిండ, ఆసనముపరచు స్తోతలు సహితము నిన్ను ఉపాసింతురు.

10. ఇంద్రా! మానవులకు బలము ఉన్నది. ధనము ఉన్నది. పంచ జనులందు ప్రకాశించు ధనమును మాకు ప్రసాదించుము. విశ్వబలములను మాకు అందించుము.

నాలుగవ ఖండము

ఋషులు :- 1. మేధాతిథి. 2. రేభుడు. 3. వత్సుడు. 4. భరద్వాజుడు. 5. నృమేధ. 6. పురుహన్మ. 7. పురుమేధ, నృమేధులు. 8. వసిష్ఠుడు. 9. మేధాతిథి, మేధ్యాతిథులు. 10. కలి.

1. ఉగ్రఇంద్రా! నీవు వరము లిచ్చువాడవు. ఇది సత్యము. సోమాభిషవ కర్తలచే ఆహ్వానించ బడువాడవు. నీవు దూరము నుండియు, దగ్గరి నుండియు వరములు వర్షించువాడవని వినుచున్నాము.

2. ఇంద్రా! నీవు దూర ద్యులోకమున ఉండుము. లేదా దగ్గరి అంతరిక్షమున ఉండుము. ఈ లోకము నుండి యజమాని నిన్ను ఆహ్వానించును. తన కాంతులచే సర్వత్ర వ్యాపించు కిరణముల వంటి స్తుతులతో ఆహ్వానించుము. సోమము అందుకొని యజ్ఞమునాకు ఆహ్వానించును.

3. ఇంద్రుడు శత్రుభయంకరుడు. శత్రువుల తలలు వంచువాడు. బుద్ధిశాలి. సర్వత్ర స్తుతియోగ్యుడు. శక్తిమంతుడు. ఉద్గాతలారా! మీ హితము కొరకు ఇంద్రునకు సోమము సముపార్జించండి. మహాస్తుతులను లాసిగా గానము చేయండి.

4. ఇంద్రదేవా! మాకు భూమి, నీరు, గాలి మంగళకరములు అగును గాత. శీత, ఆతప, వర్షములు శుభప్రదములు అగును గాత. యజమాని ఇంటను, మాకును హవిరూప ధనము కలుగును గాత. శత్రువు యొక్క ఆయుధములను దూరమున ఉంచుము.

5. సూర్యుని ఆశ్రయించిన కిరణములు సూర్యుని కాంతిని భజించును. ఇంద్రుని ఆశ్రయించిన వారు అతని ధనమును భజింతురు. ఇంద్రుడు సృష్టించిన, సృష్టించనున్న ధనములందు - మాకు తండ్రి ధనపు భాగము వంటిది - లభించును గాత.

6. ఇంద్రుడు అమరుడు. ఇంద్రునికి కాక ఇతరులను ఉపాసించిన మర్త్యునకు అన్నము లభించదు.

ఇంద్రుడు రంగురంగుల గుర్రములు కలవాడు. గుర్రములను కూర్చువాడు. హర్యశ్వములను రథమునాకు పూన్చువాడు. అట్టి ఇంద్రుని అర్చించని వానికి అతడు లభించడు.

7. స్తోతలారా! ఏ ఇంద్రుని అసురుల యుద్ధములకు దేవతలు తప్పక ఆహ్వానింతురో అట్టి వానిని ఈ యజ్ఞమున శోభన స్తుతులతో అర్చించండి. వృత్రహంతవు, మహా ఆయుధవంతుడవు. కీర్తనీయుడ వగు ఇంద్రా! మూడు సవనములకు విచ్చేయుము.

8. ఇంద్రా! భూమి యొక్క అడుగు పొరయందున్న ధనము నీదియే. మధ్య పొరయందున్న ధనమును పరిపుష్టము చేయుదువు. విశ్వమందలి సమస్త ధనములకు నీవే స్వామివి. ఇది వాస్తవము. గోవులు మున్నగు ధనములు ఇచ్చుటలో నీకు సాటి వచ్చువారు లేరు.

9. ఇంద్రా! నీవు ఇంతకు ముందు ఎక్కడ ఉంటివి? ఇప్పుడు ఎచట ఉన్నావు? నీ మనసు అనేకుల మీద ఉండును. నీవు యుద్ధకుశలుడవు. యుద్ధములందు అసురులను పరిమార్చువాడవు. రారమ్ము. సంగీత విద్వాంసులు నీ స్తుతులను గానము చేయుచున్నారు.

10. మేము యజమానులము. ఇంద్రుడు వజ్రధారి. అతనికి నిన్న, నేడు సోమము సమర్పించినాము. సంతృప్తుని చేసినాము. అందువలన ఇంద్రా! నేటి సవనపు సోమమును సేవింపుము. స్తోత్రములను వినుము. ఆనందించుము.

అయిదవ ఖండము

ఋషులు :- 1,6. పురుహన్మ. 2. భర్గుడు 3. ఇరిమిఠి. 4. జమదగ్ని. 5,7 దేవాతిథి. 8. వసిష్ఠుడు. 9. భరద్వాజుడు. 10. వాలఖిల్యులు.

1. ఇంద్రుడు నరులకు ప్రభువు. రథము మీద పయనించువాడు. గమనమున అందరిని మించిన వాడు. సకల సేనలను తరింపచేయువాడు. పాపనాశకుడు. పెద్దవాడు. అట్టి వానిని స్తుతించుచున్నాము.

2. ఇంద్రదేవా! మాకు భయము కలిగించు వారినుండి మమ్ము నిర్భయులను చేయుము నీవు అభయ ప్రదాతవు. మమ్ము రక్షించుటకు మా శత్రువులను నష్టపరచుము. మమ్ము బాధించువారిని నష్టపరచుము.

3. గృహపతీ! ఇంటిని నిలుపు స్తంభము గట్టిది అగును గాక. సోమ సంపాదకులారా! మీ అవయవములు పటిష్టములు అగును గాత. సోమపాయి, అసుర భంజక ఇంద్రుడు మునులమగు మమ్ము కాపాడును గాత.

4. ఇంద్రదేవా! నీవు సూర్యరూపుడవు. తేజస్సున అధికుడవు. ఇది సత్యము. అదితిపుత్రా! బలమున నీవు అధికుడవు.

ఇది సత్యము. నీ మహిమ గొప్పది. స్తోతలు దానిని స్తుతింతురు. దేవా! వీర్యము నందును నీవు అధికుడవు. ఇది సత్యము.

5. ఇంద్రదేవా! నీకు మిత్రుడు అగువాడు ఆశ్వవంతుడు, రథవంతుడు, గోమంతుడు, శోభన ధనవంతుడు, నిత్య అన్నవంతుడు, స్తోత్రవంతుడు అయి సభలందు గౌరవము పొందుచున్నాడు.

6. ఇంద్రదేవా! స్వర్గములు వందలయినను నీకు సాటిరావు. భూగోళములు వందలయిన నీ అంత కాజాలవు. సూర్యులు వందలయినను నీ ప్రకాశమునకు సరిరారు. పుట్టిన ఏ పదార్థమూ నీ అంతటిది లేదు. ద్యావాపృథ్వులు నీకు సరిబోలవు. నీవు అందరికన్న గొప్పవాడవు.

7. ఇంద్రదేవా! నిన్ను తూర్పు, పడమర, ఉత్తర, దిగువ దిక్కులా నరులందరు స్తుతించుచు ఆహ్వానింతురు. రాజులు తమకు హితము కూర్పుమని నీకు ప్రేరణ కలిగింతురు. స్తుతింతురు. 'తుర్వశు' ని విషయమున కూడ నిన్ను ఆహ్వానింతురు.

(తుర్వశుడను రాజు సుదాసునితో యుద్ధమున ఓడినాడు. ఇంద్రుడు అతనికి సాయము చేసినాడు. రక్షించినాడు.)

8. ఇంద్రదేవా! నీవు వ్యాపకుడవు. నిన్ను బెదిరించగల నరుడేడి? నీ విషయమున శ్రద్ధ గలవాడు హవివంతుడు అగుచున్నాడు. సోమము సంపాదించినవాడు హవిస్సులు అర్పించదలచుచున్నాడు.

9. ఇంద్రాగ్నులారా! ఉష చరన రహిత. అట్లయ్యు చరణ సంహిత ప్రాణుల కన్న ముందు అవతరించును. ఆమె ప్రాణుల శిరములు వదలి నాలుకలతో శబ్దము చేయించును. తదుపరి ఒకేరోజు ముప్పది ముహూర్తములను దాటును.

10. ఇంద్రా! మా యజ్ఞశాలలు మీకు దగ్గరలో ఉన్నవి. మావరకు పరిమితమగు బుద్ధితోను, రక్షణలతోను అవశ్యము విచ్చేయుము. పరమశాంతములగు అభీష్టములతో విచ్చేయుము. సుఖములు కలిగించుటకు విచ్చేయుము.

ఆరవ ఖండము

ఋషులు :- 1. నృమేధుడు. 2,3. వసిష్ఠుడు. 4. శంయు. 5. పురుచ్ఛేపుడు. 6. వామదేవుడు. 7. మేధ్యాతిథి. 8. భర్గుడు. 9,10. మేధ్యాతిథి, మేధాతిథులు.

1. ఇంద్రుడు జరారహితుడు. ఇతరులకు ప్రేరణ కలిగించువాడు. తనకు ప్రేరణ అక్కరలేనివాడు. వేగవంతుడు. శత్రుంజయుడు. యజ్ఞములకు విచ్చేయువాడు. రథికుడు. అజేయుడు. జలవర్ధనుడు. జనులారా! మీ రక్షణలకు గాను అట్టి ఇంద్రుని ముందుంచు కొనండి.

2. ఇంద్రదేవా! నిన్ను యజమాని సహితము మాకు దూరము చేయకుండును గాక. దూరము నందు ఉన్నాను మా యజ్ఞమునకు విచ్చేయుము. మేము చేయు స్తుతులను ఆలకించుము.

3. జనులారా! వజ్రధారియు, సోమపాయియు నగు ఇంద్రుని కొరకు సోమము సంపాదించండి. ఇంద్రుని సంతోషపెట్టుటకు పురోడాశము వండండి. ఇంద్రుని ప్రసన్నుని చేయుకార్యములు చేయండి. ఇంద్రుడు మీకు సుఖములు ప్రసాదించి పురోడాశము స్వీకరించును.

4. ఇంద్రుడు శత్రుహంత. సర్వద్రష్ట. అట్టి ఇంద్రుని మేము స్తుతించుచున్నాము. ఆహ్వానించుచున్నాము.

ఇంద్రుడు సహస్ర గోధనుడు. బహుధనయుక్తుడు. సజ్జన పోషకుడు. అట్టి ఇంద్రుడు సంగ్రామములందు మమ్ము వర్ధిల్ల చేయును గాత.

5. అశ్వినులారా! మీరు మా యజ్ఞములనే ధనముగా భావించువారు. మీ పనులతో మాకురాత్రింబవళ్ళు ఫలములు ప్రసాదించుడు. మీ దానములు అక్షయములు అగును గాక. మా దానములు ఎన్నటికిని క్షీణించ కుండును గాత.

6. ఎప్పుడైనను యజమాని స్తోతలచే స్తుతులు చేయించవచ్చును. తదుపరి పాపనాశకుడు, వివిధ కర్మలు ధరించువాడగు వరుణుని తమ రక్షణల కొరకు స్తుతించవలెను.

7. మేధ్యాతిథే! ఇంద్రుని ఆనందపరచుము. గోవులను రక్షించమని కోరును. ఇంద్రుడు హర్యశ్వములను రథమునకు పూన్చువాడు. బంగారు రథము కలవాడు. వజ్రధారి హితకారి. రమణీయుడు.

(**మేధ్యశ్చాసౌ అతిథిస్చేతి మేధ్యాతిథిః** - యజ్ఞములకు అతిథియగు వాడు ఇంద్రుడని కూడ అర్ధము. అప్పుడు అది ఇంద్రునకు విశేషణమగును. ఇచట ద్రష్ట తనను సంబోధించుకొనుచున్నాడు.)

8. మా స్తోత్ర, శస్త్రాత్మక కీర్తనలను ఇంద్రుడు మా ముందుండి వినును గాత. విని మా యజ్ఞమున తన బుద్ధితోను, ధనము తోను బలము తోను సోమ పానము చేయును గాత.

9. వజ్రధారీ! నిన్ను మహా మూల్యమునకు విక్రయించను. వేలమూల్యమునకు, పది వేల మూల్యమునకు విక్రయించను. ధనముల స్వామీ! నిన్ను అపరిమిత ధనమునకు విక్రయించను.

10. ఇంద్రదేవా! నీవు నా తండ్రిని మించినవాడవు. అన్నము పెట్టని అన్నను మించిన వాడవు. ఆశ్రయము కలిగించు ఇంద్రా! నీవు మా అమ్మకు సముడవు. "మె మాతాచ సమా". నేను బలవంతుడను, ధనవంతుడను అగుటకు నన్ను

యశస్విని, మహితుని చేసి నన్ను రక్షింపుము.

ఏడవ ఖండము

ఋషులు :- 1. వసిష్ఠుడు. 2,6,7 వామదేవుడు. 3,9 మేధాతిథి, మేధ్యాతిథులు. 4. నోధ. 5. మేధాతిథి. 8. వాలఖిల్యులు. 10. నృమేధ.

1. వజ్రహస్తా! పెరుగు కలిపిన సోమము సిద్ధము చేసినాము. హర్యశ్వముల మీద విచ్చేయుము. సోమపానము చేయుము ఆనందించుము.

2. ఇంద్రదేవా! స్తోత్రయుక్తమగు ఈ సోమము నిన్ను ఆనందింప చేయ నిరీక్షించుచున్నది. ఈ ఆనందకర సోమమును త్రావుము. మా స్తుతులను ఆకర్షించుము. స్తోతవ్యా! మాకు ధనములను ప్రసాదించుము.

3. ఈ ధేనువు మిక్కిలి పాలిచ్చునది. వేగవంత. అనాయాసముగ పితుక తగినది. విలక్షణ. సహస్రదుగ్ధ ధారలది. అభిలషణీయ. ఈ గోవు ఇంద్రుని ఆహ్వానించుచున్నది.

4. ఇంద్రదేవా! మహా మహా పర్వతములు కూడ నిన్ను అడ్డజాలవు. స్తోతనైన నాకు నీవు ప్రసాదించిన ధనమును ఎంతటి వాడును నిలుపజాలడు.

5. ఇంద్రుడు అన్నములకు ప్రభువు. వేగవంతుడు. సోమము త్రావి మదించువాడు. తన బలమున శత్రు పురములను ధ్వంసము చేయువాడు. సోమము సిద్ధమైనంత ఋత్విజుల కూడి సేవించువాడు. అట్టి ఇంద్రుని ఎరింగినవాడు ఏడి?

6. ఇంద్రా! నీవు యజ్ఞ విఘ్న కారులను దండించువాడవు. అందువలన మా యజ్ఞశాలకు నలుదిశల ఉన్న విఘ్నకారులను తరిమి కొట్టుము. నీవు ధనపతివి. అనేకులచే తలచుకొనబడువాడవు. మా సోమమును మా గృహములందు వర్ధిల్ల చేయుము.

7. త్వష్ట, పర్జనుడు, బ్రహ్మణస్పతి, పుత్ర, భ్రాతృసహిత అదితిదేవి దుష్కరములు, రక్షాయోగ్యములగు యజ్ఞస్తుతులను రక్షింతురు గాత.

8. ఇంద్రా! నీవు ఎన్నటికిని హింసకుడవు కావు. హవి అందించు యజమానులకు ఋత్విజులను సమకూర్తువు. మఘవా! నీ ధనము అనంతము. ప్రకాశవంతము. ఆ ధన దానము మమ్ము చేరుచున్నది.

9. వృత్రహంతా! నీవు హర్యశ్వములను రథమునకు పూన్చుట నిశ్చయము. నీవు ఉగ్రుడవు. దర్శనీయులగు మరుత్తుల

సహితుడవై ద్యులోకము నుండి విచ్చేయుము.

10. వజ్రీ! హవి అర్పించు నరులు నేడు ముందే నీకు సోమము సమర్పించినారు. మేము స్తోతలము. నిన్ను స్తుతించుచున్నాము. అవి వినుటకు మా యజ్ఞమునకు విచ్చేయుము.

ఎనిమిదవ ఖండము

ఋషులు :- 1,2,7,8. వసిష్ఠుడు. 3. అశ్వినులు, వైవస్వతుడు. 4. ప్రస్కణ్వుడు. 5. మేధాతిథి, మేధ్యాతిథులు. 6. దేవాతిథి 9. నృమేధుడు. 10. నోధ.

1. ఉష సూర్య పుత్రి. ఆమె అవతరించుచునే అంధకారములను దూరము చేయును. ఉషస్సును జనులందరు చూచినారు. ఆమె మహానేత్రము రాత్రి చీకటిని తరిమి వేయును. నరునకు నేత్రము వంటి ఉష వెలుగులు పరచును.

2. అశ్వినులారా! వీరు స్వర్గము కోరువారు. వీరు ఋత్విజులు. వీరందరు మిమ్ము ఆహ్వానించుచున్నారు. మీరు కర్మనే ధనముగా భావించువారు. నన్ను రక్షించుమని మిమ్ము ఆహ్వానించుచున్నాను. మీరు మిమ్ము స్తుతించు వారి వద్దకు వెళ్ళువారు కదా!

3. ప్రకాశమానులగు అశ్వినులారా! భూలోకమున మిమ్ము ప్రకాశింప చేయు నరుడు ఏడి? మీ కొరకు రాళ్ళతో దంచి సోమము తీయుచు అలసిన యజమానికి బహుళాన్నములు, రుచులు కలుగుచున్నవి. అట్లు అతడు ఐశ్వర్యవంతుడు అగుచున్నాడు.

4. అశ్వినులారా! మీ కొరకైన యజ్ఞమందు మధుర సోమము సిద్ధమై ఉన్నది. దానిని సేవించండి. యజమానికి ధనములు ప్రసాదించండి.

5. ఇంద్రా! నీవు భరించువాడవు. సింహసముడవు. యజ్ఞమందు నీకు సోమరసము సమర్పించుచున్నాను. దిగ్విజయ స్తోత్రములచే స్తుతించుచున్నాను. సర్వదా నిన్ను యాచించుచున్నాను. తన ప్రభువును యాచించని వాడెవడు?

6. అధ్వర్యులారా! ఇంద్రుడు సోమ పిపాసియై ఉన్నాడు. సోమమును ఉత్తర వేది మీదకు చేర్చండి. సారథి రథమున హర్యశ్వములను పూన్చినాడు. వృత్రహంత ఇంద్రుడు అదిగో రానే వచ్చినాడు!

7. ఇంద్రదేవా! నీవు అందరి కన్న పెద్ద వాడవు. నేను చిన్నవాడను. ప్రసిద్ధ ధనమును నాకు తెచ్చి ఇమ్ము. నీవు ధనవంతుడవు. యాచించ దగిన వాడవు. యుద్ధములకు ఆహ్వానించ బడువాడవు అగుచున్నావు.

8. ఇంద్రదేవా! నీవు ఎంత ధనవంతుడవో నేను అంతటి ధనవంతుడను అగుదును గాక. ఆ ధనమును నేను సామగాయక స్తోతలకు ఇచ్చెదను. వృధా చేయను.

9. ఇంద్రా! నీవు యుద్ధములందు శత్రు సేనలను తిరస్కరించు వాడవు. శత్రు నాశక ఇంద్రా! నీవు దైవిక ఆపదలను తొలగించువాడవు. మా శత్రువులకు ఆపదలు కలిగించు వాడవు. సకల శత్రువులను నాశనము చేయుచున్నావు. విఘ్నములను నివారించుచున్నావు.

10. ఇంద్రా! నీవు ద్యులోక బలమున వర్ధిల్లు చున్నావు. భూమి మీద పుట్టిన వాడెవ్వడును నీకు సాటి రాలేదు. మమ్ము అందరను మించిన వారలను చేయుము.

తొమ్మిదవ ఖండము

ఋషులు :- 1,2,6 వసిష్ఠుడు. 3. గాతు ఋషి. 4. పృథ్వువైన్యుడు. 5. సప్తగుడు. 7. గౌరివీతి. 8. వేనుడు. 9. బృహస్పతి లేక సకులుడు. 10. సుహోత్రుడు.

1. ప్రకాశమానమగు పాలు కలిసిన సోమము సిద్ద పరచినాము. స్వాభావికముగనే నీవు ఈ సోమమున తత్పరుడవు అగుదువు. నిన్ను స్తోత్రములు, హవిచే ఆరాధించుచున్నాము. సోమపుమత్తులో మా స్తుతులను వినుము.

2. ఇంద్రా! నీ కొరకు ఆసనము సిద్దపరచినాము. నిన్ను ఆహ్వానించు వారు అనేకులు. నేతలగు మరుత్తుల సహితుడవై విచ్చేయుము. ఈ ఆసనమున కూర్చుండుము. మా రక్షణలను వర్ధిల్లచేయుము. మాకు ధనము ప్రసాదించుము. సోమమును ఆనందించుము.

3. ఇంద్రదేవా! నీవు జలధర మేఘములను విదీర్ణము చేసినావు. మేఘములకు నీరు వెడలు మార్గములు ఏర్పరచినావు. బాధించు మేఘములను కురిపించినావు. నీవు ఎన్నో మేఘముల నుండి జలధారలు కలిగించినావు. దానవులను హతమార్చినావు.

4. ఇంద్రదేవా! సోమమును అభిషవించు వారు నిన్ను స్తుతించుచున్నారు. అనంత ధనవంత ఇంద్రా! మేము నీకు పురోడాశము అర్పించి స్తుతించుచున్నాము. నీకు ప్రియతమ మగు ధనమును మాకు ప్రసాదించుము. నీ రక్షణలు గల ధనమును మేము స్వయముగా పొందగలము.

5. బహుధనముల స్వామీ! మేము ధనము కోరుచున్నాము. నీ కుడిచేయి పట్టుకొన్నాము. నీవు అనేక గోవుల అధిపతివని మాకు తెలియును. మాకు కోరికలు తీర్చు ధనమును ప్రసాదించుము.

6. యుద్ధములందు రక్షణ కొరకు అనేక ఉపాయములు రచించబడును. అప్పుడు నరులు ఇంద్రుని ఆహ్వానింతురు.

శూరవీర ఇంద్రా! నరులు నిన్ను అన్నము అర్థింతురు. వారికి గోవులను, గోష్ఠములను ప్రసాదించుము.

7. సూర్య కిరణములు సంచరించునవి. సుఖములు కలిగించునవి. యజ్ఞప్రియలు. ద్రష్టలు ప్రజ్ఞాయాచికలు. అవి ఇంద్రుని యందు చేరినవి. ఇంద్రా! తిమిరమును దూరము చేయుము. తేజస్సును పూరింపుము. మమ్ము బంధ విముక్తులను చేయుము.

8. వేనా! నీవు సుందర నగరముల వాడవు. ఆకశమునకు ఎగురునపుడు బంగారు రెక్కల వాడవు. వరుణునకు దూతవు. విద్యుతాగ్నికి నిలయమవు. పక్షి రూపమున వర్షాదులు కలిగించువాడవు. స్తోతలు నిన్ను మనమున ధరించి అంతరిక్షమును చూచుచున్నారు.
(**అసావాదిత్యో వేనో** అని యజుర్వేధము **ఇన్ద్రో ఉవై వేనః, ఆత్మా వైవేనః** అని కౌషీతకి. ఈ మంత్రపు ఋషి వేనుడు.)

9. వేనుడు పూర్వము పుట్టినవాడు. జ్ఞాని వెధముఖమున శబ్దము చేయువాడు. కాంతి రక్షకుడు. అతడు ఆదిత్యాదులకు కాంతులు కలిగించినాడు. పుట్టిన, పుట్టనున్న వారిని స్థిరపరచినాడు.

10. ఇంద్రుడు మహానుడు. బలవంతుడు. శత్రుంజయుడు. శీఘ్రగామి. స్తుతియోగ్యుడు. వజ్రధారి. అట్టి ఇంద్రుని కొరకు స్తోతలు అపూర్వములు, సుఖదాయకములగు అనేక స్తుతులను గానము చేయుచున్నారు.

పదవ ఖండము

ఋషులు :- 1,2,4. ద్యుతానుడు. 3. బృహదుక్థుడు. 5. వామదేవుడు. 6,8. వసిష్ఠుడు. 7. విశ్వామిత్రుడు. 9. గౌరివీతి.

1. కృష్ణాసురుడు శీఘ్రగామి. పదివేల సేనలు కలవాడు. అతడు దండెత్తి అంశుమతి నదీ తీరమునకు చేరినాడు. అతడు తన బలమున లోకములను భయపెట్టు ధ్వని చేయగలవాడు. ఇంద్రుడు మరుత్తులతో కూడి అతని వద్దకు వచ్చినాడు. నరులు ఏక మనస్కులై ఆరాధించునట్టి ఇంద్రుడు కృష్ణాసురుని, అతని సేనను హతమార్చినాడు.

2. ఇంద్రా! సకల దేవతలు యుద్ధమందున నీకు సాయపడు మిత్రులై ఉండిరి. వారు వృత్రుడు తమ వైపునకు వచ్చుటను చూచి, భయపడి, నలువైపులకు నిన్ను విడిచి పారి పోయినారు. అప్పుడు ఎప్పటికి విడువని మరుత్తులతో నీకు స్నేహము అయినది. అప్పుడు నీవు విశ్వమందలి శత్రువులను స్వ బలమున గెలిచినావు.

3. కాల స్వరూప ఇంద్రుని కీర్తించుచున్నాడు:-

ఇంద్రుడు యుద్ధవిధాత. అనేకమంది శత్రువులను తరిమికొట్టువాడు. యువతను వార్ధక్యముచే మ్రింగించువాడు. అట్టి ఇంద్రుని మహత్తును ఎరుగండి.

బృహదుక్థా! ముసలివాడైనవాడు మరణించుచున్నాడు. అతడే రేపు మరల ఈ లోకమున పుట్టుచున్నాడు.

4. ఇంద్రా! నీవు ఎంతటి పరాక్రమా వంతుడవనగా నీవు కనిపించగనే ఏడుగురు శత్రువులు మిగలకున్నారు. నీవు చీకటిలో ఉండిన ద్యావాపృథ్వులను సూర్య రూపమున ప్రకాశవంతము చేసినావు. సగౌరవముగా సమస్త లోకములను నీవే భరించుచున్నావు.

5. ఇంద్రా! నీవు స్తుతులు అభిలషించువాడవు. మాశత్రువులను క్షీణింపచేయువాడవు. మాకు విజయము కలిగించువాడవు. మేఘముల ప్రేరకుడవు. ద్యులోక వాసివి. జలధరుడవు. వరదుడవు. స్థిరుడవు. వజ్రధారివి. శత్రుహంతవు. వర్షము కొరకు వానిని ప్రార్థించినట్లు నిన్ను స్తుతులతో అర్చించుచున్నాము.

6. జనులారా! మహావృద్ధి కర్త, మహామహుడగు ఇంద్రునకు సోమము అర్పించండి. జ్ఞానవంతుడగు ఇంద్రుని ఎంతో స్తుతించండి. వరదా! ఇంద్రా! హవి అర్పించు వారికి ప్రత్యక్షమగుము.

7. అన్నప్రదుడు, విజయప్రదాత, ఉత్సాహి, ధనికుడు, నరోత్తముడగు ఇంద్రుని యజ్ఞమునాకు ఆహ్వానించుచున్నాము.

ఇంద్రా! నీవు మాస్తుతులు వినువాడవు. ఉగ్రుడవు. అరి భయంకరుడవు. రాక్షసహంతవు. శత్రు ధనాపహారివి. రక్షించుమని నిన్ను పిలుచుచున్నాము.

8. అన్నములు కోరువారు ఇంద్రునకు స్తుతులు, హవిస్సులు అర్పించండి. వసిష్ఠా! నీవు సహితము యజ్ఞమందు ఇంద్రుని మహాస్తుతులతో అర్చించుము. ఇంద్రా! నీవు లోకములను వర్ధిల్ల చేయువాడవు. నేను నిన్ను ఉపాసించుచున్నాను. నా మాటలు వినుము.

9. ఇంద్రుని ఆయుధము అంతరిక్షమున స్థాపించబడినది. ఆ ఆయుధము ఇంద్రుని కొరకు జలములను వశపరచుకున్నది. భూమి మీద మిగిలిన నీరు ఓషధులందు చేరుచున్నది.

పదకొండవ ఖండము

ఋషులు :- 1. అరిష్టనేమి 2. భరద్వాజుడు. 3. విమదుడు. 4,5,6,9. వామదేవుడు. 7. విశ్వామిత్రుడు. 8. రేణు. 10.

గోతముడు.

1. తార్క్ష్యుడు ప్రసిద్ధుడు. అన్నవంతుడు. దేవతల ప్రేరణ కలవాడు. శక్తిమంతుడు. శత్రు రథభంజకుడు. అరిష్టనేమి. పదునైన ఆయుధముల వాడు. శత్రుంజయుడు. శీఘ్రగామి. మంచిరెక్కల వాడు. శుభములు కలుగవలెనని అతనిని ఈ యజ్ఞమునాకు ఆహ్వానించుచున్నాము.

(**వాయుర్వై తార్క్ష్యః** అని కౌషీతకి. **స్వస్త్యయనం వై తార్క్ష్యః** అని ఐతరేయము. తార్క్ష్యుడు వాయువు, శుభము అగును.

ఈ మంత్రద్రష్ట అరిష్టనేమి. అరిష్టనేమి అనగా ఎదురులేని రథము లేక ఆయుధము పదునైన ఆయుధము.

అరిష్టనేమి తండ్రి తార్క్ష్యుడు.)

2. **త్రాతారమిన్ద్రం హువే** = రక్షకుడగు ఇంద్రుని ఆహ్వానించుచున్నాము. **అవితారమిన్ద్రం హువే** = కోరికలు తీర్చు ఇంద్రుని ఆహ్వానించుచున్నాము.

ఇంద్రుడు సకల సంగ్రామములకు ఆహ్వానించబడువాడు. శూరుడు. సకల శక్తిమంతుడు. పురుహూతుడు. అట్టి ఇంద్రుని ఆహ్వానించుచున్నాము. ధనవంత ఇంద్రుడు ఈ హవిని స్వీకరించును గాక.

3. ఇంద్రుడు కుడిచేతి వజ్రము పట్టువాడు. రథముల నియంత. హర్యశ్వముల రథికుడు. అట్టి ఇంద్రుని యజామహే = పూజించుచున్నాము. ఇంద్రుడు సోమపానము చేసి గడ్డము కదలాడగా ప్రత్యక్షమగును. తన సేనలతో శత్రువులను గడగడలాడించును. అతడు నానావిధ ధనములను స్తోతలకు ఇచ్చును.

శ్మశ్రుభిః = గడ్డము మీసములతో అని అర్థము. ఇంద్రునకు గడ్డము మీసములు ఉన్నవని సూచన. మత్తెక్కిన వాని గడ్డము కదలుచుండును.)

4. ఇంద్రుడు శత్రుహంత. దడిపించువాడు. శత్రువులను తరుమువాడు. గొప్పవాడు. అపారుడు. వజ్రహస్తుడు. అట్టి ఇంద్రుని స్తుతించుచున్నాము. మేము స్తోతలము.

ఇంద్రుడు వృత్రహంత. అన్నదాత. అపార ధనవంతుడు. అతడు ధనములు దానము చేయును.

5. ఒకడు మమ్ము దండించుటకు మా మీదకు దండెత్తెను. ఒకడు అహంకారమున, క్షీణించు ఆయుధములతో ఎదిరించ గల మా ప్రజమీద దండెత్తెను. అట్టి వారినుండి రక్షణలకు ఆబోతుల వలె ఎగబడుదుము. వారిని తరిమి

వేతుము గాత.

6. యుద్ధములందు స్పర్థించు నరులు ఎవనిని పిలిచెదరో, ఆయుధము లెత్తి పోరుసల్పువారు ఎవనిని పిలిచెదరో, వీరులను ప్రసాదించుమని ఎవనిని పిలిచెదరో, జలముల కొరకు ఎవనిని పిలిచెదరో, వర్షము కొరకు ఎవనిని ఆశ్రయింతురో, యజమానులు హవి అర్పించి ఎవని బలమును పెంచుదురో అతడు ఇంద్రుడు అగును. ఇంద్రుడే అగును.

7. ఇంద్ర, పర్వతములారా! మేము మిమ్ము ప్రార్థించుచున్నాము. మహా రథముల మీద రండి. మాకు వీర పుత్ర సహిత అన్నములను ప్రసాదించండి.

ఇంద్ర, పర్వత దేవతలారా! మా యజ్ఞములందలి హవిని ఆరగించండి. మేము అర్పిమ్చు అన్నములకు ప్రసన్నులు కండి. మా స్తుతులు వినండి. వర్ధిల్లండి.

8. ఇంద్రుడు యజ్ఞముల వలన భూలోక ద్యులోకములను, రథపు రెండు చక్రములను ఇరుసువలె పట్టి నిలిపిఉంచినాడు. అట్టి ఇంద్రుని బిగ్గరగా ఆకాశమునకంటు ధ్వనిచే స్తుతించండి. అవి ఆకాశ జలములకు ప్రేరణ కలిగించును గాత.

9. ఇంద్రుడు పైకి ఎగురగలవాడు అయినాడు. విశాల అంతరిక్షమునకు చేరుకున్నాడు. స్తోతలు ఇంద్రప్రియస్తుతులు గానము చేసి అతనిని ప్రత్యక్షము చేసికొనుచున్నారు. ఈ యజ్ఞమునాకు కాంతి మంతుడై విచ్చేయు ఇంద్రుడు నా తండ్రికి పౌత్రుని ప్రసాదించును గాక - "పితుర్నపాతమ్".

(నాకు కొడుకునిమ్ము అనవచ్చును. కాని పితామహుడు పౌత్రుని చూడ వలెనని భావము.)

10. హర్యశ్వములు వీరకృత్యములు చేయునవి. తేజస్వులు. శత్రువులకు అందనవి. యజ్ఞాదులకు ఇంద్రుని చేర్చుటకు రథమునకు తగిలినవి. వానిని స్తోత్రములు, మంత్రములు చదివి నియంత్రించగలవాడు ఏడి?

రథమును లాగునట్టి ఈ అశ్వములను స్తుతించువాడు ఆయుష్మంతుడు అగుచున్నాడు.

పన్నెండవ ఖండము

ఋషులు :- 1. మధుచ్ఛందుడు. 2. మాధుచ్ఛందుడు. 3,6. గోతముడు. 5,8. తిరశ్చి. 4. అత్రి. 7. నిపాతిథి. 9. విశ్వామిత్రుడు. 10. శంయు.

1. శతక్రతో! నిన్ను ఉద్గాతలు గానము చేసి స్తుతించుచున్నారు. అర్కిణులు పూజనీయ ఇంద్రుని మంత్రములచే ప్రశంసించుచున్నారు. ఇతర బ్రాహ్మణులు వెదురు గడను వలె నిన్ను ఉన్నతుని చేయుచున్నారు.

(వెదురుగడ మొన పట్టి నాట్యము చేయువారు గడను పైకి ఎత్తుదురు.)

2. ఇంద్రుడు రథికులందు శ్రేష్ఠుడు. అన్నములకు ప్రభువు. సజ్జన పోషకుడు. సముద్ర గభీరుడు. అతనిని సమస్త స్తుతులు వర్ధిల్లచేసినవి.

3. ఇంద్రదేవా! ఇది ప్రశంసనీయ, ఆనందదాయక, అమృత, అభిషుత సోమము. ఇది యజ్ఞ సదనమున దీప్తమై ధారలుగా నీ ముందుకు చేరుచున్నది. ఈ సోమమును సేవింపుము.

4. విచిత్రుడు, వజ్రి, సంపన్నుడగు ఇంద్రుడు మాకు ఇవ్వదలచిన ధనము ఈ లోకమున లేదు. ఇంద్రా! నీవు మాకు రెండు చేతులతో ధనమును అందించుము.

5. ఇంద్రదేవా! నేను 'తిరశ్చి' ని. నీకు స్తుతులతో సపర్యలు చేయుచున్నాను. నా స్తుతులు వినుము. నన్ను వీర పుత్రులు, గోవులు, ఇతర ధనములతో పరి పూర్ణుని చేయుము. మహాంఅసి - నీవు ఎంతో గొప్పవాడవు.

6. ఇంద్రదేవా! నీ కొరకు సోమము సిద్ధమైనది. నీవు బలశాలివి. శత్రు తిరస్కర్తవు. విచ్చేయుము. సేవింపుము. సూర్యుడు అంతరిక్షమును వెలుగులతో పూరించినట్లు ఈ సోమము నిన్ను పరిపూర్ణుని చేయును గాత.

7. ఇంద్రా! ఈ 'నిపాతిథి' స్తుతులు వినుటకు హర్యశ్వముల మీద చేరుకొనుము. నీవు స్వర్గ పాలకుడవు. నీవు విచ్చేసినంత నేను సుఖింతును. దీప్తివంతా! ఇక స్వర్గమునకు విచ్చేయుము.

8. స్తుతియోగ్య ఇంద్రా! సోమము సిద్ధమైనది. మా స్తుతులు - రథములు గమ్యమును వలె- నిన్ను చేరుచున్నవి. ధేనువులు దూడలను వలె స్తుతులు నిన్ను పిలుచుచున్నవి.

9. రండి. రండి. త్వరపడండి. శుద్ధిచేయు సోమము తోను, శుద్ధిచేయి మంత్రములతోను శుద్ధుడగు ఇంద్రుని స్తుతించండి. పాపరహితుడై వర్ధిల్లిన ఇంద్రుని శుద్ధ స్తోత్రములు, పాలు కలిపిన సోమము ఆనందింప చేయును గాత.

(ఇంద్రుడు వృత్రాదులను వధించినాడు. తనకు బ్రహ్మహత్యా పాతకము తగిలినది అనుకున్నాడు. దానిని వదిలించుమని ఋషులను కోరినాడు. ఇది శాట్యాయనక బ్రాహ్మణము నందలి వృత్తాంతము. ఈ మంత్రము దీనికి సంబంధించినది.)

10. ఇంద్రా! మరింత ధనవంతము, ప్రకాశవంతము యశస్వంతమగు సోమము నీ భక్తులకు ధనము ప్రసాదించుచున్నది. సోమాధిపతి ఇంద్రా! అభిషుత సోమము నీకు ముదము కూర్చును గాత.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత పూర్వార్చి యందలి
మూడవ అధ్యాయము సమాప్తము.

శం నో దేవీరభీష్టయే శంనో భవన్తు పీతయే |
శం యోరభిస్రవన్తునః ||

నాలుగవ అధ్యాయము

మొదటి ఖండము

ఋషులు :- 1. భరద్వాజుడు. 2,7. వామదేవుడు. 3. ప్రియమేధ. 4. ప్రగాథుడు. 5. శ్యావాశ్వ ఆత్రేయ. 6. శంయు. 8. మధుచ్ఛందసుడు.

1. ఇంద్రుడు సోమపిపాసి. సర్వజ్ఞుడు. గమ్యమునకు చేర్చువాడు. యజ్ఞములకు చేరువాడు. అగ్రగామి. నరులారా! మీరు అట్టి ఇంద్రునకు సోమము అర్పించండి.

2. మిత్రమా! ఇంద్రా! నీవు అనేక పర్వత గుహల నుండి సోమరూప అన్నమును తెచ్చినావు. దానితో లోకము నందలి ఆకలి దప్పులను తొలగించుము.

3. ఇంద్రా! నీవు బలశాలివి. పరాక్రమవంతుడవు. హింసకులను హతమార్చువాడవు. సజ్జన పోషకుడవు. మాకు రక్షణలు, సుఖములు కలుగుటకుగాను, రథమును వలె నిన్ను నడిపించుచున్నాము.

4. ఇంద్రుని అనుగ్రహము సంపాదించు కర్మలను దేవతల పితరుడగు మనువు ఏర్పరచినాడు. ఇంద్రుడు యజమానులు చేయు అట్టి కర్మలను ఆశించుచు వచ్చును.

5. ఇంద్రా! ఏ యజ్ఞమునకు ప్రకాశమాన, శీఘ్రగామి మరుత్తులు రథము మీద నిన్ను చేర్చుచున్నారో ఆ యజ్ఞమున మధుర, మాదక సోమపానము చేయుము. వర్షము కలిగించి అన్నము పుట్టించుము.

6. ఇంద్రుడు భక్తులకు అనుగ్రహించువాడు. బలములకు నాథుడు. శత్రుంజయుడు. నేత యజ్ఞాదులందుండువాడు. విశ్వధని. అట్టి ఇంద్రుని స్తుతించుచున్నాను.

7. జయశీలుడు, అశ్వరూపుడు, వేగవంతుడగు దధిక్రావనామక అగ్ని దేవతను కీర్తించుచున్నాను. అతడు మా ఇంద్రియములను శక్తివంతములు, సుఖవంతములు చేయును గాక. మా ఆయుష్యములను పొడిగించును గాత.

8. ఈ ఇంద్రుడు శత్రుపురధ్వంసి, నిత్య తరుణుడు, విద్వాంసుడు, అమిత పరాక్రమశాలి, సర్వకర్మ పాలకుడు, వజ్రి, బహుజన స్తుతుడు అగుచున్నాడు.

రెండవ ఖండము

ఋషులు :- 1,3,5. ప్రియమేధ 2,10. వామదేవుడు 4. మధుచ్ఛందుడు. 6. భరద్వాజుడు. 7. అత్రి 8. ప్రస్కణ్వుడు. 9. అప్త్యస్త్రితుడు.

1. అధ్వర్యులారా! శూరవందనీయుడగు ఇంద్రునకు ముప్పూటల అన్నము అందించండి. అతడు మీచే యజ్ఞము చేయించును. యజ్ఞఫలము కలిగించును.

2. సర్వజ్ఞుడగు ఇంద్రునకు రెండు అశ్వములు ఉన్నవి. అవి సమస్త కర్మలకును, యజ్ఞములకును సాగును. ఆ విషయము ధృవపరచుకొని వానిని రథమునకు కట్టుదురు. అట్లని విద్వాంసులు వచించుచున్నారు. వారు స్వర్గార్హులు.

3. నరులారా! ఇంద్రుని అర్చించండి. విశేషముగా అర్చించండి. యజ్ఞ ప్రేమికులారా! ఇంద్రుని అర్చించండి. ప్రార్థించండి. బిడ్డలారా! వరదుడు, శత్రుహంత యగు ఇంద్రుని అర్చించండి అర్చించండి **"అర్చస్తు అర్చత"**

4. బహుశత్రు వినాశకుడగు ఇంద్రుని వర్ధన స్తుతులు, మంత్రములచే కీర్తించండి. అప్పుడు ఇంద్రుడు మీ పుత్రులను, మిత్రులను అనుగ్రహించును.

5. ఇంద్రుడు పగతుర మీద దండెత్తువాడు. శత్రువు ముందు తలవంచనివాడు. బలములకు అధిపతి. మరుత్తులారా! మీ సేనలు, వాటి గమనము, రథములను రక్షించుట కని ఇంద్రుని ఆహ్వానించుచున్నాను.

6. నరుడు కర్మానుష్టానము చేయును. సన్మార్గవర్తి అగును. తేజోవంతుడగు ఇంద్రుని స్తుతించును. స్తోతయగును. అతడు ఇంద్రుని ప్రకాశ రక్షణలందు తన శత్రువులను పాపములను దాటును.

7. శతక్రతూ! నీవు బహుధనవంతుడవు. నీ దానము అతిభారము. కావున విశ్వద్రష్టవు, మంగళ మయుడవగు ఇంద్రదేవా! మాకు ధనమును ప్రసాదించుము.

8. శుభ్రవర్ణ ఉషోదేవీ! నీ వెలుగులు వ్యాపించినంత నరులు, పశువులు జాగ్రుతులు అగుదురు. పక్షులు ఆకాశమున సంచరించును.

9. సూర్యుడు ప్రకాశించినంత ఆకసమున నిలుచు దేవతలారా!

కద్వః ఋతం కద్వస్నృతం కాప్రత్నా వ ఆహుతిః । ఏది సత్యము? ఏది అసత్యము? ఏది సనాతనము? ఏది నీ ఆహుతి?

10. హోత, ఉద్గాతలారా! మీరు అనుష్టించు ఋక్ సామములనే మేము ఆరాధింతుము. అవి ప్రకాశవంతములై దేవతలకు యజ్ఞమును చేర్చును.

మూడవ ఖండము

ఋషులు :- 1. రేభుడు. 2. సువేద శైలూషి. 3 వామదేవుడు. 4. సవ్య ఆంగిరసుడు. 5. విశ్వామిత్రుడు 6. కృష్ణ ఆంగిరసుడు. 7,8. సవ్యుడు. 9. భరద్వాజుడు 10. మేధాతిథి. 11. గర్భస్రవణ్యుపనిషత్తు.

1. విశాలరంగములందలి సేనలు దండెత్తుటకు కూడినవి. శత్రుహంతయగు ఇంద్రుని ఆయుధవంతుని చేయుచున్నవి.

సూర్యుని వలె ప్రకాశించు ఇంద్రుని, స్తోతలు యజ్ఞములందు సాక్షాత్కరింప చేయుచున్నారు.

ఇంద్రుడు కర్మిష్టులందు శ్రేష్ఠుడు. స్థిరుడు. శత్రుహంత. ఉగ్రుడు. పరమతేజస్వి. బలశాలి. అట్టి ఇంద్రుని ధనము కోరి స్తుతించుచున్నాము.

2. ఇంద్రదేవా! నీ యొక్క ప్రధాన క్రోధమునకు శ్రద్ధగా ప్రణమిల్లుచున్నాను. ఆ కోపము తోనే నీవు దస్యులను వధించినావు. మేఘములందున్న నీటిని ఈ లోకమునాకు చేర్చినావు. ద్యావాపృథ్వులు నీ అధీనమున ఉన్నవి. విశాల అంతరిక్షము నీ బలమునకు కంపించును.

3. విశ్వమా! స్వర్గ బలములకు స్వామియైన ఇంద్రునకు స్తుతులు, హవిస్సులు సమర్పించుము. ఇంద్రుడు ఒక్కడే యజమానికి అథితి. శత్రుంజయుడు. నవీనుడు. అతడు ఒక్కడే విజయమార్గమున నడిపించగలవాడు.

4. ఇంద్రా! నీవు అధిక ధనవంతుడవు. అనేకులచే కీర్తించబడువాడవు. మేము నీ వారలము. నిన్ను ఆశ్రయించి యజ్ఞములు చేయుచున్నాము. నీవు వినా అన్యుడు స్తుతియోగ్యుడు కాడు. భూమి ప్రాణులను పోషించినట్లు నీవు మా

స్తుతులను పాలించుము.

5. నరపాలకుడు, ప్రశంసనీయుడు, బలవర్ధకుడు, పురుహూతుడు, అమరుడు ఇంద్రుడు. అతనిని సుందర, బృహత్తర స్తుతులచే నిత్యము స్తుతించండి. సకల దిశలందు స్తుతించండి.

6. స్త్రీలు పరిశుద్ధులు, దోషరహితులు, ధనవంతులగు తమ భర్తలను తమ రక్షణల కొరకు ఆలింగనము చేసికొందురు. అట్లే స్వర్గసుఖముల కొరకు స్తుతులు ఇంద్రుని కౌగిలించుకొనును.

('పరిష్వజంత' అనుట వరించుట కావచ్చును.)

7. ఇంద్రుడు ప్రసిద్ధుడు. శత్రువును ఎదిరించు వాడు. కీర్తనీయుడు. ధనార్ణవుడు. అతనిని స్తుతించండి. ప్రసన్నుని చేయండి. ఇంద్రుడు సూర్యుని వంటి మానవ హితకారి. అతడు కిరణముల వలె సంచరించును. అతడు మహానుడు. మేధావి.

సుఖముల కోరి అట్టి ఇంద్రుని అర్చించండి.

8. ఇంద్రుడు విశ్వభూపతి. శత్రుస్పర్ధి. దాత. రథము వలె గమ్యమునాకు చేర్చువాడు. అశ్వము వలె యజ్ఞములకు చేర్చువాడు. నా రక్షణకు అట్టి ఇంద్రుని సుందర స్తుతులచే నుతించుచున్నాను. శత ప్రదక్షిణలు చేయుచున్నాను.

9. ద్యావాపృథ్వులు, జలవంతమై ప్రాణులను పోషించు ధరిత్రి జలనిధి, సుందరుడగు వరుణుని శక్తి వలన నిలిచి ఉన్నవి. నిత్య బీజవంతములు అగుచున్నవి.

10. ఇంద్రదేవా! నీవు ఉషస్సువలె ద్యావాపృథ్వులను కాంతులతో నింపుచున్నావు. దేవా, మానవులకు ప్రభువగు నిన్ను అదితిదేవి కన్నది. నీ వంటి పుత్రునకు జన్మనిచ్చి అదితి మహా జనని అయినది.

11. ఋత్విజులారా! స్తుతియోగ్య ఇంద్రుని హవిస్సులు, స్తుతులతో అధికముగా అర్చించండి. ఇంద్రుడు 'ఋత్విశ్వ' ని వెంటపెట్టుకొని కృష్ణాసురుని గర్భవతులగు భార్యలను హతమార్చినాడు. అట్టి వరదుడు, వజ్రహస్తుడగు ఇంద్రుని మమ్ము రక్షించుమని మిత్రుని వలె ఆహ్వానించుచున్నాము.

('ఋజిశ్వుడు' 'ఓశిజ' పుత్రుడు. "విప్రు" "కృష్ణగర్భ" లతో జరిగిన యుద్ధమున ఇంద్రునాకు సాయము చేసినాడు.)

నాలుగవ ఖండము

ఋషులు :- 1. నారదుడు. 2,3. పృక్త్వశ్వసూక్తి 4. పర్వతుడు. 5,6,7,10. విశ్వమనా వైయశ్వుడు. 8. నృమేధ 9. గోతముడు.

1. ఇంద్రా! అభిషుత సోమపానము చేసిన నీవు యజమాని, స్తోతల బలములను వర్ధిల్లచేసి వారిని పావనులను చేయుచున్నావు. అతడు నిశ్చయముగా మహామహుడు. "మహాన్ హి సః"

2. స్తోతలారా! పురుహూతుడు - అనేకులచే పిలువబడువాడును, పురుష్టుతమ్ - అనేకులచే స్తుతించబడువాడును అగు ఇంద్రుని స్తుతులు పాడండి. మహామహుడగు ఇంద్రుని మంత్రములచే అర్చించండి.

3. వజ్రధారి ఇంద్రా! నీవు వరదుడవు. యుద్ధములందు శత్రుహంతవు. లోకకర్తవు. హర్యశ్వుడవు. మేము నీ సోమపాన జనిత హర్షమును ప్రశంసించుచున్నాము.

4. ఇంద్రా! విష్ణువు సోమ పానమునకు వచ్చినంత నీవు వేరొక యజ్ఞమున సోమ పానము చేయుదువు. 'ఆప్తి' పుత్రుడగు 'త్రితు' ని యజ్ఞమున సోమపానము చేయుదువు. మరుత్తులు సోమపానమునాకు వచ్చినంత మరొకరి యజ్ఞమున సోమపానము చేసి ప్రసన్నుడవు అగుదువు. అట్టి నీవు మేము అర్పించు ఉత్తమ సోమము సేవించుము. ప్రసన్నుడవు అగుము.

5. అధ్వర్యులారా! మాదకము, ఆనంద దాయకమగు సోమమునే ఇంద్రునకు అర్పించండి. సమర్థుడు, వర్దమానుడే కదా కీర్తనీయుడు!

6. అధ్వర్యులారా! ఇంద్రుని ముందు, ఇంద్రుని కొరకు సోమబిందువులను రాల్చండి. ఇంద్రుడు ఆ మధుర సోమరసమును త్రావి తన మహిమచే స్తోతలకు అధిక అన్నములను ప్రసాదించును గాత.

7. ఇంద్రుడు స్తోతవ్యుడు. నాయకుడు, ఒక్కడే సకల శత్రుసేనలను హతమార్చువాడు. మిత్రులారా! రండి. త్వరత్వరగా రండి. ఆ ఇంద్రుని స్తుతించండి.

8. ఉద్గాతలారా! మేధావి, మహానుడు, అన్నకర్త, విధ్వాంసుడు, స్తుతి ప్రియుడగు ఇంద్రుని బృహత్ సామముల గానము చేయండి.

9. ఇంద్రుడు ఎదురులేని వాడు. జగదీశ్వరుడు. అతడు ఒక్కడే ఉపాసకులకు విశేష ధనము ఇచ్చువాడు అగుచున్నాడు. మరొకడుకాడు.

10. మిత్రులారా! వజ్రప్రాణిని మంత్రములచే ప్రార్ధించండి. మీ అందరి కొరకని నరశ్రేష్టుడు, శత్రు భయంకరుడగు

ఇంద్రుని స్తుతించుచున్నాను.

అయిదవ ఖండము

ఋషులు :- 1. ప్రగాథుడు 2. భరద్వాజుడు 3. నృమేధ 4. పర్వతుడు 5,7. ఇరిమిరి. 6. విశ్వమనుడు 8. వసిష్ఠుడు.

1. ఇంద్రా! నీవు పుట్టుకతోనే శత్రు రహితుడవు. నియంత్రించువారు లేనివాడవు. సనాతన బందు రహితుడవు. నీవు బాంధవ్యము కోరునపుడు యుద్ధమున సాయమునకు పిలిచినవానికి స్నేహితుడవు అగుచున్నావు.

2. మిత్రులారా! ఇంద్రుడు ముందు మాకు శ్రేష్ఠమగు ధనమును విశేషముగా ఇచ్చుచున్నాడు. ఆ ఇంద్రునే మీకు ధనమునిమ్మని రక్షణ కల్పించమని ప్రార్థించుచున్నాను.

3. సంచలన మరుత్తులారా! రండి, మా వద్దకు రండి. రాకున్నను మాకు హాని కలిగించకండి. సమతేజ స్కులును, పర్వతములను సహితము నియంత్రించు మరుత్తులారా! మమ్ము విడువకండి. మరొకచోట నిలువకండి.

4. అశ్వపతి, గోపతి, భూపతివగు ఇంద్రా! నీ కొరకు సోమము సిద్ధపరచినాము. సోమపతీ! విచ్చేయుము. సోమపానము చేయుము.

5. వరదా! ఇంద్రా! మా గోష్టమునకు క్రోధమున శ్వాసల మంటలతో వచ్చువానిని నీ సహాయముననే మాటలతో మరలింపగలము.

6. సతేజస్క మరుత్తులారా! మీ తల్లులగు గోవులు సహజాతలు, సహబాంధవులు అవి అన్ని దిక్కులందుండును. ఒకదానిని మరొకటి నాకును.

7. ఇంద్రదేవా! నిన్ను స్తుతియుక్తుని చేయుచున్నాము. జలములున్న బాటసారిని అన్యుడు అర్థించినట్లు మా కోరికలు తీర్చుమని నిన్ను అర్థించుచున్నాము.

9. ఇంద్రదేవా! పాడితో కూడినదియు, ఆనందదాయకమును, స్వర్గము కలిగించు సోమమును సిద్ధము చేసినాము. పక్షులవలె కూడి నిరీక్షించుచు నమస్కరించుచున్నాము.

10. వజ్రధారీ! నీవు మూడు సవనములకు ప్రత్యక్షమగుచున్నావు. మేము నిన్ను సోమము సమర్పించి పోషించుచున్నాము. తన ఇంట అన్నము కలుగవలెననుకొను సజ్జనుడు ఇతరులను పిలిచినట్లు మమ్ము కాపాడుమని నిన్ను ఆహ్వానించుచున్నాము.

ఆరవ ఖండము

ఋషులు : 1,2,3,4,5,6,9,10. సోభరి. 7,8. నృమేధ.

1. ఇంద్రా! నీవు జన్మముననే శత్రు రహితుడవు. నియంతలేనివాడవు. నీకు బందువులు ఉండరు.కాని నీవు కోరినంత యజకులు, యోద్ధలు నీకు బంధువులగుచున్నారు.

2. ఋత్విక్కులారా! మిత్రులారా! ఇంద్రుడు మున్ను మా కొరకు సమృద్ధ ధనము ఇవ్వదలచినాడు. అట్టి ధనమునే అందించుమని అర్థించండి - రక్షించమని స్తుతించండి.

3. ప్రస్థానించు మరుత్తులారా! విచ్చేయండి. రానప్పుడు హాని కలిగించకండి. మీరు సమతేజోవంతులు. పర్వతములను సహితము నియంత్రించగలవారు. మమ్ము విడువకండి. అన్యుల వద్దకు చేరకండి.

4. ఇంద్రా! నీవు అశ్వపతివి. గోపతివి. అన్నపతివి. సోమపతివి. సోమము సేవింపుము 'సోమంపిబ"

5. ఇంద్రా! నీవు వరదుడవు. మేము గోధనులము - నీ భక్తులము. శత్రువు మా మీద అధిక క్రోధం గలవాడు అయినాడు. ఊపిరి పీల్చలేకపోతున్నాడు. మీ సహాయం ఉంటేనే మేము శత్రువును తొలగించగలము.

6. మరుత్తులారా! మీరు సమతేజం కలవారు. గోవులు మీ తల్లులు. మీకు సజాతీయులు బంధువులు అందుకే అవి దశదిశలందు ప్రేమగా పరస్పరం నాకుచున్నవి.

7. ఇంద్రా! నీవు శతక్రతువవు. బహుదృష్టులవాడవు. మాకు ధనము, బలము ప్రసాదించుము. నీవు శత్రుహంతవు. వీరుడవు. నిన్ను ఆహ్వానించుచున్నాము.

8. నీటికుండతో సాగేవాడు బాటసారి దోసిట్లో నీళ్ళు పోస్తాడు. అదే విధంగా ఇంద్రా! నిన్ను యాచిస్తున్నాము. నిన్నే స్తుతించుచున్నాము.

9. ఇంద్రా! నీ మధువు పాలుకలిపినది. హర్షదాయకము. స్వర్గమున లభించునది. పక్షులు కూడినట్లు కూడి నీకు ప్రణమిల్లుచున్నాము.

10. ఇంద్రా! నీవు బహురూపములవాడవు. మూడు సవనాల్లో దర్శనం ఇస్తావు. గృహపతి గుణవంతుని ఆహ్వానిస్తాడు. అట్లే మేము నిన్ను ఆహ్వానించుచున్నాము.

ఏడవ ఖండము

ఋషులు : 1-8. గోతముడు. 9. త్రితుడు. 10. అవస్యుడు.

1. ఇది సోమము. ఇది మధురము. యజ్ఞములకు చేరునది. దీనిని గోవులు పానము చేయుచున్నవి. అవి వారములు ఇచ్చునవై, ఇంద్రునితో సాగి ప్రసన్నులై, శోభాయమానలు అగుచున్నవి. అవి స్వరాజ్యమున ఉండుచున్నవి.

(**స్వకేయస్యేన్ద్రస్య యద్రాజ్యం స్వరాజ్యం** అని సాయణుడు. ఇంద్రుని రాజ్యము స్వరాజ్యమని.)

2. ఇంద్రా! నీవు బలశాలివి. వజ్రివి. నీ కొరకని విధివిహితముగ సోమము పట్టి నిలిచినాము. నీవు వర్ధిల్లు స్తుతులు వచించినాము. నీరాజ్యమున నీ అధికారము ప్రకటించుము. వృత్రుని భూమండలము నుండి తొలగించుము.

(అహిమ్-హంతారం వృత్రం అని సాయణుడు అహి సర్పము అని మెక్డొనాల్డ్. అహి అనగా పాము, శత్రువు, వృత్రుడు అని నిఘంటువు. కావున భూమండలము నుండి తొలగించవలసినవి విషము, పగ, పాపము కావచ్చును.)

3. వృత్రహంత ఇంద్రా! నరులు నీకు సోమమున హర్షము, స్తోత్రములచే బలము కలిగించుచున్నారు. అందువలననే నిన్ను పెద్ద, చిన్న యుద్ధములకు ఆహ్వానించుచున్నారు. మా ఆహ్వానములు విన్న ఇంద్రుడు మమ్ము యుద్ధములందు రక్షించునుగాత.

4. మేఘవాహన, వజ్రహస్త ఇంద్రా! నీ సామర్ధ్యమును కాదన్న శత్రువు లేడు. దానితోటే స్వరాజ్యమున ప్రభుత్వము చేయుచున్నావు. మాయమృగమగు వృత్రుని నీ మాయతోనే హతమార్చినావు. ఆనాడే నీ బలము ప్రసిద్ధమైనది.

5. ఇంద్రా! దండెత్తుము. శత్రువును ఎదుట నిలిచి పట్టుము. శత్రువులు నీ వజ్రమును నిలుపజాలరు. నరులు దాని ముందు తలలు వంచెదరు. కావున స్వరాజ్యమున నీ అధికారము చూపుము. వృత్రుని వధించుము. అతడు కట్టిన నీటిని విడిపించుము.

(వృత్రుడు నీటిని కట్టి పెట్టినాడని వృత్తాంతము.)

6. యుద్ధము జరిగినపుడు గెలిచినా వానికి ధనము లభించును. ఇంద్రదేవా! శత్రువుల మదమును అణచు హర్యశ్వములను రథమునకు పూన్చుము. నిన్ను ఆరాధించని వానిని ఓడించుము. నిన్ను ఆరాధించు వానికి ధనమును నిలుపుము.

7. ఇంద్రా! నరులు నీవు ప్రసాదించిన అన్నము తిన్నారు. తృప్తులైనారు. ఆనందమున మాటరాక తలలు ఆడించినారు. తదుపరి తేజోవంతులగు ఋత్విజులు నవ్యస్తుతులచే నిన్ను స్తుతించినారు. నీవు హర్యశ్వములను రథమునాకు కట్టుము.

8. మఘవా! మా స్తుతులను దగ్గరి నుండి స్పష్టముగ ఆకర్ణించుము. నీవు ముందు వలెనే ఉండుము. మారకుము. మమ్ము ఎప్పుడు స్తుతివంతులను చేయుదువు? మా స్తుతులను స్వీకరించుటకు త్వరగా హర్యశ్వములను రథమునకు పూన్చుము.

9. ఉదక మండలమున సూర్య కిరణ యుక్తుడగు చంద్రుడు ఉరుకులు పెట్టుచున్నాడు. చంద్ర సంబంధులగు బంగరు మొనల కిరణములారా! నేనుకూపమున ఉన్నందున మీ కిరణములు అందుత లేదు. నన్ను కూపము నుంచి లేపండి.

ద్యావాపృథ్వులారా! నా స్తుతులు వినండి.

(ద్యావాపృథ్వులను కూడ తనను బయటికి లాగవలసినదని ప్రార్థించుచున్నాడు. కూపము అజ్ఞానాంధకారము - కిరణములు జ్ఞాన జ్యోత్స్న కావచ్చును.)

10. అశ్వినులారా! మీ రథము ప్రియతమము. ఫలదము. ధనవాహము. స్తోతలగు ఋషులు చక్కని స్తుతులచే దానిని శోభిల్ల చేయుచున్నారు. మధు విద్యావిశారదులారా! ఆ స్తుతులను ఆకర్ణించండి.

ఎనిమిదవ ఖండము

ఋషులు :- 1,7. వసుమిత్రుడు. 2,4. విమదుడు. 3. సత్యశ్రవుడు. 5,6. గోతముడు. 8. అంహోముగ్వామాదేవ్యుడు.

1. అగ్నిదేవా! నీవు దీప్తిమంతుడవు. జరా రహితుడవు. నిన్ను సకల దిశలందు ప్రజ్వలింప చేయుచున్నాము. నీ దీప్తి స్తుతియోగ్యము. అది ద్యులోకమున వెలుగుచున్నది. మేము స్తోతలము. మాకు అన్నము ప్రసాదించుము.

2. అగ్నిదేవా! నేను విమదుడను. నీ కొరకు దోషరహిత స్తుతులు రచించినాను. నీవు హోతవు. కుశలు పరచినట్టియు, ఓషధీ వ్యాప్తమైనట్టియు, పావక శుద్ధమగు యజ్ఞమునకు నిన్ను ఆహ్వానించుచున్నాను. ఆరాధించుచున్నాను. నీవు మహిమాన్వితుడవు కదా!

3. ఉషోదేవీ! నేడు నీ వెలుగులతో మా ధన మార్గములను ప్రకాశింపచేయుము. నీవు సుజాతవు సూనృతవు. నేను వయపుత్రుడనగు సత్యశ్రవుడను. నన్ను పూర్వము వలెనే అనుగ్రహింపుము.

4. సోమమా! నీ మహిమ గొప్పది. నేను విమదుడను. నా మనసును, ఆత్మను, ప్రజ్ఞానమును శుభ ప్రధము చేయుము. నీ స్తోతలు నీకు మిత్రులు అగుదురు గాక. గోవులు పచ్చికలో వలె వారు నీ మైత్రిచే ఆనందింతురుగాక.

5. ఇంద్రుడు ప్రజ్ఞావంతుడు. అరిభయంకరుడు. సోమాన్నవంతుడు. అతడు తన బలమును ఎదుట నిలిచి ప్రదర్శించును. తదనంతరము దర్శనీయులు, సునాసికలగు హర్యశ్వవంత ఇంద్రుడు సంపదల కొరకని దగ్గరనున్న ఇనుప వజ్రమును అందుకొనును.

6. ఇంద్రుడు స్నేహశీలి. వరదుడు. గోప్రదాత. అతడు రథమును అధిష్టించువాడు. అతనికి సోమము నిండిన పాత్ర గుర్తుకురాగా హర్యశ్వములను పూన్చును గాత.

7. అగ్ని ధనమగును. ఆశ్రయమగును. అతని తృప్తుని చేయుటకు ధేనువులు సాగును. అట్టి అగ్నిని శీఘ్రగాములగు అశ్వములు తెచ్చును. హవి సమర్పించు నిత్య ఉపాసకులను అగ్ని అనుగ్రహించుము. అట్టి అగ్ని మాకు అన్నము ప్రసాదించునుగాత.

8. దేవతలారా! ప్రసన్న మనస్క, శత్రు శిక్షక ఆర్యను, రక్షించు మిత్రుడు, పాపనాశక వరుణుడు ఎవనిని ఉన్నత పదమునకు చేర్తురో - వానిని పాపములు అంటవు. దుర్గతులు తాకవు.

తొమ్మిదవ ఖండము

ఋషులు :- 1-6, 9,10 ఋణసదస్యుడు. 7. వసిష్ఠుడు. 8. వామదేవుడు.

1. సోమమా! ఇంద్రుని కొరకు, మిత్రుని కొరకు, పూషా కొరకు, భాగుని కొరకు రుచికరమవై పాత్రలన్నింట నిండుము.

2. సోమమా! నీవు సహనశీలవు. మాకు మంచి అన్నములు ప్రసాదించుము. నలువైపులా నున్న పాత్రలందు నిండుము. మా శత్రువులపై దండెత్తుము. మా రుణములను తీర్చుము. పాపములను నాశము చేయుము. దాటిపొమ్ము.

3. సోమమా! నీవు మహానుడవు. రసవాహినివి. పోషకుడవు. సకల దేవతల లోకములందలి పాత్రలందు నిండుము.

4. సోమమా! నీవు అశ్వము వలె జలముచే శుద్ధి చేయబడినావు. అశ్వము వంటి వేగము కలదానవు. మాకుబలము, ధనము కలిగించుటకు పాత్రలందు నిండుము.

5. సోమము శుభంకరము. విద్వత్తమము. అది ధనము, ఆనందము కొరకు జలములందు స్రవించును.

6. సోమమా! నిన్ను సంపాదింతుము. స్తుతింతుము. నీవు మహా మానవ సామ్రాజ్యములను రక్షించుటకు శత్రు సేనపై దండెత్తెదవు.

7. మరుత్తులు కాంతిమంతులు. ప్రభువులు సమాన స్థానముల వారు. మానవ హితైషులు. అశ్వవంతులు. ఉగ్రులు. వారు ప్రార్థించువారిని అనుగ్రహింతురు.

8. అగ్నిదేవా! నీవు కళ్యాణమూర్తివి. పరమ ప్రియుడవు. మేము స్తోతలము. ఇంద్రాదులను ప్రసన్నులను చేయు స్తుతులతో - అశ్వము వలె హవిని వహించు నిన్ను వర్ధిల్ల చేయుచున్నాము.

9. ఈ దేవతలు మానవ హితకారులు. ప్రకాశించువారు. సవిత కొరకు సిద్ధము చేసిన సోమరూప అన్నమును అందుకున్నారు. యజమానులారా! ఇక స్వర్గమును జయించండి. అశ్వములను జయించండి.

10. సోమమా! నీవు యశస్విని. చక్కని ధారల దానవు. సనాతనుడవు. గొప్పవాడవు. రోమముల నుంచి ప్రవాహించుము.

(సోమమును అజ రోమములతో శుద్ధి చేయుదురు.)

పదవ ఖండము

ఋషులు :- 1,2. ఐంద్రి. 3. త్రసదస్యుడు. 4,5. ఐంద్రి. 6,10. సంపాత ఋషి.

1. ఇంద్రా! నీవు సర్వత్ర శత్రుచ్ఛేదకుడవు. సర్వత్రదాతవు. బలవంతుడవు. మాకు కోరిన పదార్థముల నిమ్ము. యాచించువారికి ఇమ్ము.

2. ఇంద్రుడు ఋతురూపుడు. ప్రఖ్యాతుడు. అడిగిన వరములు ఇచ్చువాడు. అతనిని ప్రశంసించుచున్నాను.

3. వృత్రాసురుని వధించుటకు గాను ఇంద్రుని స్తుతించుచున్నాము. మంత్రములచే పూజించుచున్నాము. ప్రసన్నుని చేయుచున్నాము.

4. ఇంద్రా! ఋభువులు మానవులు. వారు నీ గుర్రముల కొరకని రథము సిద్ధము చేసినారు. త్వష్ట నీ కొరకని ద్యుమంత వజ్రమును నిర్మించినాడు.

(మానవులగు ఋభువులు తమ నైపుణ్యమున దేవతలు అయినారు.)

5. హవిస్సులు అర్చించువారు ధనవంతులగుదురు. సుఖింతురు. అర్పించనివాడు దానములు ఇవ్వజాలడు. తన ధనమును తాకజాలడు.

6. ఇంద్రుని శరణు కోరినవారు నిర్మలులు, లోక పోషకులు, దానాది సద్గుణ యుక్తులు, పాపరహితులు అగుచున్నారు.

7. ఉషోదేవీ! హర్షదాయక తేజస్సులతో విచ్చేయుము. పొడుగు బరువైన ఆవులు నీ రథమును సేవించుచున్నవి.

8. ఇంద్రా! చమసములందు మధుర సోమము నీవద్ద ఉంచినాము. అన్నము వడ్డించినాము. ప్రార్థించుచున్నాము.

9. సుందర స్తుతివంతులగు మరుత్తులు పూజార్హా ఇంద్రుని స్తుతింతురు. నిత్య యవ్వనుడు. ప్రసిద్ధుడగు ఇంద్రుడు వారి శత్రువుల మీద దండెత్తును. వధించును.

10. విప్రులారా! ఇంద్రుడు వృత్రహంత. అతనిని ప్రసన్నుని చేయగల విశేష స్తుతులు గానము చేయండి.

పదకొండవ ఖండము

ఋషులు :- 1. పృషదుడు. 2,3,4. బంధువు. 5. సంవర్తుడు. 6. ఆప్త్యుడు. 7. ఐలూషుడు. 8. భరద్వాజుడు. 9. ఆత్రేయ. 10. వసిష్ఠుడు.

1. అగ్ని హవ్యవాహుడు. బుద్ధికుశలుడు. హవియుక్తుడు. రథము వలె చేర్చువాడు. అతడు యజమానిని గుర్తించును.

2. అగ్నిదేవా! నీవు అర్చనీయుడవు. మాకు దగ్గరి వాడవు. రక్షకుడవు. సుఖ ప్రదుడవు అగుము.

3. అగ్ని మహితాత్ముడు. సూర్యసముడు. పూజనీయుడు. అతడు యజిమ్చు వారికి రత్నరాసులు ఇచ్చును.

4. అగ్ని సకల శత్రుహంత. ఈ యజ్ఞమున తూర్పున ఆసీనుడై ఉన్నాడు. ఋత్విజులు అతనిని స్తుతించుచున్నారు.

5. ఈమె ఉష. తన సోదరి రాత్రి అంధకారమును తన ప్రకాశమును దూరము చేయుచున్నది. తన వెలుగులను రథము మీదకు చేర్చుచున్నది.

6. దృశ్యమానములగు సమస్త భువనములను, సుఖముల కొరకని స్వాధీనపరచు కొనుచున్నాను. ఇంద్రుని, సమస్త దేవతలను స్తుతించుచున్నాను. వారు నాకు కార్యసిద్ధి కలిగింతురుగాత.

7. ఇంద్రా! నీ దానములు రాజమార్గము నుంచి చీలు చిన్న మార్గములవలె మాకు అందును గాక.

8. ఇది దేవతలు ప్రసాదించిన అన్నము. దీనిని మేము అనుభవింతుముగాత. సుపుత్రవంతులమగుదుము గాత. శతహిమములు జీవింతుము గాక.

9. ఇంద్ర, మిత్ర వరుణులారా! మాకు బలము నిచ్చు అన్నము ప్రసాదించండి. మా అన్నములను వర్ధిల్లచేయండి.

10. **"ఇంద్రో భువనస్య రాజతి"** ఇంద్రుడు లోకములకు ప్రభువు అగుచున్నాడు.

పన్నెండవ ఖండము

ఋషులు :- 1,10. గృత్సమదుడు. 2. గౌరాంగిరసుడు. 3,5,7,9 పరుచ్ఛేపుడు. 4. రేభుడు. 6. ఏవయామి. 8. నకులుడు.

1. ఇంద్రుడు బలశాలి. పూజనీయుడు. తృప్తుడు. ఈ సముపార్జించిన సోమమున యవల సత్తు కలుప బడినది. దానిని విష్ణు సహితుడై ఇంద్రుడు పానము చేసినాడు. ఆ సోమము మహాకార్యములు నిర్వర్తించుటకు ఇంద్రునకు ప్రేరణ కలిగించినది. బిందువులుగారాలు ఈ సోమము దీప్తివంతమై సత్య స్వరూపుడగు ఇంద్రుని చేరినది.

2. సూర్యభగవానుడు వేలకొలది మనుష్యులు కలవాడు. దర్శనీయుడు. విద్వాంసులకు మాననీయుడు. విధాత. జ్యోతిర్మూర్తి. అతడు నిర్మలములు, అంధకార రహితలు, సమాన మనస్కలగు ఉషస్సులకు ప్రేరకుడగును. సూర్యుని తేజస్సునాకు పగటిపూట చంద్రుడు తేజోహీనుడు అగుచున్నాడు.

3. ఇంద్ర దేవా! నీవు సుదూరపు స్వర్గము నుండి మా వద్దకు అగ్నియు, సోమము మాకందినట్లు, యజమాని యజ్ఞశాలకు చేరినట్లు, తారల ప్రభువగు చంద్రుడు, స్వస్థానమునకు చేరినట్లు విచ్చేయుము. మేము సోమము పట్టి నిలిచి నిన్ను ఆహ్వానించుచున్నాము. అన్నము పెట్టుమని బిడ్డ తండ్రిని కేక వేసినట్లు యుద్ధములందు విజయము కలిగించుమని నిన్ను కేక వేయుచున్నాము.

4. ఇంద్రుడు ధనవంతుడు. ఉగ్రుడు. స్తుఃయము. భూరి బలశాలి. అప్రతిహతుడు. అట్టి ఇంద్రుని మరల మరల ఆహ్వానించుచున్నాము.

పరమ పూజ్యుడు. యజ్ఞయోగ్యుడగు ఇంద్రుడు మా స్తుతులు విన్నాడు. మా యజ్ఞమునకు అభిముఖుడు అగుచున్నాడు.

వజ్రియగు ఇంద్రుడు ధనము లభించు సన్మార్గములను తెలియపరచును గాక.

5. ఇంద్రా! నేను ఆహవనీయగ్నిని ప్రణయనాది కర్మలందు స్థాపించినాను. అట్టి అగ్నికి అభిముఖుడనై ఆరాధించుచున్నాను. ఇంద్రవాయువులను ప్రార్థించుచున్నాను. వారు - భూమికి నాభిస్వరూపమగు దేవాయాజన స్థానమున - కలిసి కూర్చున్నారు. వారు మాస్తుతులను వినవలెను. మా కర్మములు దేవతలను చేరినట్లు మాస్తుతులు ఇంద్రవాయువులను చేరుచున్నవి.

6. ఇవి 'ఏవయామి' ఋషి వాక్కు నుండి అవతరించిన స్తుతులు. ఈ స్తుతులు మరుద్వంతుడు, వ్యాపకుడు, మహానుడగు ఇంద్రుని చేరునుగాక.

ఈ స్తుతులు పూజనీయులు, సుందర ఆభరణోపేతులు, స్తుత్యభిలాషులు, మేఘచాలకులు, గమన శీలురగు మరుత్తులకు చేరునుగాత.

7. పవిత్రము, హరిత వర్ణము, ప్రకాశధారల సోమము ద్వేషించు సకల రాక్షసులను - సూర్య కిరణములు చీకటిని వలె నాశనము చేయును. జగత్తును భరించు సోమధారలు దీప్తములై, హరితములై, పావనము చేయుచు ప్రకాశించును. స్తోతల తేజస్సులతో కూడిన రసవంత సోమము అనేక రూపములు దాల్చుచున్నది.

8. సవితా దేవత సర్వజ్ఞుడు. సత్ ప్రేరకుడు, రత్నదాత. సర్వప్రియుడు. స్తుతియోగ్యుడు. అట్టి దేవతను అర్చించుచున్నాను. అతని కాంతి ఆకసమున నిలుచును. ద్యావాపృథ్వులను వెలిగించును. అతడు ఆవిర్భవించినంత కాంతులు పరచుకొనును. బంగరు కిరణముల సూర్యుడు మమ్ము అనుగ్రహించునుగాక. స్వర్గము కొరకని ఈ సోమము సేవించునుగాక.

9. అగ్ని అగ్రుడు, హోత, ధనస్వామి. మహా బలపుత్రుడు. విద్వాంసుడు. నేను అట్టి అగ్నిని అర్చించుచున్నాను.

అగ్ని యజ్ఞ నిర్వాహకుడు. దేవతలను పూజించువాడు. అనుగ్రహించువాడు. తేజస్వి, అతడు నలువైపుల జరుగు హోమములందు ఘృత సమర్పణమున ప్రజ్వరిల్లుచున్నాడు.

10. ఇంద్రా! నీవు ప్రేరకుడవు. మానవ హితకారివి. ప్రథముడవు. పురాతనుడవు. మహాకార్యములు చేసినావు. అందుకు సకల దేవతలు నిన్ను ప్రశంసించుచున్నారు.

ఇంద్రా! నీవు నీ బలమున విజిగీషులగు అసురుల ప్రాణములు తీసినావు. వారు కట్టి పెట్టిన జలములను విడిపించినావు. నీ బలమున చీకట్లను పారద్రోలుము. నీ బలము కొరకు మా హవిస్సులు అందుకొనుము.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్రవచన సామవేద సంహిత
పూర్వార్చిక యందలి ఐంద్రకాండము సమాప్తము.

యస్య నిః శ్వసితం వేదా యోవేదేభ్యో2ఖిలం జగత్|
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థ మహేశ్వరమ్ ||

పవమాన కాండ

అయిదవ అధ్యాయము

మొదటి ఖండము

ఋషులు : 1,4. అమహీయుడు. 2. మధుచ్ఛందుడు. 3. భృగుర్వారణి. 5. త్రితుడు. 6. కశ్యపుడు. 7. జమదగ్ని. 8. దృఢచ్యుతి. 9. అసిత, దేవలలు. 10. కవిర్మేధావి.

1. సోమమా! నీ యొక్క రాసపు జన్మ ఉన్నతము. నీవు ద్యులోకమున విరాజిల్లు దానవు. ప్రభావశాలివి. అన్నవంతవు. సుఖవంతవు. భూమి మీద ఉన్న మేము నిన్ను పొందుచున్నాము.

2. సోమమా! నీవు ఇంద్రుని పానమునకు గాను సముపార్జించబడినావు. రుచికర, హర్షదాయక ధారగా స్రవింపుము.

3. సోమమా! నీవు వరములిచ్చుదానవు. ధారలుగా కలశమున చేరుము. మరుత్వంతుడగు ఇంద్రుని కొరకు సకల బలకారివి అగుచు మదకారివి అగుము.

4. సోమమా! నీ యొక్క రసము దేవతలను వర్ధిల్ల చేయునది. రాక్షసులను నాశము చేయునది. పరమ శ్రేష్టము. ఆనందదాయకము. నీవు సాదరముగ కలశమున చేరుము.

5. ఋత్విజులు ముప్విధస్తుతులు ఉచ్చరింతురు. పాడియావులు పాలిచ్చుటకు అంబారావములు చేయును. హరిత సోమము శబ్దాయమానమై కలశమున చేరును.

6. సోమమా! నీవు మధురతమావు. పూజనీయమగు యజ్ఞ స్థానమునకు ఇంద్రుడు విచ్చేయనున్నాడు. నీవు

కలశమున ప్రవేశించుము.

7. సోమము పర్వతమున పుట్టినది. ఆనందము కొరకు తేబడినది. నీటిలో పెరిగినది. శ్యేనము గూటికి వలె తన స్థానమగు కలశమునకు చేరుచున్నది.

8. పాపహారి! బలవర్ధక మాదక సోమమా! ఇంద్రాదులు, మరుత్తుల కొరకు కలశమున నిండుము.

9. సోమమా! నీవు పర్వతమున పుట్టినావు. పరిశుద్ధ పాత్రలందు నిండినావు. స్తోతల సమస్త కోరికలు తీర్చుచున్నావు.

10. అభ్యుదయము కలిగించు సోమము అభిషవణ ఫలకముల మీద నిలిచి స్వర్గ ప్రియులై, స్వర్గమునకు సాగువారికి లభించుచున్నది.

(సోమరసము తీయుటకు ఉపయోగ పడు ఫలకములు అభిషవఫలకములు.)

రెండవ ఖండము

ఋషులు :- 1. శ్యావాశ్వుడు 2. త్రితుడు. 3,8, అమహీయుడు. 4. భృగువు. 5,6. కశ్యపుడు. 7. నిధ్రువి. 9,10. కాశ్యప అసితుడు.

1. సోమము ఆనందము రాల్చునది. అభిషుతమగును. హవివంతులమగు మా యజ్ఞమునాకు చేరును. మాకు కీర్తి కరమగుచు పాత్రలందు ప్రవేశించును.

2. సోమము బుద్ధిని వర్ధిల్ల చేయును. జలతరంగముల వంటి సోమము పశువులు అరణ్యమునకు వలె పాత్రలందు చేరును.

3. అభిషుత సోమము కోరికలు తీర్చునది అగును. ధారలుగా పాత్రలకు చేరును. అది మాకు లోకమున కీర్తి కలిగించునుగాత. మా శత్రువులను నాశము చేయును గాత.

4. సోమమా! నీవు వరములిచ్చుదానవు. పావనము చేయుదానవు. సర్వద్రష్టవు. తేజోమయవు. నిన్ను ఆహ్వానించుచున్నాము. **"త్వాహవామహే"**

5. చైతన్యవంతమును, ప్రియమును అగు సోమము ఋత్విజుల మంత్రములకు రథమునులాగు అశ్వముల వలె

పాత్రలకు స్రవించును.

6. బలవంతము, వేగవంతమును అగు సోమమును ఋత్విజులు గోవులు, అశ్వములు, పుత్రుల కొరకు ఏర్పరతురు.

7. సోమమా! నీవు ప్రకాశవంతమవు. ధారగా పాత్రలకు చేరుము. ఆనంద రసమవై ఇంద్రుని చేరుము. ధారా రూపమువై వాయువును చేరుము.

8. పవమానము బృహత్తరమగు వైశ్వానర జ్యోతిని ఆకాశము నందు విచిత్రమగు వజ్రముగా సృష్టించినది.

9. అభిషుతమై, దీప్తమై, స్తుతియుక్తమగు సోమము మాదకమై దశాపవిత్రమునుండి రాలుచున్నది.

(జల్లించు లేక వడకట్టు ఉపకరణము దశాపవిత్రము.)

10. బుద్ధి వర్దనమగు సోమము స్తోతలచే స్తుతించబడుచు సాగర తరంగముల వలె పాత్రలందు ప్రవేశించుచున్నది.

మూడవ ఖండము

ఋషులు :- 1,2,8,9. అమహీయుడు. 3. జమదగ్ని. 4. ప్రభూవసుడు. 5. మేధ్యాతిథి. 6,7. నిధ్రువి. 10. ఉక్ష్యుడు.

1. సుజాతము జల ప్రేరకము, శత్రు నాశనము, గోఘ్రుతాది మిశ్రితమగు సోమము దేవతలకు లభించును.

2. సోమము ద్రష్ట అది సకల శత్రువులపై దండెత్తును. ఆ మేధావి సోమమును శుద్ధి చేసి అలంకరింతురు.

3. అభిషుతమై, కలశమున ప్రవేశించిన సోమము సకల సంపదలను వర్షించునదై ఇంద్రుని కొరకు స్థాపించబడును.

4. అభిషవ ఫలకముల మీద పిండబడిన సోమము పవిత్రమై యజ్ఞమునందు విడువబడిన రథాశ్వము వలె, యజ్ఞమును యుద్ధమును వలె ఆక్రమించును.

5. త్వరపడునదియు, ప్రకాశవంతమును, గమన శీలమును అగు సోమము చీకట్లను ధ్వంసము చేయుచు గోవులు గోష్టమునకు వలె యజ్ఞమందు ప్రవేశించుచున్నది.

6. బలవర్ధక సోమమా! శత్రువులను హతమార్చుచు, మాకు జ్ఞానము ప్రసాదించుచు పాత్రలందు నిండుచున్న నీవు దేవతలను నమ్మనివారిని దూరము చేయుము.

7. మానవ హితకారిణి, జలప్రేరకవగు నీవు ఏధారతో సూర్యుని ప్రకాశింపచేసినావో - ఆ ధారతో ఈ పాత్రయందు ప్రవేశించుము.

8. మహా జలములను బంధించిన వృత్రాసురుని వధించిన ఇంద్రుని రక్షించిన నీవు ధారగా ఈ పాత్రయందు నిండుము.

9. సోమమా! నీ రసమును సేవించిన ఇంద్రుడు శంబరుని తొంబది తొమ్మిది పురములను ధ్వంసము చేసినాడు. అట్టి నీవు ఇంద్రార్ధము ఈ కలశమున రాలుము.

10. సోమము దీప్తము. దాత. అది మాకు సర్వ ప్రకార దానములను, బలములను అన్నములను ఇచ్చునుగాత. అభిషుతమై సకల దిశలనుండి పాత్రలందు వర్షించును గాత.

నాలుగవ ఖండము

ఋషులు :- 1. మేధ్యాతిథి. 2,7. భృగువు. 3. ఉచథ్యుడు. 4. అవత్సారుడు. 5,6. నిధ్రువి. 8,9. కశ్యపుడు. 10. అసితుడు. 11. కవి. 12. జమదగ్ని. 13. అయాస్యుడు. 14. అమహీయుడు.

1. సోమము వర్షిణి. హరిత వర్ణ పూజ్య. మిత్రసమ. దర్శనీయం. అది సూర్య సమ తేజమున ద్యులోకమున వెలుగుచున్నది.

2. సోమమా! నీవు సుఖ ప్రధావు. ధనదాతవు. శత్రు నాశకమవు. అనేక జనాభిలాషివి. ఈ యజ్ఞమున నీ బలమును ఆరాధించుచున్నాము.

3. అధ్వర్యులారా! రాళ్ళతో దంచి సోమ రసము తీయండి. కలశమున నింపండి. ఇంద్రుని కొరకు దానిని పవిత్రము చేయండి.

4. అభిషుత సోమ ధారలు ఇంద్రునకు ఉత్సాహము కలిగించును. పాపములను ప్రక్షాళనము చేయును. ఊర్ధ్వ దిశకు చేరును.

5. సోమమా! సహస్ర సంఖ్యాక ధనములను మా ముందు కురిపింపుము. మమ్ము అన్నములందు స్థాపించుము.

6. ప్రాచీనములు, గమన శీలములగు సోమములు నవీన స్థానములను ఆక్రమించినవి. అవి సూర్యుని వంటి తేజస్సులను సృష్టించినవి.

7. సోమమా! దీప్తివంతవమగుము. చప్పుడు చేయుచు కలశమున పడుము. యజ్ఞ ప్రదేశమున తొలుత నిలుచుటకు విచ్చేయుము.

8. వరములిచ్చుసోమమా! దీప్తివంతమగుము. దివ్యసోమమా! నీవు వర్షము కలిగించు వ్రతము కలదానవు. వరద సోమమా! దేవతలకు, మానవులకు హితకరములగు పనులు చేయుము.

9. సోమమా! ఋత్విజులచే శుద్ధి చేయబడుము. అన్నము కలిగించుటకు ధారగా కలశమునకు విచ్చేయుము. రుచికర పదార్ధములనిచ్చు గోవులను ప్రసాదించుము.

10. సోమమా! నీవు కోరికలు తీర్చుదానవు. మేము దైవభక్తులము. మమ్ము రక్షించుము. బలము కలిగించు నీవు ఆనందదాయనివై స్రవించుము.

11. సోమమా! నీవు నీ సత్కార్యముల వలన పూజనీయవు అయినావు. దేవతలను ప్రసన్నము చేయుము వాన చప్పుడు చేయుము.

12. ఇది సోమము. విశేష జ్ఞానమయము. శుద్ధి చేయబడినది. పాత్రలందున్నది. జలములందు పుట్టినది. అన్నదాత. అందరు ఎరింగినది.

13. సోమమా! మా కొరకు స్రవించుచున్నావు. ధనార్ధము కలశమున పడుచున్నావు. అయాస్యుడనను నేను నీ ధారలచే దేవతలను యజించుచున్నాను.

14. సోమమా! శత్రువులను వధించుచు, అదాతలను రాల్చుచు, ఇంద్రుని స్థానమునకు చేరి, అచట నుండి స్రవించుము.

అయిదవ ఖండము

ఋషులు :- 1,2. భరద్వాజుడు. 3. అత్రి. 4,5,6,8. విశ్వామిత్రుడు. 7,11,12. వసిష్ఠుడు. 9. కశ్యపుడు. 10. జమదగ్ని.

1. సోమమా! నీవు పావకమవు. జలములను కప్పుకొని, ధారగా కలశమునకు చేరుదువు. రత్న దాతవగు నీవు యజ్ఞ

స్థానమునాకు చేరుదువు. దీప్తవై ప్రవహించుచు దేవతలకు హితకారివి అగుదువు.

2. ఏ సోమము దేవతలకు శ్రేష్ఠ హవి యగునో ఏది మానవ హితకారి యగునో, ఏది జలాంతర్గతమై సాగునో, దేనిని రాళ్ళతో దంచి పిండుదురో అట్టి సోమమును ఇచట నీటితో తడపండి.

3. సోమమా! నీవు శిలలచే పిండబడి రక్షణలు కలిగించుచు మా ఎదుట కలశమున పాడుచున్నావు. హరిత వర్ణ సోమము - నగరమునాకు నరుడు ప్రవేశించినట్లు - కలశమున ప్రవేశించును. సోమము కర్రపాత్రలో ప్రవేశించును.

4. సోమమా! నీవు దేవతల పానమునకు గాను సముద్రము వంటి వసతీ నదీ జలములందు వర్ధిల్లుదువు. ప్రస్తుతము మాధకము, జాగ్రుతమగు నీవు తీవల జలము నుండి మధుర రసముగా ప్రవహించుచు కలశమున చేరుచున్నావు.

5. సోమము పిండి రసము తీయబడినది. రోమములచే శుద్ధి చేయబడినది. అశ్వము వంటి వేగవంతమగు హరిత సోమధార ఆనందదాయకమై వచ్చుచున్నది.

6. సోమమా! నీవు మిత్రమవు. నీ వెంట నిత్యము సుఖింతును గాత. అనేకులగు రాక్షసులు నన్ను హింసించుచున్నారు. వారిని హతమార్చుము.

7. సోమమా! నీవు సుందర అంగుళులచే చేయబడినదానవు. పవిత్రము చేయబడిన దానవు. కలశమున శబ్దము చేయుదానవు నీవు పిశంగ వర్ణపు. బహుజన ఆరాధ్యవు. స్తోతలకు ధనములను ప్రసాదించుము.

8. సోమము గమన శీలము. మానవ ప్రియము. మాదకము. అది మధుర రస బిందువులను రాల్చుచు సమస్త దిశలనుండి నదులు సముద్రమునందు వలె కలశమున పడుచున్నది.

9. సోమమా! నీవు అప్రమత్తమవు. ప్రియమవు. ఆజరోమ దశా పవిత్రము నుండి బిందువులుగా రాలుదువు. నీవు అంగిరస శ్రేష్ఠవు. బుద్దివర్ధకమవు. పితరల నేతవు. నీవు మా యజ్ఞమున మధుర రసముజ కురిపించా నపేక్షింతువు.

10. సోమము ఆనందకరము. అభిషుతము. మరుత్తులతో కూడిన ఇంద్రుని కొరకు పాత్రమున నిండును. అది సహస్రధారలై అజరోమముల నుండి వడకట్టబడి మానవులచే శుద్ధి చేయబడును.

11. సోమమా! నీవు విశేష అన్నములు ప్రసాదించుదానవు. స్తోత్రములన్నియు నీవైపు ప్రవహించుచున్నవి. దేవతలకు మత్తు, తృప్తి కలిగించుచు యజ్ఞములందు దేవతల కొరకు స్రవింపుము.

12. మరుత్వంతములు, మాదకములు, ఇంద్ర సంబంధస్తులు యజ్ఞము వైపు పయనించినట్లు పవమాన సోమ

ధారలు పావనములై స్రవించుచున్నవి.

ఆరవ ఖండము

ఋషులు :- 1,9. ఉషనుడు. 2. అసితుడు. 3,7. పరాశరుడు. 4,6. వసిష్ఠుడు. 5,10. ప్రతర్దనుడు. 8. ప్రస్కణ్వుడు.

1. సోమమా! త్వరత్వరగా పరుగెత్తి రమ్ము. కలశమున నిలువుము. ఋత్విజులు నిన్ను పవిత్రము చేయుదురు. నీవు యజమానికి అన్నము ప్రసాదించుము. బలశాలిని అశ్వమును వలె నిన్ను మార్జనము చేసిన అధ్వర్యులు తమ అంగుళులతో నిన్ను యజ్ఞమునకు చేర్చెదరు.

(అంగుళులతో అనగా చేతితో అని అర్థము. వాస్తవముగా అంగుళులే పనిచేయును. చేయి వ్రేళ్ళకు ఆధారము మాత్రమే అగును.)

2. ఉశనఋషి వలె స్తోత్రములు వచించు స్తోతలు ఇంద్రాది దేవతల గుణగణములను వర్ణింతురు. బహుకర్మలదియు, తేజోవంతమును, పాపములను శుద్ధి చేయునదియునగు పగలు సముపార్జించిన సోమము ధ్వని చేయుచు పాత్రలందు చేరును.

3. హవి సమర్పించు వారు ఋగ్యజుస్సామ స్తుతులను ఉచ్చరింతురు. మహా సోమమును మంగళ వచనములచే నుతింతురు. ఆబోతు వద్దకు ఆవు పోయినట్లు స్తోతలు సోమము వద్దకు చేరుదురు.

4. సోమము హిరణ్యమున పవిత్రమగును. ఆసోమపు దివ్య రసము దేవతలకు చేరును. పిదప అభిషుతమై ఉన్ని పాత్రల నుండి సాగి హోత పశు సహితముగ యజ్ఞమున ప్రవేశించినట్లు పాత్రలందు ప్రవేశించును.

5. బుద్ధికి మూలమగునదియు, ద్యులోకమును ప్రకటింపచేయునదియు, పృథివిని పోషించునదియు, అగ్నిని ప్రకాశింపచేయునదియు, ఆదిత్యుని తృప్తి పరచునదియు, ఇంద్రుని ఆనందింపచేయునదియు, విష్ణువునకు పుష్టి కలిగించునదియునగు సోమము పాత్రలందు చేరుచున్నది.

6. సోమము మూడు సవనములు కలది. కోరికలు తీర్చునది. పెద్ద శబ్దము చేయునది. స్తుతులు అట్టి సోమమును అభిలషించును. నీటి కప్పు కలది, నీటిని పారించునది, వరుణుని వలె రత్నదాతయగు సోమము ధనములను ప్రసాదించును.

7. సోమము జలములను ప్రవహింపచేయునది. యజ్ఞములను రక్షించునది. కోరికలు తీర్చునది. అది అభిషుతమై జలదములున్న విశాల అంతరిక్షమున ప్రాణులను సృష్టించుచు అందరిని మించుచున్నది.

8. అభిషుతము, హరితవర్ణము, తేప తేప నినదించు, పరిశుద్ధము చేయబడిన సోమము ద్రోణ కలశమున చేరి శబ్దము చేయును. ఋత్విజులు సోమమును దుగ్ధాదులతో కలిపి, పాత్రలందు చేర్చి, దేవతలకు హవి అర్పించి, స్తుతించుచున్నారు.

9. ఇంద్రా! వరదుడవగు నీ కొరకు ఈ మధుర సోమము వాన చినుకుల వలె దశా పవిత్రమున రాలును. సహస్రద, శతద, బహుదయగు బలశాలి సోమము సనాతన యజ్ఞమున ప్రతిష్ఠితమైనది.

10. సోమమా! నీవు మధురతరమవు. వసతీ నదీ జలమును కప్పుకున్నదానవు. ఉన్ని పాత్రలకు స్రవింతువు. పిదప మాదకమవై, ఇంద్ర పాన యోగ్యమవై, ఆనందదాయకవై, జలయుక్తవై ద్రోణ కలశములందు ప్రత్యక్షమగుచున్నావు.

ఏడవ ఖండము

ఋషులు :- 1. ప్రతర్దనుడు. 2. పరాశరుడు. 3. వాసిష్ట ఇంద్ర ప్రమతి. 4. వసిష్ఠుడు. 5. వాసిష్ఠ మృడీకుడు. 6. నోధ 7. గౌరకాణ్వుడు. 8. వాసిష్ఠమన్యు. 9. కుత్సుడు. 10. పరాశరుడు. 11. కశ్యపుడు. 12. ప్రస్కణ్వుడు.

1. సోమము సేనాని శూర. అది యాజమానులకు పశువులను ఇవ్వగోరును. రథముల ముందు నడుచును. ఈ సోమసేన ప్రసన్నమగును. ఇంద్రుని ఆహ్వానించు వారికీ శుభములు కూర్చును. ఇంద్రుని వేగముగా రప్పించుటకు తెల్లని వస్త్రము వంటి పాలను ధరించును.

2. సోమమా! నీ ధారలు మధురములు. అవి జలమున పవిత్రములగును. ఉన్నిని దాటి పాత్రలందు ప్రవేశించును. తదుపరి పాలతో కలిసి రుచికరమావాగుదువు. అప్పుడు నీ తేజస్సు సూర్యుని వంటిది అగును.

3. స్తోతలారా! సోమపు స్తుతి గీతలు పాడండి. మేము దేవతలను పూజించుచున్నాము. మహాధనము కొరకని సోమాభిషవము చేయండి. రుచికర సోమమును ఉన్ని మీద నుంచి పారించండి. అట్టి దివ్య సోమము దీప్తివంతమై ద్రోణ కలశమున ప్రకాశించునుగాత.

4. సోమము అధ్వర్యుల ప్రేరణ కలది. ద్యావాపృథ్వుల స్రష్ట. అన్నదాత. ఆయుధములను పదను పెట్టుచు, చేతులందు ధనముతో ప్రత్యక్షమగునుగాత.

5. కాంతివంతమగు సోమము స్తోతల వాణిని సంస్కరిమ్చును. యజ్ఞమున సవనముల అగ్రగామి అగును. అప్పుడు సోమము శ్రేష్ఠమై, దేవతలకు సేవనీయమై, కలశమున నిలుచును. అప్పుడు దానిలో పాలు పిండుటకు గోవులు సాగును.

6. అంగుళులు కలిసి పనిచేయునవి. కర్మకారులు సోమమును పిండును. శుద్ధము చేయును. ఆ దశాంగుళులు దేవతల కొరకని సోమమునకు ప్రేరణ కలిగించును. అప్పుడది సూర్యుని సకల దిశలకు పరుగులిడును. ఆ సోమము అశ్వము వలె ద్రోణ కలశమున చేరును.

7. అశ్వమును కడిగినట్లు, ఉదయ సూర్యుని కిరణములు వెలిగించినట్లు, సోమమును పరిశుభ్రము చేయుచున్నాను. తదుపరి నీట మునిగిన సోమము స్తోతలను అభిలషించుచు గోపాలుడు గోష్టమువలె ద్రోణ కలశమున ప్రవేశించుచున్నది.

8. సోమము క్షరణశీలము. బలశాలి. వేగంవంత ఇంద్రునకు బలకర పానీయమగునది. ధనదాత. బాల ప్రభువు. మాదకమై పాత్రలో ప్రవేశించుచున్నది. అది సకల దిశల రాక్షసులను హతమార్చును. శత్రువులను వధించును.

9. సోమమా! ధారగా పారుము. ధరములను వర్షించుము. శుభ్ర జలములందు చేరుము. సూర్య, వాయువుల వంటి వేగమును సంతరించుకొనుము. మహా బుద్ధిశాలియైన ఇంద్రుని యందు చేరుము.

10. మహా సోమము మహాత్కార్యములు చేసినది :-

సోమము జలగర్భ అయినది. దేవతలను భజించినది. ఇంద్రునకు బలము కలిగించినది. సూర్యునకు ప్రకాశము కలిగించినది.

11. దేవతలను ఆనందమున మునకలు వేయించునదియు, స్తోత్రములందు శబ్దాయ మానమగు సోమము స్తోత్రసహితయై - రథము యుద్ధము నందు వలె - యజ్ఞమున ప్రవేశించుచున్నది. పదిచేతి వేళ్ళు సోమము గల ఉన్ని పాత్రను ఉన్నత స్థానమున స్థాపించుచున్నవి.

12. ఋత్విజులు నీటి అలల వంటి స్తుతులను సోమము వైపు పంపుదురు. ఆ స్తుతులు నమస్కరించుచు అభిలషించుచు సోమపు దరి చేరి, సోమమున కలసి, లీనమగును.

ఎనిమిదవ ఖండము

ఋషులు :- 1. శ్యావాశ్వుడు. 2,3 నాహుష యయాతి. 4. సాంవరణ మనువు. 5,8. అంబరీష, ఋజిష్వానులు. 6,7. రేభసూన, కాశ్యపులు. 9. ప్రజాపతి.

1. మిత్రులారా! పురోజిత సోమమును అభిషవించండి. దానిని అత్యంత మాదకము చేయండి. సాగిన నాలుక గల

కుక్క నుండి రక్షించండి.

2. పోషక, పూజనీయ, ధన ప్రద సోమము శుద్ధి చేయబడి, కలశమున చేరుచున్నది. సకల ప్రాణులను పాలించు సోమము ద్యావాపృథ్వులను తన తేజమున ప్రకాశింపచేయుచున్నది.

3. సోమము మధురము. మాధకము. పవిత్రము నుండి సాగిఇంద్రుని కొరకు క్షరితమగుచున్నది. సోమమా! మాదకమగు నీ రసము ఇంద్రాది దేవతలకు చేరును గాక.

4. సోమము సన్మార్గదర్శి. మిత్రము. ప్రఖ్యాతము. పాపరహితము. ధ్యానము ఏర్పరచునది. స్వర్గము కలిగించునది. దీపించునది. అట్టి సోమము మా వద్దకు చేరుచున్నది.

5. సోమమా! నీవు దీప్తిమంతవు. నిన్ను వందల మంది అభిలషించుచున్నారు. నీవు వేలమందిని పోషించుచున్నావు. అనంత అన్న, యశములు గల నీవు తేజస్వివి. బల ప్రదవు. మాకు పుత్ర ధనమును ప్రసాదించుము.

6. గోవు పుట్టిన దూడను నాకును. అట్లే ద్రోహమెరుగని ఇంద్రుడు తనకు ప్రియమగు సోమమును సేవించును.

7. అందరిచే కోరబడునదియు, శత్రుంజయము అగు సోమము కొరకు శూరులు ధనుష్టంకారము చేయుదురు. ప్రథమ పూజార్హులగు విప్రులు సోమమును పూజింతురు. బలము కలిగించు తెల్లనిపాలను కలుపుదురు.

8. అందరు అభిలషించు హరిత, బభ్రువర్ణ సోమము సకల దేవతలకు ఆనందము కలిగించుటకు సాగును.

9. ప్రసిద్ధమగు సోమ వచనములను యజ్ఞ విఘ్నకారకులు వినకుందురుగాక. దక్షిణ లేని యజ్ఞమును భృగువులు తొలగించినట్లు కుక్కను తొలగింతురుగాక.

తొమ్మిదవ ఖండము

ఋషులు : 1-3, 5,6. కవి. 4. ఋషిగణుడు. 7. రేణు. 8. భార్గవ వేనుడు. 9. వసువు. 10. వత్సప్రి. 11. అత్రి. 12. పవిత్రుడు.

1. సోమము సేవన యోగ్యము. హితకరి. అది సకల జలములందు లభించును. జలములందు పెరుగును. అట్లు వర్ధిల్లిన మహా సోమము విశ్వమును దర్శించుటకు సూర్యుని మహారథమును అధిష్టించును.

2. ప్రేరణ అక్కరలేని, హరితవర్ణ, సుప్రసిద్ధ సోమము అనేక దేవతాయుక్త యజ్ఞమున లభించునుగాక. అదాతలగు మా శత్రువుల అన్నమును హరించి ఆరగించును గాత. మా స్తుతులను దేవతలకు చేర్చును గాక.

3. ఇంద్రునకు బలము వజ్రము. ఆ వజ్రమునకు బీజ రూపము సోమము. అది రసమయమై ద్రోణ కలశమున ధ్వనించును. యజ్ఞ ఫలమును వర్షము వలె కలిగించు సోమము పాడియావు వంటిది అగును.

4. సోమము ఇంద్రుని విశిష్ట ఉదరమున విశేషముగా ప్రవేశించును. ప్రవేశించిన సోమము ఇంద్రునకు మిత్రము అగును. మిత్రుడగు ఇంద్రుని ఉదరమును బాధించదు.

యువకులు యువతులను కలిసినట్లు సోమము జలమును కలియును. అవి సహస్రధారలుగా దశాపవితరము నుండి కలశమున చేరును.

5. సోమము ధర్త, శోధనయోగ్య రసరూప దేవతలకు బల ప్రదాత. స్తుతియోగ్య హరితవర్ణ. అది దశా పవిత్రము నుండి శుద్ధియై వచ్చును. నరులచే సిద్ధము చేయబడిన అశ్వము వలె సోమము అనాయాసముగ జల ప్రవాహమున చేరును.

6. సోమము విజ్ఞులకు కల్పకము. విశేషద్రష్ట. ఉషస్సును, పగటిని పెంచు సూర్యుని వర్ధిల్లచేయునది. పారుచున్న ఈ సోమము జలపూర్ణమై, స్తోత్రయుక్తమై ఇంద్రుని హృదయమున చేరగోరి ధారలుగా కలశమున పడుచున్నది.

7. శ్రేష్ఠ యజ్ఞమున నిలిచిన ఈ సోమము కొరకు ఇరువది యొక్క గోవులు పాలిచ్చును. ఈ సోమము యజ్ఞము నందు వర్ధిల్లి వసతీ వరీ మున్నగు జలమును పవిత్రము చేయుటకు మంగళ స్వరూప అగును.

(12 నెలలు + 5 రుతువులు + 3 లోకములు + 1 ఆదిత్యుడు = 21 కలిసి గోవునందు పాలు కలిగించుచున్నవి.)

8. సోమమా! చక్కగా అభిషుతవగుము. ఇంద్రుని కొరకు సకలదిశల రసమును స్రవింపచేయుము. వ్యాధులు, రాక్షసులు దూరమగుదురు గాక. సత్యాసత్యములు పలుకు పాపులకు నీ యొక్క రసము గణమివ్వకుండును గాత. నీ యొక్క రసములు యజ్ఞములందు మాకు ధనములు అగును గాక.

9. కాంతివంతము, వరదము, హరితవర్ణ సోమము సముపార్జించబడినది. అది రాజు వలె దర్శనీయ అగును. అది జలములందు చేరి రసము పిండునపుడు ధ్వని చేయును. తదుపరి పవిత్రమై ఉన్ని పాత్రను దాటి శ్యేనము వలె తన స్థానమునకు చేరును.

10. మధుమంతమగు సోమము దూడలకు పాలిచ్చు ఆవుల వలె, యజ్ఞమందు అంబారావములు చేయుచు పాలు

రాల్చుగోవుల వలె ఇంద్రుని కొరకు పాత్రలందు నిండును.

గోవులు శుద్ధ దుగ్ధ రూప సోమమును ఇంద్రుని కొరకే ధరించి ఉన్నవి.

11. ఋత్విజులు సోమమును పాలతోను, వ్యంజనములతోను చక్కగా కలుపుదురు. దేవతలు అట్టి సోమమును ఎంతో ఇష్టముగా సేవింతురు.

దేవతలు సోమమును మధువుతోను, నీటితోను కలుపుదురు. ధారగా పైనుండి పోయుదురు. బంగారముతో శుద్ధము చేయుదురు. అప్పుడు దానిని ద్రష్టనుగా సేవింతురు.

12. బ్రాహ్మణస్పతి సోమమా! పవిత్రమగు నీవు సర్వత్ర వ్యాపించి ఉన్న సామ్రాట్టువు. నిన్ను పానము చేసిన వానికి చైతన్యము కలిగింతువు. తపము లేక పరిపక్వత లేదనియు, అది లేకున్న చైతన్యము కలుగదనియు విశ్వవిదితాము. తపము వలన పరిపక్వత చెందిన వాడే చైతన్యవంతుడు అగుచున్నాడు.

పదవ ఖండము

ఋషులు :- 1,11. అగ్నిశ్చాక్షుషుడు. 2. చక్షుర్మానావుడు. 3,4,9,10. పర్వత నారదులు. 5. త్రితుడు. 6. మనువు. 7. అగ్ని. 8,12. ద్వితుడు.

1. సోమము సద్యోజాత పాత్రలందు రాలునది. సర్వజ్ఞ. హరితవర్ణ. అభిషుత. ఇది వరదుడగు ఇంద్రుని చేరును గావుత.

2. సోమమా! నీవు జాగరణశీలవు. పాత్రలందు నిండుము. ఇంద్రుని కొరకు నాలుగు దిశల నుండి పాత్రలను పూరింపుము. స్వర్గము దీప్తము. దాని శత్రువులను శోషింపచేయు జలమును ప్రసాదించుము.

3. మిత్రులారా! కూర్చోండి. సోమమును గూర్చి సామగానములు చేయండి. తండ్రి బిడ్డను అలంకరించినట్లు సోమమును శోభిల్లచేయుటకు యజ్ఞములచే అలంకరించండి.

4. మిత్రులారా! మత్తు కొరకని సోమమును స్తుతించండి. శిశువు వంటి హవిస్సులతోను, స్తుతులతోను స్వాదిష్టము చేయండి.

5. యజ్ఞమును పూర్తి చేయించునదియు, పూజనీయమును, జలముల శిశువును అగు సోమము యగ్నపు ప్రకాశమునాకు తన రసముతో ప్రేరణ కలిగించును. సకల హవిస్సులను పరివ్యాప్తము చేయును. సోమము

ద్యావాపృథ్వులందుండును.

6. సోమమా! దేవతల సేవనమునకును, వారికి బలము కలిగించుటకును పాత్రలందు నిండుము. మధుమంత రసవంతమగు నీవు మా కలశమందు నిలువుము.

7. పవిత్ర స్తుతులకు అగ్రగామియైన సోమము మాటిమాటికి శబ్దము చేయును. పవిత్ర సోమము ధారలుగా ఉన్ని పాత్రలనుండి పయనించును.

8. పవిత్ర, కర్మల విధాత సోమాపు స్తుతులు ఉచ్చరించండి. స్తుతులకు ప్రసన్నమగు సోమమును సేవకుని ధనమిచ్చి ప్రసన్నుని చేసినట్లు గొప్పగా స్తుతించండి.

9. బలశాలి సోమమా! అభిషుతమైన నీవు మమ్ము గోమంతులను, అశ్వవంతులను, ధనవంతులను చేయుము. పవిత్రము, పరిశుద్ధమగు రసము మాకు పాడియందు లభించునుగాత.

10. ధనదాత సోమమా! మాకు దానాదులు అందించమని నిన్ను సకల దిశలందు స్తుతించుచున్నాము. నీ యొక్క రసమునందు పాలు మున్నగు వానిని కలుపుచున్నాము.

11. ఇష్టపడదగిన హరిత సోమము వంకర పవిత్రములనుండి సాగును. సోమమా! స్తోతలకు పుత్రులను, కీర్తిని ప్రసాదించుము.

12. పవిత్ర సోమము మధురిమ కురిపించుచు కలశమున చేరుచున్నది. ఈ సోమమును ఋషులు సప్త చందములచే స్తుతించుచున్నారు.

పదకొండవ ఖండము

ఋషులు :- 1. గౌరివీతి. 2. ఊర్ధ్వసద్మ. 3,8. ఋజిష్వ. 4. కృతయశ. 5. ఋణ్వ. 6. శక్తి. 7. ఉరు.

1. సోమమా! నీవు మధురిమవు. ఫల ప్రదవు. పూజనీయవు. పరమదీప్తవు. హర్షదాయకవు. ఇంద్రునకు మాదకమవ్వై క్షరితమగుము.

2. అన్నస్వామి సోమమా! నిన్ను దేవతల స్తుతులతో కీర్తించుచున్నాము. మాకు దీప్యమగు కీర్తిని, అన్నమును ప్రత్యక్షముగ ప్రసాదించుము. ఆకాశము నందలి మేఘమును వర్షింపచేయుము.

3. సోమము అశ్వము వంటి వేగవంతము. స్తుతియోగ్య, ఆకాశ జల ప్రేరకము. తేజస్సు కలిగించునది. జలము నుండి సాగునది. ఋత్విజులారా! అట్టి సోమమును స్తుతించండి. నీటితో తడపండి.

4. ఋత్విజులారా! మదచ్యుతము, సహస్ర ధారాయుతము, వరదము, విశ్వ ధన సహితమగు సోమపు ఫలములను పితుకండి. సాధించండి.

5. ధనములను, దుగ్ధాదులను, భూములను, శ్రేష్ఠ మానవులను తెచ్చు సోమమును ఋత్విజులు అభిషవించుచున్నారు.

6. పవమాన సోమమా! నీవు దీప్తివంతవు. దేవతలజన్మలు తెలిసినదానవు. వారి అమృతత్వమునకు ఋత్విజులచే ఘోషింపచేయుచున్నావు.

7. హర్షదాయక సోమము జలతరంగములవలె ఇటునటు క్రీడించును. అభిషుత సోమము ఉన్న పాత్ర నుండి ధారగా కలశమున ప్రవేశించును.

8. స్రవించు సోమము అంతరిక్షమునందలి మేఘములను భిన్నము చేసి వర్షము కలిగించును. సోమము అసురులు హరించిన గోవ్రజమును, అశ్వ సమూహములను విడిపించును.

అరి భయంకర సోమమా! కవచ ధారి వలె అసురులను హతమార్చుము.

(1. **ప్రాణోవైపవమానః అయం వాయుః పవమానః** అని శార్యము. 2. **పవమాన ఏవ భూత్వా పశ్చాద్వాతి** అని తైత్తిరీయము. 3. **ఆత్మావై యజ్ఞస్య సవమానః** అని తాడ్యము. 4. **సోమోవై పవమానః** అని శతపథము. 5. **పవమానోక్థం వా ఏతద్వద్వైశ్వ దేవమ్** అని కౌషీతకి **సోమోవై పవమానః** అనునదే ఈ కాండకు వర్తించును.)

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
యందలి పవమానకాండ సమాప్తము.

యస్య నిః శ్వసితం వేదా యోవేదేభ్యో2ఖిలం జగత్|
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థ మహేశ్వరమ్ ||

అరణ్యకాండ

అరవఅధ్యాయము

మొదటి ఖండము

ఋషులు :- 1. భరద్వాజుడు. 2. వసిష్ఠుడు. 3,6. వామ దేవుడు. 4. సునశ్శేపుడు. 5. గృత్సమదు. 7,8. అమహీయుడు.

1. వజ్రహస్త, సుందర హను ఇంద్రా! మేము ఆశించినదియు, ద్యులోక భూలోములను పూరించునదియు, ప్రశంసనీయము, బలదాయకము, తృప్తికరము అగు అన్నమును మాకు అందించుము.

2. ఇంద్రుడు స్థావర, జంగమ ప్రపంచమునకు ప్రభువు. అతడు భూమి మీద ఉన్న సమస్త సంపదలకు స్వామి. దాతలకు అధిక ధనము అందించును. అట్టి ఇంద్రుడు ప్రశంసణీయ ధనము మాకు అందించును గాత.

3. ఇది హవిస్సు. తేజోయుతము. ఇంద్రస్తోత్రయుక్తము. యజమానికి స్వర్గదాయి. ఇంద్రుని బహుళ ధన దానయోగ్య.

4. వరుణదేవా! మా తలలకు కట్టిన నీ పాశములను పైకి జరిపి వదులు చేయుము. కాళ్ళకు కట్టిన పాశములను క్రిందకు జరిపి వదులు చేయుము. నడుమునకు కట్టిన పాశమును తొలగించుము.

అదితి పుత్ర వరుణా! మేము శునశ్శేపులము మేము నిన్ను గూర్చి వేయు వ్రతము బాధారహితము, దోషరహితము అగును గాక.

5. సోమమా! నీవు పవిత్రమున శుద్ధము చేయబడుదువు. నీ సాయమున మేము సంగ్రామములందు శౌర్య పరాక్రమములు ప్రదర్శించగలము.

మిత్రావరుణులు, అదితి, సముద్రము, ద్యులోక, భూలోకములు మాకు ధనము నిచ్చి వర్ధిల్లచేయుదురుగాక.

6. దేవతలారా! సోమము దాతలందు అద్వితీయము. అది మా కోరికలు తీర్చునట్లును, మాకు ఫలములు ప్రసాదించునట్లును చేయండి.

7. సోమమా! నీవు మాకు ధనములు ప్రసాదించు దానవు. మేము ఇంద్రుని, మిత్రుని మరుత్తులను యజించుటకుగాను ధారగా విచ్చేయుము.

8. ఇది సోమ రూప అన్నము. ఇది మానవులకు, లోకములకు చెందినది. మేము దీనిని పంచగోరుచున్నాము. పంచుచున్నాము.

9. నేను అన్నమును. అగ్ని వరుణాది దేవతల కన్న ముందు ఉండినదానను. నేనే అమృతమును. నేనే ఋతమును. ఎవడు నన్ను దానము చేయుచున్నాడో వాడు సకల ప్రాణులను రక్షించుచున్నాడు. అన్నము దానము చేయని వానిని నేను మ్రింగుదును.

రెండవ ఖండము

ఋషులు :-1. శ్రుతకక్షి. 2. అరురుచి. 3,4,5. మధుచ్ఛందుడు. 6. గృత్సమదుడు. 7. నృమేధ. పురుమేధులు.

1. ఇంద్రదేవా! నల్లని, ఎర్రని, రంగురంగుల ఆవులందు ప్రకాశమానమగు తెల్లనిపాలను ఏర్పరచినావు. అందుకు మేము నిన్ను కీర్తించుచున్నాము.

2. ఆదిత్యుడు ఉషస్సంబంధి. అతడు స్వయంప్రకాశకుడు. సర్వమును ప్రకాశము చేయువాడు. లోకములకు వర్షము వలన అన్నము, బలము కలిగించుటకు గర్జించును. సూర్యుడే ఓషధులకు గర్భము కలిగించుచున్నాడు. పంటలు పడించుచున్నాడు.

3. ఇంద్రుడు వజ్రధారి. ఆభరణధారి. అతడు అశ్వములను ఒక చోట నిలుపగలడు. మాటమాత్రమున వానిని రథములను పూన్చగలడు.

4. ఇంద్రా! నీవు ఉగ్రుడవు. నీ రక్షణలు ఉగ్రతమములు. మమ్ము సాధారణ యుద్ధములందును, వేల ఆయుధముల యుద్ధములందును రక్షింపుము.

5. 'ప్రథ' వసిష్ఠ పుత్రుడు. 'సప్రథ' భరద్వాజ పుత్రుడు. నేను ప్రథను నా తండ్రియగు వసిష్ఠుడు అనుష్టుప్ ఛందోయుక్తము, హవి కలిగించునది అగు రథంతార సామమును ధాత మరియు విష్ణువు నుండి పొందినాడు.

6. వాయుదేవా! నియుతులను వాహనముల మీద విచ్చేయుము. వెలగొందు సోమము విధి విహితముగా సిద్ధపరచినాము. నీవు సోమముగల వారి ఇంటికి చేరుదువు కదా!

7. ఇంద్రా! నీ కన్న ముందు ఏమున్నది? నీవు అనాదివి. ధనవంతుడవు. నీవు వృత్రుని వధించినపుడే ప్రకటితమైనావు. అప్పుడే నీవు భూమిని వెలువరించినావు. దృఢపరచినావు. అట్లే ద్యులోక అంతరిక్షములను స్థిరపరచినావు.

మూడవ ఖండము

ఋషులు :- 1,5,7,10. వామదేవుడు. 2,3. గోతముడు. 4. మధుచ్ఛందుడు. 6. గృత్సమదుడు. 8,9. భరద్వాజుడు. 11. హిరణ్యస్తూపుడు. 12,13. విశ్వామిత్రుడు.

1. పరమేష్టి దివి యందు ద్యోతమానుడై ఉన్నాడు. అతడు నా యందు బ్రహ్మ తేజమును పెంచి స్థిరపరచును గాత. నాకు కీర్తి కలిగించి స్థిరపరచును గాత. యజ్ఞమందలి హవిస్సులను పెంచి స్థిరపరచునుగాత.

2. సోమమా! నీకు క్షీరములు కలుగును గాక. అన్నములు కలుగును గాక. బలములు కలుగును గాక. నీవు అమృతమవై అన్ని దిశలందు వర్ధిల్లుము. స్వర్గమునందు మాకు అన్నము కలిగించుము.

3. సోమమా! నీవే సకల జగములందు ఓషధులు కలిగించినావు. నీరు కలిగించినావు. గవాది పశువులను కలిగించినావు. విశాల అంతరిక్షమును వ్యాపింపచేసినావు. అంధకారమును అంతము చేసినావు. వెలుగులను పెంచినావు.

4. అగ్ని పురోహితుడు. దేవ యజ్ఞములకు ఋత్విజుడు. హోత. రత్నదాత. అతనిని ఆరాధించుచున్నాము.

5. అగ్నిదేవా! అంగిరసులు తొలుత నిన్ను స్తుతించుటకు శబ్దములు కనుగొన్నారు. పిదప స్తుతి సాధనలగు ఛందస్సులను కనుగొన్నారు. తదుపరి స్తుతులు రచించినారు. అప్పుడు జనులు ఉషస్సును స్తుతించినారు. వెలుగొందు సూర్యుని స్తుతించినారు. దీప్తివంతమగు వాణిని స్తుతించినారు. ఆవిధముగ స్తుతులు ఆవిర్భవించినవి.

6. ఒక జలము ఆకసము నుండి కురియును. రెండవది భూమి మీద ఉండును. అవి రెండు కలియును. నదులుగా మారి పారును. సముద్రమున చేరును. సాగర మధ్యపు బడబాసలమును తృప్తిచెందించును. ఆ జలములకు పౌత్రుడు నిర్మలమై దీప్తమంతమై, శుద్ధమై మనకు దగ్గరలో లభించును.

(ఈ జలముల పుత్రుడు మేఘము. పౌత్రుడు వర్షము.)

7. రాత్రి భద్రయువతి. అదిగో వచ్చుచున్నది. చంద్ర కిరణములను కూడి వచ్చుచున్నది. ఈ భద్రరాత్రి సకల జగములను సుఖ నిద్ర పుచ్చుచున్నది.

8. వైశ్వానరా! నీవు హవివంతుడవు. వరదుడవు. నేను నీ తేజస్సును స్తుతించుచున్నాను. అందుకే మా స్తుతి యాగములందు వైశ్వానరుని చేరింది. అగ్నిని చేరినది. అది నవ్యమై, జాతవేదియై, నిర్మలమై, చారుశీలమై సోమము దశా పవిత్రము నుండి వలె నా హృదయకుహరము నుండి వెడలినది.

9. సమస్త దేవతలారా! నేను స్తుతించుచున్నాను. ఆకర్ణించండి. అపాన్నపాత అగ్నీ! భూలోక, ద్యులోకములారా! నా

స్తుతులు వినండి. మనసున నిలుపుకొనండి. మీకు గిట్టని పలుకులు పలకను. మీకు రుచించునవే ఉచ్చరింతును. కావున మా దరికి చేరండి. మా వద్దనే సంబరపడండి.

10. దేవతలారా! నాకు ద్యావాపృథ్వుల యశస్సు కలుగునుగాక. ఇంద్ర బృహస్పతుల యశస్సు కలుగును గాత. ఆదిత్యుని యశస్సు కలుగునుగాక. ఈ యశస్సులు నన్ను విడువకుండునుగాక. సభాయశస్సులు నాయందు చేరునుగాక.

11. వజ్రహస్త ఇంద్రుడు చేసిన మహా పరాక్రమ కార్యములను - ఇదిగో ఇప్పుడే - చెప్పుచున్నాను. అవి ఏవి? అనిన వినండి :-

మేఘమును బాదుత మొదటిది. వర్షము కురిపించుట రెండవది. కురిసిన నీటి నదులకు, తటములు నిర్మించి ప్రవహింపచేయుట మూడవది.

12. నేను అగ్నిని. జాతవేదను - పుట్టుకతోనే సర్వము తెలిసినవాడను - నా నేత్రము ఘృతమగును. నా నోట అమృతమున్నది. నేను ప్రాణమును. నేనే వాయురూపమున అంతరిక్షమున ఉన్నాను. నేనే అక్షయుడగు సూర్య రూపమున ద్యులోకమున అధిష్టించి ఉన్నాను. **"అర్కీసర్వమ్"** సమస్తము నేనే అయి ఉన్నాను.

13. ఈ అగ్ని భూమియొక్క ప్రధాన స్థానమును రక్షించును. ఈ మహాగ్ని సూర్యుడు సంచరించు అంతరిక్షమును రక్షించును. అంతరిక్షమందలి సప్తమారుతములను రక్షించును. ఈ దర్శనీయ అగ్ని దేవతలకు ఆనందదాయక యజ్ఞమును రక్షించును.

నాలుగవ ఖండము

ఋషులు : 1,2,8-12. వామదేవుడు. 3-7. నారాయణుడు.

1. అగ్నిదేవా! నిన్ను ఋత్విజులు ప్రజ్వరిల్ల చేయుదురు. నీవు సర్వోపరి విరాజిల్లువాడవు. నీ నోరు ప్రకాశమానము. అందలి నాలుక హవిస్సులు భక్షించును.

అగ్నిదేవా! నీవు దానములను పుట్టించువాడవు. మాకు అన్నమును, ధనమును, చూడదగు తేజస్సును ప్రసాదించుము.

2. వసంతము రమణీయము. గ్రీష్మము రమణీయము. వర్షము రమణీయము. శరత్తు రమణీయము. హేమంతము రమణీయము. శిశిరము రమణీయము.

3. ఆ పురుషుడు వేల తలలవాడు. వేల కనులవాడు. వేల పాదములవాడు. అతడు సమస్త భూమండలమందు వ్యాపించగా పదివ్రేళ్ళంత మించినాడు.

(దశాంగులమ్ =రెండు బెత్తలు లేక జానెడు.)

4. అతడు ఈ లోకములను తాకకుండనే పైకి లేచినాడు. ఈ సమస్తము అతని ఒక అంశము మాత్రమే. అతడు మరల మరల అవతరించుచున్నాడు. అతడే విశ్వవ్యాప్తమై ఉన్నాడు. అతడే చేతనాచేతనములందు వ్యాపించి ఉన్నాడు.

5. దృశ్యమానమగు సమస్తము అతడే అగును. పుట్టినది, పుట్టనున్నది అతడే అగును. ఈ సమస్త భూతములు అతనిలో పాతికవంతు అగును. మిగిలిన ముప్పాతిక ప్రకాశాత్మక అమృతత్వము అగును.

6. భూత, భవిష్యత్, వర్తమానములు ఆ పురుషుని మహిమ వలననే కలుగుచున్నవి. అతని మహిమ అంతకన్న గొప్పది అతడు అమృతత్వమునకే ప్రభువు. ప్రాణులను జీవింపచేయుటకు మాత్రమే అన్నము అగుచున్నాడు.

7. ఆ మహాపురుషుని నుండి బ్రహ్మాండము ఉత్పన్నమైనది. ఆ బ్రహ్మాండము మీద ఒక పురుషుడు జన్మించినాడు. అతడు వివిధ ప్రాణులను కల్పించినాడు. అతడు అప్పుడు భూమిని కల్పించినాడు. తదుపరి ఆ ప్రాణులకు రూపములు ఏర్పరచినాడు.

8. ద్యావాపృథ్వులారా! మీరు మంచి పోషకులని మాకు తెలియును. మీరు అపరిమిత ధనములను అన్ని దిశలందు వర్ధిల్లచేయండి. మాకు సుఖములు కలిగించండి. మమ్ము పాపముల నుండి విముక్తులను చేయండి.

9. ఇంద్రా! నీ గడ్డము, మీసములు హరితములు. నీవు 'హరి' అశ్వుడవు. గోవులను పూజించు కవులు ప్రసిద్ధుడవగు నిన్ను స్తుతించుచున్నారు.

10. బంగారపు వర్చస్సు, గోవుల వర్చస్సు, సత్యపు వర్చస్సు, వేదముల వర్చస్సు మాకు కలుగునుగాత.

11. ఇంద్రా! నీవు స్తుతించు వారిని ఆశీర్వదించువాడవు. నీవు బలములకు ఈశ్వరుడవు. మాకు శత్రువులను అణచగల బలమును ప్రసాదించుము. మా యజ్ఞమునకు చాలునంత ధనమును, బలమును కలిగించుము. మమ్ము బాధించదలచు శత్రువులను హతాశులను చేయుము.

12. గోవులారా! మీరు విశ్వ సమస్త రూపములు ధరించండి. వృషభములు, వత్సముల సహితముగా పాడి కలిగి వర్ధిల్లండి. విశాల విశ్వము మీకే చెందును గాక. ఈ భూమి మీద జలములు సుఖముగా త్రాగగలవి అగును గాక. మీరు

వర్ధిల్లండి.

అయిదవ ఖండము

ఋషులు : 1. శతంవైఖానసులు. 2. విభ్రాణుడు. 3. కుత్సుడు. 4-6. సర్పరాజ్ఞి. 7-14. ప్రస్కణ్వుడు.

1. అగ్నీ! మా ఆయుష్యములను పెంచుము. అన్నములను, బలములను మా ముందుకు పంపుము. కుక్కలవంటి రాక్షసులను దూరమున పీడించుము.

2. సూర్యదేవా! యాజమానికి నిరాటంక ఆయువు ప్రసాదించుము. ఈ సోమము మధుయుక్తము. దీనిని మరింత పానము చేయుము. నీవు వాయుప్రేరణతో జగములను రక్షించుచున్నావు.

సూర్యుడు ప్రజకు వర్షము కలిగించును. పోషించును. ప్రకాశించును.

3. సూర్యుడు చిత్రవిచిత్రుడు. అతని కిరణములు కాంతి పుంజములు. అవి మిత్ర, వరుణ, అగ్నులకు నేత్రములగుచున్నవి. అట్టి విచిత్ర సూర్యుడు ఉదయించినాడు!

ఉదయించిన సూర్యుడు ద్యావా, పృథ్వి, అంతరిక్షములను తన వెలుగులతో నింపినాడు. అతను స్థావర, జంగమాత్మక విశ్వమునకు చైతన్యము కలిగించుచున్నాడు.

4. సూర్యుడు సాగువాడు. వెలుగులు నింపువాడు. అతడు ఉదయాద్రిన ఉదయించినాడు. తల్లి వంటి భూలోకమునకు చేరినాడు. పిదప తండ్రి వంటి ద్యావా, అంతరిక్షములకు చేరుచున్నాడు.

5. ఈ సూర్యుని దీప్తులు ప్రాణ వాయువును పైకి చేర్చి క్రిందకు దింపుచు దేహము నందు సంచరించుచుండును.

ఈ మహాసూర్యుడు, అంతరిక్షమును ప్రకాశవంతము చేయుచున్నాడు.

6. సూర్యుడు పగటి ముప్పది గడియలు ఎంతో తేజస్సున వెలుగును. ఇది నిశ్చయము. అప్పుడు వేదవాణి సూర్యుని స్తుతించుచున్నది.

7. విశ్వచక్షువగు సూర్యుని చూచి దొంగల వంటి నక్షత్రములు రాత్రితో పాటే నిష్క్రమించును.

8. అగ్నులవంటి ప్రకాశమానములగు సూర్య కిరణములు జనులను క్రమక్రమముగా వీక్షించుచున్నవి. (సూర్యుడు

క్రమక్రమముగా ఎదుగుచున్నాడని.)

9. సూర్యదేవా! నీ మార్గము అన్యులకు దుర్గమము. నిన్ను విశ్వ జనులు దర్శించుచున్నారు. నీవు చంద్రుడు మున్నగు జ్యోతులకు కాంతిని ఇచ్చుచున్నావు. సకల విశ్వములను వెలిగించుచు ప్రకాశించుచున్నావు.

10. సూర్యదేవా! నీవు దేవతలముందు ఉదయించుచున్నావు. నరులముందు ఉదయించుచున్నావు. విశ్వములముందు ఉదయించుచున్నావు. స్వర్గముముందు ఉదయించుచున్నావు.

(అందరికి సూర్యుడు తమ ముందే ఉదయించినట్లనిపించును. అతడు అందరికి సమానముగ ఉదయించును.)

11. పావక, అనిష్ట నివారక సూర్యా! నీవు సకల ప్రాణి జాలమును పోషించుటకు వారిని ఏకంటితో చూచుచున్నావో దానిని మేము స్తుతించుచున్నాము.

12. సూర్యదేవా! నీవు రాత్రింబవళ్ళను కొలతలు వేయుచు, ప్రాణి జాలమును వీక్షించుచు విశాల ద్యులోక, అంతరిక్షములందు ఉదయించుచున్నావు.

13. సర్వ ప్రేరకుడగు సూర్యుడు శోధించునవియు, రథమును చక్కగా నడుపుననియునగు సప్తాశ్వములను రథమునాకు కట్టినాడు. ఆ రథము మీద యజ్ఞమునకు విచ్చేయుచున్నాడు.

14. **సప్తత్వా హరితో రథే వహన్తి దేవ సూర్య!**
శోచిష్కే శం విచక్షణ.

సూర్యదేవా! నీవు సర్వ ప్రకాశకుడవు. తేజస్సే కేశములుగా కలవాడవు. నిన్ను సప్తాశ్వములు వహించుచున్నవి.

దాశరథి లక్ష్మణాచార్య బుచ్చమాంబల పౌత్రుండును, విద్వాన్ దాశరథి వేంకటాచార్య వేంకటాంబల పుత్రుండను, బహు గ్రంథ కర్తయునగు దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత యందలి పూర్వార్చిక సమాప్తము.

సర్వేభవన్తు సుఖినః

యస్య నిః శ్వసితం వేదా యోవేదేభ్యో2ఖిలం జగత్|
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థ మహేశ్వరమ్ ||

ఉత్తరార్చిక

మొదటి ప్రపాఠకము

మొదటి అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి-అసిత దేవలుడు.

1. నరులారా! దేవతలకు అభిముఖులై యజించదలచిన వారలారా! ఈ పవమాన సోమమును స్తుతించండి.

2. సోమమా! నీవు ప్రశంసనీయవు. అభిషుతమైన నీ రసమునందు ఇంద్రుని కొరకని ఋత్విజులు పాలు కలుపుచున్నారు.

3. సోమమా! మా గోవులకు, పుత్రులకు, అశ్వములకు, ఓషధులకు సుఖములు కలిగించుచు స్రవించుము.

రెండవ తృచ : ఋషి - కశ్యపుడు.

1. సోమములు దీప్తములు, కాంతిమంతములు. నలువైపుల నుండి ధ్వనించుచు శుద్ధములగు సోమములు ధారలుగ పడుచున్నవి. వానిలో ఆవుపాలు కలియుచున్నవి.

2. సోమము బలవంతము. స్తోతలచే స్తుతించబడునది. హితకారి. యుద్ధమును శూరులు ఆక్రమించినట్లు సోమము యజ్ఞమును ఆక్రమించును.

3. సోమమా! కవీ! నీవు సూర్యుడవు. పైకి చేరుము. సంయుక్తుడవగుము. మాకు శుభములు కూర్చుచు దర్శనమిచ్చుచు అంతరిక్షము నుండి వర్షించుము.

మూడవ తృచ : ఋషి-వైఖానసుడు.

1. సోమమా! నీవు కవివి. అన్నవంతవు. అన్నము అందించగోరు నీ ధారలు దశా పవిత్రము నుండి - అశ్వశాల నుండి అశ్వములు వలె - వెడలుచున్నవి.

2. సోమము మధుర రసయుక్తము. ఋత్విజులు దానిని ఉన్ని గల దశాపవిత్రము నుండి ద్రోణ కలశమునకు పంపుదురు. వారి అంగుళులు తేపతేప సోమమును శుద్ధము చేయగోరును.

3. బిందువులుగా రాలు సోమము - పాలిచ్చిన ఆవు గోశాఆకూ చేరినట్లు - దశా పవిత్రమునకు చేరును. అది సత్యయోని యగు యజ్ఞము వైపు సాగును.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - భరద్వాజుడు.

1. అగ్నిదేవా! మా స్తుతులు వినుము. చరు, పురోడాశాదులు ఆరగించుటకును, దేవతలకు హవి చేర్చు హవి చేర్చుటకును విచ్చేయుము. దేవతలను ఆహ్వానించుచు కుశాసనమున ఆసీనుడవు అగుము.

2. అంగిరస పుత్ర అగ్నీ! నిన్ను సమిధలతోను, నేతితోను ప్రజ్వరిల్ల చేయుచున్నాము. తరుణ తమ అగ్నీ! నీవు దీప్తుడవై వెలుగుము.

3. అగ్ని దేవా! శ్రవణ యోగ్యమును, శౌర్య యుక్తమును అగు ఎంతో ధనమును మాకు అందించుము.

రెండవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. సుకృతులగు మిత్రావరుణులారా! మా గోశాలాల చుట్టు పాలు, నేయి పారించండి. శ్రేష్ఠ రసములతో పరలోక మార్గమును తడుపండి.

2. శుచివ్రత మిత్రావరుణులారా! మీరు స్తవనీయులు. హవిరూప అన్న వర్ధకులు. మహాస్తుతి యుతులు. ధనము, బలము, మహత్వమున విరాజిల్లుచున్నారు.

3. మిత్రావరుణులారా! మీరు జమదగ్నిచే ప్రజ్వలించబడిన అగ్నిచే స్తుతించబడువారు. దేవయజన స్థానమున విరాజిల్లండి. సోమపానము చేయండి.

మూడవ తృచ : ఋషి - ఇరిమిఠి

1. ఇంద్రదేవా! విచ్చేయుము. కుశాసనమున కూర్చుండుము. నీ కొరకు సోమము సిద్ధము చేసినాము. పానము చేయుము.

2. ఇంద్రా! మంత్రయుక్తములును, జాలు గలవియునగు హర్యశ్వములు నిన్ను ఇచటికి చేర్చునుగాత. **బ్రహ్మాణివః** శృణు మా స్తుతులను ఆలకించుము.

3. ఇంద్రా! మేము బ్రాహ్మణులము. సోమవంతులము. సోమము సిద్ధము చేసినాము. నీవు సోమపాయివి. నిన్ను స్తుతించుచున్నాము. హవామహే ఆహ్వానించుచున్నాము.

నాలుగవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ఇంద్రాగ్నులారా! సోమము సంస్కరించబడినది. మేము మంచి స్తుతులచే కీర్తించుచున్నాము. స్వర్గము నుండి విచ్చేయండి. మేము సమర్పించిన సోమమును **పాతమ్**-పానము చేయండి.

2. ఇంద్రాగ్నులారా! మీరు స్తోతలకు స్వర్గము అందించువారు. యజ్ఞ సాధనమును, పుష్టికరమగు సోమము మీకు చెందును. మేము స్తుతించి మిమ్ము ఆహ్వానించుచున్నాము. విచ్చేయండి. '**పాతమిమంసుతం**' ఈ సంస్కరించిన సోమమును సేవించండి.

3. నేను స్తోతను. యజ్ఞసాధక సోమపు ప్రేరణ కలవాడను. స్తుతియోగ్యులు, ఫలప్రదులగు ఇంద్రాగ్నులను భజించుచున్నాను. '**తా సోమస్యేహ తృమ్పతామ్**' వారు ఈ సోమమున తృప్తులు అగుదురుగాక.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - అమహీయుడు.

1. సోమమా! నీ యొక్క రసముది శ్రేష్ఠ జన్మము. నీవు ద్యులోకపు బలవంతవు. నీవద్ద నున్న మహా సుఖవంత అన్నము భూమికి చేరుచున్నది.

2. ధనము కలిగించు సోమమా! నీవు మేము పూజించు ఇంద్రుని కొరకు, వరుణుని కొరకు, మరుత్తుల పరిస్రవ చక్కగా స్రవించుము.

3. సోమమా! నీవు అనుగ్రహించినావు. ఈ సమస్త ధనములు మాకు లభించినవి. మేము నీ ముందు నిలిచి సేవించుచున్నాము. '**వనామహే**' ఉపాసించుచున్నాము.

రెండవ తృచ : ఋషి - కశ్యపుడు.

1. సోమమా! నీవు పవిత్రము చేయబడుదానవు. నీట నిలుచుదానవు. ధారగా పాత్రలో పడుదానవు. నీవు రత్నదాతవు. వెలుగులు చిమ్ముచు ప్రవహించుము. హిరణ్మయమగు ఋతయోనికి విచ్చేయుము.

2. మధురము, ప్రియము, దివ్యమగు రసములను రాల్చు సోమము పురాతనమగు అంతరిక్షమునకు చేరుచున్నది. తదుపరి అన్నవంతులగు ఋత్విజులచే కడుగబడి, ద్రష్టయై, కర్మలు చేయు యజమానులకు అన్నము అందించుటకు దిగుచున్నది.

మూడవ తృచ : ఋషి - ఉశనుడు.

1. సోమమా! త్వరత్వరగా పరుగులిడి రమ్ము. వచ్చి ద్రోణ కలశమున నిలువుము. హోతలు నిన్ను శుద్ధి చేయుదురు. నీవు హవి రూపము దాల్చుము. బలశాలియగు అశ్వమునకు స్నానము చేయించినట్లు బలశాలివగు నిన్ను శుద్ధిచేసిన ఋత్విజులు తమ పొడవైన వ్రేళ్ళతో నిన్ను యజ్ఞస్థానమునకు చేర్చెదరు.

2. సోమదేవత మంచి ఆయుధములు గలది. రాక్షస నాశక. ఉపద్రవహర్త. రక్షక పాలక '**దేవానాం జనితా**' దేవతల జన్మకారక, సుదక్ష. మంచి బలము కలది ద్యులోకమును నిలువరించగలది. భూమిని ధరించగలది. అట్టి సోమము అవతరించుచున్నది.

3. ఉశన ఋషి విప్రుడు. కర్మలందు అగ్రణి. జనులందు ప్రకాశమానుడు. అతడు గోవులందు దాగియున్న దుగ్ధములను స్తోత్రములచే సాధించినాడు.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. శూర ఇంద్రా! పాలు పితుకని ధేనువులు దూడలను చూచి అంబారావము చేసినట్లు స్థావర జంగమములకు స్వామివి, సర్వజ్ఞుడవు అయిన నీకు **"అభినోనుమః"** ప్రణమిల్లుచున్నాము.

2. మఘువ ఇంద్రా! నీకు సముడగు స్వర్గవాసి మరొకడు లేడు. నీకు సముడగు భూలోకవాసి మరొకడు లేడు. అట్టివాడు పుట్టలేదు. పుట్టబోడు.

రెండవ తృచ : ఋషి - వామదేవుడు.

1. ఇంద్రుడు నిత్యవర్ధనుడు. విచిత్రుడు. మిత్రుడు అతడు ఏ తృప్తి కారక పదార్థమునకు; ఏ ప్రజ్ఞాయుత వ్రతములకు మాకు ప్రత్యక్షమగును?

2. ఇంద్రా! పూజనీయము, సత్యవంతము, ఆనందదాయకమగు పదార్థము ఏది? సోమము దృఢము, సకల దిశల నుండి శత్రు ధనాపహారకము అగును. అది నీకు మత్తు కలిగించునుగాక.

3. ఇంద్రా! మిత్రుడగు, స్తోతల రక్షకుడవగు నీవు వందల రక్షణల సహితుడవై మాకు ప్రత్యక్షమగుము.

మూడవ తృచ : ఋషి - నోధ.

1. ఇంద్రుడు దర్శనీయుడు. శత్రుహంత. దుఃఖ నివారకుడు. ఋత్విజులారా! గోష్టమునందలి గోవులు దూడలను చూచి అరచినట్లు ఇంద్రుని "**గీర్భిర్నవామహే**" గీతములచే స్తుతించండి.

2. స్వర్గనివాసియు, చక్కని దాతయు, బలసంపన్నుడును, అనేకులచే హవి అర్పించబడువాడగు ఇంద్రుని పిల్లల సందడి గలదియు, వందల వేల ధనముతో కూడినదియు, గోవులు కలదియునగు గృహమును యాచించుచున్నాము.

నాలుగవ తృచ : ఋషి - కలి.

1. ఇంద్రుడు జవనాశ్వముల వాడు. ధనదాత. ఋత్విజులారా! పిల్లలు తమ తండ్రిని పిలిచినట్లు మమ్ము రక్షించుమని శ్రమించి మీరు ఇంద్రుని మహా గానముల స్తుతించండి.

2. ఇంద్రుడు సుందర చుబుకము, నాసిక కలవాడు. అతనిని మహా అసురులు నివారించలేరు. దేవతలు నివారించలేరు. నరులు నివారించజాలరు.

ఇంద్రుడు సోమప్రియుడు. తనకు సోమము సమర్పించువారికి, తనను స్తుతించు వారికి అతడు, ధనదాత యగుచున్నాడు. మేము అట్టి ఇంద్రుని అర్థించుచున్నాము.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - వైశ్వామిత్ర మధుచ్ఛందుడు.

1. సోమమా! నీవు సంస్కరింపబడినదానవు. రుచికరమవు. ఆనందదాయినివి. 'ఇంద్రాయపాతవే" ఇంద్రుని పానమునకు క్షరితవగుము.

2. రాక్షసనాశని, విశ్వద్రష్టయగు సోమము సహస్థానమగు ద్రోణకలశమున నిలుచుచున్నది.

3. సోమమా! నీవు ధనమునిచ్చుదానవు. ఇతరములను ఇచ్చుదానవు. శత్రుహంతవు. "**పర్షిరాధోమఘోనామ్**"

ధనవంతులగు శత్రువుల ధనము మాకు ఇమ్ము.

రెండవ తృచ : ఋషి - గౌరివీతి.

1. సోమమా! నీవు మధుమత్తమవు. కర్మఫలప్రదవు. పూజనీయవు. దీప్తవు. ఆనందదాయినివి. ఇంద్రుని కొరకు మాదకమవై స్రవించుము.

2. సోమమా! వరదుడగు ఇంద్రుడు నిన్ను త్రాగును. వృషభసముడు అగును. నిన్ను త్రాగును. సర్వజ్ఞుడు అగును. నిన్ను త్రాగును. ప్రజ్ఞావంతుడగును. అశ్వము యుద్ధభూమిని ఆక్రమించినట్లు ఇంద్రుడు శత్రువుల అన్నములను వశపరచుకొనును.

మూడవ తృచ : ఋషి - అగ్ని.

1. శీఘ్రముగ ఉత్పన్నమగునదియు, పాత్రలందు పడునదియు, సర్వజ్ఞయు, హరితవర్ణ, సంస్కరించబడిన సోమము ఇంద్రుని చేరును గాత.

2. సోమము సంగ్రామములందు సేవించదగినది. సంస్కరించబడినది. అది ఇంద్రుని కొరకు క్షరితమగుచున్నది. లోకములు సోమమును ఎరింగినట్లు అది ఇంద్రుని ఎరుంగును.

3. సోమపు ఆనందము కలిగినంత జనులు ధనుర్ధారులగుదురు. అట్లే జలముల విజేత, వరదుడగు ఇంద్రుడు తన వజ్రమును ధరించుచున్నాడు.

నాలుగవ తృచ : ఋషి - శ్యావాశ్వుడు.

1. సోమము పురోజిత. గెలుపు తనముందు గలది. పానయోగ్య. సంస్కృత మాదకారి. మిత్రులారా! పొడవు నాలుక కుక్కను దానికి దూరముగా తరుమండి.

2. సంస్కరించబడినదియు, కర్మసాధకమును అగు సోమము పావక ధారగా గుర్రము వంటి వేగమున నలుదిశలకు ప్రవహించుచున్నది.

3. దాహము కలిగించని సోమము విషయమున ఋత్విజులారా! సకల కర్మలను సాధించగల మీ బుద్ధితో యజ్ఞమున ఆదరము కనబరచండి.

అయిదవ తృచ : ఋషి - 'కవి'.

1. సోమము హితకారి భోజనము. జగత్తునకు తృప్తి కలిగించునది. ఏ జలములందు అది వర్ధిల్లునో ఆ జలములను

పావనము చేయునది. తదుపరి మహా సూర్యుని సర్వత్ర సంచరించురథము మీద అందరకు దర్శనమిచ్చును అధిరోహించును.

2. సత్యజిహ్వాము, శబ్దించునదియు, ప్రియమును గూర్చు, మదకారి యగు సోమము చుక్కలుగా రాలును. ఈ కార్యమును నిర్వహించు వానిని రాక్షసులు హింసించ జాలరు. బిడ్డకు నామకరణము చేయునపుడు తండ్రి ద్యులోకామును దీపింప చేయు సోమము పేరిట మూడవ పేరు పెట్టును.

(నక్షత్రనామము, వ్యవహార నామము కాక సోమయాజి అనునది మూడవ నామము.)

3. దీప్తిమంతులగు ఋత్విజులు సోమమును బంగారు కోశములందు చేర్తురు. తదుపరి అది ధ్వని చేయుచు ద్రోణ కలశమున పడును. తదుపరి వారు సోమమును స్తుతింతురు. యజ్ఞదినము లందు సోమము మూడు సవనములందును ప్రకాశించును.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - తృణపాణి శంయుడు.

1. స్తోతలారా! యజ్ఞ యజ్ఞమున దక్షుడగు అగ్నిని మాటమాటలతో స్తుతించండి. మేము అమృతుడు, జాతవేది, మిత్రుడు అనుకూలుడగు అగ్నిని 'ప్రప్రశం సిషమ్' గొప్పగా ప్రశంసింతుము.

2. బలపుత్రుడగు అగ్నిని మేము కీర్తించుచున్నాము. అతడు సహితము మమ్ము గురించి ఆలోచించును. మేము హవ్యదాతయగు అగ్నికి హవిస్సులు అర్పించుచున్నాము. అగ్ని సంగ్రామము లందు మమ్ము రక్షించును గాక. మాకు వృద్ధి కలిగించును గాత. మా సంతానమునాకు రక్షకుడు అగును గాత.

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. అగ్నిదేవా! విచ్చేయుము. నేను నీ కొరకు సుందర స్తుతులు ఉచ్చరించుచున్నాను. ఆలకింపుము. ఇతరుల స్తుతులను కూడా వినుము. **"ఏభిర్వర్ధసి ఇందుభిః"** ఈ సోమములతో వర్ధిల్లుము.

2. నీవు అనుగ్రహించిన వానికి ఉత్తమ, బాలకార అన్నమును ఏర్పరతువు. చోటు సహితము చూపింతువు. **"తత్రయోనిం కృణ్వసే".**

3. అగ్నీ! నీ తేజస్సు మా నేత్రములకు హాని కలిగించకుండును గాత. నీవు నమస్కరించువారిని రక్షించు వాడవు. అందువలన మా సేనలను స్వీకరించుము.

మూడవ తృచ : ఋషి - సౌభరి.

1. ఇంద్రా! నీవు నవ్యుడవు. వజ్రివి. మేము నిన్ను సోమమున వర్ధిల్ల చేయుచున్నాము. పూజనీయుడవగు నిన్నే రక్షకునిగా వరించినాము. ఇంటిని అన్నముతో నింపు వానిని పిలిచినట్లు నిన్ను ఆహ్వానించుచున్నాము.

2. ఇంద్రదేవా! మా యజ్ఞములను రక్షించుమని నిన్ను శరణు వేడుచున్నాము. శత్రు తిరస్కర్త. తరుణ, ఉగ్ర ఇంద్రుడు మమ్ము చేరును గాత. మేము బంధువుల వలె సర్వరక్షకుడ వగు నిన్నే కదా ఆరాధించుచున్నాము.

నాలుగవ తృచ : ఋషి - నృమేధుడు.

1. స్తుతియోగ్య ఇంద్రా! మా కోరికలు తీర్చుమని ఇప్పుడే నిన్ను ప్రార్ధించుచున్నాము. నీరు మోసుకుని పోవుచున్న వానిని వలె నిన్ను సమీపించుచున్నాము.

2. వజ్రధారి, శూర ఇంద్రా! నదులు సముద్రమును నింపినట్లు స్తోతలు మహా స్తుతులతో నీకు దినదినాభివృద్ధి కలిగింతురు.

3. ఇంద్రుడు గమనశీలుడు. అతనిది మహా రథము. మాట మాత్రమున హర్యశ్వములు రథమున తగులును. ఇంద్రుని స్వర్గమునకు వహించు హర్యశ్వములను స్తుతులు కీర్తించును.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి మొదటి అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

సామవేదం 1-1-10-5

రెండవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - శ్రుత కక్షుడు.

1. ఇంద్రుడు సర్వ శత్రుహంత. శతక్రతువు. నరులకు అధిక ధనము నిచ్చువాడు. మాన్యుడు. ఋత్విజులారా! ఇంద్రుడు ప్రత్యక్షముగా సోమపానము చేసినాడు! అతనిని ఎన్నో ఎన్నో స్తుతులచే నుతించండి.

2. ఇంద్రుడు అనేకులచే ఆహ్వానించబడు వాడు. అనేకులచే స్తుతించబడువాడు. సనాతనుడు. జనులారా! ఇంద్రుని నామము జపించండి - **'ఇంద్రఇతిబ్రవీతన'**

3. ఇంద్రుడు స్తుత్యుడు. అతడే ధనములకు స్వామి. మహానుడగు ఇంద్రుడు మాకు అన్నదాత అగును గాక. ఇంద్రుడు మా ముందుకు వచ్చి ధనాదులు అందించును గాత.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. మిత్రులారా! హర్యశ్వుడు, సోమపాయి అగు ఇంద్రునకు ఆనందము కలుగునట్లు గానము చేయండి.

2. స్తోతలారా! మంచిదాత, గొప్ప ధనవంతుడగు ఇంద్రుని స్తుతిమ్చంది. ఇతరులు స్తుతింతురు. మేము కూడ స్తుతింతుము.

3. ఇంద్రా! నీవు మా కొరకు అన్నము కోరుము. శతక్రతూ! మా కొరకు గోవులు కోరుము. ధనిక ఇంద్రా! మా కొరకు స్వర్గము కోరుము.

మూడవ తృచ : ఋషి - మేధాతిథి లేక ప్రియమేధ.

1. ఇంద్రా! నిన్ను తమ వారిని చేసికొన దలచిన వారు ఏ ప్రయోజనము ఆశించి నిన్ను స్తుతించుచున్నారో కణ్వవంశజులమగు మేము అట్లే స్తుతించుచున్నాము.

2. ఇంద్రా! నీవు వజ్రధారివి. కర్మలకు అధిష్టాతవు. యజ్ఞములు నూతనములు అయినప్పటికి అన్యము ఎరుగము. నీ స్తోత్రములను మాత్రమే ఎరుగుదుము.

3. సోమాభిషవము చేయు యజమానిని దేవతలు రక్షింతురు. అతనికి కలలు కలిగించరు. అప్రమత్తుని చేయుదురు. ఆలస్యమెరుగని దేవతలు ఆ సోమమును స్వీకరింతురు.

నాలుగవ తృచ : ఋషి - శ్రుతి కక్షుడు,

1. సోమాభిలాషి ఇంద్రుని కొరకు సోమమును సంస్కరించుచున్నాము. స్తుతించుచున్నాము. సోమము స్తుతియోగ్య. ఇతర స్తోతలు కూడ స్తుతింతురు గాత.

2. ఇంద్రుని యందు సంస్థ కాంతులు అధికములు అగును. సప్తహోతలు హవి అర్పించుచు మంత్రములు ఉచ్చరింతురు. అట్టి ఇంద్రుని సోమపానమునకు ఆహ్వానించుచున్నాము.

3. దేవతలు జ్యోతిని, గోవులను, ఆయువును కలిగించుచున్నారు. స్వర్గమును తెలియపరచుచున్నారు. అట్టి దేవతలను గురించిన యజ్ఞమును వ్యాపింప చేయుచున్నాము. మా వాణిచే యజ్ఞమును వర్ధిల్ల చేయుచున్నాము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఇరిమిఠి.

1. ఇంద్రా! ఈ సోమము దశా పవిత్రమున సంస్కరించబడినది. నీ కొరకు దర్భాసనము మీద ఉంచబడినది. విచ్చేయుము. ఈ ద్రవమును పానము చేయుము. **"ఏహీ మస్య ద్రవాపిబ"**

2. ఇంద్రుడు సమర్థుడు. అనేక పూజలు కలవాడవు. అతనికి సుఖము కలుగుటకు ఈ సోమము అభిషుతమైనది. శత్రుమానహర్తమగు ఇంద్రా! నీవు పిలువా బడుచున్నావు. **"ప్రహూయసే"**

3. ఇంద్రా! నీవు శృంగ ఋషి పుత్రుడవు. **"కుణ్డపాయి"** యజ్ఞము నిన్ను రక్షించునది అగును. ఋషులు ఆ యజ్ఞమందు తమ మనములను లగ్నము చేయుచున్నారు.

రెండవ తృచ : ఋషి - కుసీదుడు.

1. ఇంద్రా! నీ చేతులు పెద్దవి. ద్యుమంతము, చిత్రము, గ్రహణయోగ్యమగు ధనమును మా ముందు నిలిచి కుడిచేతితో అందించుము.

2. ఇంద్రా! నీవు బహు పరాక్రమ వంతుడవు. గొప్పదాతవు. భూరి ధనవంతుడవు. అనేక ఆయుధములు కలవాడవు. అట్లని మేము ఎరుంగుదుము.

3. భీకర మగు గోవును గడ్డి మేయుచున్నపుడు లొంగదీయరాదు. అట్లే శూరుడు, దానములు చేయదలచు ఇంద్రుని దేవతలు, మానవులు ఎవరును ఎదిరించజాలరు.

మూడవ తృచ : ఋషి - త్రిశోకుడు.

1. వరదా! ఇంద్రా! సోమము సంస్కరించబడినది. సోమ పానమునకు నిన్ను ఆహ్వానించుచున్నాము. తృప్తుడవగుము. మాదక సోమము నీలో వ్యాపించును గాక.

2. ఇంద్రా! మానవులు మూర్ఖులు. తమను పోషించుమని నిన్ను తిప్పలు పెట్టకుందురు గాక. నవ్వుల పాలు చేయకుందురు గాక. బ్రహ్మద్వేషులను భజించకుము. **"మా కీం బ్రహ్మద్విషం వనః"**

3. ఇంద్రా! ఈ యజ్ఞమున నీ కొరకు ఆవుపాలు కలసిన సోమము సిద్ధము చేసినాము. మాకు ధనము కలిగించుటకు గాను నీవు దీనిని గౌరమృగము నీరు త్రాగినట్లు త్రావుము.

నాలుగవ తృచ : ఋషి - మేధాతిథి లేక ప్రియమేధ.

1. ఇంద్రా! నీవు వ్యాపకుడవు. భయరహితుడవు. ఈ సోమము అభిషుతము. నీకు అర్పించుచున్నాము. త్రావుము. కడుపు నింపుము. **"పిబాసుపూర్ణముదరమ్"**.

2. ఈ సోమము ఋత్విజులచే శుద్ధము చేయబడినది. రాళ్ళచే దంచి రసము తీయబడినది. దశాపవిత్రమున జల్లించబడినది. అశ్వమును వలె నీటితో కడుగబడినది.

3. ఈ సోమమును యవల పురోడాశము వలె ఆవు పాలతో కలిపినాము. రుచికరము చేసినాము. ఇంద్రా! ఈ సోమమునకు నిన్ను ఆహ్వానించుచున్నాము.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ధనపతి, స్తుతిపతి, బలపతి ఇంద్రా! ఇది సంస్కరించ బడిన సోమము. దీనిని సేవింపుము. **"పిబాత్వా2స్య"**.

2. ఇంద్రా! ఇదిగో ఇది నీ నిమిత్తమైన సోమము శుద్ధి చేయబడినది. దీనిని నీ దేహమందు చేర్చుము. అది నీకు మత్తు కలిగించును గాత. **"సత్వా మమత్తు"**.

3. ఇంద్రా! ఆ సోమము నీ ఉభయ పార్శ్వములందు వ్యాపించును గాక. స్తుతి సహిత సోమము నీ శీర్షమును చేరును గాక. ధనము కొరకు నీ బాహువులందు చేరును గాక.

రెండవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. స్తోమ వాహులగు మిత్రులారా! ఈ కర్మమునకు త్వరగా రండి. కూర్చోండి. ఇంద్రుని గీతములు చక్కగా గానము చేయండి. **"ఇంద్రమభి ప్రగాయత"**.

2. ఋత్విజులారా! సోమాభిషవ సమయమున సమూహ గానము చేయండి. శత్రు సంహారకుడు, బహుధనములకు ప్రభువైన ఇంద్రుని స్తుతించండి.

3. ఇంద్రుడు మా పురుషార్ధములకు సిద్ది కలిగించును గాక. మాకు ధనము కలిగించును గాత. సద్బుద్ది కలిగించును గాక. దానయోగ్య అన్నములతో మాకు ప్రత్యక్షమగును గాక.

మూడవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. మిత్రుల వంటి మేము కర్మ కర్మకు, సంగ్రామ సంగ్రామమునకు మమ్ము రక్షింపుమని ఇంద్రుని ఆహ్వానించుచున్నాము.

2. ఇంద్రుడు పురాతనుడు. యజమానుల కొరకు స్వర్గము నుండి దిగి వచ్చువాడు. ఆ ఇంద్రుని పూర్వము మా పితరులు ఆహ్వానించినట్లే మేము ఆహ్వానించుచున్నాము.

3. ఇంద్రుడు మా ఆహ్వానమును ఆలకించవలెను. వేల రక్షణలతోను, అన్నములతోను మా వద్దకు విచ్చేయవలెను.

నాలుగవ తృచ : ఋషి - నారదుడు.

1. ఇంద్రా! నీవు అభిషుత సోమమును పానము చేయువాడవు. వర్ధిల్లువాడు, దక్షుడు, విష్ణువు, కర్మకర్త యగు స్తోతను పావనము చేయుదువు. అట్టి నీవే ఆరాధనీయుడు.

2. ఇంద్రుడు అతిముఖ్యుడు. రక్షకుడు. స్వర్గమునందుండువాడు. వర్ధిల్లచేయువాడు. పనులను పూర్తి చేయించువాడు. ఎంతో అన్నవంతుడు. జలములను గెలిచినవాడు.

3. అట్టి బలశాలి ఇంద్రుని అన్నము, యజ్ఞము నిమిత్తము ఆహ్వానించుచున్నాను. ఇంద్రా! మాకు సుఖములు కలిగించుటకు మా వద్దకు విచ్చేయుము. అభ్యుదయము కలిగించుటకు మిత్రసముడవు అగుము.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. అగ్ని బలపుత్రుడు ప్రియంకరుడు. చైతన్యము కలిగించువాడు. స్వామి. శ్రేష్ఠయజ్ఞవంతుడు. విశ్వదూత అమృతుడు. అట్టి అగ్నిని ఋత్విజమానుల కొరకు స్తుతించి ఆహ్వానించుచున్నాను.

2. దీపించు అగ్ని విశ్వపోషక అశ్వములను తన రథమునకు కూర్చును గాక. పిదప - అన్నవంతుడు, యజనయోగ్యుడు, స్వాహుతుడగు అగ్ని దేవతలను పిలుచుటకు పరిగెత్తును గాక. యజమానుల హవిస్సులు అగ్నిని చేరును గాత.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. ద్యులోక పుత్రి ఉష అంధకారములను అందమొందించుచు దర్శనమిచ్చినది. మహా తపస్సును తన కంటి చూపుతో కరగించు ఉష ప్రాణులకు ప్రేరణ కలిగించును. కాంతులు విరజిమ్మును.

2. సూర్యుడు తన కిరణములతో ఒకేసారి ప్రకాశించును. ఉదయించును. ఆకాశమునందలి నక్షత్రాదులకు కాంతిని ప్రసాదించును.

ఉషోదేవీ! నీ ప్రకాశము, సూర్యుని ప్రకాశము కలిగినంత మాకు అన్నము లభించుచున్నది.

మూడవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. అశ్వినులారా! స్వర్గమును ఆశించు జనులు, ఋత్విజులు మిమ్ము ఆహ్వానించుచున్నారు. ఖర్మధనులగు స్తోతలు కూడి వ్యాపకులగు మిమ్ము ఆహ్వానించుచున్నారు. మమ్ము రక్షించుడని మిమ్ము ఆహ్వానించుచున్నాను. స్తుతులు, స్తుతులు గల చోట్లకు తప్పక వెళ్ళండి. **"విశం విశం హిగచ్ఛథః"**

2. అశ్వినులారా! మీరు విచిత్ర అన్నవంతులు. విచిత్ర ధనవంతులు. వానిని మా స్తోతలమై నడిపించండి. అందుకొరకు ఏక మనస్కులై మీ రథమును మావైపు సాగించండి. మధుర సోమరస పానము చేయండి. **"పిబతం సోమ్యం మధు"**.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - అవత్సరుడు.

1. సోమము పురాతనము. దీప్తము. శుక్రము. సహస్రఫలప్రద. ఋషి దానిని పానయోగ్యము చేసినాడు. కవి సోమమును సిద్ధము చేసినాడు.

2. సోమము సూర్యుని వంటిది. సూర్యుని వలె సకల కర్మద్రష్ట యగును. సోమము ముప్పది రోజులకు లభించును. అది సప్త ధారలుగా స్వర్గమునకు చేరుచున్నది. **"సప్త ప్రవత్ ఆదివమ్"**

3. పవిత్రము చేయబడిన సోమము సూర్యుడు దివియందు వలె సకల భువనముల పైన విరాజిల్లుచున్నది.

రెండవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. ఈ సోమము హరితము. దీప్తము. జన్మచేత సనాతనము. అది దేవతల కొరకు అభిషవించబడి దశా పవిత్రమున వెలుగుచున్నది. **"పవిత్రే అర్షతి"**

2. పురాతన, స్తోత్రయుక్త, దీప్త సోమము దేవతలకు కవి - మేధావి - అగుచున్నది. విప్రులచే వర్ధిల్ల చేయబడుచున్నది. **"కవిర్విప్రేణ వావృధే"**

3. సోమమా! నీవు ప్రాచీన రసమును పాత్రలందు నింపుచున్నావు. దశాపవిత్రమున బిందువులుగా రాలుచున్నావు. నీవు చేయు శబ్దమునకు దేవతలు నీ వద్దకు చేరుదురు.

(సోమము సంస్కరించబడు చోట దేవతలు ఉందురని.)

మూడవ తృచ : ఋషి - అసిత దేవలుడు.

1. సోమమా! మేము కోరిన వానిని మావద్దకు చేర్చుము. మా శత్రువులకు భయము కలిగించుము. శత్రువుల ధనమును మాకు అందించుము. "పవమాన విదారయిమ్".

2. సోమము మంచి జన్మకలది. జలముల ప్రేరణ కలది. శత్రువులను భంగపరచునది. గోక్షీరమున శుద్ధి చేయబడినది. దానిని దేవతలు సేవింతురు.

3. నరులు దేవతలను పూజించ కోరుదురు. వారు పవమాన సోమస్తుతులను గానము చేయుదురు గాక. **"ఉపాస్మై గాయతా నరః"**.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఆప్త్యుడు లేక త్రితుడు.

1. మేధావులచే పెంచబడిన సోమములు - మృగములు అడవులందు వలె - జలములందు ప్రవేశించుచున్నవి.

2. బభ్రువర్ణ, శుక్రవర్ణ సోమములు అమృత ధారల వలె ద్రోణ కలశమున - గోవులు అన్నము అందించిన రీతి

క్షరించుచున్నవి. **"వాజం గోమన్తమా క్షరన్".**

3. అభిషుత సోమము ఇంద్రాయ వాయవే మరుద్భ్యః విష్ణవే క్షరించును గాత.

రెండవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. సోమమా! నీవు దేవతల పానమవు. సముద్రము వలె నీటితో నిండుము. నీవు మాదకమవు. అప్రమత్తవు. తీవల తుంపలచే మధుర రసమును స్రవింప చేయుదువు. ద్రోణ కలశమున చేరుము '**అచ్ఛాకోశం**'.

2. పుత్రుని వలె కోరదగినదియు, సంస్కారయోగ్యమునగు శ్వేతసోమము దర్శనీయమై అదిగో వ్యాపించుచున్నది. దీనిని అంగుళులు జలమునకు - శూరుడు రథమును యుద్ధమునకు వలె - పంపుచున్నవి.

మూడవ తృచ : ఋషి - శ్యావాశ్వుడు.

1. సోమము ఆనంద సాగరము. అది అభిషుత మైనది. హవివంతులమగు మా యజ్ఞమునకు మాకు అన్నము, కీర్తి కలిగించుటకు - చేరుచున్నది.

2. హంస తన నడకచే జనుల మనములను ఆకర్షించినట్లు సోమము సమస్త స్తోతల మనసులను జయించును. ఆసోమమును - అశ్వమును వలె - నేతితో మెరిపింతురు.

3. ఈ సోమము హరితము. త్రితర్షి అంగుళులు **"ఇంద్రాయ పీతయే"** ఇంద్రుని పానము కొరకు శిలలచే మర్దించబడుచున్నవి.

నాలుగవ తృచ : ఋషి - అగ్ని.

1. సోమమా! నీవు దేవకామివి. ధారగా పడుము. తదుపరి శబ్దించుచు దశాపవిత్రము వైపు సాగుము. అప్పుడు నీ మాదకధారలు ఏర్పడును. **"మధోర్ధారా అసృక్షత"**

2. సోమము హరితము. స్తోతలకు పుత్రులను కీర్తిని ప్రసాదించునది. అది సుందర వేగమున వంకరటింకర పవిత్రముల నుండి సాగి జల్లించబడును.

3. అభిషవించబడు సోమ శబ్దమును యజ్ఞ విఘ్నకారులు వినకుందురు గాత. స్తోతలారా! భృగువులు దోషపూరిత యజ్ఞమును దూరము చేసినట్లు కర్మరహిత శునకమును దూరము చేయండి.

దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన సామవేద
సంహిత ఉత్తరార్చిక యందలి
రెండవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్నే రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

మూడవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - జమదగ్ని.

1. సోమమా! నీవు అగ్రిమవు "అగ్రియః". పూజనీయవు. రక్షణలు గల నీవు మా స్తుతులను అందుకొనుము. సమస్త స్తుతులు నిన్ను చేరునుగాత - **"అభివిశ్వాని కావ్యా"**.

2. సర్వ ద్రష్ట సోమమా! నీవు ప్రధాన వాక్కునకు ప్రేరణ కలిగించుచు అంతరిక్ష జలములందు ప్రవేశింపుము.

3. విద్వాన్ సోమమా! నీ మహిమ వలననే ఈ భువనములు నిలిచి ఉన్నవి. ధేనువులు నీ కొరకే పరువు లిడుచున్నవి - **"తుభ్యం ధావన్తి ధేనవః"**

రెండవ తృచ : ఋషి - అమహీయుడు.

1. అభిషుత సోమమా! నీవు కోరికలు తీర్చుదానవు. ధారగా పరుము. పవిత్రమగుము. మాకు జనులందు కీర్తి కలిగించుము - **"కృధినో యశసే జనే"**. సమస్త శత్రువులను హతమార్చుము. **"విశ్వా అపద్విషో జహి"**.

2. సోమమా! ఈ యజ్ఞమున నీవు మాకు మిత్రమావు అయినావు. మేము అన్న తృప్తులము అయినాము. యుద్ధము కోరువారిని త్రోసివేయుదుము గాత.

3. సోమమా! భీమాన్యాయుధా - నీవు భయంకర ఆయుధములు కలదానవు. అవి పదునైనవి. శత్రునాశకములు. వానితో మమ్ము శత్రువుల నిందలనుండి కాపాడుము.

మూడవ తృచ : ఋషి - కశ్యపుడు.

1. సోమమా! నీవు కోరికలు తీర్చుదానవు. "వృషా దేవతలు "వృషవ్రతః" కోరికలు తీర్చు దీక్షగల వారు అగుదురు గాక. నీవు మానవులకు, దేవతలకు హితము కూర్చు దానవు.

2. వృషన్! కోరికలు తీర్చుసోమమా! నీవు వర్షించుదానవు. నీ సేవ వర్షము కలిగించును. నీ అభిషవము వర్షము కలిగించును. వర్షించు నీవు వర్షవ్రతము కలదానవు. **"సత్యం వృషన్వృషేదసి"**

3. సోమమా! నీవు 'వృష' వు. అశ్వము వంటి శబ్దము చేయుదువు. మాకు గోవులను, అశ్వములను ఇచ్చెదవు. మా కొరకు ధనద్వారములను తెరువుము. "వినోరాయే దురో వృధి"

నాలుగవ తృచ : ఋషి - జమదగ్ని.

1. సోమమా! నీవు నిశ్చయముగా 'వృష'వు. దేవతలు దర్శించ దగిన దానవు. తేజోవంతవు. నిన్ను యజ్ఞమునాకు ఆహ్వానించుచున్నాము.

2. సోమమా! నీవు నరులచే శుద్ధిచేయబడుదువు. జలమున చేర్చబడుదువు. ద్రోణ కలశమున చేరుదువు. చమసాది పాత్రలందు నిండుదువు.

3. సోమమా! నీవుచేరు యజ్ఞమున యజ్ఞపరికరములు ఉన్నవి. ఆ యజ్ఞము నందు దేవతలకు ఆనందము కలిగించుము. మాకు పుత్రులను ప్రసాదించుము. మా యజ్ఞమునాకు శుభప్రదమగుచు విచ్చేయుము.

అయిదవ తృచ : ఋషి - అమహీయుడు.

1. దశాపవిత్రమున ఆర్ద్రవమగు సోమమా! నిన్ను మిత్రముగా వరించుచున్నాము. **"సఖిత్వమా వృణీమహే"**

2. సోమమా! నీ తరంగములు ధారలుగా పవిత్రమున చేరుచున్నవి. ఆ తరంగములు మాకు సుఖములను ఇచ్చును గావుత - **"తేభిర్నః సోమ మృడయ"**

3. **"ఈశానః సోమ విశ్వతః"** సోమమా! నీవు సమస్త విశ్వములకు ప్రభువువు. అభిషుతమవై పరిశుద్ధవగుము. మమ్ము ధనవంతులను, పుత్రవంతులను, అన్నవంతులను చేయుము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - మేధాతిథి.

1. అగ్నిహోత. సమస్త సంపన్నుడు. యజ్ఞములందు శ్రేష్ఠ కర్మలవాడు. దూత. అట్టి అగ్నిని ఆరాధించుచున్నాము - **"వృణీమహే"**.

2. అగ్ని ప్రజాపాలకుడు. హవ్యవాహనుడు. దేవతలకు ఇష్టుడు. ఆహవనీయాది అనేక నామములవాడు. అతనిని ఆహ్వానమంత్రములతో సదా ఆహ్వానించుచున్నాము. **"సదాహవన్త"**

3. అగ్నిదేవా! నీవు అరణులందు పుట్టినవాడవు. యజమాని దర్భలు కలవాడు. నీవు అతనిని అనుగ్రహించుము. దేవతలను ఆహ్వానించుము. నీవు హోతవు, స్తుతియోగ్యుడవు కదా!

రెండవ తృచ : ఋషి - మేధాతిథి.

1. మిత్రావరుణులు శుద్ధబలయుతులు. యజ్ఞములందు ప్రత్యక్షమగు వారు. సోమపానము కొరకు వారిని మేము ఆహ్వానించుచున్నాము - **"హవామహే"**

2. మిత్రావరుణులు సత్యవంతులు. సత్యవర్ధనులు. వెలుగుల పాలకులు. వారిని ఆహ్వానించుచున్నాము - **'హువే'**.

3. వరుణుడు మాకు సకల రక్షకుడు అగును గాత. మిత్రుడు మాకు భద్రతర రక్షణలు కలిగించును గాత. వారిరువురు మమ్ము బహుధన యుక్తులను చేయుదురు గాత. **"కరతాం న స్సురా ధసః"**

మూడవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ఉద్గాతలు బృహత్సామమున ఇంద్రుని స్తుతించినారు. అర్కిణులు ఉక్థములతో స్తుతించినారు. అధ్వర్యులు యజుస్సులతో స్తుతించినారు.

2. ఇంద్రుడు వజ్రి సువర్ణ భూషణుడు. మాట మాత్రమున రథమునకు తగులు హర్యశ్వములు గలవాడు అగుచున్నాడు.

3. ఇంద్రా! నీవు ఉగ్రుడవు. ఉగ్ర ఆయుధములు కలవాడవు. సహస్ర సంఖ్యాక సేనల యుద్ధమున మమ్ము రక్షింపుము.

4. ఇంద్రుడు నిరంతర దర్శనము కలిగించు సూర్యుని దివిలో నిలిపినాడు. ఆ సూర్యుడు తన కిరణములచే మేఘములకు ప్రేరణ కలిగించుచున్నాడు.

నాలుగవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. మేము రక్షణలు కోరువారలము. ఇంద్రునకు, అగ్నికి వర్ధమాన హవిస్సులు అర్పించుచున్నాము. స్తుతించుచున్నాము. స్తుతులను ఉచ్చరించుచున్నాము.

2. విప్రులు ఆ ఇంద్రాగ్నులను తమ రక్షణ కొరకు ఎన్నో రీతుల స్తుతించుచున్నారు. ఎన్నో శ్రమలకు ఓర్చి అన్న ప్రాప్తికి గాను వారిని నుతించుచున్నారు.

3. మేము స్తోతలము. హవియుక్తులము. ధనార్థులము. ఇంద్రాగ్నులారా! మిమ్ము స్తుతించుచున్నాము. యజ్ఞములకు గానములతో ఆహ్వానించుచున్నాము. **"హవామహే"**

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - వారుణి లేక భృగువు

1. సోమమా! నీవు వృషవు. ధారగా పారుము. సర్వబాల సహితవై మరుద్వంత ఇంద్రునకు ఆనందము కలిగించుము.

2. పవమాన సోమమా! నీవు ద్యావాపృథ్వులను భరించుదానవు. సర్వదర్శనీయవు. బలశాలివి. నిన్ను యుద్ధములకు పంపుచున్నాను.

3. సోమమా! నీవు నా అంగుళులతో శుద్ధమైన దానవు. హరిత వర్ణవు. నిరంతరము ధారగా పారుము. మిత్రుడగు ఇంద్రుని యుద్ధముల కంపుము. **'యుజంవాజేషు చోదయ'**

రెండవ తృచ : ఋషి - ఉపమన్యు.

1. ఎర్రని ఆబోతు అరచుచు ఆవుల మీదికి ఉరుకునట్టి ధ్వని చేయు సోమమా! నీవు ద్యావాపృథ్వులను అందుకొనుచున్నావు. యుద్ధములందు నీవు చేయు ఇంద్రుని వంటి గర్జన వినిపించుచున్నది. అమ్ధరను ఆనందపరచు ఈ స్తుతులు నిన్ను చేరును గాక.

2. సోమమా! నీవు రుచిగల దానవు. పాలు కలిసినదానవు. మధురమవు. రసయుక్తవై అందుచున్నావు. పరిషిచ్యమానవై, పరిశుద్ధవై, ధారగా పారి ఇంద్రుని చేరుకొనుము.

3. సోమమా! నీవు మాదకమవు. వృత్రవధ వలన నీటిని గ్రహించిన మేఘమును వర్షింపచేయుము. మత్తు నిచ్చుటకు

పాత్రలో పడుము. తెల్లని దానవై మాకు గోవులను ఇచ్చు నిమిత్తము చేరుకొనుము.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - భరద్వాజుడు.

1. ఇంద్రదేవా! మేము స్తోతలము. మాకు అన్నము కలిగించుమని నిన్నే ఆహ్వానించుచున్నాము. **'హవామహే'.** నీవు మంచి రక్షకుడవు. శత్రువులు గల అన్యులు సహితము నిన్ను ఆహ్వానింతురు. **హువన్తే.** యుద్ధములకు కూడ నిన్ను పిలుతురు.

2. ఇంద్రా! నీ పరాక్రమము విచిత్రము. నీచేత వజ్రము ఉన్నది. నీవు అరిభయంకరుడవు. మహా మహుడవు. మేము నిన్ను స్తుతించుచున్నాము. మాకు గోవులను, అశ్వములను రథములను ఇమ్ము. గెలిచిన వారికి ఇచ్చినట్లు మరిన్ని అశ్వములను ఇమ్ము.

రెండవ తృచ : ఋషి - ప్రస్కణ్వుడు.

1. ఇంద్రుడు సుసంపన్నుడు. ధనవంతుడు. స్తోతల మగు మాకు వేలకొలది ధనములు ప్రసాదించును. మా వలె మీరును ఎరుగండి. **సురాధసం ఇంద్రమర్చ** - సుందర ధనవంతుడగు ఇంద్రుని అర్చించండి.

2. యోధ విజిగీషువై శతానీకము మీదకు దండెత్తినట్లు ఇంద్రుడు యజమానియొక్క యజ్ఞ విఘ్నకార శత్రువుల మీద దండెత్తును. వారిని వధించును. బహుధనశాలి యగు ఇంద్రుని వద్ద యజమానులకు ఇచ్చు ధనము కొండల మీది నీటివలె తరుగకుండును.

మూడవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. వజ్రధారి ఇంద్రా! మేము హవి అర్పించువారలము తొలినాడే నీకు సోమము అర్పించినాము. ఇచట నా స్తుతులను ఆకర్షించుము. నీ ఇంటికి వెళ్ళుము. **"స్వసరమాగహి"**

2. ఇంద్రా! నీ శిరస్త్రాణము సుందరము. నీవు హర్యశ్వుడవు. స్తోతవ్యుడవు. నిన్ను సేవించు వారు వచ్చినారు. ప్రశంసనీయ సోమము అభిషుతమైనంత సేవింపుము. సంతృప్తుడవగుము. మాకు నీ వంటి ధనములభించును గాత.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - అమహీయుడు.

1. సోమమా! నిన్ను దేవతలు ఆశింతురు. నీవు రక్షస నాశకమవు. మాదకరసమవు. పానయోగ్యమవై పాత్రలందు ప్రవేశించుము. **"పవస్వాన్ధసా"**

2. సోమమా! నీవు శత్రువగు వృత్రుని వధించినావు. నిత్యము యుద్ధమున చేరుదువు. నిత్యము గోవులను ఇచ్చుచున్నావు. అశ్వములను ఇచ్చుచున్నావు. **"దివే దివే గోషాతిరశ్వసా అసి"**

3. సోమమా! నీవు చక్కని ఆవుల పాలతో కలుపబడినావు. గరుడుని వలె నీ స్థానమునకు చేరుము. వెలుగొందుము - **"అరుషోభవ"**

రెండవ తృచ : ఋషి - అమహీయుడు.

1. సోమము సర్వపోషక. ఆరాధనీయ ధనహేతువు. ఇది పరిశుద్ధమై కలశమున చేరుచున్నది. **పతిర్విశ్వస్య భూమనో** - సర్వలోకములను పోషించు సోమము ద్యావాపృథ్వులను తన తేజమున వెలిగించుచున్నది.

2. సోమము ప్రియతమము. గాయకులూ పోటీలు పడి దాని మాదకమును స్తుతింతురు. శుద్ధిచేయబడి, దీప్తములైన సోమములు తమ క్షరణ మార్గములను ఏర్పరచు కొనును. **"సోమాసః కృష్వతే పథః"**

3. సోమమా! నీ యొక్క రసము శక్తి దాయకము. పాలు కలుపదగిన ఆ రసమును మాకు అందించుము. పంచ జనులకు అందునట్టి నిన్ను ధనము కోరుచున్నాము.

మూడవ తృచ : ఋషి - భార్గవుడు.

1. సోమమా! నీవు నరులకు వృషవు. అధిక ద్రష్టవు. దినములను, ఉషస్సులను, ద్యులోక జలములను వర్ధిల్ల చేయుదానవు. నరులచే నుతించ బడుదానవు. నీవు ఇంద్రుని హృదిలో ప్రవేశించగోరి, శబ్దించుచు కలశమందు చేరుము.

2. సోమము సనాతన కవి. అధ్వర్యులు దానిని పవిత్రము చేయుదురు. నరులు దానిని నియంత్రింతురు. అది నలుదిశల నుండి కలశమున పడుచు ముల్లోకాములందు ఇంద్రుని జలములను సృష్టించును. మిత్రభావమున ఇంద్రుని కొరకు వాయువును పెంచి క్షరించును.

3. లోకకారక సోమము సంస్కరించబడుచు ఉషస్సును ప్రకాశవంతము చేసినది. నీటి నుండి సాగినది. సమృద్ధమైనది. హృదయమునా చేరదలచినది. ఇరువది యొక్క గోవుల పాలు పిండుకొని, మదకరమై, రమణీయమై ప్రవహించుచున్నది.

ఆరవ ఖండము

తొలి తృచ : ఋషి - అంగీరసుడు లేక శ్రుత కక్షి.

1. ఇంద్రా! నీవు శూరుడవు. శత్రుధమనుడవు. స్థిరుడవు. అందువలననే ఆరాధనీయుడవు.

2. మహాధనవంత ఇంద్రా! యజమానులు దేవతలకు హవి అర్పించినారు. వారికి నీవు ధనములు ప్రసాదించినావు. మాకు సహితము ధనమునిమ్ము. మమ్ము పాలించుము. "**అధాచిదింద్ర నః సచా**"

3. **వాజానాంపతే** - అన్నములకు స్వామివగు ఇంద్రా! తొందరపడు బ్రాహ్మణుని వంటివాడవు కాకుము. సోమము క్షీరమిశ్రితమై ఉన్నది. పూర్తిగా ఆనందించుము. "**మత్స్వా సుతస్యగోమతః**"

రెండవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. ఇంద్రుడు సాగర విశాలుడు. రథికులకు రథికుడు. వాజానాంపతి. సత్పతి - మంచి సంరక్షకుడు. అతనిని మా సమస్త స్తుతులు వర్ధిల్లచేసినవి.

2. బలపతి ఇంద్రా! మేము నీ మిత్రులము. మేము అన్నవంతులము అగుదుము గాక. శత్రువులకు భయపడకుందుము గాక. మాకు అభయమునిమ్మని విజేతవు, అపరాజితుడ వగు నిన్ను ప్రార్థించుచున్నాము.

3. **పూర్వీరిన్ద్రస్య రాతయః** - ఇంద్రుని ధనములు పురాతనములు. యజమాని ఋత్విజులకు గోవులు, ధనము, అన్నము దక్షిణగా ఇచ్చును. అట్లయినను అతని విషయమున ఇంద్రుని రక్షణలు ఏ మాత్రము తగ్గవు. "**న వి దస్యన్త్యూతయః**"

దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన సామవేద
సంహిత ఉత్తరార్చిక యందలి.
మూడవఅధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్నీ రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

నాలుగవఅధ్యాయము

మొదటి ఖండము

తొలి తృచ : ఋషి - జమదగ్నీ.

1. **ఏత అసృగ్రమిన్దవస్తిరః పవిత్ర మాశవః |**
విశ్వాన్యభి సౌభగా ||

సోమము వంకరల పవిత్రము వైపు వడివడిగా సాగును. సకల సౌభాగ్యములు కలిగించు దిశగా సాగును.

2. సోమము మహా బలప్రదాత. దురిత విధ్వంసి. మా పుత్రుల సుఖమునకు ధనములను, అశ్వములను స్వయముగా ఇచ్చుచున్నది.

3. సోమము మాకు, మా గోవులకు స్థిరమగు అన్నమును, ధనమును ప్రసాదించును గాక. మా సుందర స్తుతులను ప్రత్యక్షముగ స్వీకరించును గాత.

రెండవ తృచ : ఋషి - జమదగ్ని.

1. మానవుడు యజ్ఞము చేయును. ప్రభువగు సోమము స్తుతులు అందుకొనును. ఆకసము నుండి కలశమునకు చేరుటకు దిగును.

2. సోమమా! నీవు దేవతల పానయోగ్యమవు. అభిషుతవైనావు. మాకు శత్రువును జయించు నట్టియు, సర్వత్ర వ్యాపించునట్టియు నగు బలమును, వర్చస్సును ప్రసాదించుము.

3. సోమమా! వందల గోవుల సాహితమును గోవులకు పుష్టి కలిగించు అశ్వసమూహ సహితమును అగు సంపదలను రక్షణల కొరకు మా వద్దకు పంపుము.

మూడవ తృచ : ఋషి - కవి.

1. మహా ద్యులోక స్థానములందున్న ధనమును ధరించిన కళ్యాణమూర్తి సోమమును సుకృత్యములచే అర్థించుచున్నాము. **"చారుం సుకృత్య యేమహే"**

2. సోమము మహా శత్రువులను కూల్చినది. ప్రశంసణీయ మహత్కార్యములు చేసినది. మదకారి. శత్రుపుర ధ్వంసి. అట్టి సోమము నుండి ధనము అర్థించుచున్నాము.

3. సుకృత సోమమా! నీవు ధనము వద్దకు చేర్చుదానవు. ప్రదీప్తవు. నిన్ను ద్యులోకము నుండి శ్యేనము అవలీలగా తీసికొని వచ్చును. **"సువర్ణో అవ్యథీభరత్"**

4. ఇంకను కర్మ ద్రష్టము, అభీష్ట ప్రదాతయు, ఫలప్రదయునగు సోమము తనయొక్క మహా మహిమలను వ్యాపింపచేయును. **"జ్యాయే మహిత్వమానశే"**

5. సోమము జలప్రేరకము. యజ్ఞ రక్షకము. సమస్త దేవతలకు సమభావమున చేరునది. దానిని మంచి రక్కల శ్యేనము దివినుండి తెచ్చును.

నాలుగవ తృచ : ఋషి - కశ్యపుడు.

1. సోమమా! నిన్ను నరులు శుద్ధి చేయుదురు. మాకు అన్నము కలుగుటకు నీవు ధారగా పారుదువు. అన్న రూపములగు గోవులందు చేరుము.

2. సోమమా! నీవు స్తుత్యవు. హరిత వర్ణపు. పాలలో కలసి పవిత్రమగు దానవు. జనులకు అన్నము, ధనము కలిగించుము.

3. సోమమా! నీవు హవినిచ్చు వారితోటి దానవు. దీపించు దానవు. యజ్ఞముకొరకు పవిత్రమగు దానవు. హితకారివి. ఇంద్రుని స్థానమునకు చేరుము. **'ఇంద్రస్య యాహి నిష్కృతమ్"**

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - మేధాతిథి.

1. అగ్ని కవి. గృహరక్షకుడు. యువకుడు. హవ్యవాహనుడు. జహ్వాస్యుడు.
"అగ్నినాగ్నిః సమిధ్యతే" అగ్ని చేతనే అగ్ని ప్రజ్వరిల్లుచున్నాడు.

2. అగ్నిదేవా! నీవు యజమాని హవిస్సులు దేవతలకు చేర్చువాడవు. అతడు నిన్ను ఆరాధించుచున్నాడు. అతనికి పరిపూర్ణ రక్షకుడవు అగుము. **'తస్యస్మ ప్రావితాభవ.'**

3. ఎవడు హవిష్మంతుడగునో, ఎవడు దేవయజనమునకు అగ్నిని దగ్గర నుండి అర్చించునో అట్టి వానికి అగ్నీ! సుఖములు కలిగించుము. **"తస్మైపావకమృడయ"**.

రెండవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. పవిత్ర బలముగల మిత్రుని ఆహ్వానించుచున్నాము. హింసకులను మ్రింగు వరుణుని ఆహ్వానించుచున్నాము.

వారు ఉభయులు భూమికి జలమును పంపు కార్యమును సాధింతురు. **"ధియం ఘృతాచీం సాధయంతా"**

2. మిత్రావరుణులు సత్యవర్ధనులు. సత్యమునే తాకువారు. ఈ మహా క్రతువును సత్యఫల యుక్తను చేయుచున్నారు.

3. మిత్రావరుణులు మేధావులు. ఉపకారకులు. నివాస ప్రదాతలు. వారు బలమును, కర్మమును పరిపుష్టము చేయుచున్నారు.

మూడవ తృచ : ఋషి - మధుచ్ఛంధుడు.

1. మరుద్గణములు నిత్య సంతోషులు. నిర్భయులు. ఇంద్రసహితులు. వారు ఎంతో సుందరముగా దర్శనము ఇచ్చుచున్నారు. **"ఇంద్రేణ సంహిదృక్షసే"**

2. వర్షకాలము గడచిపోవును. అన్నము అందించవలసి ఉండును. అప్పుడు మరుత్తులు యజ్ఞనామము ధరింతురు. మరలక గర్భములు దాల్తురు. జలములకు ప్రేరణ కలిగింతురు.

(పునర్గర్భత్వమేరిరే - మరల గర్భము దాల్చినారు. మబ్బులు నీరు నింపుకొనుట మరల మరల జరుగునది.)

3. మరుత్తులు దృఢ దుర్గములను నలువైపుల నుంచి బ్రద్దలు కొట్టగల వారు. వానిని దూర దూరములకు విసరివేయగల సమర్ధులు. ఇంద్రా! నీవు అట్టి మరుత్తుల సాయమున గుహలందుండిన గోవులను విడిపించినావు.

నాలుగవ తృచ ప; ఋషి - భరద్వాజుడు.

1. ఇంద్రాగ్నులు పూర్వము ఈ సమస్త విశ్వమును నిర్మించినారు. ఆ విషయమును ఋషులు వర్ణించినారు - **'తాహువే'** - వారిని మేము ఆహ్వానించుచున్నాము. తమను స్తుతించు వైర్ని ఇంద్రాగ్నులు బాధించరు. **"ఇంద్రాగనీ న మర్ధతః"**

2. ఉగ్రులు, శత్రునాశకులగు ఇంద్రాగ్నులను **"వాహమహే"** - ఆహ్వానించుచున్నాము. వారు ఈ సంగ్రామమున మమ్ము సుఖింప చేయుదురు గాత. **"తానోమృడయత ఈద్రుశే"**

3. ఇంద్రాగ్నులారా! ఆర్యుల శత్రువులను హతమార్చండి. సత్పురుషులను రక్షించుటకు దుష్టులను హతమార్చండి. విశ్వము నందలి విద్వేషులను నాశనము చేయండి. **"హథో విశ్వా అపద్విషః"**

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. సోమము గమనశీలి. మనసును నియంత్రించునది. మదకరి. మదస్రావి. అది కలశము పై నున్న పవిత్ర స్థానమును చేరి మద్యమై, మధుర రసమై అన్ని దిశల నుండి వెడలుచున్నది. **"పవన్తే మద్యం మదమ్"**

2. పవిత్రము చేయబడిన, దీప్యమాన, బృహత్ సత్యమగు సోమరాజము తరంగములుగ కలశమున చేరుచున్నది. బృహత్ ఋత సోమము మిత్రావరుణుల సేవకు గాను విశేషముగా విచ్చేయుచున్నది.

3. నరులచే నియంత్రించబడినదియు, అభిలషణీయము, మహాద్రష్టయు, దీప్యమానము, అంతరిక్షమున ఉత్పన్నమైన సోమము ఇంద్రుని కొరకు అభిషుతమైనది.

రెండవ తృచ : ఋషి - పరాశరుడు.

1. యజమాని - **తిస్రోవాచః** - త్రివచనములను ఉచ్చరించును. యజ్ఞధారి సోమమును మంగళ వచనములతో స్తుతించును. ఆవులు ఆబోతు వైపు పోవునట్లు అంబారావములు చేయుచు పాలిచ్చుటకు సోమము వద్దకు వచ్చును. కోరికలు గల స్తోతలు స్తుతించుటకు చేరుదురు. **"సోమం యన్తి మతయో వావశానాః"**

(**త్రిస్రోవాచః ఋగ్యజుః సామాత్మికాః స్తుతిః** అని సాయణ వ్యాఖ్య.)

2. పాడియవులు సోమమును కోరుచుండును. విప్రులు సోమమును స్తుతించుచుందురు. అభిషుత సోమము శుద్ధిచేయబడి పాత్రయందు చేరును. మేము ఉచ్చరించు త్రిష్టుప్ మంత్రములు సోమమును చేరును - **"సోమే ఆర్కాస్త్రిష్టుభః సం నవన్తే"**

3. సోమమా! పరిషచ్యమానవై మాకు శుభములు కలిగించరమ్ము. ఎంతో మత్తునిచ్చు దానవై ఇంద్రుని హృదయమున చేరుము. వాక్కును వర్ధిల్ల చేయుము. జ్ఞానము కలిగించుము.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - పురుహన్మ.

1. ఇంద్రదేవా! నూరు ద్యులోకములు నీకు సరిరావు. వంద భూములు సహితము నీయంత కాజాలవు. వేయి సూర్యులు సహితము నీ ప్రకాశమంత కాలేరు. వేయేల సృష్టిలో ఏదియు నీకు సరి కాజాలదు. ద్యావాపృథ్వులు కూడ నిన్ను అందుకొన జాలవు.

2. వరదఇంద్రా! నీవు కోరిన ఫలములు ఇచ్చు వాడవు. నీవు మహా బలవంతుడవు కదా! మాకు బలములు కలిగించుము. మహాబలి, ధనవంత, వజ్రధారి ఇంద్రా! మా గోష్ఠములను గోవులతో నింపుము. వివిధ, విచిత్ర ఆయుధములతో మమ్ము రక్షింపుము.

రెండవ తృచ : ఋషి - మేధాతిథి.

1. వృత్రహంతా! మేము అభిషవ జలముల వలె వినమ్రులై నిన్ను సేవింతుము. సోమము క్షరించును. స్తోతలు కుశాసనములపై ఆసీనులగుదురు. నిన్ను భక్తితో ఉపాసింతురు.

2. వ్యాపక ఇంద్రా! అభిషుత సోమము వెడలినది. స్తోతలు బిగ్గరగా నిన్ను స్తుతించుచున్నారు. నీవు సోమతృష్ణ గలవాడవై, చక్కని నడకల సవ్వడితో ఎప్పుడు ఇచటికి విచ్చేతువు?

3. బెదిరించు ఇంద్రా! ప్రావీణ్యము గల స్తోతలకు వేలకొలది అన్నములు, బలములు, ధనములు ప్రసాదించుచున్నావు.

ధనవంత, విశేష ద్రష్ట ఇంద్రా! బంగరు రంగు గోవుల సహితముగా - మాకు త్వరగా ధనము నిమ్మని ప్రార్థించుచున్నాము.

మూడవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. యుద్ధమందు దబ్బునదూరి తన తెలివిని ఉపయోగించు వాడు అన్నమును సాధించుచున్నాడు.

యజమానులారా! మీ కొరకు నేను స్తుతించుచున్నాను. వడ్రంగి కర్రను వశపరచుకున్నట్లు నేను ఇంద్రుని అభిముఖుని చేయుచున్నాను.

2. ధనదాత అనుచిత స్తుతులచే స్తుతించబడడు. ధనదాతను స్తుతించని వానికి ధనము లభించదు.

ధనిక ఇంద్రా! అభిషవము నాడు నేను నిన్ను స్తుతించుచున్నాను. దానయోగ్య ధనమును నాకు ప్రసాదించుము. స్తుతించు వారికే కదా నీవు ధనము నొసంగుచున్నావు!

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - త్రితుడు లేక ఆప్త్యుడు.

1. **త్రిసోవాచః** - మూడు వాక్కులు ఉచ్చరించ బడుచున్నవి. పాడియావులు అంబారావములు చేయుచున్నవి. హరిత వర్ణసోమము నినదించుచున్నది. ద్రోణకలశమున చేరుచున్నది.

2. మంత్రములు ఋతమునకు తల్లులు. అవి దివియందు సోమమును శిశువును వలె మార్జించుచున్నవి. ప్రశంసించుచున్నవి.

3. సోమమా! చతుస్సముద్రముల వేల కొలది ధనమును మాకు తెచ్చి ఇమ్ము. **"ఆపవస్వ సహస్రిణః"**

రెండవ తృచ : ఋషి - యయాతి.

1. మధుమత్తమములు, మాదకములగు సోమములు పవిత్రములై ఇంద్రుని కొరకు క్షరించుచున్నవి. సోమములారా! మీ మత్తులు దేవతలను చేరును గాత. **"దేవన్ గచ్ఛన్తు వోమదాః"**

2. **"ఇందురింద్రాయపవత"** సోమమా! ఇంద్రుని కొరకు క్షరించుము అని స్తోతలు అనుచున్నారు.

వాచస్పతి - బలవంతము, జగత్పతియగు సోమము స్తుతులు, ఆరాధనలు కోరును.

3. సోమము రసరూపము. స్తుతి ప్రేరకము. ధనపతి. ఇంద్రునకు మిత్రుడు. సోమము దినదినము మిత్రుడగు ఇంద్రుని కొరకు సహస్ర ధారలుగా ప్రవహించును. **"సహస్రధారః పవతే"**.

మూడవ తృచ : ఋషి - పవిత్రుడు.

1. **"బ్రహ్మణస్పతే"** మంత్రములకు ప్రభువా! సోమమా! నీ పావక గుణము సర్వత్ర వ్యాపించి ఉన్నది. ప్రభూ! నీవు దేహము నందలి సకల అవయవములకు వ్యాపింతువు. విశ్వవ్యాప్తమగు నీవు తనువునకు తాపము కలిగించక, పరిపక్వము కాకున్న వ్యాపింపజాలవు. పరిపక్వమైనంత యజ్ఞమును వహించుచు దశా పవిత్రమున వ్యాపించుచున్నావు.

2. తాపక సోమపు పావక గుణము ద్యులోకము పైన వ్యాపించి ఉన్నది. ఈ సోమపు కిరణకాంతులు స్థిరములై ఉన్నవి. ఈ సోమపు వడిగల రసము అభిషవకారుని రక్షించును. సోమములు తమ తేజస్సున ద్యులోకమును అధిరోహించుచున్నవి. **"దివః పృష్ఠ మధిరోహంతి తేజసా"**

3. ఉషస్సు గల సూర్యుడు ప్రధానముగా ప్రకాశింప చేయుచున్నాడు. అతడు వర్షము కలిగించుచున్నాడు. సకల భువనములకు అతడే జలములను ఇచ్చుచున్నాడు. అతడు సకల లోకములకు అన్నము అందించుచున్నాడు.

సృష్టించగల దేవతలు సోమ శక్తితోనే జగములను సృష్టించుచున్నారు.

మానవ ద్రష్టలగు పిత్రుదేవతలు కాంతిని గర్భమున దాల్చుచున్నారు.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - సౌభరి.

1. అగ్ని పరమదాత. యజ్ఞవంతుడు. మహా తేజోవంతుడు. కూర్చుండి స్తుతించు స్తోతలారా! అట్టి అగ్నిని కీర్తించండి. **ప్రగాయత.**

2. ధనవంతుడు, అన్నవంతుడు, ప్రజ్వలితుడు, ఆహుతుడు అగు అగ్ని యజమానులకు పుత్రులను, యశస్సును కలిగించుచున్నాడు. ఈ అగ్ని మనవాడు కావలెను. అనుగ్రహించవలెను. అన్నములు అందుకొని మాటిమాటికి మా వద్దకు రావలెను. "**వాజేభిరాగమత్**"

రెండవ తృచ : ఋషి - గోయుక్తుడు.

1. వజ్రధారి ఇంద్రా! నీవు వరదుడవు. యుద్ధములందు శత్రు తిరస్కర్తవు. లోకకర్తవు. హర్యశ్వవంతుడవు. సోమపానము చేసిన నిన్ను ప్రశంసించుచున్నాము.

2. ఇంద్రదేవా! నీవు నీ శక్తితో ఆయుష్మంతుడగు మనువు కొరకు సూర్యాది జ్యోతులను ప్రకాశింపచేసినావు. సోమపు మత్తున ప్రసన్నుడవు అయినావు. ఈ మహా యజ్ఞమున విరాజిల్లినావు.

3. నీ బలము ప్రసిద్ధము. నిన్ను పూర్వము స్తుతించిన వారు నేడు కూడ నిన్ను స్తుతించుచున్నారు. ఇంద్రా! నీవు నిత్యము మేఘములను నీ అదీనమున ఉంచుకొనుము.

మూడవ తృచ : ఋషి - తిరశ్చి.

1. నేను తిరశ్చిని. హవిని అర్పించువాడను. ఆరాధించు వాడను. ఇంద్రా! నా ఆహ్వానము వినుము - '**శ్రుధీహావం**' విన్నవాడవై నాకు పుత్రులను, గోవులను, ధనమును ప్రసాదించుము. నీవు మహా మహుడవు కదా! "**మహాం అసి**"

2. "ఇంద్రా! నవీనము, ఆనందదాయక మగు స్తుతిని నీ కొరకు రచించిన వానికి సనాతనము, సత్యవర్ధనము, అతీంద్రియ దృష్టిగల జ్ఞానమును ప్రసాదించుము.

3. ఆ ఇంద్రుని మేము స్తుతించుచున్నాము. మా స్తుతులు, ఉక్థ్యలు ఇంద్రుని వర్ధిల్ల చేయుచున్నవి. ఇంద్రుని యొక్క బహు పరాక్రమములను ప్రశంసించుచున్నాము. ఆరాధించుచున్నాము.

దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన
సామవేద సంహిత ఉత్తరార్చిక యందలి
నాలుగవఅధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

అయిదవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - గణములు

ప్ర త ఆశ్వినీః పవమాన ధేనవో దివ్యా అస్పృగ్రన్ పయసా ధరీమణి |
ప్రాంతరిక్షాత్స్థావిరీస్తే అస్పృక్షత యేత్వా మృజన్త్యృషిపాణ వేధసః ||

1. సోమమా! నీవు వ్యాప్తావు. తృప్తి కలిగించు దానవు. అంతరిక్షము నుండి ధారలుగా పడుదానవు. అట్టి నీ ధారలు పాలతో కలుపబడి ద్రోణకలశమున చేరుచున్నవి. నిన్ను ఋత్విజులు, ఋషులు శుద్ధిచేయుచున్నారు. వారు నిన్ను ధారలుగా అంతరిక్షము నుండి పాత్రలోనికి చేర్చుచున్నారు.

2. సోమము అభిషుతము. ధృవము. విరాజమానము. అట్టి సోమపు కిరణములు ఇటునటు పరుగులిడుచున్నవి. దశాపవిత్రము నందు శోధితమైన సోమము పాత్రలందు ప్రవేశించుచున్నది.

3. సోమమా! నీవు విశ్వద్రష్టవు. ప్రభువవు. విరాజిల్లుదానవు. నీయొక్క మహాకిరణములు సకల ధామములను సకల దిశల నుండి ప్రకాశింప చేయుచున్నవి. వ్యాపకా స్వభావము గల నీవు రసము తీసినంత పరిశుద్ధమగుదువు. నీవు సకల భువనములకు స్వామివై విరాజిల్లుచున్నావు. **"పతిర్విశ్వస్య భువనస్య రాజసి."**

రెండవ తృచ : ఋషి - అమహీయుడు.

1. పవమాన సోమమా! దివియందలి విచిత్ర అశ్వని వంటి బృహత్ వైశ్వానర జ్యోతిని కల్పించినావు.

2. పవమాన సోమమా! నీ యొక్క రసము మాదకము. రక్షోవర్జితము. అది ఉన్నిగల దశా పవిత్రమును దాటును. పాత్రలందు ప్రవేశించును.

3. పవమాన సోమమా! నీ యొక్క రసము దక్షము. ద్యుమంతము. ప్రకాశించునది. అది విశ్వవ్యాప్తములగు సకల జ్యోతులుగా దర్శనమిచ్చును.

మూడవ తృచ : ఋషి - మేధాతిథి.

1. సోమము జలము వంటిది. శీఘ్రగామి. దీప్త. స్రవంతి. అది కృష్ణచర్మమును నష్టపరచును. పాత్రలందు చేరును. అట్టి సోమమును మేము స్తుతించుచున్నాము.

2. సోమము శుభములకు అందునది. వ్రతహీనులకు అందనిది. రాక్షసులను బంధించునది. అట్టి సోమమును స్తుతించుచున్నాము.

3. అభిషుతమగుచున్న సోమపు ధ్వని వర్షధ్వని వలె వినిపించుచున్నది. బలశాలి సోమపు మెరుపులు ఆకసమున మెరయుచున్నవి.

4. సోమ బిందువులారా! మీరు మరింత అన్నమును, గోవులను, అశ్వములను, పుత్రులను ప్రసాదించండి.

5. సూర్యుడు తనకిరణములతో పగళ్ళను నింపినట్లు విశ్వద్రష్ట సోమమా! నీవు నీ యొక్క రసముతో ద్యావాపృథ్వులను నింపుము.

6. సోమమా! మాకు సుఖములు కలిగించు దారాలతో భూలోకమున సకల దిశల నుండి జలము వలె వ్యాపింపుము.

రెండవ ఖండము

తొలి తృచ : ఋషి - బృహస్పతి

1. బృహస్మతి సోమమా! నీవు దేవతలకు ప్రియతమవు. 'దేవతలెచ్చట?' అని అడుగుచు ధారలుగా త్వరత్వరగా రా రమ్ము.

2. సంస్కార రహిత స్థానములను సంస్కరించుచు జనులకు అన్నము కలిగించుటకు ఆకాశము నుండి వర్షము కలిగించుము.

3. ద్యులోకము మీద మందగామి యగుచు దశాపవిత్రము నుండి సాగి జల తరంగము లందు సోమము క్షరితమగును.

4. సోమము అభిషుత మగును. దీప్తమగును. సర్వద్రష్టయగును. దేవతలను ప్రకాశింప చేయును. బలోపేతమయి త్వరత్వరగా దశా పవిత్రమును చేరును.

5. అభిషుత సోమము తన రసమును దూరపు, దగ్గరి దేవతలను సేవించును. ఇంద్రునాకు మధుమంతమై అందును.

6. ఇంద్రుని పానము కొరకు హరితవర్ణ సోమము రాళ్ళతో నలిపి తీయబడును. స్తోత్తలు ఒకచో కూడి సోమమును స్తుతింతురు.

రెండవ తృచ : ఋషి - జమదగ్ని.

1. పనులు చేయుటకు పరస్పరము కలిసి యుండు అంగుళులు సోమమును అభిషవించుచు బలశాలి, స్వామి, పూజనీయ సోమమును పాత్రలకు పంపును.

2. సోమమా! నీవు పరిపూర్ణ తేజస్కవు. దీప్యమానవు. పరిశుద్ధవు. దేవతల కొరకు సంస్కరింపబడుదానవు. మాకు సకల దానములను ప్రసాదించుము - "విశ్వావసూన్యా విశ"

3. పవమానమా! దేవతలను సేవించుటకు స్తుతుల వర్షము కలిగింపుము. మాకు అన్నము కలిగించుటకు వర్షము కలిగింపుము.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - శతంభరుడు

1. అగ్ని జనరక్షకుడు. అప్రమత్తుడు. మంచి బలశాలి. అతడు లోకములకు కొత్త కొత్త శుభములు కలిగించుటకు వెలువడినాడు.

ఘృతప్రతీకుడు. మహానుడు, ద్యులోకము నంటు తేజోవంతుడగు శుద్ధ అగ్ని ఋత్విజుల కొరకు దీప్తివంతుడై ప్రకాశించుచున్నాడు.

2. అగ్ని గుహలందుండెను చెట్టు చెట్టున ఉండెను. అంగిర ఋషి అట్టి అగ్నిని సాధించినాడు. బలముగా మథించిన

అగ్ని ఆవిర్భవించునట్లు చేసినాడు.

అంగిరులచే ప్రకటించ బడిన అగ్నీ! అందుకే నిన్ను బలపుత్రుడు అనుచున్నారు - 'త్వమాహుః సహసస్పుత్రవజ్గరః'

3. అగ్ని ఋత్విజుడు. యజ్ఞకేతనుడు. పురోహితుడు. దేవతలతో సమానమగు రథము కలవాడు. అతడు తొలుత మూడు స్థానములందు ప్రజ్వలితుడగును. తదుపరి సుక్రతువు, హోతయగు అగ్నిని కుశాసనమున యజ్ఞార్థము ప్రతిష్టించెదరు.

(మూడు స్థానములు మూడు లోకములు.)

రెండవ తృచ : ఋషి - గృత్సమదుడు

1. ఋతవర్ధనులగు మిత్రావరుణులారా! మీ కొరకు సోమము అభిషుతమైనది. ఈ యజ్ఞమునాకు మిమ్ము ఆహ్వానించుచున్నాము. ఆలకించండి. "శృతం హవమ్"

2. మిత్రావరుణులారా! మీరు రాజులు. ద్రోహము ఎరుగని వారు. స్థిరులు. శ్రేష్ఠమగు వేయిస్తంభముల సదనమునకు చేరండి.

3. ఆదేశ మాత్రమున పాలించువారు, ఘ్రుతమె అన్నముగా గలవారు. అదితి పుత్రులు, ధనస్వాములగు మిత్రావరుణులు కపటమెరుగని యజమాని సమర్పించు హవిస్సులు అందుకొనుటకు విచ్చేయుదురు.

మూడవ తృచ : ఋషి - రహోగణ గోతముడు.

1. తనకు ఎదురెరుగని ఇంద్రుడు దధీచి అస్తికలతో 810 మంది అసురులను హతమార్చినాడు.

(దధీచి అథర్వణ పుత్రుడు. అతడు భూమి మీద అసురులు లేకుండ చేసినాడు. అతడు స్వర్గమునకు వెళ్ళినంత అసురులు భూమండలమును ఆక్రమించుకున్నారు. ఇంద్రుడు వారితో పోరలేక పోయినాడు. అప్పుడు ఇంద్రుడు దధీచి అవశేషము కొరకు వెదకినాడు. దధీచి యొక్క గుర్రపు తల కురుక్షేత్రము దగ్గరి శరణ్యావతి వద్ద ఉన్నదని మునులు చెప్పినారు. ఇంద్రుడు ఆ శిరస్సు అస్తికలతో అసురులను హతమార్చినాడను వృత్తాంతము శాత్యాయమున చెప్పబడినది.

అశ్వినులు దధీచిని మధువిద్య ఉపదేశించుమని ఆశ్రయించినారు. దధీచి అందుకు అంగీకరించినాడు. అశ్వినులకు మధువిద్య తెలియుట ఇంద్రునకు ఇష్టము లేదు. అతడు దధీచిని తల నరుకుదునని బెదిరించినాడు.

అశ్వినులు అది గ్రహించి దధీచి తలతీసి అతనికి గుర్రపు తల తగిలించినారు. ఆ గుర్రపు తలతోనే దధీచి అశ్వినులకు బ్రహ్మవిద్య ఉపదేశించినాడు. ఇంద్రుడు దధీచి గుర్రపు తలను నరికినాడు. అశ్వినులు దధీచి అసలు తలను తగిలించినారు. ఇది దధీచి గుర్రపు తలను గురించిన భాగవత కథ.

వృత్రుని వధించుటకు దధీచి శరీరమును యాచించి, దానితో ఆయుధము చేసిన తాను అట్టి ఆయుధమున ప్రవేశింతుననియు దానితో వృత్రుడు చచ్చుననియు శ్రీమన్నారాయణుడు దేవతలకు ఉపదేశించినాడు. దేవతలు దధీచి దగ్గరికి వెళ్ళి అతని దేహమును యాచించినారు.

"దేవతలారా! ఈ శరీరము నశించునది. ప్రాణికోటి యెడల దయచూసి ధర్మము, కీర్తి ఆర్జించని వాడు రాతిగుండె వాడనుటలో సందియము లేదు. ప్రాణుల దుఃఖమును చూచి దుఃఖించుట సుఖమును చూచి సుఖించుటయే అక్షయ ధర్మమగును. ప్రపంచమున ధనము, పుత్రులు, జ్ఞాతులు, శరీరము ఏవియు పనికి వచ్చునవి కావు. ఈ శరీరము చివరకు కుక్కలపాలో, నక్కలపాలో యగును. అట్టి శరీరము పరోపకారము కొరకు ఉపయోగపడిన అంతకు మించి కావలసినదేమి?" అని నిశ్చితాత్ముండై దధీచి తత్త్వావ లోకనంబుచేత నిరసిత బంధనుండై బుద్ధీంద్రియ మానసంబులతో గూడిన క్షేత్రజ్ఞుని పరబ్రహ్మ స్వరూపంబైన భగవంతునందు నేకీ భూతంబు చేసి యోగజ్ఞానంబున శరీరంబు విడిచి, దధీచి ఎన్నడు ఎవడును చేయనట్టి దానము చేసినాడని భాగవత కథ. ఈ వచనము నేను రచించిన శ్రీమద్భాగవతమునందలిది.)

2. పర్వతములందు పడిన దధీచి యొక్క అశ్వశిరమును ఇంద్రుడు కనుగొనదలచినాడు. శర్యణావతి సరస్సునందు దానిని కనుగొన్నాడు. (దానితో అసురులను, వృత్రులను హతమార్చినాడు.)

3. గమనము గల చంద్రమండలమున రాత్రిళ్ళు ఆదిత్యుని కాంతియే ప్రకాశించుచున్నది అను విషయము ఇంద్రునకు తెలియును.

నాలుగవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. ఇంద్రాగ్నులారా! ఈ స్తుతి అతి ప్రధానము. దీనిని స్తోతలు మీ కొరకు మేఘము నుండి వర్షము వలె సృష్టించినారు.

2. ఇంద్రాగ్నులారా! స్తోతల స్తోత్రములను ఆలకించండి. వానిని స్వీకరించండి. ప్రభువులగు మీరు కర్మ ఫలమును ప్రసాదించండి.

3. కర్మ ప్రేరకులగు ఇంద్రాగ్నులారా! మమ్ము పాపకార్యములకు నియమించకండి. శత్రుహింసలకు నియమించకండి. నిందలకు నియమించకండి.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - దృఢచ్యుతుడు.

1. సోమమా! నీవు పాపములు హరించు దానవు. బలసాధనమవు. మాదకమవు. దేవతలు, మరుత్తులు వాయువులు పానము చేయుటకు పాత్రలందు నిండుము.

2. వృష, కవి, స్థిర, సర్వప్రియ, హింసించరాని సోమము దేవతలందు చేరి శోభిల్లుచున్నది.

3. పవమానమా! మా కార్యమునకు హితము కూర్చుము. శబ్దించుము. ద్రోణ కలశమున ప్రవేశించుము. వాయుదేవత కొరకు పాత్రయందు రాలుము.

రెండవ తృచ : ఋషి - మైత్రావరుణ వసిష్ఠుడు.

1. బిందువులుగా రాలు సోమమా! నేను నిత్యము నీ సేవ చేయుచున్నాను. చాలమంది రాక్షసులు నన్ను బాధించుచున్నారు. వారిని నష్టపరచుము.

2. బభ్రువర్ణ సోమమా! నేను రాత్రింబవళ్ళు నిన్ను సేవించుచున్నాను. నీవు ప్రజ్వలితుడవై పరమస్థానమున ఉన్న సూర్యుని వంటిదానవు. పక్షివలె దిగిరమ్ము. మమ్ము చేరుము.

మూడవ తృచ : ఋషి - బృహన్మతి.

1. సోమము పావనమైనది. విశిష్ట ద్రష్ట. సకల శత్రువులను అతిక్రమించునది. అట్టి సోమమును విప్రులు దీపింప చేయుదురు.

2. అరుణ సోమము ద్రోణ కలశమునకు చేరును. తదుపరి ధృవస్థానమున ఉండునట్టి వరదుడగు ఇంద్రుడు ఆ సోమమును సేవించును.

3. బిందువులుగా రాలు సోమమా! మాకు మరింత ధనము నిమ్ము. సకల దిశల నుండి వేలకొలది ధనమును తెచ్చి ఇమ్ము - **'ఆ పవస్వ సహస్రిణమ్'**

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - మైత్రావరుణ వసిష్ఠుడు.

1. పిబా సోమమిన్ద్ర ఇంద్రా! సోమపానము చేయుము. అభిషవము చేయువారి బాహువులు అభిషవ శిలలను - కళ్ళెము గుర్రమును లాగినట్లు - లాగుచున్నవి. హర్యశ్వ ఇంద్రా! ఆ సోమము నీకు ఆనందము కలిగించును గాక.

2. హర్యశ్వ ఇంద్రా! ఈ సోమము నీకు తగినది. రుచిరము. మాదకము. దానిని సేవించి నీవు రాక్షసులను వధింతువు. మహా ధనిక ఇంద్రా! ఆ సోమము నీకు ఆనందకరము అగును గాత.

3. మఘవా! వసిష్ఠుడు నిన్ను ఈ స్తుతులతో అర్చించుచున్నాడు. వానిని స్వీకరింపుము. యజ్ఞశాలయందు హవిస్సులను ఆరగించుము.

రెండవ తృచ : ఋషి - త్రిశోకుడు.

1. ఇంద్రుడు సమస్త సంగ్రామములందు విజయుడు. నరులు ఒకచోట కూడి అతనిని స్తుతింతురు. అతని వడిని పెంచుదురు. అతనికి ప్రకాశము కలిగించుటకు సూర్యుని నుతింతురు.

ఇంద్రుడు విఘ్నకర్తల వినాశకుడు. శ్రేష్ఠుడు. స్థిరుడు. శత్రుహంత. ఉగ్రుడు. అనంత బలశాలి. అతనిని ధనము కొరకు స్తుతించుచున్నారు.

2. విప్రులు ఉచ్చైస్స్వరమున ఇంద్రుని స్తుతించుచున్నారు. మేషరూప, వ్యాపక ఇంద్రునకు నమస్కరించుచున్నారు.

స్తోతలారా! మీరు కీర్తిమంతులు. ద్రోహమెరుగని వారు. ఇంద్రుని స్తుతించుటకు తొందర పడండి. మీ స్తుతులను ఇంద్రుని చెవికి ఎక్కించండి.

3. స్తోతలు సోమపాయి ఇంద్రుని సుస్వరమున నుతింతురు. యజమానిని వర్ధిల్లచేయు ఇంద్రుడు ధృతవ్రతుడై, బలమైన రక్షణలతో వారిని కాపాడును.

మూడవ తృచ : ఋషి - పురుహన్మ.

1. ఇంద్రుడు నరులకు ప్రభువు. రథము మీద పయనించు వాడు. నిరాటంకుడు. సకల సేనలను తరింపచేయువాడు. వృత్రహంత. మహామహుడు. అట్టి వానిని ప్రశంసించుచున్నాను.

2. ఇంద్రుడు మహా రక్షకుడు. అతడు విరోధులకు ఉగ్రుడు. అనుకూలురకు అనుగ్రహుడు. దర్శనీయుడు. మహానుడు. వజ్రి. సూర్యసముడు. పురుహన్మ! అట్టి ఇంద్రుని రక్షించుమని స్తుతించుము.

(ఋషి తనను సంబోధించు కొనుచున్నాడు.)

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - అసితుడు.

1. సోమము కవి. కర్మసాధకము. అధిషవణ ఫలకములందు స్థాపించబడినది. ద్యులోకమునకు అత్యంత ప్రియము. అది శిలలచే శుద్ధమైనది. అధ్వర్యులకు సిద్ధమైనది.

2. అదిగో వెలువడినది! విశుద్ధ, మహిమాన్విత సోమము. అది ఒకరి బిడ్డ. ఋత వర్ధన. ఆ సోమము - జగత్కారకులు, దానికి పితరులు - ద్యావాపృథ్వులను ప్రకాశింప చేసినది!

3. సోమమా! స్తోతలు నీకు నివాస భూతులు. ద్రోహరహితులు. వారు నిన్ను జనులకు సరిపోవునంత లభించుమని ప్రార్ధించుచున్నారు.

రెండవ తృచ : ఋషి - శక్తి

1. దేవతా సంబంధ సోమమా! దీప్తమానమగు నీవే ఘోషించుము. దేవతల మీద ధ్యాస ముంచుము. అమృతత్వము పొందుము.

2. సత్పురుషుడగు దధ్యంగ ఋషి సోమముచే యజ్ఞద్వారములను తెరచినాడు. విప్రులు సోమముతోనే అపహృత గోవులను సాధించినారు. యజమానులు సోమము తోనే ఇంద్రాదులను ప్రసన్నులను చేసినారు. అమృతాన్నమును పొందినారు.

మూడవ తృచ : ఋషి - అగ్ని

1. పావన సోమమా! ధారలుగా - అనేక దారులుగా ఉన్నిగల దశా పవిత్రమును చేరుచున్నావు. నీ ముందు పవిత్రస్తుతి నినదించుచు సాగుచున్నది.

2. బలశాలి సోమము జలములందు క్రీడించుచు, దశా పవిత్రము నుండి వెడలగా అంగుళులు దానిని శుద్ధి చేయుచున్నవి. మూడు పాత్రలందు చేరు సోమమును స్తుతులు సకల దిశల నుండి ప్రశంసించుచున్నవి.

3. అన్నము కలిగించుటకు వర్షము నిచ్చు సోమము యుద్ధమునకు అశ్వము వలె - కలశమునాకు

పంపబడుచున్నది. తదుపరి సోమము ధ్వని చేయుచు పాత్రలందు చేరుచున్నది.

నాలుగవ తృచ : ఋషి - ప్రతర్దనుడు

1. సోమము బుద్ధిని పుట్టించినది. ద్యులోక, స్వర్గ జనయిత. పృథివీ జనయిత. అగ్ని జనయిత. సూర్య జనయిత. ఇంద్ర, విష్ణువుల జనయిత. అట్టి సోమము పాత్రలందు పడుచున్నది.

2. స్తోతలందు బ్రహ్మ, మేధావులందు కవి, విప్రులందు ఋషి, పశువులందు మహిషము, పక్షులందు శ్యేనము, హింసకులందు స్వధితి అయిన సోమము దశా పవిత్రము నుండి వెడలుచున్నది.

3. ప్రవహించు నదీ తరంగములు శబ్దములు కలిగించినట్లు సోమము మనసుకు శ్రావ్యమగు శబ్దములు చేయును. సోమము కోరికలు తీర్చును. అంతః కరణములను దర్శించును. గోవులను తెలియును. దుర్బలులకు అందకుండును. అట్టి సోమము ఎన్నో బలములను సంతరించు కొనుచున్నది.

ఏడవ ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రయాగుడు లేక అగ్ని.

1. అగ్ని బలవంతుల బంధువు. బలశాలి. జ్వాలారూపి. అత్యధికుడు. ఋత్విజులారా! అట్టి అగ్నిని చేరుకొనండి.

2. ఈ అగ్ని కర్రరూపమును దిద్దు వడ్రంగి వలె మమ్ము సరిదిద్దువాడు అగును గాక. ఈ అగ్ని మాకు జ్ఞానము, యశస్సు కలిగించును గాత.

3. అగ్ని దేవత అతడు మానవులకు సకల సంపదలు కలిగించును. అగ్ని అన్నసహితుడై మమ్ము చేరును గాత.

రెండవ తృచ : ఋషి - గోతముడు.

1. సోమము ప్రశస్తము. హర్షదాయకము. మాదకము. అభిషుతము. ఇనుమింద్ర సుతం పిబ ఇంద్రా! ఈ అభిషుత సోమ పానము చేయుము. యజ్ఞభూమి యందు దీప్తములగు సోమధారలు నిన్ను చేరుచున్నవి.

2. ఇంద్రా! నీవు హర్యశ్వములను రథమునాకు జోడింతువు. అందువలన నీకు సముడగు రథికుడు లేడు. బలములందు నీకు సములు లేరు. ఆశ్వవంతులందు కూడ నీకు సరి వచ్చువారు లేరు.

3. ఋత్విజులారా! త్వరపడండి. ఇంద్రుని అర్చించండి. ఇంద్రుని స్తుతులు ఉచ్చరించండి. అభిషుత సోమము

సమర్పించండి. అది ఇంద్రునకు ఆనందకరము అగును గాక. తదుపరి ప్రశంసనీయుడు, బలశాలి యగు ఇంద్రునకు నమస్కరించండి.

మూడవ తృచ : 'ఋషి - సందిగ్ధః'.

1. హర్యశ్వవంత, శూర ఇంద్రా! రా రమ్ము. ఈ హవిస్సును స్వీకరించుము. నీవు అందగాడవు. ఆనందించుము. నిన్ను కోరునది, సంస్కరించబడినది, చైతన్య వంతమగు సోమ మధువును సేవింపుము.

2. ఇంద్రా! ఇది అభిషుత సోమము. మధురము. స్వర్గ స్తుతి యుక్తము. మాధకము. అది నీవద్దకు చేరినది. స్వర్గ సమమగు నీ ఉదరమును ఆ సోమముతో నింపుము.

3. సాహసి ఇంద్రుడు సోమపానము చేసి మిత్రుని వలె శత్రువులను వధించినాడు. బలాసురుని పరిమార్చినాడు. భ్రుగువును సహించినాడు.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చికయందలి అయిదవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

ఆరవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - సికతా నివావరి పృశ్నయోజుడు.

గోవిత్పవస్వ వసువిద్ధిరణ్య విద్రేతోధా ఇందో భువనేష్వర్పితః |
త్వం సువీరో అసి సోమ విశ్వవిత్తం త్వా నర ఉపగిరేమ ఆసతే ||

1. సోమమా! నీవు గోవులను ఇచ్చుదానవు. దానములను ఇచ్చుదానవు. హిరణ్యమును ఇచ్చుదానవు. ఉత్పాదక శక్తిని ఇచ్చుదానవు. పాత్రలోనికి చేరుము.

సోమమా! నీవు సువీర్యవు. విశ్వవిదవు. నిన్ను ఋత్విజులు స్తుతించుచున్నారు. ఉపాసించుచున్నారు.

2. సోమమా! నీవు అభిషవించ బడిన దానవు. కోరికలు తీర్చుదానవు. నరులకు సాక్షీభూతవు. వారియందు అనేక రూపములుగ ప్రవేశించుదానవు. నీవు మా కొరకు క్షరించుము. మేము ధనవంతులము, హిరణ్య వంతులము అగుదుము గాక. లోకములందు జీవించుటకు సమర్ధులము అగుదుము గాత - **"వసుమద్ధిరణ్య వద్వియం స్యామ భువనేషు జీవసే."**

3. సోమమా! నీవు సంస్థమునకు స్వామివి. హరిత వర్ణవు. చక్కని నడకల హర్యశ్వము లను రథమునకు పూన్చుచున్నావు. సమస్త భువనములందు ప్రవేశించుచున్నావు. నీవు మధువతివి. దీప్తివతివి. జలవర్షము కలిగించుము. నరులు నీ కర్మమునకు పూనుకొందురు గాత.

రెండవ తృచ : ఋషి - కశ్యపుడు.

1. అభిషుత సోమమా! నీవు విశ్వవిదవు. నీ దారాలు సూర్య కిరణములు వలె ప్రకాశించుచున్నవి.

2. సోమమా! నీవు రస వాహినివి. నీవు చైతన్యము కలిగించుచున్నావు. విశ్వరూపవు అగుచున్నావు. అంతరిక్షము నుండి మమ్ము పావనులను చేయుచున్నావు. మాకు బహువిధ ధనములను ప్రసాదించుచున్నావు.

3. పవమానమా! నీవు సూర్యుని వలె ప్రకాశించుచున్నావు. దశాపవిత్రమున ధ్వని చేయుచున్నావు. శబ్దమునకు ప్రేరణ కలిగించుచున్నావు.

మూడవ తృచ : ఋషి - అసితుడు లేక దేవలుడు.

1. పవమాన దీప్తమాన సోమమా! నీవు మాకు లభించుచున్నావు. ఆవు పాలతో కలియుచున్నావు. జలములందు ప్రవేశించుచున్నావు.

2. సోమము గమనశీలము. అది ప్రవహించును. జలమువలె దశాపవిత్రమున చేరును. అభిషుత సోమము ఇంద్రునకు తృప్తి కలిగించుటకు సాగును.

3. పవమాన సోమమా! నీవు ఇంద్రునకు ఆనందము కలిగించుచున్నావు. దశా పవిత్రమున చేరుచున్నావు. ఋత్విజులు నిన్ను హవిర్ధానమునకు చేర్చుచున్నారు.

4. సోమమా! నీవు రాళ్లచే దంచబడుచున్నావు. దశాపవిత్రమునకు చేరుకొనుచున్నావు. తదుపరి ఇంద్రుని ఉదరమున ప్రవేశించుచున్నావు.

5. సోమమా! నీవు నరులకు ఆనందదాయినివి. ప్రజలచే గ్రహించబడుదానవు. స్తుతి యోగ్యవు. మాకు ప్రత్యక్షమగుము.

6. సోమమా! నీవు మంత్రములచే స్తుతింపదగిన దానవు. శుచివంతవు. పావకమవు శత్రు నాశకమవు. మాకు ప్రత్యక్షమగుము.

7. అభిషుత సోమము మధురము. శుచి మంతము. పావకము. దేవతలకు తృప్తినిచ్చునది. పాప కర్మలను నాశము చేయునది. అట్లని చెప్పబడుచున్నది.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి -అసితుడు - దేవలుడు.

1. సోమము కవి. దేవతల పానయోగ్య ఉన్ని ఉన్న దశాపవిత్రము నుండి సాగును. శత్రువును సహించును. యుద్ధములు గెలుచును.

2. పవమాన సోమము స్తోతలను సహస్ర గోమంతులను, అన్నవంతులను చేయుచున్నది. ఇది నిశ్చయము.

3. సోమమా! నీవు మాచే స్తుతించబడుచున్నావు. దశాపవిత్రమున సంస్కరించబడు చున్నావు. అట్టి నీవు మనస్ఫూర్తిగా మాకు సకల ధనములను, అన్నములను ఇచ్చెదవు గాత.

4. సోమమా! మేము హవి అర్పించువారలము. మాకు బృహద్యశస్సును, స్థిరమగు ధనమును కలిగింపుము. మమ్ము అన్నమున నిలుపుము.

5. సోమమా! నీవు కర్మ నిర్వాహకమవు. గొప్పదానవు. సుప్రతవు. సంస్కృతవు. మహా రాజు వలె మా స్తుతులను ఆమోదింపుము.

6. సోమము యజ్ఞాదుల నిర్వాహకము. అది జలములందు ప్రవేశించును. హస్తములచే సంస్కరించబడును. పాత్రలందు చేరును.

7. సోమమా! నీవు ఆటలాడు దానవు. యజ్ఞతుల్యవు. దాతవు. స్తోతలమగు మమ్ము వీరులను చేయుము. దశా పవిత్రమున చేరుము.

రెండవ తృచ : ఋషి - అవత్సారుడు.

1. సోమమా! మమ్ము అధికారికమగునట్టియు మాటి మాటికి కలుగునట్టియు నగు రసమున ప్రవహింపచేయుము. సమస్త సౌభాగ్యములు కలిగించుము.

2. సోమమా! నీవు అన్నరూపవు. తృప్తి కలిగించు దానవు. స్తోత్రములు నీ కొరకే ఎట్లు పలుకుచున్నవో అట్లే నీవు మా యజ్ఞమునందు ఆసీనవు అగుము.

3. సోమమా! ఇంకను మాకు గోవులనిమ్ము. అశ్వముల నిమ్ము. గబగబ సాగు దినము లందు అన్నమును ధారగా వర్షింపుము.

4. సోమమా! నీవు సహస్రజితవు. శత్రుంజయవు. అపరాజితవు. శత్రువును ధిక్కరించి వధించు దానవు. ధారగా వర్షించుము.

మూడవ తృచ : ఋషి - జమదగ్ని.

1. సోమమా! నీవు మధురసమును బలికించు దానవు. నీ మధుధారలు మమ్ము రక్షించును గాత. ఆ ధారలు దశాపవిత్రమున చేరును గావుత.

2. సోమమా! ఉన్నిని లక్ష్యపెట్టకుము. యజ్ఞమూలమగు దశా పవిత్రమున చేరుము. ఇంద్రుని పానమునకు అందుము.

3. సోమమా! నీవు స్వాధిష్ఠవు. ధనధాత్రివి. అంగిరుల కొరకు దీప్తములగు పాలవంటి రసధారలను వర్షించుము.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - అరుణుడు.

1. అగ్నిదేవా! నీవు ఓషధులను అరణ్యములను భస్మము చేయదదలతువు. అప్పుడు అవన్నియు అన్నము వలె నీ నోట పడును. అట్టి తరి నీ కాంతి వర్షకాల మేఘపు మెరుపు వలెను ఉష! కాలమున వ్యాపించు ప్రకాశము వలెను భాసిల్లును.

2. అగ్నిదేవా! నీవు వాయువుతో కూడినపుడు వేగవంతుడవగుదువు. వృక్షలతాదులందు వ్యాపింతువు. అప్పటి నీ ఉరుకులు జరారహితములు, భస్మీకృతములు అగును. అప్పటి నీ తేజస్సు రథికుల అద్భుత గమనము వలె ఉండును.

3. అగ్ని బుద్ధిని కలిగించువాడు. యజ్ఞపు పరమ సాధనము. దేవతల ఆహ్వాత. శత్రు తిరస్కర్త మనసుకు ప్రేరణ కలిగించువాడు. అట్టి అగ్నిని ఋత్విజులు ఇట్లు ప్రార్థించుచున్నారు:-

మేము గుమిగూడి నిన్ను స్వల్ప హవిని భక్షించుమనియు మరింత హవిని భక్షించుమనియు ప్రార్థించుచున్నాము. **వృణతే నాన్యం త్వత్** - నిన్ను కాక మరొకరిని ప్రార్థించము.

రెండవ తృచ : ఋషి - ఉరుచక్రి.

1. మిత్రావరుణులారా! మీరిద్దరు పటిష్ట రక్షణలు కలిగించు వారమట నిశ్చయము. మేము మీ అనుగ్రహమును ఆశించుచున్నాము.

2. మేము స్తోతలము. మీరు ద్రోహము ఎరుగని వారని ప్రసిద్ధులు. మేము మిమ్ము స్తుతించుచున్నాము. మేము మీ వారలము అగుదుము గాక. అన్నము, గృహము కలవారలము అగుదుము గాక.

3. మిత్రావరుణులారా! మమ్ము గొప్ప గొప్ప ఆయుధములతో రక్షించండి. మాకు ఆయుధము లిచ్చి మమ్ము కాపాడండి. మేము పుత్రసహితులము, శత్రు రహితులము అగుదుము గాత.

మూడవ తృచ : ఋషి - కురుహూతి.

1. ఇంద్రా! త్రావుము పాత్రలంధాలి అభిషుత సోమమును. పెంచుకొనుము బలము లెమ్ము. గడ్డము కదలించుము.

2. ఇంద్రా! నీవు శత్రువు మీదకు దండెత్తు వాడవు. నీవు శత్రు నాశనము చేయునపుడు ద్యావాపృథ్వులు నీకు ప్రసన్నము అగును గాత.

3. ఇంద్రా! ఎనిమిది దిక్కులు, సూర్యసహితముగ తొమ్మిది స్థానములకు వ్యాపించిన స్తుతులచే నిన్ను కొలుచుచున్నాను. అట్లయినను నిన్ను కొలువతరమా?

నాలుగవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. ఇంద్రాగ్నులారా! మేము స్తోతలము. మీరు సుఖములను ఇచ్చువారలు. మేము మిమ్ము స్తుతించుచున్నాము. సేవించండి అభిషుత సోమమును.

2. ఇంద్రాగ్నులారా! మీ అశ్వములు అనేకులకు ప్రియములు. హవిర్దాతల కొరకు పుట్టినవి. వాని మీద మా వద్దకు విచ్చేయండి.

3. ప్రేరణ కలిగించు ఇంద్రాగ్నులారా! రండి. ఈ అభిషుత సోమము సేవించుటకు ఆ అశ్వముల మీద విచ్చేయండి.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - భృగువు.

1. సోమమా! నీవు దీప్తిమంతవు. అరణ్యములు నీకు తావరములు. అటనుండి వెడలుము. శబ్దించుచు ద్రోణ కలశమున చేరుము.

2. జలములందు చేరు సోమమా! ఇంద్ర, వాయు, వరుణ, మరుత్, విష్ణు దేవతల కొరకు ద్రోణ కలశమున చేరుము.

3. సోమమా! మాకు పుత్రుల నిమ్ము. అన్నములు ప్రసాదించుము. సకల దిశల నుండి వేల కొలది ధనములను కలిగించుము.

రెండవ తృచ : ఋషి - గోతముడు.

1. స్తోతలు సోమమును అభిషవింతురు. అది అశ్వవేగమున పాత్రలందు చేరును. తదుపరి హరిత వర్ణ మాదక ధారలు ద్రోణ కలశమున చేరును.

2. గోమంతమగు సోమము ఘ్రుతాదులతో కలసి ద్రోణ కలశమున చుక్కలు చుక్కలుగ రాలును. పాలతో కలసి సముద్రమునకు జలము వలె ద్రోణ కలశమున చేరును. మాదక సోమము మత్తు కలిగించుటకు దంచబడును.

మూడవ తృచ : ఋషి - అసితుడు.

1. సోమమా! విచిత్రము, స్తుత్యము, దివ్యము, పార్థివమునగు ధనమును మాకు తెచ్చి ఇమ్ము. మమ్ము పావనులను చేయుము.

2. సోమమా! ఆయువులను పెంచుము. పావనులను చేయుము. కోరికలను తీర్చుము. హరిత వర్ణవాగుము. నీకు స్థానమగు పరచిన దర్భాసనమున ఆసీనవగుము.

3. ఇంద్ర, సోములారా! నిశ్చయముగా మీరు సమస్తమునకు ప్రభువులు, మీరు గోవులను పాలించండి. సకల

ఐశ్వర్యములకు అధిపతులు కండి. మా యజ్ఞములకు పుష్టి కలిగించండి.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - గోతముడు.

1. ఇంద్రుడు శత్రునాశకుడు. నరులు అతనిని స్తుతింతురు. మాదకుని, బలవంతుని చేయుదురు. అట్టి ఇంద్రుని పెద్ద, చిన్న యుద్ధములందు రక్షించుమని ఆక్రందింతుము. అతడు మాకు యుద్ధములందు పరిపూర్ణ రక్షణ కలిగించును గాత.

2. ఇంద్రా! నీవు వీరుడవు. శత్రుహనన కుశలుడవు. శత్రువు నుండి భూరి ధనమును గుంజుకొన గలవాడవు. స్తోత కొద్ది వాడైనను అతనికి ధనము నిచ్చి వర్ధిల్ల చేయుదువు. సోమాభిషవ కర్తకు, యజమానికి ధనము నిత్తువు. **భూరి తే వసు** - నీ ధనము అపారము కదా!

3. యుద్ధము కలిగినపుడు శత్రువును జయించుటకు ధనము సముకూర్చుకొనవలసి ఉండును. ఇంద్రా! మదస్రావి అశ్వములను నీ రథమునాకు కూర్చుము. నిన్ను ఆరాధించని వానిని వధించుము. ఆరాధించు వానికి ధనము ప్రసాదించుము. **'అస్మాఇంద్రవసౌదధః'** - ఇంద్రా! మమ్ము ధనములందు నిలుపుము.

రెండవ తృచ : ఋషి - గోతముడు.

1. ఈ సోమము రుచికరము. మధురము సకల యజ్ఞవ్యాపకము. దీనిని గౌరవర్ణ గోవులు త్రావును. గోవులు ఇంద్రుని చేరి శోభిల్లును. వరదుడగు ఇంద్రుని వెంట సాగి ప్రసన్నలగును. ఏలననగా అవి ఇంద్రుడు పానము చేయగా మిగిలిన సోమమును త్రాగును. పాలిచ్చు నట్టి ఆ పాడి యావులు ఇంద్రుని స్వరాజ్యమున వసించును.

2. ఆ గోవులు ఇంద్రుని స్పర్శను కోరుచుండును. అవి అనేక రంగులవి. ఇంద్రుడు పానము చేయు సోమమున తమ పాలు కలుపును. ఆ గోవులు ఇంద్రునకు ప్రియములు. అవి ఇంద్రుని వజ్రమునాకు శత్రునాశక ప్రేరణ కలిగించును. అట్టి ధేనువులు ఇంద్రుని స్వరాజ్యమున వసించును.

3. ఆ గోవులు జ్ఞానము గలవి. తమ పాలతో ఇంద్రుని బలమును వర్ధిల్లచేయునవి. ఇంద్రుని శత్రువులకు మీరు ఇది వరకే ఓడినారని చెప్పునవి. అందుకు ఇంద్రుని గాథలు వినిపించునవి. అట్టి ధేనువులు ఇంద్రుని స్వరాజ్యమున వసించుచున్నవి.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - జమదగ్ని

1. సోమము పర్వతములందు పుట్టినది. బలకారము, మాదకమని ప్రసిద్ధికెక్కినది. ఇది జలములందు పెరుగునది. డేగ తన స్థానమునకు చేరినట్లు సోమము స్వస్థానమున స్థిరపడును.

2. సోమము దేవతలను అర్చించుటకు యోగ్యమైనది. శుద్ధము. అన్నరూప. దానిని ఋత్విజులు అభిషవింతురు. అది జలమున శుభ్రము చేయబడును. దానిని గోవులు తమ పాలతో రుచికరమొనర్చును.

3. సోమము ప్రేరకము. మధురము. రసయుక్తము. యజ్ఞము చేసి అమృతత్వము సాధించదలచిన ఋత్విజులు సోమమును యుద్ధమున కంపు అశ్వమును వలె అలంకరింతురు.

రెండవ తృచ : ఋషి - ఊర్ధ్వ సద్మడు.

1. సోమమా! నీవు అన్నములకు స్వామివి. స్తుతి యోగ్యవు. ద్యోతమానవు. బృహదన్న స్వరూపవు. దేవతాప్రియవు. హవి రసరూపమున మా ముందు తేజరిల్లుము. ఆకసమందలి మేఘముతో వర్షము కలిగించుము.

2. సోమమా! నీవు సుదక్షవు. అధిషవణ పాత్రయందు అభిషవము చేయబడిన దానవు. రాజు వలె ప్రజలను పోషించుదానవు. అట్టి నీవు కలశమున చేరుము. యజ్ఞము కొరకు యజమానులకు ప్రేరణ కలిగించుము. ద్యులోకము నుండి జలవర్షము కలిగించుము.

మూడవ తృచ : ఋషులు - పర్వత, నారదులు.

1. సోమము చేతనత్వము కలిగించునది. యజ్ఞసాధకము. జలపుత్రి. సత్యప్రకాశకము, సర్వ ధారకము. రస ప్రేరకము, సమస్త హవిస్సులందు వ్యాప్తమైనది. ఆ సోమము పైన స్వర్గమందును, దిగువ పృథివి యందును ఉండును.

2. సోమము త్రితఋషి గుహయందు ఉండినది. అది అధిషవణ ఫలకముల మీదకు చేరినది. అప్పుడు ఋత్విజులు సోమమును కీర్తించ దలచినారు, వారు యజ్ఞసాధనములగు ఏడు చందస్సులతో సోమమును స్తుతించినారు.

3. సోమమా! ధారలుగా పారుము. నేను త్రితుడను. మూడు సవనములందు సామ గానము చేయువాడను. అందుకు ధనము ప్రసాదించుమని ఇంద్రునకు ప్రేరణ కలిగించుము. సుక్రుతులగు యజమానులు ఇంద్రుని స్తోత్రములనే కదా ఉచ్చరింతురు!

నాలుగవ తృచ : ఋషి - రేభుడు.

1. సోమమా! నీవు అభిషుతవు. ఇంద్రుడు, విష్ణువు, ఇతర దేవతల కొరకు మధురతర మగుము. అన్నప్రాప్తికి గాను దశా పవిత్రమున ధారగా పడుము.

2. పవమాన సోమమా! నీవు అనేక హవిస్సులకు కారణమవు. మా అంగుళులు ద్రోహమెరుగనివి. అవి నిన్ను పాత్రయందు పిండుచున్నవి. అప్పుడు పుట్టిన దూడ ఆవును నాకినట్లు మా అంగుళులు నిన్ను తాకుచున్నవి.

3. మహావ్రత సాధక సోమమా! నీవే ద్యావాపృథ్వులను ధరించుచున్నావు. అభిషుతవై మహత్త్వము కలిగి కవచమును కప్పుచున్నావు,

అయిదవ తృచ : ఋషి - మన్యువు.

1. సోమమా! నీవు బలవంతవు. గమనశీలవు. రస సమూహమవు. ఇంద్రునకు బలకర రసమును అందించుము.

బలములకు రాజా సోమమా! స్తోతలకు ధనమును అందించుము. రాక్షసులను నాశము చేయుము. శత్రువులను నలుదిశలందు పీడించుము.

2. సోమము రాళ్ళచే దంచబడి పిండబడును. మదకారక ధారలచే దేవతలను తృప్తిపరచును. ఉన్ని పాత్రలనుండి జల్లించబడి వెడలును. ఇంద్రునకు మిత్రమగును. ప్రకాశించు మాదక సోమము ఇంద్రుని బలము కొరకు వర్షించును.

3. యజమానులు యజ్ఞములు నిర్వహింతురు. సోమము ఋతువులననుసరించి వానియందు వ్యాపించును. పవిత్ర సోమము కలశమున బిందువులుగ రాలును. సోమదేవత తన రసప్రభావమున ఇంద్రాది దేవతలను కూర్చును. అట్టి సోమమును దశాంగుళులు దశా పవిత్రమున చేర్చుచున్నవి.

ఏడవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసుశ్రుతి లేక వత్సుడు.

1. అగ్నిదేవా! నీవు ద్యుమంతుడవు. జరారహితుడవు. నిన్ను సకల దిశలందు వెలిగించుచున్నాము. నీ దీప్తి ప్రశంసనీయమగును. ద్యులోకమున పరివ్యాప్తమగును. అప్పుడు నీవు స్తోతలకు అన్నము ప్రసాదించుము.

2. అగ్నిదేవా! నీవు అన్నదాతవు. శత్రునాశకుడవు. ప్రజాపాలకుడవు. హవ్యవాహనుడవు. జ్యోతిషస్పతివి. దీప్తి మంతుడవగు నీ కొరకు మంత్రయుక్త హవి నీ ముందునకు చేరుచున్నది. మేము స్తోతలము. మాకు అన్నము ప్రసాదించుము.

3. అగ్నీ! నీవు బలముల స్వామివి. ప్రజలను పోషించు వాడవు. అన్నముల అందించువాడవు. ఇవి హవి నిండిన పాత్రలు. అవి నీ నోట పచనమగుచున్నవి. నీవు మాకు యజ్ఞ ఫలములు కలిగించుచున్నావు. స్తోతలమగు మాకు అన్నము ప్రసాదించుము.

రెండవ తృచ : ఋషి - నృమేధుడు.

1. ఇంద్రుడు విప్రుడు. మహానుడు. వర్షము కలిగించు వాడు. హవిస్సులకు కారకుడు. విద్వాంసుడు. స్తోత్రప్రియుడు.

ఉద్గాతలారా! అట్టి ఇంద్రుని కొరకు బృహత్ సామ గానములు చేయండి.

2. ఇంద్రా! నీవు శత్రుధ్వంసివి. నీవే సూర్యునకు తేజస్సు కలిగించుచున్నావు. నీవే విశ్వకర్తవు. విశ్వదేవతవు. మహామహుడవు.

3. ఇంద్రా! నీవే ఆదిత్యుని వెలిగించుచున్నావు. స్వర్గమును ప్రకాశింపచేయుచున్నావు. దేవతలందరు నీ మైత్రి కోరి వినమ్రులై ఉన్నారు. అట్టి నీవు ఆగచ్ఛ - విచ్చేయుము.

మూడవ తృచ : ఋషి - గోతముడు.

1. ఇంద్రా! నీవు అత్యంత బలశాలివి. శత్రుదమనుడవు. నీ కొరకు సోమము సిద్ధమై ఉన్నది. యజ్ఞశాలకు విచ్చేయుము. సూర్యుడు ఆకాశమును తన కిరణములచే నింపినట్లు సోమరసము నిన్ను సర్వ శక్తులతో నింపును గాత.

2. వృత్రమంత ఇంద్రా! రమ్ము రథము నెక్కుము. నీ హర్యశ్వములు మంత్రములచే రథమున పూన్చబడినవి. సోమాభిషవ శబ్దము నీ మనుసును లాగుచున్నది. కావున మా ముందుకు రమ్ము.

3. ఇంద్రుడు అప్రతిహతుడు. అతనిని మానవులు ఋషులు స్తుతింతురు. యజింతురు. హర్యశ్వములు ఇంద్రుని అట్టి స్థలములకే చేర్చును.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
యందలి ఆరవ అధ్యాయము
సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

ఏడవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - సికతానివావరి.

జ్యోతిర్యజ్ఞస్య పవతే మధుప్రియం పితా దేవానాం జనితా విభూవసుః |
దధాతి రత్నం స్వధయోరపీచ్యం మదింతమో మత్సర ఇంద్రియో రవః ||

1. సోమము యజ్ఞములకు జ్యోతి అగును. దేవతలకు ప్రియమగు రసము కురిపించును. సోమము తండ్రి అగును. తల్లి అగును. మహా ధనవంత అగును. అది బలకారకము, ఆనందదాయకము, ఇంద్ర సేవిత అగును.

సోమరసము ద్యావాపృథ్వులందున్న ధనమును యజమానులకు చేర్చును.

2. సోమము స్వర్గ ప్రభువు. శతధార. బుద్ధి వర్ధక, బలశాలి, హరితవర్ణ. ఆ సోమము చప్పుడు చేయుచు కలశమునకు చేరును. బిందువులుగా రాల్చగల ఉన్నిగల దశా పవిత్రమున శుద్ధమగును. కోరికలు తీర్చు సోమము మిత్రుని వలె హితకారి యగును. యజ్ఞ పాత్రలందు స్థిరపడును.

3. సోమమా! నీవు జలముల కన్న ముందు పవిత్రమగుదువు. వాక్కు కన్న ముందు సాగుదువు. కిరణముల ముందు ఉందువు. అన్నము సాధించుటకు ఆయుధము పూని సంగ్రామమున దూకుదువు.

సోమమా! అట్టి నిన్ను అధ్వర్యులు నలిచి రసము తీయుదురు.

రెండవ తృచ : ఋషి - కశ్యపుడు

1. సోమము బలశాలి. దీప్తివంత. వేగవంత. అది యజమానులకు గోవులను, అశ్వములను, పుత్రులను ఇవ్వదలచి మధురసమును రాల్చును.

2. యజ్ఞకాములగు అధ్వర్యులు సోమమును అలంకరింతురు. చేతులతో శుద్ధి చేయుదురు. ఉన్ని పాత్రల నుండి సాగింతురు.

3. హవి అర్పించు యజమానుల కొరకు ఆ సోమము స్వర్గమందలి, అంతరిక్షమందలి, భూమి మీద సంపదలను

వర్షించునుగాత.

మూడవ తృచ : ఋషి - మేధాతిథి.

1. సోమమా! నీవు దేవకామివి. వేగమున సాగుము. పవిత్రముగ కురియుము. కోరికలు తీర్చునట్టి నీవు ఇంద్రుని చేరుకొనుము.

2. సోమమా! నీవు సేవకుల అభీష్టములు నెరవేర్చుదానవు. కీర్తిమంతవు. భరించుదానవు. మాకు అన్నము, నీరు పంపుము నీ ఆసనమున కూర్చుండుము.

3. అభిషుతసోమధార అడిగిన వరములు ఇచ్చునది. ప్రియమధువును పాత్రలందు నింపును. సోమము సత్కర్మ సాధకము. అది జలమును ఆచ్ఛాదించుకొనును.

4. సోమమా! నీలో ఆవుపాలు కలసినపుడు నీ గుణములు వర్ధిల్లును. నీ వలన మహా జలములు లభించును.

5. సోమము రసవాహిని. స్వర్గమును నిలిపి ఉంచునది. భరించగలది. మా సోమము పవిత్రములందలి జలములలో మరల మరల శుద్ధి చేయబడును.

6. వరము లిచ్చు హరిత వర్ణ సోమపు మహత్తు మహనీయము. అది మిత్రుని వలె దర్శనీయ శబ్దించు సోమము సూర్య సమమై ప్రకాశించును.

7. సోమమా! నిన్ను బలకారము చేయునట్టి మంత్రములు నీయొక్క బలమున కర్మ సంబంధులై పవిత్రములగుచున్నవి.

8. సోమమా! లోకకర్తలు శత్రువును అణచివేయుటకు తగిన బలమునకు నిన్ను పానము చేయ ప్రార్థింతురు. అందువలన నీ ప్రశంసనీయ కీర్తియు వర్ధిల్లును.

9. సోమమా! నీవు సనాతన యజ్ఞములకు ఆత్మవు. మాకు గోవులను, అశ్వములను, అన్నములను, నరులను ప్రసాదించుము.

10. సోమమా! మేము ఇంద్రుని యజించదలచినాము. పర్జన్యుడు వర్షము కురిపించినట్లు నీవు మధుధారలు వర్షించుము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - హిరణ్యస్తూపుడు

1. సోమమా! నీవు మహా అన్నవంతవు. అభిషుతవు మా యజ్ఞమున దేవతలను సేవింపుము. విఘ్నకారులను హతమార్చుము. తదుపరి మాకు శుభములు కలిగించుము. **"అథానో వస్యసస్కృధి"**

2. సోమమా! మాకు జ్యోతిని ప్రసాదించుము. స్వర్గమును, సకల సౌభాగ్యములను ప్రసాదించుము. **"అథానో వస్యసస్కృధి"**

3. సోమమా! మమ్ము దక్షులను చేయుము. మాకు యజ్ఞ ఫలమును ప్రసాదించుము. శత్రువులను వధించుము. **"అథానో వస్యసస్కృధి"**

4. అధ్వర్యులారా! ఇంద్రుని పానము కొరకు సోమమును దశా పవిత్రమున శుద్ది చేయండి. **"అథానో వస్యసస్కృధి"**

5. సోమమా! మాకు రక్షణలు కలిగించుము. మమ్ము సూర్యుని ఉపాసకులను చేయుము. **"అథానో వస్యసస్కృధి"**

6. సోమమా! నీవు ప్రసాదించిన జ్ఞానము వలన నీవు కలిగించిన రక్షణలందు మేము చిరకాలము సూర్యుని దర్శింతుము గాత. **"అథానో వస్యసస్కృధి"**

7. సోమమా! నీవు దిశ్య ఆయుధముల గలదానవు. మేము స్తోతలము. మాకు ద్యావాపృథ్వులందలి స్థిరధనమును ప్రసాదించుము. "**అథానో వస్యసస్కృధి"**

8. సోమమా! నీవు బలశాలివి. సంగరమున పగతురకు లొంగనిదానవు. శత్రువును లెక్కచేయనిదానవు. ద్రోణ కలశమున చేరుము. **"అథానో వస్యసస్కృధి"**

9. పవమాన సోమమా! యజ్ఞములు అనేక ఫలములను ఇచ్చునవి. ఆ యజ్ఞములందు యజమానులు నిన్ను స్తుతింతురు వర్ధిల్ల చేయుదురు. **"అథానో వస్యసస్కృధి"**

10. సోమమా! మాకు విచిత్రమును, అశ్వయుక్తమును, స్వర్గమునకు చేర్చునదియునగు ధనమును ప్రసాదించుము. **"అథానో వస్యసస్కృధి"**

రెండవ తృచ : ఋషి - ఉచథ్యుడు.

1. సోమము దేవతలకు హర్షదాయకము. అది స్తోతలను తరింపచేయుచు, అభిషుతమై ధారగా దశా పవిత్రమునకు పరుగులిడును.

'తరత్సమన్దీధావతి' - దేవతలకు హర్షదాయక సోమము స్తోతలను తరింపచేయుచు పరుగులిడును.

2. సకల ప్రకార ధనములిచ్చుదియు, దేవియునగు సోమధార యజమానిని రక్షించుట ఎరుగును. **'తరత్సమందీధావతి'**

3. ధ్వస్ర, పురూహన్తికులనురాజుల వేలకొలది ధనమును మేము గ్రహించినాము. అది మాకు శుభప్రదము అగునుగాత. **'తరత్సమందీ ధావతి'**

4. వారివద్ద నుండి మూడు వందలును, కొన్ని వేలును ధనమును తీసికొన్నాము. అవి మాకు శుభప్రదములు అగును గాక. **'తరత్సమందీ ధావతి'**

మూడవ తృచ : ఋషి - జమదగ్ని.

1. ఈ సోమరస ధారలు దేవతలకు పరమానంద దాయకములు. వానిని స్తుతించుచున్నాము. మాకు బలము కలిగించుటకు అవి ధారలుగా పాత్రలందుపడుచున్నవి.

2. సోమమా! నిన్ను దేవతలు సేవించవలసి ఉన్నది. అతి ప్రియములగు ఆవుపాలు, నేతితో కూడుము. పరిశుద్ధవై పాత్రలందు పడుము. అన్నదాత్రివగు నీవు దశా పవిత్రమున కురియుము.

3. జమదగ్నిచే పూజింపబడిన సోమమా! మాకు గోవులను, సకల దిశలు స్తుతించు అన్నమును ప్రసాదించుము.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - కుత్సుడు.

1. అగ్ని సర్వజ్ఞుడు ఆరాధనీయుడు. వడ్రంగి రథమును అందముగా తీర్చిదిద్దినట్లు. అగ్ని కొరకు మేము స్తుతి రూప స్తోత్రము రచించినాము. మా మనసు అగ్ని మీద నిలిచి ఉన్నది. మేము అగ్నిని శ్రద్ధగా ఆరాధించుచున్నాము. ఇది నిశ్చయము.

అగ్నిదేవా! మీకు మాకు మైత్రి ఏర్పడినది. ఇక మాకు ఎవరి వలనను భయము ఉండకుండును గాత.

2. అగ్నిదేవా! నీ యొక్క యాగము కొరకని ఇరువది యొక్క పదార్థములను సేకరించినాము. ప్రతి పూర్ణిమ, అమావాస్యకు దర్శపౌర్ణమాస యాగమున నిన్ను అర్చించుచున్నాము. నీ కొరకు హవిస్సులు సిద్ధము చేసినాము. నా చిరంజీవిత్వమునకు గాను మేము చేయు ఈ కర్మకు సిద్ధి కలిగించుము. మీకు మాకు మైత్రి ఏర్పడినది. ఇక మాకు ఎవరివలనను భయము ఉండకుండును గాత.

3. అగ్నిదేవా! నిన్ను చక్కగా ప్రజ్వలింపచేయ కలుగుదుము గాత. నీవు మా దర్శపూర్ణమాసాది కర్మలకు సిద్ధి కలిగించుము. నీలో అర్పించిన హవిస్సులను దేవతలు స్వీకరించుచున్నారు. మేము అదితి పుత్రులగు దేవతలను సేవించదలచినాము. నీవు వారిని మా యజ్ఞమునాకు కొనిరమ్ము. మీకు మాకు మైత్రి ఏర్పడినది. ఇక మాకు ఎవరి వలనను భయము ఉండకుండునుగాక.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. సూర్యుడు ఉదయించినాడు. మిత్రావరుణులను ఉభయులను శత్రువును మ్రింగు ఆర్యమను స్తుతించుచున్నాము.

2. ఈ స్తుతి హితకారి, రమణీయము, ధనసహితము, నిరాటంకము, సర్వప్రాప్యము అగునుగాత. '**ఇయం విప్రా మేధసాతయే**' విప్రులారా! ఈ స్తుతి మాకు యజ్ఞప్రాప్తి కలిగించునుగాత.

3. వరుణదేవా! మాకు సత్సాంగత్యము కలుగును గాక. మిత్రదేవా! మాకు సత్సాంగత్యము కలుగునుగాత. మాకు అన్నము కలుగునుగాత. స్వర్గము కలుగును గాక.

మూడవ తృచ : ఋషి - త్రిశోకుడు.

1. ఇంద్రా! సకల శత్రు సేనలను విదీర్ణము చేయుము. హింసక యుద్ధముల తలలు వంచుము. లొంగదీయుము.

'**వసు స్పార్హం తదాభర**' శత్రువులు ఆశపడు ధనమును మాకు తెచ్చి ఇమ్ము.

2. ఇంద్రా! నీ వద్ద భూరి ధనము ఉన్నది. ఈ విషయము మానవులకు తెలియును. '**వసుస్పార్హః తదాభర**'

3. ఇంద్రా! నీవు అన్యులకు చలించనివారికి, నిశ్చలురగు వారికి, ఆలోచనాపరులకు ధనము అందించినావు. వసుస్పార్హం తదాభర'

నాలుగవ తృచ : ఋషి - శ్యావాశ్యుడు.

1. ఇంద్రాగ్నులారా! మీరు యజించ తగినవారు. యుద్దములందును, యజ్ఞములందును పరిశుద్దులు అగుచున్నారు.

"ఇంద్రాగ్నీ తస్య బోధతమ్" ఇంద్రాగ్నులారా! అట్టి స్తుతులను గ్రహించండి.

2. ఇంద్రాగ్నులారా! శత్రువును పరిమార్చగల రథమున పయనించు వృత్రుని మీరు వధించినారు. మీఉర్ ఎంతటివానికిని పరాజితులు కానివారు. **"ఇంద్రాగ్నీ! తస్య బోధతమ్"**

3. ఇంద్రాగ్నులారా! ఋత్విజులు రాళ్ళతో దంచి సోమము తీసినారు. సోమాపు మదకారి అమృత రసమును మీ కొరకు పాత్రలందు నింపినారు. **"ఇంద్రాగ్నీ తస్య బోధతమ్"**

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - కశ్యపుడు.

1. సోమమా! మాధుర్యము సంతరించుకొనుము. ఈ పవిత్ర యజ్ఞమున మరుత్సహిత ఇంద్రుడు ఆసీనుడగుచున్నాడు. అతని కొరకు వర్షించుము.

2. సోమమా! నీవు ధారణ కలదానవు. విద్వాంసులు నిన్ను అలంకరింతురు. నరులు నిన్ను శోధింతురు.

3. కవివగు సోమమా! నీవు అభిషుతవైనావు. నీ యొక్క రసమును మిత్రుడు, ఆర్యమ, వరుణుడు, మరుత్తులు పానము చేయుదురు గాక.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. సోమమా! నీవు అంగుళులచే అమర్చబడినావు. శుద్ధిచేయబడినావు. కలశమున శబ్దమునకు ప్రేరణ కలిగించుచున్నావు.

పవమానమా! నీవు స్తోతలకు పచ్చని బంగారముతో కూడిన బహుళ ధనమును ప్రసాదించుచున్నావు.

2. నీవు వరములిచ్చు దానవు. శుద్ధి చేయుదానవు. ఉన్నిగల దశా పవిత్రమున జల్లించబడుదువు. నీట చేరి చప్పుడు చేయుదువు.

పవమానమా! నీవు గోదుగ్ధఘ్రుతాదులతో కలిసి దేవతల సమున్నత స్టానమునకు చేరుచున్నావు.

మూడవ తృచ : ఋషి - అమహీయుడు.

1. సోమమునకు తొమ్మిది సముద్రములు తల్లులగును. పది అంగుళులు దానిని శుద్ధిచేయుము. ఆ సోమము ఆదిత్యులతో కలిసిపోవును.

2. అభిషుతమగు సోమము కలశమున ఇంద్రునితో కలిసిపోవును. వాయువుతో కలిసిపోవును. సూర్య కిరణములతో కలిసిపోవును.

3. సోమమా! నీవు మధుర రసవంతవు. కళ్యాణ రూపవు. మా యజ్ఞమున భగుని కొరకు, వాయువు కొరకు, పూష కొరకు, వరుణుని కొరకు వర్షించుము.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. మేము అన్నవంతులము. గోవుల వలన ఆనందముగా ఉన్నాము. ఇంద్రుడు కూడ మాతో కూడి ఆనందించును గాత. అప్పుడు మా గోవులు బలము గలవై మరిన్ని పాలిచ్చునవి అగును.

2. ఇంద్రదేవా! నీవంటి మహిమాన్వితుడు మమ్ము అనుగ్రహించునుగాత. స్తోతలమగు మేము యాచించుచున్నాము. రథ చక్రమునకు ఇరుసుకూర్చినట్లు మేము కోరినవానిని తెచ్చి ఇమ్ము.

3. ఇంద్రదేవా! స్తోతలు తమ కోరికలు తీర్చుమని నిన్ను అర్థించుచున్నారు. వారిని అనుగ్రహింపుము. రథములు వర్తకులు తగిన అక్షమును సమకూర్చినట్లు - వారు కోరిన పదార్థములు తెచ్చి ఇమ్ము.

రెండవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. ఇంద్రుడు సత్కర్మకర్త. పాదుగు చేపుగోవులు పితుకు వాని కొరకు అరచినట్లు మమ్ము రక్షించుమని ఇంద్రుని ప్రతి దినము ఆహ్వానించుచున్నాము.

2. సోమపాయి ఇంద్రా! సోమపానమునకు మా మూడు సవనములకు విచ్చేయుము. ధనశాలివగు నీ ప్రసన్నత మమ్ము గోవులు కలవారిని చేయుచున్నది.

3. తదుపరి నీకు అంతరంగికులగు బుద్ధిమంతుల కూడి నిన్ను గురించి తెలిసికొందును. ఇంద్రా! రమ్ము మాకు తప్ప

ఇతరులకు నీ విషయము వివరింపకుము.

మూడవ తృచ : ఋషి - మాంధాత.

1. ఇంద్రా! ఉషస్సు తన కాంతులచే జగములను పూరించినట్లు నీవు ద్యావాపృథ్వులను పూరించుచున్నావు. నీవు మహామహులకు మహామహుడవు. మానవ జాతికి సామ్రాట్టువు. నీకు అదితి జన్మనిచ్చునది. అందువలన ఆమె భద్రనారి. మహామాత అయినది.

2. జ్ఞానవంత ఇంద్రా! నీవు మహా అంకుశము వంటి 'శక్తి' ఆయుధమును ధరించినవాడవు. ధనవంత ఇంద్రా! మేక తన ముని కాళ్ళతో కొమ్మును గుంజినట్లు నీవు శత్రువులను గుంజుచున్నావు. అదితి దేవి నీకు జన్మనిచ్చినది. అందువలన ఆమె భద్ర మహిళ, మహామాత అయినది.

3. దేవా! మానవులకు దుఃఖము కలిగించు వారు ఉన్నారు. హరించు వారున్నారు. మానవతకు శత్రువులు ఉన్నారు. వారి బలమును క్షీణింపచేయుము. మమ్ము దెబ్బతీయదలచిన శత్రువును నీ కాళ్ళ క్రింద నలిపి వేయుము. నీకు అదితి తల్లి జన్మనిచ్చినది. అందువలననే ఆమె శుభంకరి, మహామాత అయినది.

ఆరవ ఖండము

తొలి తృచ : ఋషి - అసితుడు లేక దేవలుడు.

1. రాళ్ళమధ్య నలిగి శబ్దము చేయు సోమము దశాపవిత్రమున నలువైపుల నుండి పడుచున్నది.
"మదేషు సర్వధా అసి" సోమమా! నీవు స్తోతలకు సర్వము ఇచ్చుదానవు అగుచున్నావు.

2. సోమమా! **త్వం విప్రః త్వం కవిః** అందువలన అన్నమున పుట్టిన మధుర రసమును ఇచ్చుచున్నావు. **"మదేషు సర్వధా అసి".**

3. సోమమా! నీవు సమస్త దేవతలకు ప్రీతికరమవు. వారందరు నిన్ను సేవించగోరుచున్నారు. **"మదేషు సర్వధా అసి".**

రెండవ తృచ : ఋషి - ఋణవుడు.

1. సోమము ధనము లిచ్చునది. పాడియావుల నిచ్చునది. అన్నముల నిచ్చునది. సుపుత్రుల నిచ్చునది. అట్టి సోమమును ఋత్విజులు అభిషవించుచున్నారు.

2. సోమమా! నిన్ను ఇంద్రుడు పానము చేయుచున్నాడు. మరుత్తులు పానము చేయుచున్నారు. ఆర్యమతో కూడిన భగదేవత పానము చేయుచున్నాడు. సోమము వలననే మహా రక్షణలు గల మిత్రావరుణులు ప్రత్యక్షమగుచున్నారు. ఇంద్రుడు ప్రత్యక్షమగుచున్నాడు.

మూడవ తృచ : ఋషులు - పర్వత నారదులు.

1. మిత్రులారా! దేవతలకు మాదకమగు సోమాపు గుణములను గానము చేయండి. శిశువును పోషించినట్లు, సోమమునకు హవి అర్పించి స్తుతించి స్వాదు యుక్తము చేయండి.

2. సోమము దేవతల రక్షకము. ఆనంద దాయకము. స్తుతులచే శోభాయమానము. ప్రేరణ కారి. తల్లులు తమ బిడ్డలను వలె అట్టి సోమమును నీట ముంచి తీయుదురు.

3. ఈ సోమము బలవర్ధక సాధనము. దేవతలు పానము చేయునది. వారికి బలప్రదము. ఈ అభిషుత సోమము ఇంద్రాది దేవతలకు మధురతా యుక్తమగుచున్నది.

నాలుగవ తృచ : ఋషి - మనువు.

1. సోమము మిత్రము. అభిషుతము. పాపరహితము. ధ్యాసమున సుందరము. సర్వజ్ఞ స్వర్గ మార్గదర్శి. అట్టి సోమము మన కొరకు కలశమున చేరుచున్నది.

2. సోమము పవిత్రము బుద్దివర్ధకము. దధిమిశ్రితము. జలగామి. అది పాత్రయందు నిలిచినపుడు సూర్యుని వలె సర్వదర్శన యోగ్యమగును.

3. సోమము కాంతి మంతమగు ఆవుపాలలో కనిపించునది. వివిధ పాషాణములచే దంచబడునది. ధనము లిచ్చునది. అది మాకు నలుదిశల నుండి అన్నము నందించుచున్నది.

ఐదవ తృచ : ఋషి - కుత్సుడు.

1. సోమమా! నీ పావన ధారచే ధనము వర్షించుము. పవిత్రమగు సరస్సున ప్రవేశింపుము. నీవు అభిషుతమైనంత సర్వమునకు మూల భూతుడగు సూర్యుడు కూడ వాయు వేగవంతుడగును. ఎంతో మేధావియగు ఇంద్రుడు నిన్ను సేవించి మాకు యజ్ఞము చేయు పుత్రుని ప్రసాదించును గాక.

2. సోమమా! నీవు శ్రవణయోగ్యవు. మా యజ్ఞమందు నీ స్థానమును అలంకరించుము. ధారగా వర్షించుము. చెట్టు

పండిన ఫలములను రాల్చినట్లు శత్రువులను గెలుచుటకు మాకు అరువది వేల ధనమును ప్రసాదించుము.

3. సోమమా! శరములు కురిపించుము. పగ వారిని పారద్రోలుము. ఇది నీకు అనాయాస కృత్యము. అశ్వయుద్ధమున, బాహుయుద్ధమున, శత్రునాశక సంగ్రామమున శత్రువులను హతమార్చుము. పారద్రోలుము. దూరము చేయుము. అగ్నిహోత్రము ఆచరించని వారిని మా దరికి చేరనీకుము.

ఏడవ ఖండము

మొదటి తృచ : ఋషి - బంధువు.

1. అగ్నిదేవా! నీవు ఆరాధనీయుడవు. మాకు దగ్గరివాడవు. రక్షకుడవు. సుఖకారివి అగుము **'శివోభవ'**

2. నీవు వ్యాపకుడవు. బహు అన్నవంతుడవు. అందరకు ముందరివాడవు. మా ముందు పరివ్యాప్తుడ వగుము. నీవు దీప్తివంతుడవు కదా! మాకు ధనమునిమ్ము - **"రయిం దాః"**

3. అగ్నిదేవా! నీవు కాంతిమంతుడవు. వెలుగులు విరజిమ్ము వాడవు. మాకు సుఖములు, పుత్రమిత్రాదుల నిమ్మని నిన్ను ప్రార్థించుచున్నాము.

రెండవ తృచ : ఋషి - అప్త్యుడు.

1. ఈ సమస్త భువనములు మాకు సుఖములను ఇచ్చును గాత. ఇంద్రుడు, విశ్వేదేవతలు మా మనో రథములను నెరవేర్తురు గాక.

2. అదితి పుత్రులగు అన్య దేవతల సహితుడైన ఇంద్రుడు మా యజ్ఞ, దేహ, సంతానములను సఫల మనోరథులను చేయునుగాత.

3. అదితి పుత్రులగు మిత్రాది దేవతలు, మరుద్గణ సహితుడైన ఇంద్రుడు మా కొరకు ఔషధములు సమకూర్తురు గాక.

మూడవ తృచ : సంపాత ఋషి

1. ప్రవో2ర్చోప

దరిచేరి ఇంద్రుని చక్కగా పూజించండి.

దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి ఏడవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

ఎనిమిదవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - అసిత దేవలులు.

ప్రకావ్యముశనేవ బ్రువాణో దేవో దేవానాం జనిమా వివక్తి |
మహివ్రతః శుచిబన్ధుః పావకః పదా వరాహో అభ్యేతి రేభన్ ||

1. స్తోత ఉశన ఋషివలె స్తోత్రమును ఉచ్చరించుచున్నాడు. దేవతలు ప్రకటమగునట్లు చదువుచున్నాడు.

సోమము మహా పరాక్రమశాలి. దీప్త. తేజోవంత. పాపనాశక. అభిషుత. అది శబ్దించుచు పాత్రలకు చేరుచున్నది.

2. వేటకాడు హంసను బాధించినట్లు 'వృషగణము' అను ఋషులు శత్రువులచే బాధించబడినారు. వారు రక్షింప బడుదురుగాక. వారు వేగమున, అభిషవ శబ్దమును బట్టి, యజ్ఞశాలలకు చేరుకుందురు గాక. స్తోత్రయోగ్యము, శత్రువులు సహించలేనిదియునగు సోమమును బాణవాద్యము వాయించుచు స్తోతలు స్తుతింతురు గాక.

3. సోమము అనేకులచే స్తుతించబడునది. దాని వేగము అంతరిక్షము వైపు సాగును. అనాయాసముగ సాగు సోమపు వేగమును ఎంతటివాడును కొలత వేయజాలడు. తీక్షణతేజము గల అంతరిక్షచరి సోమము అనేక రీతులుగా వెలుగులు వ్యాపింపచేయును. సోమము పగలు హరితముగను, రాత్రి ప్రకాశవంతముగను దర్శనమిచ్చును.

4. అభిషవ సమయమున పాత్రలందు సోమము చేయు శబ్దము రథపు చప్పుడు వలెను, గుర్రపు సకిలింపు వలెను ఉండును. సోమము శత్రువు అన్నము గుంజుకొనదలచి యజమానులకు ధనము ఇచ్చుటకు పరాక్రమించుచున్నది.

5. యుద్ధమున విజయము సాధించిన రథము వలె సోమము యజ్ఞము వైపు సాగునపుడు ఋత్విజులు భారవాహుల వలె దానిని తమ భుజములకు ఎత్తుకొందురు.

6. కీర్తనలచే రాజులను వలె సప్తహోతలచే యజ్ఞమును వలె సోమమును గోఘ్రుతాదులచే సంస్కరించుచున్నారు.

7. అభిషుతమగు సోమము బృహత్ స్తుతి యుక్తమై మధుర మధురసధారలను నలు దిశల నుండి వర్షించుచున్నాది.

8. సోమము ఇంద్రుని పానయోగ్య. ఉషస్సు వలె శోభలు వ్యాపింప చేయునది. అట్టి సోమము అభిషవ సమయమున ధ్వని చేయును.

9. స్తుతి కర్తలును, సనాతనులును, సోమమును తెచ్చునట్టి మానవ ఋత్విజులు యజ్ఞద్వారములను తెరచుచున్నారు.

10. మంచిజన్మము గల సప్త హోతలు సోమపు స్థానమును పూరించి కర్మానుష్టానమునకు ఉపక్రమించుచున్నారు.

11. కనులతో సూర్యుని దర్శించుటకు యజ్ఞపు నాభి రూపియగు సోమమును నా నాభియందు చేర్చుచున్నాను. సోమ కిరణములను వ్యాపింపచేయుచున్నాను.

12. ఇంద్రుడు పరాక్రమశాలి. అధ్వర్యులు అతనికి ప్రీతిపాత్రులు. ఇంద్రుడు తన కనులతో అధ్వర్యుల హృదయములందున్న సోమమును చూచుచున్నాడు.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషులు - అసిత దేవలులు.

1. ఈ యజమాని కోరిన దేవతా సంబంధములను ఎరుంగుచు సోమము కర్మమున యజ్ఞమార్గమును అనుసరించును.

2. సోమము హవిస్సులందు శ్రేష్టము. సోమము నీట చేరును. ప్రధానధారలుగా పడును.

3. హవిస్సులందు ప్రధానమగు సోమము వాణిని ప్రకటించును. కోరికలు తీర్చును. సత్యరూపయగును. హింసారహితయై యజ్ఞశాల జలములందు ధ్వనించును.

4. బలములను శోధించు సోమము స్తోత్రములందు ప్రవేశించినపుడు స్వర్గమునందలి అన్నవంత ఇంద్రుడు సోమమును సేవించ నిచ్చగించును.

5. ఋత్విజులు సోమమును కర్మలకు ప్రేరణ కలిగింతురు. రాజు తనను ఎదిరించు వారిని హతమార్చినట్లు సోమము

యజ్ఞవిఘ్నకారులను హతమార్చును.

6. సోమము హరితవర్ణ. దేవతలకు ప్రియతమ. అది నీట చేరి ఉన్ని పాత్రల ద్వారా జల్లించబడును. అభిషవ సమయమున శబ్దము చేయును. స్తుతించబడును.

7. సోమమును కొనుట, అభిషవించుట మున్నగు కర్మలందు క్రీడించు యజమాని ఇంద్ర, వాయు, అశ్వినీ దేవతలను ఆనందపరచినవాడు అగుచున్నాడు.

8. ఏ యజమానియొక్క సోమధారలు మిత్రావరుణ, భగదేవతల కొరకు వర్షించుచున్నవో అతడు సోమమును గ్రహించినవాడై సుఖములు అనుభవించుచున్నాడు.

9. ద్యావాపృథ్వులందున్న దేవతలారా! మీకు హర్షము కలిగించు సోమ హవిస్సును అర్పించుచున్నాము. మీరు మాకు ధన, అన్న, పశ్వాది సంపదను ప్రసాదించండి.

10. సోమమా! మేము నీ ఎదుట నిలిచి నీ బలమును ఆరాధించుచున్నాము. నీ యొక్క బలము సుఖము కలిగించునది, ధనము నిచ్చునది, శత్రువుల నుండి రక్షించునది, కోరికలు తీర్చునది అగును గాక.

11. సోమమా! నీవు మదకారివి. నిన్ను ఆరాధించుచున్నాము. నీవు సర్వసేవనీయవు. నిన్ను సేవించుచున్నాము. నీవు బుద్ధిశాలివి. నిన్ను ఆరాధించుచున్నాము. నీవు స్తుతివంతవు. నిన్ను ఆరాధించుచున్నాము. నీవు అందరిని రక్షించుదానవు. అనేకులచే అర్థించబడు దానవు. నిన్ను ఆరాధించుచున్నాము.

12. సుక్రతు సోమమా! నిన్ను ధనము అర్థించుచున్నాము. శ్రేష్ఠజ్ఞానము అర్థించుచున్నాము. మా పుత్రుల కొరకు ధనము, జ్ఞానము అర్థించుచున్నాము. నీవు అందరిని రక్షించుదానవు. అనేకులచే అర్థించబడు దానవు. నిన్ను ఆరాధించుచున్నాము.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - భరద్వాజుడు.

1. వైశ్వానరాగ్ని ద్యులోక శీర్షము. భూలోక స్వామి. యజ్ఞము కొరకు తొలుత పుట్టినవాడు. కవి. సామ్రాట్టు జనులకు అతిథిసముడు. దేవతలకు ముఖము వంటివాడు. మాకు రక్షకుడు. ఋత్విజులు అట్టి అగ్నిని యజ్ఞములందు అరణులలో కల్పింతురు.

2. అమర అగ్నీ! నీవు అరణులందు వ్యక్తమగు వాడవు. సమస్త దేవతలు నిన్ను పసిపిల్లలను వలె బుజ్జగింతురు.

వైశ్వానరా! నీవు పాలకుడవు. నీవు ద్యావాపృథ్వుల మధ్య ప్రకాశించినపుడు ఋత్విజులు యజ్ఞము చేసి అమృతత్వము నొందుదురు.

3. వైశ్వానరాగ్ని యజ్ఞమునకు నాభిస్వరూపుడు. ధనముల సదనము. మహానుడు. ఆహుతులు అందుకొనువాడు. ఋత్విజులచే స్తుతించబడువాడు. మానవ యజ్ఞకర్తలు యజ్ఞకేతనుడగు అగ్నిని మంథనమున సృష్టింతురు.

రెండవ తృచ : ఋషి - యజతుడు.

1. ఋత్విజులారా! మిత్రావరుణలను ఉచ్చై స్వరమున కీర్తించండి. అధిక బలశాలురగు మిత్రావరుణలారా! యజ్ఞమందు బృహత్ స్తుతులకు విచ్చేయండి.

2. మిత్రావరుణులు సమస్తమునకు ప్రభువులు. జలములకు కారకులు. ప్రకాశవంతులు. దేవతలందు ప్రశస్తులు - **'దేవేషు ప్రశస్తా"**

3. వారు మాకు ద్యావాపృథ్వులందున్న మహాధనము ఇవ్వగల శక్తిమంతులు. మిత్రావరుణులారా! మీ బలము దేవతలందు గొప్పది. మేము దానిని స్తుతించుచున్నాము.

మూడవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. ఇంద్రా! నీ ప్రకాశము విచిత్రము. ఋత్విజులు అభిషవించినారు సోమమును. అది నిత్య శుద్ధము. విచ్చేయుము. సోమము సేవింపుము.

2. ఇంద్రా! మేము నీ భక్తులము. ఋత్విజులు నీకు ప్రేరణ కలిగించుచున్నారు. సోమము అభిషుతమై ఉన్నది. వేదవాణిని స్వీకరించుటకు ఈ యజ్ఞమునకు విచ్చేయుము.

3. ఇంద్రా! వడివడిగా రమ్ము. వేదస్తుతులను స్వీకరింపుము. నీకు అభిషుత సోమ హవిస్సు అర్పించుచున్నాము. అందుకొనుము.

నాలుగవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. ఏ అగ్ని తన జ్వాలలతో సమస్త అరణ్యములను చుట్టుకొనునో, ఏ అగ్ని అడవులను కాల్చినల్లని మసిచేయునో అట్టి అగ్నిని స్తుతించండి.

2. ఏ మానవుడు ఇంద్రుని కొరకు అగ్నియందు సుఖదాయక హవిస్సులు అర్పించునో అట్టి వానికి అన్నము కలిగించుటకు గాను ఇంద్రుడు వర్షము కలిగించును గాత.

3. ఇంద్రాగ్నులారా! మీకు సకల దిశల నుంచి హవి అందించుటకు గాను మాకు బలకరమగు అన్నమును, వేగవంతములగు అశ్వములను ప్రసాదించండి.

నాలుగవ ఖండము

మొదటి తృచ : సికతానివావరి ఋషిగణము.

1. సోమము ఇంద్రుని ఉదరమున ప్రవేశించును. మిత్రమగు సోమము ఇంద్రుని ఉదరమున పట్టకుండును.

నరులు యువతులను కలసినట్లు సోమము జలమును కలసికొనును. అభిషుతమైనంత శతసాధక దశా పవిత్రము నుండి కలశమున ప్రవేశించును.

2. సోమమా! నిన్ను ధ్యానించవారును, నీ మదకారక శబ్దమును వినగోరువారును అగు నీ స్తోతలు కర్మానుష్టాన మందున్నారు. యజ్ఞశాలలో స్తోతలు హరితవర్ణ, క్రీడనశీల సోమమును స్తుతింతురు. పాడియావులు సోమము కొరకు ఎక్కువ పాలను ఇచ్చును.

3. పవమాన సోమమా! నీవు పవిత్రావు. మేము అన్నములను సమకూర్చినాము. నీవు నీ యొక్క రసమున దానిని పావనము చేయుము. మేము దినమున చేయు మూడు సవనములకు బాధ కలిగించకుము. మాకు ప్రసిద్దుడు, బలవంతుడు, సుందరుడు, మధురతముడు శక్తివంతుడగు పుత్రుని ప్రసాదించుము.

రెండవ తృచ : ఋషి - పురుహన్మ.

1. ఇంద్రుడు జ్ఞానదాత. ప్రశంసనీయుడు. తన బలమున శత్రువును తిరస్కరించువాడు. అపరాజితుడు. అట్టి ఇంద్రుని యజ్ఞమున ప్రసన్నము చేసిన వానికి ఎదురు ఉండదు. ఎంతటి వాడును అతనికి హాని కలిగించ జాలడు.

2. ఇంద్రుడు ఇతరులను సహించని బలశాలి. శత్రుంజయుడు. అట్టి ఇంద్రుని నేను నుతించుచున్నాను. ఇంద్రుడు ప్రత్యక్షమైనంత మహిషములు, వేగము గలిగి హవిస్సులనిచ్చు గోవులు, మేకలు ప్రణమిల్లును. ద్యావాపృథ్వులు, సకల ప్రాణులు ప్రణమిల్లుదురు.

నాలుగవ ఖండము

తొలి తృచ : ఋషి - నారదుడు.

1. మిత్రులారా! రండి కూర్చొనండి. సోమపు కీర్తిని గానము చేయండి. పవిత్ర సోమమును మరింత స్తుతించండి. తదుపరి శిశువును అలంకరించినట్లు సోమమును యజ్ఞములచే శోభిల్లునట్లుగా అలంకరించండి.

2. సోమము గృహసాధనము. దేవరక్షకము. మదకరము. ద్యావాపృథ్వుల బలములను పెంచునది. ఋత్విజులారా! తల్లిని బిడ్డను కలిపినట్లు ఈ సోమమును వసతీవర జలముతో కలపండి.

3. వేగము కొరకు, దేవతల పానము కొరకు, మిత్రావరుణులకు సుఖము కలుగునట్లు బలవర్ధక సోమమును పవిత్రము చేయండి.

రెండవ తృచ : ఋషి - ఐశ్వర్యుడు.

1. సోమము బలశాలి. అనేక ధారలు కలది. ఉన్ని పాత్రలందు జల్లించపడును. అనేక ధారలుగా వర్షించును.

2. సోమము బహు బలశాలి. నీట శుభ్రము చేయబడును. అందు గోఘృతాదులు కలియును. అట్టి సోమము వర్షించును.

3. సోమము నరులచే నియంత్రితమై, రాళ్ళచే దంచబడి ఇంద్రుని ఉదరమను కలశమున ప్రవేశించును.

మూడవ తృచ : ఋషి - జమదగ్ని.

1. దూర దేశమున, సమీప ప్రాంతమున శుద్ధి చేయబడినదియు, కురుక్షేత్రపు శరణ్యావతి సరస్సున శుద్ధి చేయబడినదియు నగు సోమము మాకు కోరిన ఫలములను ప్రసాదించును గాత.

2. ఎయ్యది దూర ఋజీక దేశమున - ఎయ్యది కృత్నానమను కర్మ ప్రధాన దేశమున ఎయ్యది సరస్వతీ నదీ తీరమున- ఎయ్యది పంచ జనులచే అభిషుతము చేయబడినదో అట్టి సోమము మాకు కోరిన ఫలములను ప్రసాదించును గాక.

3. అభిషుతమును, దీప్త పాత్రలందు చేరినదియు నగు సోమము మాకు దివినుండి వర్షమును, వీరపుత్రులను ప్రసాదించును గాత.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - వత్సుడు.

1. అగ్నీ! నేను వత్సుడను. నీకు నచ్చిన, నీకు మనోహరమగు స్తుతులచే స్తుతించుచున్నాను. నిన్ను పరమోత్తమ ద్యులోకము నుండి ఇచ్చటికి ఆహ్వానించుచున్నాను.

2. అగ్నీ! నీవు సమస్త దేశములందు సమదృష్టి కలవాడవు. అందుకే నీవు సకల దిశలకు స్వామివి. మా రక్షణలకు నిన్ను యుద్ధములకు ఆహ్వానించుచున్నాము. **"సమత్సు త్వా హవామహే"**

3. ఇది బలముల పోరు మేము బలము కోరువారము అగ్ని యుద్ధములందు ధనము ప్రసాదించువాడు. మేము అగ్నిని ఆహ్వానించుచున్నాము - **"అగ్నిం హవామహే"**

రెండవ తృచ : ఋషి - నృమేధ.

1. ఇంద్రా! నెవెఉ శతక్రతువవు. బహు కర్మవంతుడవు. విశేష జ్ఞాతవు. మాకు అన్నము నిమ్ము. బలము నిమ్ము. శత్రుతిరస్కర్తా! మాకు వీరపుత్రుని ప్రసాదించుము.

2. శతక్రతో! **త్వంహి నః సితా. త్వం మాతా. త్వం వసుః** మేము నిన్ను సుఖములు యాచించుచున్నాము.

3. ఇంద్రా! స్తోతలు నిన్ను స్తుతించుచున్నారు. బలశాలిని చేయుచున్నారు. బలశాలి ఇంద్రా! నిన్ను యజమానులు అనేకులు ఆహ్వానించుచుందురు. మేము బలము ఆశించి నిన్ను స్తుతించుచున్నాము. నీవు మాకు శ్రేష్ఠ ధనమును ప్రసాదించుము.

మూడవ తృచ : ఋషి - భౌమ అత్రి.

1. ఇంద్రదేవా! నీవు వజ్రధారివి. విచిత్ర రూపివి. నీవు నాకు ఇవ్వవలసిన ధనము ఈ లోకమున లేదు. అట్టి ధనము నీ వద్ద ఉన్నది. దానిని నాకు రెండు చేతులతో ఇమ్ము **'ఉభాయా హస్త్యా భర'**

2. ఇంద్రా! నీవు ఏ అన్నమును పరమోత్తమము అనుకొంచుచున్నావో అట్టి దానిని మాకు ప్రసాదించుము. మేము అపారమగు అన్నము కలవారలము అగుదుము గాక.

3. ఇంద్రదేవా! నీ మనసు గొప్పది. సకల దిశలందు స్తుతించ బడునది. అట్టి నీ మనసు కన్న దృఢమగు అన్నమును మాకు కలిగించుము.

దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన సామవేద
సంహిత ఉత్తరార్చిక యందలి ఎనిమిదవ అధ్యాయము
సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

తొమ్మిదవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రతర్దనుడు

శిశుం జజ్ఞానం హర్యతం మృజన్తి శుమ్భన్తి విప్రం మరుతో గణేన |
కవిర్గీర్భిః కావ్యే కవిః తన్త్సో పవిత్రమత్యేతి రేభన్ ||

1. సోమము అప్పుడు పుట్టిన శిశువు వంటిది. అందరు అభిలషించు సోమమును మరుత్తులు శుద్ధి చేయుదురు. బుద్ధివర్ధక సోమమును సప్త మరుద్గణము శోభిల్లచేయును. సోమమును విద్వాంసులు శబ్దములచే స్తుతింతురు. సోమము స్తుతి సహితమై కలశమున ప్రవేశించును.

2. సోమము సర్వద్రష్ట. ప్రకాశకారకము. సూర్యుని సేవించునది. బహుస్తుతివంక. కవుల చెదరిన పదములను కూర్చునది. అట్టి మహా పూజనీయ సోమము మూడవ ధామమగు ద్యులోకమునకు చేరదలచినది. అది స్తుతించబడినది. దీప్యమానమైనది. ఇంద్రుని ప్రకాశింపచేయుచున్నది.

3. సోమము చమస పాత్రలందు నిలిచినది. ప్రశంసనీయ. శక్తి కలిగించునది. పాత్రలందు విహరించునది. యజమానులకు గోవులు ప్రసాదించునది. వారిని పోషించునది. జనములకు ప్రేరణ కలిగించునది. అట్టి సోమము అంతరిక్షమును సేవించి నాలుగవ ధామమగు చంద్ర లోకమును సేవించుచున్నది.

రెండవ తృచ : ఋషులు - అసిత, దేవలులు.

1. ఈ సోమములు ఇతని - ఇంద్రుని బలమును పెంచుచున్నవి. ఇంద్రునకు ఇష్టమైనదియు, ఆనందము కలిగించునదియు నాగు రసమును వర్షించును.

2. సోమమా! నీవు అభిషుతవైనావు. పాత్రలందు నిలిచినావు. వాయువును అశ్వినులను చేరుకొన్నావు. మాకు

సుబలమును ప్రసాదించుము.

3. పవిత్ర సోమమా! దేవతలకు మూలమగు యజ్ఞ స్థానమును చేరుకొన్నాను. ఇంద్రుని అర్చించదలచినాను. నా హృదయమునకు ప్రేరణ కలిగించుము.

4. సోమమా! పది అంగుళులు నిన్ను శుద్ధి చేయుచున్నవి. సప్తహోతలు నీకు తృప్తి కలిగించుచున్నారు. విప్రులు నిన్ను మాదకము చేయుచున్నారు.

5. సోమమా! నీవు దశాపవిత్రమున ఉన్ని యందు ఉన్నదానవు. సుఖ స్వరూపమవు. దేవతలకు ఆనందము కలిగించుటకు నిన్ను గోఘ్రుతాదులందు చేర్చుచున్నాను.

6. సోమము పవిత్రము. కలశములందు పిండబడినది. ప్రకాశించు హరిత వర్ణ సోమము ఆవు పాల వస్త్రమును ఆచ్ఛాదించుకొనుచున్నది.

7. సోమమా! ధనవంతులమగు మా ముందు వర్షింపుము. మమ్ము ద్వేషించు వారినందరను హతమార్చుము. మాకు మిత్రుడగు ఇంద్రుని చేరికొనుము.

8. సోమమా! నీవు మానవ ద్రష్టవు. సర్వజ్ఞవు. ఇంద్రపీతవు. అట్టి నిన్ను సేవించు మాకు అన్నము, సంతానము కలుగును గాత.

9. సోమమా! దివి నుండి వర్షము కలిగించుము. భువి మీద అన్నము మొలిపించుము. యుద్ధములందు మా బలమును స్థిరపరచుము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషులు - అసిత దేవలలు.

1. సోమము వేల ధారలది. దశా పవిత్రమున శుద్ధమైనది. పావనము చేయునది. అది ఇంద్ర వాయువుల కొరకు పవిత్రము చేయబడి పాత్రలకు చేరుచున్నది.

2. సోమము పవమానము. పరితృప్తము. దేవతలు పానము చేయునది. ప్రసిద్ధము. రక్షణలు కోరు ఉద్గాతలారా! ఆ సోమాపు ఎదుట నిలచి స్తోత్రగానము చేయండి.

3. అన్నప్రాప్తి కలిగించునదియు, దేవయగ్న సిద్ధి కొరకు స్తుతించుబడునదియు, మానవులకు అనేక బలములు

కలిగించునదియునగు సోమము వర్షించుచున్నది.

4. సోమమా! దీప్తులను, శక్తులను వర్షించుము. మా యుద్ధములందు మరింత అన్నము కురిపించుము.

5. యుద్ధములకు ప్రేరణ కలిగించు సోమము వేగగామి వలె ఋత్విజులచే ఉన్నిగల పాత్రలందు రాల్చబడును.

6. స్తుతించబడునవియు, దీపించునవియునగు సోమములు మాకు వేలకొలది ధనములు మంచి బలములు ప్రసాదించునుగాక.

7. ధ్వనించు సోమములు దూడ వద్దకు చేరు గోవు వలె పాత్రలకు చేరును. బాహువులచే ధరించబడును - **"దధన్విరే గభస్త్యోః"**

8. సోమము ఇంద్రునకు పర్యాప్తమగుచున్నది. తృప్తి కలిగించుచున్నది. అట్టి సోమము నినదించుచు మమ్ము ద్వేషించు వారలనందరను హతమార్చునుగాత. **'విశ్వా అప ద్విషో జహి"**

9. పవమానమా! అదాతలను నష్టపరచుచు సకల ద్రష్టవగు నీవు యజ్ఞశాల యందు విరాజిల్లుము.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషులు - అసిత, దేవలలు.

1. యజ్ఞసిద్ధి కలిగించునదియు, మధురతర రసవాహినియునగు సోమము ఇంద్రుని కొరకు ధారలగ ఏర్పరచబడుచున్నది.

2. పాడియావులు దూడల కొరకు అరచినట్లు ఋత్విజులు సోమపానము చేయునని ఇంద్రుని స్తుతింతురు.

3. మాదక రసమును కురిపించు సోమము యజ్ఞశాలయందు వసించును. నదీ తరంగము లందు దిట్టమైన సోమము మాధ్యమిక గంధర్వవాణిలో చేరును.

4. సుక్రతు, కవి, సర్వద్రష్ట యగు సోమము అంతరిక్షనాభి వంటి ఉన్ని గల పాత్రయందు సత్కరింపబడును.

5. సోమము కలశమలందున్నది. పవిత్ర మధ్యమున స్థాపించ బడినది. ఆ సోమాంశమున చంద్రుడు ప్రవేశించుచున్నాడు.

6. సోమము మధువును రాల్చుచు కలశమును నింపుచున్నది. అంతరిక్షపు ఆధార స్థానమునకు వాక్కును పంపుచున్నది.

7. సోమము నిత్యస్తుత. అరణ్యముల ప్రభువు. అది ఋత్విజులను జంటలుగా ప్రేరేపించును. అమృత తుల్య స్తుతులు చేయు ఋత్విజుల నడుమ స్తుతులను స్వీకరించును.

8. పవమాన సోమమా! మమ్ము సహస్ర వర్చస్సులందు సుందర భవనములందు, ధనము లందు నిలుపుము.

9. కవియు, అభిషుతము, శ్రేష్ఠస్థానమున ఉన్నదియు, తృప్తి కలిగించునదియునగు సోమము తన ధారలను ద్యులోకపు ప్రియ స్థానము వైపు మళ్ళించును.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఉచథ్యుడు.

1. సోమమా! సముద్ర తరంగ స్వనము వలె నీవు వేగముగ పైకి ఎగిసెదవు. బాణ నామక వాద్య స్వనమును కలిగించుము.

2. సోమమా! నీ ప్రాదుర్భావమైనంత ఋగ్యజుస్సామ వాక్కులు వెలువడును. అప్పుడు నీవు శ్రేష్ఠ పవిత్ర పాత్రయందు ప్రవేశింతువు.

3. సోమము ప్రియతమము. హరిత వర్ణ. పాషాణ పీడిత. మధుచ్యుత. పవమాన. అట్టి సోమమును ఋత్విజులు ఉన్ని గల పాత్రలకు పంపుచున్నారు.

4. పరమానంద దాయక సోమమా! నీవు ఇంద్రుని ఉదరమునకు చేరవలసి ఉన్నది. పవిత్రమున జల్లించబడుము. ధారగా వర్షించుము.

5. పరమానంద దాయక సోమమా! ఆవుపాలు మున్నగు వానితో కలియును. ప్రశంస నీయవగుము. వర్షించుము. ఇంద్రుని జఠరమున ప్రవేశించుము - **"ఏన్ద్రస్య జఠరం విశ"**

అయిదవ ఖండము.

మొదటి తృచ : ఋషి - అమహీయుడు.

1. సోమమా! నీ యొక్క రసమున ఇంద్రుని పానము కొరకని క్షరించుము. నీవు యుద్ధములందు తొంబది తొమ్మిది

పురములను ధ్వంసము చేయుదువు.

2. ఇంద్రుడు సోమపానము చేసి పురములను ధ్వంసము చేసినాడు. సత్యకర్మయగు దివోదాసను రాజుకు శత్రువులైన శంబరుని, యదువును, తుర్వసుని హతమార్చినాడు.

3. సోమమా! నీవు అశ్వములను ఇచ్చుదానవు మాకు గోవులను, సువర్ణ సహిత అశ్వములను అపార అన్నమును ప్రసాదించుము.

రెండవ తృచ : ఋషి - అమహీయుడు.

1. సోమమా! హింసక శత్రువులను వధించుము. అదాతలను నష్టపరచుము. ఇంద్రుని స్థానము నందు కొనుము. ధారగా వర్షించుము.

2. పవమాన సోమమా! మాకు మరింత ధనమును ప్రసాదించుము. శత్రువులను హతమార్చుము. వీర పుత్రులను యశస్సును ప్రసాదించుము.

3. పవమాన సోమమా! నీవు ధనము నిచ్చుదానవు. నీవు ధనము ప్రసాదించ దలచినపుడు ఎంతటి శత్రువైనను నిన్ను ఆపజాలడు.

మూడవ తృచ : ఋషి - నిధ్రువి.

1. సోమమా! మానవులకు హితము కూర్చు జలమునకు ప్రేరణ కలిగించుదానవు. ఏధారచే సూర్యుని ప్రకాశింప చేసినావో అట్టి ధారగా వర్షించుము.

2. మానవులను అంతరిక్షమునకు చేర్చుటకు సోమము సూర్యునకు ఏతశనామక అశ్వమును కూర్చును - **"అయుక్త సూర ఏతశం"**

3. సోమమా! ఇంద్రుడు ఇంకను ఇట్లనుచు హరితవర్ణ అశ్వములను గమనమునకుగాను సూర్యునకు కూర్చును.

ఆరవ ఖండము

తొలి తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. అగ్ని దేవత. అట్లయ్యు మర్త్యులందుండు వాడు. యజ్ఞసంబంధి వేడి, వెలుగుల నిచ్చువాడు. ఘ్రుత భక్షకుడు. పావకుడు. దేవతలారా! అన్య అగ్నుల సహితుడగు పరమ పూజ్య అగ్నిదేవతను యజ్ఞములందు దూతను చేయండి.

2. గడ్డి మేయు అశ్వము సకిలించినట్లు అగ్ని నిర్నిరోధముగా వృక్షములకు వ్యాపించును. అప్పుడు అగ్ని జ్వాలలు వాయువు వెనుక వెనుక సాగును. అగ్నిదేవా! అప్పుడు నీ మార్గము నల్లనిది, మసిగలది అగును. **"తే వ్రజనం కృష్ణమస్తి"**

3. అగ్నిదేవా! నీవు వర్షము కలిగించువాడవు. నీవు పుట్టినంతనే జరారహితములగు నీ జ్వాలలు ప్రజ్వరిల్లును వెలుగులు కలిగించు నీ జ్వాలలు ధూమయుక్తములై అంతరిక్షమునకు చేరును. తదుపరి ఇంద్రాది దేవతలను చేరుకొనుచున్నావు.

రెండవ తృచ : ఋషి - శృతి కక్షి లేక షుకక్షి.

1. మహావృత్రుని వధించుటకు ఇంద్రునకు సోమము అర్పించి, స్తుతించి అతని బలమును పెంచుచున్నాము. వర్షము నిచ్చు నాతడు మాకు వరదుడు అగును గాత. **"స వృషా వృషభో భవతు"**

2. ఇంద్రుడు దాతయగుటకే సృష్టించ బడినాడు. బలశాలి యగుటకే సొమ్ము సృష్టించబడినది. అన్నవంతుడు, కీర్తి వంతుడగు ఇంద్రుడు సోమయోగ్యుడు అగుచున్నాడు.

3. స్తోతలు ఇంద్రుని స్తుతించుచున్నారు. ఆ స్తుతులచే ఇంద్రుని - వజ్రాయుధమునకు వలె- పదను కలిగించుచున్నారు. అందువలననే అతడు బలవంతుడు, అపరాజితుడు, మహానుడు, శత్రువునకు లొంగనివాడు, స్తోతలకు ధనదాత అగుచున్నాడు.

ఏడవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఉచథ్యుడు.

1. అధ్వర్యులారా! రాళ్ళతో సోమమును పిండండి. దశాపవిత్రమునకు పంపండి. ఇంద్రుని పానము కొరకు పరిశుద్ధము చేయండి.

2. సోమము మాదక, పవిత్ర అన్నరూప రసము. ఇంద్రాది దేవతలు, మరుత్తులు సోమమును సేవించుచున్నారు.

3. ఋత్విజులారా! మధుమత్తమము, ద్యులోకమునకు అమృత స్వరూపమగు శ్రేష్ఠ సోమమును వజ్రధారి ఇంద్రుని కొరకు అభిషవించండి.

రెండవ తృచ : ఋషి - కవి.

1. సోమము శోధించునది. రసరూప. దేవతలకు బలదాయక భరించునది. అట్టి సోమము దివియందు ప్రవహించుచున్నది.

మాచే చేయబడిన హరితవర్ణ సోమము సుశిక్షిత అశ్వము వలె నదులందు తన బలమును కూర్చుకొనును.

2. సోమము శూరుని వలె హస్తములందు ఆయుధములు ధరించును. రథికుల గోవులకు ఇంద్రుని శక్తి కలిగించును. అధిఒ ఋత్విజుల ప్రేరణ వలన ఆవు పాలు మున్నగు వానిని కలసి కొనును.

3. పవమాన సోమమా! వ్యాకోచము నొందు ఇంద్రుని ఉదరమున ధారగా ప్రవేశింపుము. విద్యుత్తు మేఘమును వలె - మాకొరకు ద్యులోకమును వెలిగించుము. నీ మహిమచే అపార అన్నమును మా వద్దకు చేర్చుము.

మూడవ తృచ : ఋషి - దేవాతిథి.

1. ఇంద్రదేవా! నీవు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశలందలి స్తోతలచే స్తుతించబడుచున్నావు. 'అన' పుత్రుని ఋత్విజులు నిన్ను విశేషముగ స్తుతించుచున్నారు. తూర్వశుని ఋత్విజులు కూడ నిన్ను స్తుతించుచున్నారు.

2. ఇంద్రా! నిన్ను రుమ, రుశ, శ్యావక, కృపులు ప్రసన్నుని చేయుచున్నారు. అట్లయినను స్తుతులకు ప్రేరణ కలిగించు కణ్వగోత్రజులు తమ స్తుతులచే నిన్ను వశపరచుకొనుచున్నారు. మా కర్మమునకు విచ్చేయుము.

నాలుగవ తృచ : ఋషి - భర్గుడు.

1. మేము వచించు స్తోత్రరూప, శాస్త్రరూప వాక్కును ఇంద్రుడు మా ముందుకు వచ్చి వినును గాత. ధనవంతుడగు ఇంద్రుడు మా సహితముగ యశోవంతుడు కాదలచినాడు. అందువలన అతడు బలశాలి అయినాడు. అతడు సోమపానమునాకు వచ్చును గాక.

2. ఇంద్రా! నీవు ఉభయలోక వాసివి. ప్రకాశించువాడవు. జగదుపకారకుడవు. నీవు నీ బలమునకే సాధ్యుడవు. ఇతర దేవతలు ఉపమాన భూతులే! నీవే ముఖ్యుడవు. నీ మనసు సోమము కాంక్షించుచున్నది - **"సోమకామం హి తే మనః"**

ఎనిమిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - నిధృవి.

1. సోమమా! దీప్తములగు ధారలచే పడుము. మదకారి యగు నీ యొక్క రసము ఇంద్రుని చేరును గాత. ధారణ కలిగి వాయువును చేరుము.

2. సోమమా! చెవులకు వినిపించు శత్రుధనమును పీడించు నీవు ద్రోణ కలశమున చేరుము.

3. అభిషుతమై మధువును స్రవించుచున్నది.

రెండవ తృచ : ఋషి - అంబరీషుడు లేక ఋజిశ్వుడు.

1. సోమమా! మాకు అన్నము ప్రసాదించుము.

2. సోమమా! నీవు అనేకమందిచే కోరబడు దానవు. ధన దాత్రివి. మేము నీ విచ్చిన ధనము వద్ద ఉందుము గాక. సోమమా! మాకు నీవు అందించిన అన్నపు సుఖములు కలుగును గాత.

3. ఆవు పాడి కోరు వాని నన్నింటిలో సోమము ముఖ్యము. అది దీప్తమై అంతరిక్షమునకు చేరునట్లే యజ్ఞములకు తన ధారలచే చేరికొనును. అభిషుత సోమము మధుచ్యుతమై ఉన్నిగల పవిత్రమున చేరును.

మూడవ తృచ : ఋషి - ఋణ లేక అసదస్యు.

1. సోమమా! నీవు గొప్ప దానవు. రసవాహినివి. పితృతుల్యవు. సకల దేవతా ధామముల వైపు సాగుము.

2. సోమమా! దీప్తమై దేవతల కొరకు స్రవించుము. దివికి, భువికి, ప్రజలకు సుఖశాంతులు కలిగించుము.

3. సోమమా! నీవు దీప్తవు, పానయోగ్యవు, ద్యులోక ధర్తవు అగుచున్నావు. బలశాలి వగు నీవు సత్యస్వరూప యజ్ఞమున వర్షించుము.

తొమ్మిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఉశనుడు.

1. అగ్నిదేవా! నీవు స్తోతలకు ధనదాతవు. ప్రీతి పాత్రుడవు. అతిథివి. మిత్రుడవు. రథము వలె ధనము తెచ్చువాడవు. అట్టి నిన్ను స్తుతించుచున్నాము.

2. ఇంద్రాదులు అగ్నిని విద్వాంసునిగా ప్రశంసించుచున్నారు. మానవులు అట్టి అగ్నిని గార్హపత్య, ఆహవనీయునిగా ప్రతిష్టించుచున్నారు.

3. నిత్య తరుణ ఇంద్రా! హవి సమర్పించు యజమానులను రక్షింపుము. వారి స్తుతి వాక్యములు వినుము. నీ సామర్థ్యమున వారి పుత్రులను రక్షింపుము.

రెండవ తృచ : ఋషి - నృమేధ.

1. ప్రియములు కలిగించునట్టి, అపరాజితుడవగు, అన్యులకు లొంగని ఇంద్రా! నీవు పర్వతము వలె ఎటు నుంచి చూచినను మహానుడవు. స్వర్గస్వామివి. మా వద్దకు విచ్చేయుము.

2. సత్య స్వరూప సోమపాయివగు ఇంద్రా! నీవు ఉభయలోకముల మీద నీ ప్రభావము చూపుచున్నావు. సోమాభిషవకర్తలను వర్ధిల్ల చేయు స్వర్గాధి దేవతవు.

3. ఇంద్ర దేవా! నీవే శత్రుపుర ధ్వంసివి. రాక్షసాంతకుడవు. మానవులను వర్ధిల్ల చేయువాడవు. స్వర్గాధిపతివి.

మూడవ తృచ : ఋషి - జేత.

1. ఇంద్రుడు శత్రుపుర భంజునుడు. యువకుడు. విద్వాంసుడు. అమిత పరాక్రమశాలి. సకల కర్మపాలకుడు. వజ్రి, బహుస్తుతుడు. అదిగో అట్టి ఇంద్రుడు ప్రత్యక్షమైనాడు.

2. ఇంద్రా! నీవు వజ్రధారివి. దేవతల గోవులను దాచిన బలాసురుని గుహను తెరిచినావు కదా! అప్పుడు బలాసురుని అధీనమందలి దేవతలు భయము విడిచినారు. నీవద్దకు చేరినారు.

3. తన స్వంత బలముతో జగములను శాసించుచున్న ఇంద్రుని స్తుతించుచున్నాము. ఇంద్రుని ధనదానములు వేనవేలు. కాదు. అంతకు మించినవి "సహస్రం యస్యరాతయ ఉతవాసన్తి భూయసీః"

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర సామవేద సంహిత ఉత్తరార్చిక యందలి
తొమ్మిదవఅధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదవఅధ్యాయము

మొదటి ఖండము

తొలి తృచ : ఋషి - పరాశరుడు.

అక్రాంత్సముద్రః ప్రథమే విధర్మన్ జనయత్ప్రజా భువనస్య గోపాః |
వృషా పవిత్రే అధిసానౌ అవ్యే బృహత్సోమో వా పృధే స్వానో అద్రిః ||

1. సోమము జలమును వర్షించునది. అందరిని రక్షించునది. అంతరిక్షమున ప్రజలను పుట్టించునది. ఎంతో గొప్పది. కోరికలు పూరించునది. అట్టి అభిషుతమై, ఆదరించబడు సోమము ఎత్తున ఉన్న ఉన్నిగల పవిత్ర పాత్రమున అధికముగా వర్ధిల్లుచున్నది.

2. సోమదేవీ! మాకు ధనము, అన్నము కలిగించుటకు వాయువును ప్రసన్నుని చేయుము. అభిషుతమగుచు మిత్రావరుణులను ప్రసన్నులను చేయుము. మరుత్తుల బలములను ప్రసన్నము చేయుము. దేవతలను ప్రసన్నులను చేయుము. ద్యావాపృథ్వులను ప్రసన్నులను చేయుము.

3. మహా సోమము మహత్కార్యములు చేసినది. అది జల గర్భ స్వరూపమై దేవతలను సేవించినది. పవమాన సోమము ఇంద్రునకు బలము సమకూర్చినది. దీప్త సోమము సూర్యుని యందు తేజస్సు పుట్టించినది - **"అజనయత్సూర్యే జ్యోతిరిన్దుహః"**

రెండవ తృచ : రిషి - శునశ్శేపుడు.

1. ఈ సోమము వెలుగొందునది. మరణరహిత. ఇది పక్షి వలె వేగముగ ద్రోణ కలశము వైపు సాగుచున్నది.

2. స్తోతలచే కీర్తించబడు ద్యోతమాన సోమము యజమానులకు వివిధ ధనముల నిచ్చుదు జలములందు విహరించుచున్నది.

3. పవమాన శూర సోమము కోరదగిన సకల ధనములను స్వబలమున జయించి మాకు ఇవ్వగోరుచున్నది.

4. ఈ సోమము దివ్యము. అది రథము కోరుచున్నది. మేము కోరినవి ఇవ్వదలచుచున్నది. అదిగో నినదించుచున్నది.

5. ఈ సోమము దివ్యము. స్తోతలు దీనిని స్తుతించుచున్నారు. అశ్వమును వలె యుద్ధము కొరకు దానిని స్తుతులచే అలంకరించుచున్నారు.

6. ఈ సోమము దివ్యము. అంగుళులచే అభిషుతము. అపరాజిత. అది శత్రు సంహారమునకు వెడలుచున్నది.

7. ఈ సోమము ధారగా పారుచున్నది. కేకలు పెట్టుచున్నది. లోకములను లెక్క చేయకున్నది. స్వర్గగమునకు సాగుచున్నది.

8. ఈ సోమము యజ్ఞవంత. హింసింపజాలనిది. లోకములను లెక్క చేయకున్నది. స్వర్గమునకు సాగుచున్నది.

9. ఈ సోమము హరిత వర్ణ. ఆది యందే పుట్టినది. దేవతలు కొరకు శుద్ధి చేయబడినది. దశా పవిత్రమునకు సాగుచున్నది.

10. ఈ సోమము బహు కర్మయుత. అన్నములు పుట్టించునది. ఇది అభిషుతమై ధారగా పారుచున్నది.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషులు -అసిత దేవలులు.

1. సోమము శూర. పిండినది. వడిగల రథముల మీద ఇంద్రుని స్థానమునకు సాగుచున్నది. స్వబలమున అచటికి చేరుచున్నది.

2. ఈ సోమము మహా యజ్ఞము కొరకు బృహత్ కర్మల నిచ్చగించుచు దేవతలు చేరు యజ్ఞమునకు చేరుచున్నది.

3. సోమము అనేక రసరూప అన్నములను వర్షించునది. శోధనయోగ్య. ఋత్విజులు అట్టి సోమమును ద్రోణ కలశమున పరిశుద్ధముగా పిండుదురు.

4. సోమమును హవిర్ధానమునకు చేర్చెదరు. ఆ రెంటి మధ్య నున్న పరిశుద్ద మార్గమున అధ్వర్యులు దానిని దేవతలకు అర్పింతురు.

5. సోమము వేగవంతము. శ్వేత కిరణయుతము. రసవాహినులకు ప్రభువు. అది అధ్వర్యుల వెంట సాగును.

6. తన బలమున మా కొరకు ధనము సాధించు సోమపు కిరణములు శృంగముల వంటివి. అభిషవ సమయమున యూధపతి వృషభము తన కొమ్ములను కదలించినట్లు సోమము తన కిరణములను కదలించును.

7.

సోమము కర్మలకు అడ్డుతగులు రాక్షసులను పీడించును. పెద్ద పెద్ద అంగలు వేసి చంపదగిన రాక్షసుల మధ్యకు దూకును.

8. సోమము ఆయుధవంత. హర్షదాయక. హరితవర్ణ. సోమమును దశాంగుళులు దశాపవిత్రమున కంపును.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - రాహూగణుడు.

1. వరములిచ్చునదియు, వేగవంతయునగు సోమము వేలమందికి అన్నము సమకూర్చదలచి అభిషుతమగుచు ఉన్నిగల పాత్రలందు జల్లించబడి, దశా పవిత్రమునకు చేరును.

2. ఇంద్రుని పానము కొరకు హరిత వర్ణ సోమమును త్రితర్షి అంగుళులు అభిషవ ఫలములకు పంపుచున్నవి.

3. ఈ సోమము నరుల వద్దకు డేగవలె వేగముగను, జారుడు వ్యభిచారిణి వద్దకు వెళ్ళినట్లు సంకేత పరముగను చేరును.

4. సోమము ద్యులోకమునకు బిడ్డ. అది దశా పవిత్రమున ప్రవేశించును. రసరూప మధ్యమై దర్శనమిచ్చును.

5. పానమునకు అభిషుతమగు హరిత వర్ణ సోమము అందరిని పోషించుచు తన ప్రియ స్థానమగు దశా పవిత్రమునకు కేక పెట్టుచు ప్రవేశించును.

6. ఈ సోమమును దశాంగుళులు కర్మకొరకని శుద్ధి చేయును. అనే అంగుళులు ఇంద్రుని ప్రసన్నుని చేయుటకు శోధించును.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రియమేధ.

1. సోమము వేగవంత. సర్వజ్ఞ. మనసః పతి. దానిని అధ్వర్యులు పాత్రలందు నింపగా అనేక ధారలుగా దశా పవిత్రమునకు చేరుచున్నది.

2. ఈ సోమము దేవతల కొరకు అభిషుతమైనది. పవిత్రమున వడకట్టబడినది. అది దేవతల దేహములందు చేరుచున్నది.

3. చావు లేనిది శత్రు నాశక దేవతలకు ప్రియతమ దివ్య సోమము కలశములందు శోభిల్లును.

4. కోరికలు తీర్చు సోమము నినదించుచు దశాంగుళుల ప్రేరణ కలిగి ద్రోణ కలశమునకు పరుగులిడుచున్నది.

5. పాత్రలందుండి, బలము ఆనందము కలిగించు అభిషుత సోమము ద్యులోకమునందలి సూర్యుని వెలిగించుచున్నది. **"సూర్య మారోచయత్"**

6. వాక్పతి - హింసింపబడజాలని సోమము దీప్తిమంతమై అన్నింటిని ఆచ్ఛాదించుచు సూర్యునిచే విడువబడి దశా పవిత్రమున చేరుచున్నది.

అయిదవ ఖండము

మొదటి తృచ : -ఋషి - నృమేధ.

1. కవి, స్తుత్య, పవిత్ర సోమము శత్రువులను తరుముచు కృష్ణ మృగ చర్మము మీద దంచబడును.

2. బలసాధక, సర్వజిత సోమము ఇంద్ర, వాయువుల కొరకు దశా పవిత్రమున చుక్కలుగా రాల్చబడును.

3. ద్యులోకపు శీర్షము, కోరికలు తీర్చునట్టి, సర్వజ్ఞ సోమము చెక్క పాత్రలలోనికి ఋత్విజులచే పంపబడుచున్నది.

4. సోమము గోవులు, హిరణ్యము ఇచ్చునది. దీప్త. శత్రుంజయ. అహింస్య అది నినదించుచున్నది.

5. వృష, హరితవర్ణ, పవిత్ర, దీప్తమాన, బలశాలి సోమము దశా పవిత్రమున రాలుచున్నది. ఇంద్రుని కూడ చేరుచున్నది.

6. సోమము దేవతల రక్షక. పాపుల శిక్షక. అహింసనీయ. శోధక అట్టి బలశాలి సోమము ద్రోణ కలశమున చేరుచున్నది.

ఆరవ ఖండము

తొలి తృచ : ఋషి - రాహూగణుడు.

1. దేవతలు అభిలషించు సోము ఇంద్రుని పానమునకు అభిషుతమైనది. వృషయై, రాక్షస నాశకమై దశా పవిత్రమునకు చేరుచున్నది.

2. సర్వద్రష్ట, పాపహారి సోమము అందరిని భరించుచు దశా పవిత్రమునకు చేరును. అందునుంచి అరచుచు ద్రోణ కలశమున చేరును.

3. సోమము వేగవతి. ద్యులోక దీపిక. రాక్షస నాశక. అది అభిషుతమై, ఉన్నిగల పవిత్రమున జల్లించబడి అనేక ధారలుగా సాగును.

4. సోమము త్రితుని మహాయజ్ఞమున అభిషుతమై తన దివ్యకాంతులచే సూర్యుని ప్రకాశింపచేయుచున్నది.

5. శత్రునాశక, వర్షక, అభిషుత, ధనదాత, అహింస్య సోమము అశ్వము వలె వేగముగ కలశమున ప్రవేశించును.

6. దివ్యము, పలుచని సోమము అనుభవజ్ఞులగు అధ్వర్యుల ప్రేరణ కలిగి తన రసమున ఇంద్రుని పూజించుచు కలశముల వైపు సాగుచున్నది.

ఏడవ ఖండము

తొలి తృచ : ఋషి - పవిత్రుడు.

1. ఋషులచే సముపార్జించబడిన, వేదసార భూత పవమాన దేవతాసహిత మంత్రములను ఉచ్చరించువాడు వాయు దేవతచే రుచి పుట్టించబడిన పవిత్రమగు భోజనము చేయుచున్నాడు.

2. ఋషులచే సముపార్జించబడిన, వేదసారభూత పవమాన దేవతా సహిత మంత్రములను ఉచ్చరించువానికి సరస్వతి స్వయముగా పాలు, నేయి, బలము కలుగజేయు నీరు ప్రసాదించుచున్నది.

3. పవమాన దేవతా సహిత ఋక్కులు శుభములు కలిగించునని, ఫలప్రధములు. అనుగ్రహరూప ఘ్రుతవర్షకములు. అవి ఋషుల చేత రసరూపమున కూర్చబడినవి కదా! అవి మంత్ర పాఠకులకు అమృతములు. హితకరములు అగుచున్నవి.

4. ఇంద్రాది దేవతలచే సముపార్జించబడిన పవమాన మంత్రముల అధిష్టాత్రి దేవేరులు మాకు ఇహ, పర ఉభయలోకములను ప్రసాదింతురుగాక. మా మనోరథములను ఉభయలోకములందును ఫలింపచేయుదురు గాక.

5. ఇంద్రాదులు ఏ పవిత్ర సాధనమున నిత్యము తమను పావనము చేసికొందురో, అట్టి సహస్రధారల పవమాన దేవతా సహిత ఋక్కులు మమ్ము పావనులను చేయునుగాత.

6. పవమాన దేవతా సహిత మంత్రములు శుభప్రదములు. అవి స్వర్గము కలిగించును. ఇహమున పుణ్యము అన్నపానములు కలిగించును. అమృతత్వము కలిగించును.

ఎనిమిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. అగ్ని ఆహవనీయ స్థానమున సమిధలచే ప్రజ్వరిల్లువాడు. అగ్ని ద్యావాపృథ్వుల మధ్య విచిత్ర కిరణములచే ప్రకాశించువాడు. అగ్ని ఆహుతులు అందుకొని సర్వత్ర సంచరించువాడు. అట్టి అగ్నికి మహా ప్రణామము చేయుచున్నాము. శరణు వేడుచున్నాము.

2. అగ్ని తన ప్రభావమున సకల దురితములను దూరము చేయువాడు. ధనాగారము కలవాడు. అట్టి అగ్నిని మేము స్తుతించుచున్నాము. అతడు మమ్ము పాపములు, దుష్కర్మల నుండి కాపాడును గాక. హవి సమర్పించు మమ్ము రక్షించును గాక.

3. **అగ్నే! త్వం వరుణః త్వం మిత్రః** వసిష్ఠులు నిన్ను స్తుతించుచున్నారు. వర్ధిల్ల చేయుచున్నారు. నీ వద్ద ఉన్న ధనము మా అనుభవమునకు వచ్చునుగాత. **"యూయంపాత స్వస్తిభిః సదానః"** మీ దేవతలందరు మాకు శుభములు కూర్చి, మమ్ము రక్షింతురుగాక.

రెండవ తృచ : ఋషి - వత్సుడు

1. ఇంద్రుడు పర్జన్యుని వలె వృష్టి కలిగించువాడు. తన మహిమతోనే అందరిని మించినవాడు. స్తోతలు అతనికి బిడ్డలవంటివారు. వారి స్తుతులచే అతడు వర్ధిల్లును. **"స్తోమైర్వత్సస్య వావృధే"**

2. స్తోతలు ఇంద్రుని స్తుతించి అతనిని యజ్ఞాధిష్టాతను చేయుచున్నారు. అప్పుడు ఆయుధములు నిరర్ధకములే కదా!

(ఇంద్రుడే రక్షకుడైనపుడు ఆయుధములేలా? అని.)

3. ఇంద్రుడు యజ్ఞమున ప్రత్యక్షమైనాడు. ఆకాశమును నింపునట్టి అశ్వములు ఇంద్రుని వేగముగా తీసికొని వెళ్ళుచున్నవి. అట్టి ఇంద్రుని ఋత్విజులు కీర్తించుచున్నారు. **"విప్రా ఋతస్య వాహసా"**

తొమ్మిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - వైఖానసుడు.

1. మరల మరల తిమిరాములను ధ్వంసము చేయు సర్వత్రగామి హరిత వర్ణ సోమము దేవతలకు ఆనందము కలిగించుటకుగాను కలశములకు పారుచున్నది.

2. పవమానము గొప్ప రథము కలది. తేజస్సులను మించిన తేజస్సు గలది. హరిత ధారలది. దానికి మరుత్తులు సహాయకులు అగుచున్నారు.

3. పవమానమా! నీవు అన్నము, బలము ఇచ్చుదానవు. స్తోతలకు వీర పుత్రులనిమ్ము. నీ వెలుగులను జగములందు నింపుము.

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. సోమము హవిస్సులందు విశిష్టము. మానవ హితకారి. జలములందు వసించునది. రాళ్ళచే దంచబడునట్టిది. అట్టి సోమమును ఇచట చల్లండి.

2. సోమమా! నీవు ఎంతటి వానికిని లొంగవు. ఎంతో పరిమళము కలదానవు. శుద్ధి చేయబడుచున్న నీవు ఉన్ని పాత్రలకు ప్రవహింపుము. అభిషుతమైనంత నీయందు గోఘ్రుతాదులను కలుపుదుము. జలములందు నిన్ను ప్రసన్నను చేయుదుము.

3. దేవతలకు తృప్తి కలిగించు, యజ్ఞ సాధక, సర్వద్రష్ట సోమము అభిషుతమై ద్రోణ కలశము చేరుచున్నది. దర్శించుకొనండి.

పదవ ఖండము

మొదటి తృచ : ఋషి - నృమేధ.

1. సకల కిరణములు సూర్యుని సేవించుచున్నవి సకల ధనములు ఇంద్రుని సేవించుచున్నవి. ఇంద్రుడు తన బలమున సృష్టించిన ధనములకు మమ్ము- పితరుల ధనమునకు వంటి భాగస్వాములను చేయునుగాత.

2. **"భద్రా ఇంద్రస్య దాతయః"** ఇంద్రుని దానములు శుభప్రధములు. ఇంద్రుని మనసు దానములకు ప్రేరణ కలిగించును. ఇంద్రుని ఆరాధించు వారి కోరికలు నిష్ఫలములు కావు.

స్తోతలారా! దాతయు, పుణ్య కర్ములకు ధనము నిచ్చు ఇంద్రుని స్తుతించండి.

రెండవ తృచ : ఋషి - భర్గుడు.

1. **'యత ఇన్ద్ర భయామహే తతోనో అభయం కృధి'** ఇంద్రా! ఎచట మాకు భయము కలుగుచున్నదో అచట మమ్ము నిర్భయులను చేయుము.

ఇంద్రదేవా! మాకు నీ రక్షణలు కలిగించుము. మమ్ము ద్వేషించు వైర్ని భంగపరచుము. మమ్ము హింసించు వైర్ని భంగపరచుము.

2. ఇంద్రా! నీవు ధనపతివి. మా కిచ్చుటకు నీ వద్ద అపార ధనమున్నది. భూములున్నవి. నీవు స్తుతి యోగ్యుడవు ధనవంతుడవు. మేము నిన్ను అభిషుత సోమము అర్పించి ఆహ్వానించుచున్నాము.

పదకొండవ ఖండము

మొదటి తృచ : ఋషి - భరద్వాజుడు.

1. సోమమా! నీవు పరమానందప్రదవు. మహాశక్తి ప్రదవు. ఆధ్వరమున ధారవగుము. స్తోత్ర యుక్తవై ద్రోణ కలశమున పరిశుద్ధవగుము.

2. సోమమా! నీవు అత్యంత మదయుక్తవు. యజ్ఞమును భరించుదానవు. బలయుతవు. దీప్తవు శత్రుంజయవు.

3. సోమమా! నీవు పాషాణములచే అభిషుతవగుము. నినదించుము. ద్రోణ కలశమున చేరుము.

రెండవ తృచ : ఋషి - మనువు.

1. సోమమా! నీవు దేవతలకు ఆహారమవు. శక్తివంతవై ధారగా ప్రవాహింపుము. మాదక రసవంతవై ద్రోణ కలశమున స్థిరపడుము.

2. సోమమా! జలమునకు చేరునట్టి వేగవంతమగు నీ యొక్క రసము బలము కలిగించి ఇంద్రుని వర్ధిల్ల చేయును. దేవతలు నిన్ను అమృతత్వమునకు సేవింతురు.

3. సోమము ద్యులోకమున వృష్టి కలిగించునది. స్వర్గప్రద. భూమి మీద వర్షము కలిగించునది. అభిషుతము, పవిత్రము. అట్టి సోమము మాకు ధనము ప్రసాదించునుగాత.

మూడవ తృచ : ఋషి - అంబరీషుడు.

1. అందరు అభిలషించునట్టి పాపహారి బభ్రువర్ణ సోమము దశా పవిత్రమున శోధితమగును. సోమము మాదక రసమై సకల దేవతల వద్దకు చేరును.

2. సోమము స్వంత కీర్తిగలది. పాషాణ పీడిత. ఇంద్ర ప్రియ. తరంగవంత. అట్టి సోమమును దశాంగుళులు జలములందు శుభ్రము చేయును.

3. సోమమా! వృత్రఘ్న ఇంద్రుని కొరకును దక్షిణ లిచ్చునట్టి యజ్ఞము కొరకును, అనేక యజ్ఞములు చేయు నరుల కొరకును పాత్రలందు ప్రవేశించుము.

నాలుగవ తృచ : ఋషి - త్రసదస్యు.

1. సోమమా! నీవు అశ్వమును వలె శుభ్రము చేయబడినదానవు. వేగవంతవు. మాకు గొప్ప ధనము, బలము కలుగుటకు పాత్రలందు చేరుము.

2. సోమరసము మాదకమగుటకు ఋత్విజులు దానిని పవిత్రము చేయుదురు. తమకు మహా యశస్సు, అన్నము కలుగుటకు సోమమును ద్యుమంతమును చేయుదురు.

3. దేవతలకు శిశువు వలె పుట్టిన హరిత వర్ణ సోమమును ఋత్విజులు దేవతల కొరకు పరిశుద్ధము చేయుచున్నారు.

ఐదవ తృచ : ఋషి - అమహీయుడు.

1. పుట్టినది జలమున చేరినది. శత్రునాశక, గోఘ్రుతాది మిశ్రిత సోమము వద్దకు దేవతలు చేరుచున్నారు.

2. ఇంద్రుని హృదయమును సేవించు సోమమునే మా యొక్క స్తుతిరూపవాణి - పిల్లలను పాలుగల తల్లి వలె - వర్ధిల్ల చేయుచున్నది.

3. సోమమా! మా గోవులకు సుఖములు కలిగించుము. మా గృహములను అన్నములతో నింపుము. ద్రోణ కలశ జలమును వర్ధిల్ల చేయుము.

పన్నెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - త్రిశోకుడు.

1. ఏ ఋషులు అభిముఖులై అగ్నిని ప్రజ్వరిల్ల చేయుదురో, ఎవరికీ యువతమ ఇంద్రుడు మిత్రుడగునో అట్టి వారు దర్భలను పరచుచున్నారు.

2. **ఏషా మిన్ద్రో యువాసఖా** - యువక ఇంద్రుడు, ఎవరికి మిత్రుడగుచున్నాడో వారి సమిధలు గొప్పవి, స్తుతులు గొప్పవి, శస్త్రములు గొప్పవి అగుచున్నవి.

3. **ఏషా మిన్ద్రోయువా సఖా** అట్టివాడు యోద్ధ, సేనాపరి వేష్టితుడు, స్వబలమున శత్రువులను జయించువాడు అగుచున్నాడు.

రెండవ తృచ : ఋషి - గోతముడు.

1. ఇంద్రుడు ఒక్కడే హవిసమర్పించు నరులకు ధనమును ఇచ్చుచున్నాడు. అప్రతిహతుడగు ఇంద్రుడు లోకములకు ప్రభువగుచున్నాడు.

2. అనేకమందిచే సోమమును సిద్దము చేయించి, ఇంద్రుని ఆరాధించువారికి ఇంద్రుడు మహా బలమును ఇచ్చుచున్నాడు.

3. దేవతలకు హవి అర్పించని నరులను ఇంద్రుడు ఎప్పుడు కాలితో పూవును నలిచినట్లు నలిపివేయును? ఇంద్రుడు ఎప్పుడు వేగముగా వచ్చి మా స్తుతులను వినగలడు?

మూడవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. శతక్రతు ఇంద్రా! ఉద్గాతలు నీ గుణగానము చేయుచున్నారు. అర్చకులు నిన్ను అర్చించుచున్నారు. బ్రాహ్మణులు తమ వంశమును వలె నిన్ను వర్ధిల్ల చేయుచున్నారు.

2. యజమాని సోమవల్లి కొరకు కొండలు ఎక్కినప్పుడు అనేక కర్మలు గల యజ్ఞమును అనుష్టించినపుడు ఇంద్రుడు యజమాని కార్యమును తెలిసికొనుచున్నాడు. వరదుడగుచు దేవగణ సహితుడై యజ్ఞమునకు వచ్చుచున్నాడు.

3. సోమపాయి ఇంద్రా! కేశగ్రీవ, యువ, పరిపుష్టలగు నీ అశ్వములను రథమునకు కట్టుము. మా స్తుతులు ఆలకించుటకు మా వద్దకు విచ్చేయుము.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పదవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదకొండవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - మేధాతిథి.

సుషమిద్ధో న ఆ వహ దేవాం అగ్నే హవిష్మతే| హోతః పావక యక్షిచ |

1. అగ్నీ ఉజ్జ్వలముగ ప్రజ్వరిల్లుము. మా యజమాని కొరకు దేవతలను ఆహ్వానించుము. పావకుడవు. హోతవగు అగ్నీ! ఆ దేవతలను నీవే యజించుము.

2. కవీ! నీవు తనూనపాత అగ్నివి. మమ్ము రక్షించుటకు గాను నేడు మధుమన్తమగు మా యజ్ఞమును దేవతలకు చేర్చుము.

3. అగ్నీ! నీవు ప్రేమగలవాడవు. తీయని పలుకుల వాడవు. నరాశంస నామకుడవు. ఇప్పటి ఈ యజ్ఞమందలి హవిస్సులను దేవతలకు అందించుమని నిన్ను ఆహ్వానించుచున్నాము.

4. అగ్నీ! నీవు మానవులకు హితకరుడవు. హోతవు. సుఖతమ రథమున దేవతలను యజ్ఞ భూమికి తీసికొని రమ్ము.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. పాప నాశకులగు మిత్రుడు, ఆర్యమ, భగుడు, సవిత నేటి సూర్యోదయమున మాకు ధనము ప్రసాదింతురు గాక.

2. మిత్రాది దేవతలారా! మీరు విచ్చేసినంత మాకు రక్షణలు కలుగును గాక. మమ్ము పాపముల నుండి తరింప చేయుదురు గాక.

3. మిత్రాది దేవతలు, అదితి మాత సురక్షితములగు మా కర్మములకు ప్రభువులు అగుచున్నారు. వారు మాకు ప్రభువులు, మాకు ధనము ప్రసాదించగల శక్తి గలవారలు అగుచున్నారు.

మూడవ తృచ : ఋషి - ప్రగాథుడు.

1. **"ఉత్త్వా మదస్తు సోమాః"** ఇంద్రదేవా! సోమములు నీకు మరింత ఆనందము కలిగించునుగాక. వజ్రాయుధధారీ! మాకు అన్నము కలిగించుము. వేదవిద్వేషులను హతమార్చుము.

2. ఇంద్రా! నీవు మహానుడవు. నీకు సరివచ్చు వారు లేరు. యజ్ఞములందు ధనదానము చేయని లోభులను కాలి క్రింద నలిచివేయుము.

3. ఇంద్రా! నీవు సంస్కరించబడిన, సంస్కరించబడని సోమములకు అధిపతివి. త్వం రాజా జనానామ్ - నీవు జనులకు రాజువు.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - పరాశరుడు.

1. సోమము అప్రమత్త, సత్య స్వరూప స్తుతల ప్రజ్ఞాత. అది అభిషుతమగుచు పాత్రలందు ప్రవేశించును.

అధ్వర్యుల హస్తములు పరస్పరము సహకరించుకొనునవి. కోరికలు కలవి. యజ్ఞములను నిర్వహించునవి. అవి సోమమును తాకుచున్నవి.

2. సోమము అభిషుత యజ్ఞసాధక. అది ప్రేరణ కలిగించు ఇంద్రుని చేరుచున్నది. ద్యావాపృథ్వులను తన మహిమచే నింపుచున్నది.

సోమము ప్రియ పదార్థములను ఇచ్చునది. అత్యంత ప్రియధారల సోమము మమ్ము రక్షించుచున్నది. నేను సోమ భ్రుత్యుడను. సోమము మాకు ధనములు ప్రసాదించునుగాత.

3. సోమము వర్థిల్లునది. వర్థిల్ల చేయునది. దశా పవిత్రమున పరిశుద్ధమగునది. అది తన తేజో రూపమున మమ్ము రక్షించునుగాత.

సోమము ప్రసన్నమైనంత స్థానజ్ఞులు, సర్వ విదులైన మా పూర్వ పితరులను గ్రోగ్రహణమునకు గాను పర్వతముల వైపు సాగుచున్నారు.

రెండవ తృచ : ఋషి - ప్రగాథుడు.

1. మిత్రులారా! ఇంద్రుని తప్ప ఇతఃరులను స్తుతించకండి. బలహీనులు కాకండి. సోమము అభిషుతమైనంత వరదుడగు ఇంద్రుని సామూహికముగ స్తుతించండి. ఇంద్రుని గూర్చిన మంత్రములను మరి మరి ఉచ్చరించండి.

2. ఇంద్రుడు వృషభము రీతి శత్రువును దెబ్బతీయువాడు. గోవు వంటి వేగవంతుడు. శత్రు పుత్రులను తరిమి కొట్టువాడు. శత్రు ద్వేషి. ఆరాధనీయుడు. ఆగ్రహానుగ్రహ సమర్ధుడు. పరమదాత. ఇహ పర ఐశ్వర్యవంతుడు. అట్టి ఇంద్రునే స్తుతించండి.

మూడవ తృచ : ఋషి - మేధాతిథి.

1. అత్యంత మధురములగు వేదస్తుతుల ఉచ్చారణ స్వరములు పైపైకి వ్యాపించుచున్నవి. అప్పుడే శత్రువులను జయించుచు, ధనములు సంగ్రహించుచు పటిష్ఠ రక్షణలు గల అన్నము కోరు రథములు భువి మీద సంచరించుచున్నవి.

2. స్తోతలు కణ్వుల వలె స్తుతించుచు, ధ్యానించుచు సూర్యుని వలె ఇంద్రునకు వ్యాప్తి కలిగించుచున్నారు. యజ్ఞమును ఆరాధించు ఋత్విజులు ఇంద్రుని అర్చించుచున్నారు. స్తుతులచే ప్రశంసించుచున్నారు.

నాలుగవ తృచ : ఋషి - రుణ లేక త్రసదస్యు.

1. సోమమా! మాకు అన్నము అందించుటకు అన్నివైపుల నుండి చేరుకొనుము. నీవు సహన శీలవు. శత్రువులను ప్రతిఘటించుము. మా రుణములను తీర్చుము. మా శత్రువులను దెబ్బతీయుటకు రమ్ము.

2. పవమానమా! జలములు ధరించు అంతరిక్షమున నీ స్వశక్తితో సూర్యుని సృష్టించినావు. ఇది నిజము.

సోమమా! నీవు స్తోతలకు గవాది పశువులను ఇచ్చుదానవు. జ్ఞానివి. వేగవంతవు. నీవే సూర్యుని సృష్టించినావు.

3. సోమమా! నీవు అభిషుతవైనావు. మాదకమవు అయినావు.

ఐదవ తృచ : - ఋషి - ఋణ లేక అసదస్యు

1. సోమమా! చక్కగా ప్రవహింపుము.

2. సోమమా! నీవు దీప్తవు. దివ్యవు. పానయోగ్యవు. అమృతత్వము కొరకును, మహాపదము కొరకును వర్షించుము.

3. సోమమా! క్రతువు కొరకును, సాహసము కొరకును ఇంద్రుడు నిన్ను పానము చేయును గాక సకల దేవతలు నీ యొక్క రసమును పానము చేయుదురుగాక.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - హిరణ్య స్తూపుడు.

1. సోమము సూర్యుని వలె సర్వవ్యాప్తమై ద్రవించునది. మదకారి. అభిషుతము. పాత్రలందు నిలుచునది. అది పరివ్యాప్తమగు దశా పవిత్రమునకు ఒకేసారి చేరును. సోమము ఇంద్రుని తప్ప అన్య దేవతలను చేరుకొనదు.

2. స్తుతులు ఇంద్రుని చేరును. మధుర సోమము జలములకు చేరును. మాదక రసమును కురిపించు సోమధారలు ఇంద్రుని నోటికి చేరును. పాత్రలందుండి, యజమానులచే శుద్ధము చేయబడిన సోమము త్వరత్వరగ ఉన్ని పాత్రలందు జల్లించబడి వెడలుచున్నది.

3. సోమము వృషభము వలె ధ్వని చేయును. స్తుతులు - గోవును వృషభము వలె సోమమును అనుసరించును. సోమము దివ్యమై అభిషుతమగును. తెల్లని ఉన్ని పాత్రలందు జల్లించబడి వెడలును. అది కవచము వంటి ఉజ్వల పదార్థములను కప్పుకొనును.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. అగ్ని ప్రశస్తుడు. దూరము నుంచి దర్శనమిచ్చువాడు. గృహపతి ఆగమ్యుడు.

నరులారా! అగ్ని అరణ్యములందు అస్తమించినపుడు అంగుళులతో వెలిగించండి.

2. అగ్ని ఇంటింట పూజనీయుడు. నిత్యుడు. సుందరుడు. దర్శనీయుడు. సమస్త భయముల నుండి రక్షణ పొందుటకు స్తోతలు అగ్నిని శాలయందు ప్రతిష్టింతురు.

3. యువతమ అగ్నీ! నీవు పూర్తిగా ప్రజ్వరిల్లినావు. నిరంతర జ్వాలా రూపుడవై మా కొరకు ఆహవనీయ స్థానమున నిలువుము.

మూడవ తృచ : ఋషి - సర్పరాజ్ఞి.

1. సూర్యుడు గమనశీలుడు. అతని తేజము పరివ్యాప్తము. అతడు ఉదయాచలమున చేరి సకల ప్రాణులకు

తల్లియైన భూమికి చేరుచున్నాడు. పిదప తండ్రియైన ద్యులోకమునకు చేరుచున్నాడు.

2. ఈ సూర్యుని వెలుగులు అస్తమించును. అయినను నడుచును. మహాన్ అంతరిక్షమును ప్రకాశింపచేయును.

3. పగటి ముప్పది గడియలు సూర్యుడు దేదీప్యమానుడై ప్రకాశించును. అప్పుడు సకల వాక్కులు సూర్యునే నుతించుచున్నవి.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత ఉత్తరార్చిక యందలి
పదకొండవ అధ్యాయము సమాప్తము

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పన్నెండవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - గోతముడు లేక వసిష్ఠుడు.

ఉప ప్రయన్తో అధ్వరం మన్త్రం వోచే మాగ్నయే |
ఆరే అస్మే చ శృణ్వతే ||

1. మేము అధ్వరము అనుష్టించువారలము. మేము అగ్నిని మంత్ర రూపమున స్తుతింతుము గాక. అగ్ని దూరము నుండి సహితము వీనిని వినగలవాడు.

2. అగ్ని అనాది కాలపు వాడు. హతమార్చు శత్రువులు గుమికూడినపుడు హవిస్సులర్పించు వారి ధనములను అగ్ని రక్షించుచున్నాడు.

3. అగ్ని పరమ కళ్యాణ స్వరూపి. అతడు మా ధనములను శత్రువుల నుండి రక్షించునుగాత. మమ్ము పాపముల నుండి రక్షించును గాక.

4. అగ్ని శత్రునాశకుడు. రణ, రణమున ధనంజయుడు. అగ్ని అరణ్యములందు వెలువడినాడు. నరులు అట్టి అగ్నిని స్తుతింతురుగాత.

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. అగ్ని దేవా! నీ అశ్వములు సాధువులు. వేగవంతులు. సావధనముగా నీ రథమును చేర్చగలవి. వానినే నీ రథమునకు కట్టుము.

2. అగ్నీ! మా ఎదుటికి రమ్ము. హవిని ఆరగించుటకు, సోమపానము చేయుటకు హవిస్సులు అందుకొనుటకు దేవతలను ఆహ్వానించుము.

3. యజ్ఞములను భరించు అగ్నీ! ఉన్నతుడవై ప్రజ్వరిల్లుము. జరా రహిత. ద్యోతమాన అగ్నీ! నీ అవిచ్ఛిన్న తేజమున సకల లోకములను ప్రకాశింపచేయుము.

మూడవ తృచ : ఋషి - వాశ్య ప్రజాపతి.

1. సోమము అభిషుతము. భోజనయోగ్యము. యజ్ఞవిఘ్నకారి శునకము అభిషవధ్వని వినకుండును గాక. భృగువులు యజ్ఞవిఘ్నకారులను చేసినట్లు శునకమును తొలగించండి.

2. సోమము దేవతల బంధువు. తల్లిదండ్రుల చేతులలో బిడ్డవలె సోమము దశాపవిత్రమున నిలిచి ఉన్నది. జారుడు వ్యభిచారిణి కొరకు, వరుడు కన్య కొరకు వలె సోమము స్వస్థానమగు కలశమునకు చేరుచున్నది.

3. సోమము బలసాధనము. శక్తిమంతము. సోమము ద్యావాపృథ్వులను తన తేజమున నింపుచున్నది. యజమాని ఇంటికి చేరినట్లు సోమము దశాపవిత్రము నుండి కలశమునకు చేరుచున్నది.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - సౌభరి.

1. ఇంద్రా! నీవు పుట్టుకతోనే శత్రు రహితుడవు. అనాదిగా నిన్ను నియంత్రించువారు లేనే లేరు. నీవు స్నేహము కోరినపుడు యుద్ధము చేయుచునే స్తోతలకు మిత్రుడవగుదువు.

2. ఇంద్రా! కేవలము ధనవంతునితో యజ్ఞయాగాదులు చేయనివానితో, నీవు స్నేహము చేయవు. సుర త్రాగువారు నిన్ను ప్రసన్నుని చేయజాలరు. నిన్ను స్తుతించు వారిని నీకు ఆత్మీయులనుగా చేసికొన్నప్పుడు వారికి ధనాదులు ప్రసాదింతువు. తదుపరి అతనిచే తన తండ్రిని వలె ఆహ్వానించ బడుదువు.

రెండవ తృచ : ఋషి -మేధాతిథి లేక మేధ్యాతిథి.

1. ఇంద్రా! నీ అశ్వములు హవిసహితములు. కేశములు కలవి. సువర్ణ రథమునకు పూన్చబడినవి. వందలు, వేల ధనములు కలవి. ఆ అశ్వములు నిన్ను సోమపానమునకు తీసికొని వచ్చునుగాత.

2. ఇంద్రా! నీది బంగరురథము. దానికి కట్టిన గుర్రముల వీపులు తెల్లనివి. వాటి తోకలు నెమలి పించముల వంటివి. అవి నిన్ను మధుర రస, స్తుతి యోగ్య సోమపానమునకు యజ్ఞ భూమికి చేర్చునుగాత.

3. వేదస్తుత్య ఇంద్రా! ఈ సోమము అభిషవాదులచే సంస్కరించబడినది. రసయుక్తముగ సిద్ధమై ఉన్నది. వాయువు దేవతలందరి కన్న ముందు సోమపానము చేసినట్లు నీవు ఆ సోమమును పానము చేయుము. ఇది సురుచిర హర్షదాయక సోమమగును.

మూడవ తృచ : ఋషి - ఋజిశ్వ.

1. ఋత్విజులారా! అశ్వమువలె వేగవంతము, స్తుతియోగ్యము. జలముల, వెలుగుల ప్రేరకము. ద్రవము. నీటిలో తేలియాడు సోమమును శుద్ధిచేయండి. తడపండి.

2. సోమము సహస్ర ధారలది. దుగ్ధము వలె ప్రియము. దానిని దేవతల కొరకు అభిషవించండి దివ్యము, సత్య స్వరూపము, మహత్తరము, జలోత్పన్న సోమము వసతీవరీ నామక జలమున పెరుగును.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - భరద్వాజుడు.

1. అగ్ని చక్కగ ప్రజ్వలించువాడు. శ్వేతవర్ణుడు. హవిస్సులు అందుకొనువాడు. స్తుతి యోగ్యుడు. స్తోతలకు ధనప్రదుడు. అట్టి అగ్ని శత్రువులను సంహరించుచున్నాడు.

2. అగ్ని ద్యావాపృథ్వులు తండ్రి తల్లులుగా అక్షయుడై విద్యుద్రూపమున ఆవిర్భవించినవాడు. అతడు యజ్ఞపు ఉత్తరవేది యందు ఆసీనుడు అయినాడు.

3. విజ్ఞుడవు, ద్రష్టవగు అగ్నీ! దేవతల వద్ద ఉన్న దివ్యాన్నము వంటి పుత్ర, పౌత్రాదులతో కూడిన ధనమును మాకు ప్రసాదించుము.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. ఈ సోమమునకు హిరణ్యము ప్రేరకము. ఇది పవిత్రము. దీప్తము. దేవతలకు చేరునది. హోత పశుమంతమగు యజ్ఞశాలకు చేరినట్లు, ఈ అభిషుతసోమము శబ్దము చేయుచు పవిత్రమున చేరుచున్నది.

2. సోమమా! నీవు శుభప్రదవు. సంగ్రామ యోగ్యవు. తేజోమూర్తివి. మహా కవులు, అనుభవజ్ఞులగు స్తోతలను ప్రశంసించుదానవు. ద్రష్టవు. అప్రమత్తవు. అభిషుతమగు నీవు యజ్ఞ పాత్రలందు ప్రవేశించుము.

3. సోమము యశోవంతులందు యశస్వి. భూమి మీద పుట్టినది. తృప్తినిచ్చునది. ఉన్నిగల పాత్రలందు వడకట్టబడినది. పవిత్రము. అట్టి సోమమా! నీవు అంతరిక్షమున నినదించుము. **"యూయం పాతస్వస్తిభిః సదానః"** మీరు మాకు నిత్యము శుభములు కలిగించుచు పోషించండి.

మూడవ తృచ : ఋషి - తిరశ్చి.

ఋషులు తమలోతాము అనుకొనుచున్నారు:-

1. రండి - రండి. త్వరగా రండి. సామ మంత్రములు పరిశుద్ధము. ఆ మంత్రములచే ఇంద్రుని స్తుతింతము. వర్ధిల్లచేయుదము. పరిశుద్ధము, గోఘ్రుతాది మిశ్రిత సోమము ఇంద్రుని ప్రసన్నుని చేయునుగాత.

2. పరిశుద్ధుడవైన ఇంద్రా! మా వద్దకు విచ్చేయుము. పరిశుద్ధ మరుత్తులచే పాపరహితునిగా చేయబడిన ఇంద్రా! విచ్చేయుము. పరిశుద్ధుడవైన ఇంద్రా! మమ్ము ధనములందు నిలుపుము. సోమము నీకు ఆనందము కలిగించును గాత.

3. పరిశుద్ధ ఇంద్రా! మాకు ధనము ప్రసాదించుము. పరిశుద్ధుడవగు నీవు రత్నములనిమ్ము. పరిశుద్ధుడవై యజ్ఞ విఘ్నకారులను హతమార్చుము. మాకు అన్నము కలిగించుము.

(ఇంద్రుడు వృత్రాదులను సంహరించుట వలన అతనికి పాపము కలిగినది. ఋషులు అతనికి పాప పరిహారము చేసి పరిశుద్ధుని చేసినారను వృత్తాంత సందర్భము.)

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - సుతంభరుడు.

1. అగ్ని సూర్యరూపి. ఆకసమున ప్రకాశించువాడు. మేము ధనము కోరువారలము. అగ్నిని గూర్చి సాధక స్తుతులు ఉచ్చరించుచున్నాము.

2. మానవులందు హోమ సంబంధమై, సిద్ది కలిగించు అగ్ని ఉన్నది. అతడు మా స్తుతులను సేవించును గాత. దేవ సంబంధులను యజించునుగాక.

3. అగ్నీ! నీవు నిత్య ప్రసన్నుడవు. వరేణ్యుడవు. హోమసాధకుడవు. అందరిని మించినవాడవు. యజమానులందరు నీ ద్వారానే యజ్ఞామష్టానము చేయుచున్నారు.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. సోమము మూడు స్తోత్రములది. కోరికలు తీర్చునది. అన్నదాత. ధ్వనించునది. స్తోతల వాక్ శబ్దములు సోమము వైపు సాగుచున్నవి.

సోమము వరణుని వలె జలములను ఆచ్ఛాదన చేసికొనునది. ప్రవహించునది. రత్నదాత. అది స్తోతలకు ధనము నిచ్చుచున్నది.

2. సోమము శూర సమూహము గలది. అనేక మంది వీరులు కలది. సహనశీల. శత్రుంజయ. ధనదాత. పదనైన ఆయుధములు కలది. వేగవంత ధనువు కలది. యుద్ధమందు ఎదురులేనిది. శత్రువును లక్ష్య పెట్టనిధి. అట్టి సోమమా! నీవు కలశము వర్షించుము.

3. సోమమా! నీ మార్గములు విశాలములు. నీవు స్తోతలకు అభయము ఇచ్చుదానవు. ద్యావాపృథ్వులను కలుపుచు వర్ణించుము. జలము, ఉష, సూర్యుడు, కిరణములకు పుష్టి కలిగించుము. నినదించుము. మాకు అనేక అన్నములను ప్రసాదించుము.

మూడవ తృచ : ఋషి - నృమేధ లేక పురుమేధ.

1. ఇంద్రా! నీవు అన్నమును, బలమును రక్షించువాడవు. సోమమునకు స్వామివి. యశశ్వివి. తలవంచనివాడవు. యజమానులను కాపాడువాడవు. వంటరిగా అప్రతిహత వీరులను హతమార్చువాడవు.

2. బలశాలి ఇంద్రా! నీవు అట్టి గుణగణములు కలవాడవు. తండ్రి నుంచి ధన భాగము కోరినట్లు నిన్ను ధనము కొరకు అర్థించుచున్నాము. యశస్సు వంటి నీ నివాసము ద్యులోకమున ఉన్నది. నీ వంటి సుఖములు మాకు కలుగును గాత.

నాలుగవ తృచ : ఋషి - సౌభరి.

1. అగ్నీ! నీవు దేవతలందు అధికదాతవు. హోతవు. అవినాశ్యుడవు. ఈ యజ్ఞనిర్వహకుడవు. యష్టవు. మేము నిన్ను

భజించుచున్నాము.

2. అగ్ని జలముల పౌత్రుడు. సుభగుడు. సుదీప్తుడు. జ్వాలావంతుడు. అట్టి అగ్ని దేవయజన భూమియందు మిత్రావరుణుల సుఖము కొరకు యజించునుగాక జలములకు సుఖము కలుగునట్లు యజించునుగాత.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. అగ్నిదేవా! నీచేత రక్షించబడువాడును, నీచేత యుద్ధములకు ప్రోత్సహించబడినవాడును నిత్యాన్నవంతుడు అగుచున్నాడు.

2. శత్రువులను లక్ష్యపెట్టని అగ్నీ! నిన్ను అర్చించు వానిని గెలువ గలవాడు లేడు. అతని బలములు అందరు వినదగినవై యుండును.

3. సమస్త మానవులందున్న అగ్ని అశ్వములచే యుద్ధములను గెలుచునుగాక. అగ్ని ఋత్విజు సహితుడై ప్రసన్నుడగును గాత.

రెండవ తృచ : ఋషి - నోధ.

1. కలసి పనిచేయునవియు, పనిచేయుటకు అటునిటు కదలునవియునగు అంగుళులు సోమమును శుద్ధి చేయును. దశాంగుళులు సోమ ప్రేరకములు అగును. హరిత వర్ణ సోమము సూర్యజాతుల వంటి దిశలకు చేరును. సోమము అశ్వ వేగమున ద్రోణ కలశమున వ్యాపించును.

2. సోమము దేవతలచే కోరబడునది. కోరికలు తీర్చునది. అనేకులు అభిలషించునది. తల్లిదండ్రులు శిశువును వలె సోమమును జలములు ఎత్తుకొనుచున్నవి. యువకుడు యువతిని చేరినట్లు అభిషుత సోమము ద్రోణ కలశమున గోఘ్రుతాదులచే కలియుచున్నది.

3. ఆవులు మేయునట్టి గడ్డి మున్నగు వాణిలో ప్రవేశించిన సోమము ఆవు పొదుగును పరిపూర్ణము చేయును. బిందు రూప సోమము ధారలందు కలియును. పాత్రలందున్న సోమమును ఆవులు శుభ్ర వస్త్రముచే వలె తమ పాలచే ఆచ్ఛాదించును.

మూడవ తృచ : ఋషి - మేధాతిథి.

1. ఇంద్రా! ఈ సోమము రసమయము. గోఘ్రుతాది యుక్తము. మాచేత అభిషుతము. దీనిని సేవించుము తృప్తుడవగుము. కలిసి పానము చేయు మమ్ము బంధువులను చేసికొనుము. మమ్ము వర్ధిల్లచేయుము. **"అవన్తు తే ధియా"** నీ అనుగ్రహము మమ్ము రక్షించునుగాక.

2. ఇంద్రా! నీ అనుగ్రహమున మేము అన్నము గలవారలము అగుదుము గాక నీ శత్రువును వేధించుటకు మమ్ము బాధించకుము. నీ రక్షణలు విచిత్రములు. అర్ధించదగినవి. వానితో మమ్ము రక్షింపుము. మమ్ము నిత్యసుఖులను చేయుము.

నాలుగవ తృచ : ఋషి - రేణుః.

1. అంతరిక్షమున ఉన్న సోమమునకు ఇరువది యొక్క గోవులు వాస్తవముగా పాలిచ్చును. ఈ సోమము యజ్ఞములందు పెరుగును. తదుపరి ఆ సోమము అన్య నాలుగు జలములందు చేరి పరిశుద్ధమగును. ఆ జలములకు కళ్యాణ రూపము కలిగించును.

2. జలములకు కళ్యాణ రూపము కలిగించిన సోమము - స్తుతులచే - ద్యావాపృథ్వులను జలపూర్ణములను చేయును. అత్యంత దీప్త జలములను సోమము ఆచ్ఛాదించుకొనును. అప్పుడు ఋత్విజులు సోమమును హవియుక్తము చేసి యజ్ఞ సదనమున నిలుపుదురు.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - కుత్సుడు

1. సోమమా! నీవు స్తుతించబడుచున్నావు. పానమునకు వాయువును చేరుము. పవమానవై మిత్రావరుణులను చేరుము. అందరి నేతలు, మనోవేగము గల రథము గల అశ్వినులను చేరుము. వజ్రధారి, వరములిచ్చు ఇంద్రుని చేరుము.

2. దేవసోమమా! నీవు మాకు వస్త్రయుక్తమును, రక్షణలు కలిగించు ధనమును ప్రసాదించుము. పవమాన సోమమా! మంచి పాలిచ్చు ధేనువులను ప్రసాదించుము. మా పోషణ కొరకు ఆనందదాయక సువర్ణనిమ్ము. అశ్వయుక్త రథములనిమ్ము.

3. పావన సోమమా! మాకు ద్యులోక ధనములనిమ్ము. భూలోక ఐశ్వర్యములనిమ్ము. వానిని అనుభవించ దగిన సామర్ధ్యము నిమ్ము. జమదగ్నికి ఇచ్చినటు వంటి ఋషి యోగ్య ధనము నిమ్ము.

రెండవ తృచ : ఋషి - ప్రియమేథ.

1. ఆది పురుషుడవు, ధనశాలివి అయిన ఇంద్రా! శత్రువును హతమార్చుటకు నీవు వెడలినపుడే భూమండలమును స్థిరపరచినావు. ద్యులోకమునకు ఉన్నత స్థానము కల్పించినావు.

2. అప్పుడే యజ్ఞము ఆవిర్భవించినది. పగటిని కలిగించు సూర్యుడు అవతరించినాడు. ఇంద్రా! పుట్టినవానిని, పుట్టనున్నవానిని నీవు లక్ష్యపెట్టకున్నావు.

3. ఇంద్రా! అపక్వ గోవులందు పక్వ దుగ్ధములు కలిగించినావు. అంతరిక్షమున సూర్యుని స్థాపించినావు.

స్తోతలారా! ప్రవర్గములచే సామమును వెచ్చ చేసినట్లు - స్తోత్రములచే ఇంద్రుని కవోష్ణుని చేయండి. ఇంద్రుని ప్రసన్నుని చేయుటకు బృహత్సామము ఉచ్చరించండి.

మూడవ తృచ : ఋషి - అగస్త్యుడు.

1. ఇంద్రా! ఈ మహా సోమము ఎంత తానున్న పాత్రకు చెందునో, అంత నీకు సహితము చెందును. ఈ సోమము మాధకము తృప్తిదము. వృష ద్రవము అన్నవంతము. వేల దానము లిచ్చునది. వరదఇంద్రా! అట్టి సోమమును నీ కొరకు సముపార్జించినాము. దీనిని సేవించుము. ప్రసన్నుడవగుము.

2. ఈ సోమము వరేణ్యము. సహాయకము. సేవన యోగ్యము. **శత్రునాశకము అవినాశ్య.** ఇంద్రదేవా! అట్టి సోమము నీకు అందునుగాక.

3. ఇంద్రదేవా! నీవు నిక్కముగ శూరుడవు. దాతవు. నేను నరుడను. నా మనోరథము తీర్చుము. అగ్ని తనకు ఆధార భూతమగు పాత్రను కాల్చినట్లు యజ్ఞములు చేయని దస్యులను భస్మము చేయుము.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్రవచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పన్నెండవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదమూడవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - కవి.

పవస్వ వృష్టిమా సు నో2పాముర్మిం దివస్పరి |
అయక్ష్మా బృహతీరిషః ||

1. సోమమా! మా కొరకు దివి నుండి సువృష్టి కలిగించుము. జలమును తరంగములుగా కురిపించుము. రోగరహిత బహు అన్నములను వర్షించుము.

2. సోమమా! ధారలుగా వర్షించుము. ఆ ధారలు అన్యదేశపు శత్రువుల గోవులు మా దేశమునకు మా ఇంటికి తరలి వచ్చునట్లు చేయును గాత.

3. సోమమా! యజ్ఞమునందు దేవతలు నిన్ను ఎంతో అభిలషించుచున్నారు. మా కొరకు ఘ్రుతమును ధారలుగా కురిపించుము. '**వృష్టిమాపవ**' - వర్షము కురిపించుము.

4. నీవు మాకు అన్నము కలిగించుటకు ఉన్ని గల పాత్రలలోనికి ధారగా పడుము. ఆ శబ్దమును దేవతలు విందురు గాక.

5. సోమము రాక్షస నాశము చేయుచు తన సనాతన దీప్తులను ప్రకాశింపచేయుచు రాలుచున్నది.

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. ఇంద్రుడు విశ్వజ్ఞుడు. శీఘ్రగామి. అగ్రగామి. నరులారా! అట్టి ఇంద్రుని పానమునకు సోమము సమర్పించండి.

2. ఇంద్రుడు శత్రుబలగ్రాహి. అభిషుత సోమయుక్తుడు. మిక్కిలి సోమపనము చేయువాడు. అట్టి ఇంద్రుని ఎదుట నిలిచి ప్రార్ధించండి.

3. అభిషుత, దీప్త సోమము సమర్పించి ఇంద్రుని శరణు వేడండి. అతడు మీ మనోరథములు గ్రహించగలడు. శత్రుభయంకరుడగుచు ఇంద్రుడు మీ కోరికలు తీర్చగలడు.

4. మన ఇంద్రునకే అన్నరూప సోమరసమును అర్పించండి. అతడు ఉరుకులు పెట్టు పగతురను ఓడించి మమ్ము భద్రముగా రక్షించును గాత.

రెండవ ఖండము.

మొదటి తృచ : ఋషి - అసితుడు లేక దేవలుడు.

1. సోమము బభ్రువర్ణ. స్వబల ఒకప్పుడు అరుణవర్ణ. ద్యులోకస్పృశ అట్టి సోమపు స్తుతులు పాడండి.

2. చేతులందు పట్టిన పాషాణములతో సోమమును అభిషవించండి. పవిత్రమున శుద్ధిచేయండి. మాదక సోమమున గోదుగ్ధమును చేర్చండి.

3. నమస్కరించి సోమమును చేరండి. సోమమున పెరుగు కలపండి. ఇంద్రునకు సోమము సమర్పించండి.

4. శత్రునాశక, విశేషద్రష్ట, దవతల అభీష్టకార్యకర్త సోమము మా గోవులకు శుభము, సుఖములు కలిగించును గాత.

5. సోమమా! నీవు అన్నును ఎరిగిన దానవు. మనసునకు ప్రభువవు. ఇంద్రుని పానమునకును, ఆనందము కలిగించుటకును పాత్రలందు నిండుము.

6. పవమాన సోమమా! వీరత్వయుక్త ధనమును మా సహాయకుడగు ఇంద్రుని ద్వారా మాకు అందించుము.

రెండవ తృచ : ఋషి - సుకక్షి.

1. సూర్యదేవా! నీవు ప్రసిద్ద ధనవంతుడవు. అర్థించువారికి వరదుడవు. దాతలగు స్తోతల కొరకు ఉదయించుచున్నావు.

2. ఇంద్రుడు తన భుజబలమున తొంబది తొమ్మిది పురములను భగ్నము చేసినవాడు. అవధ్యుడగు వృత్రుని వధించినాడు.

3. అతడు, ఆ ఇంద్రుడు కళ్యాణమూర్తి మాకు మిత్రుడు అతడు మాకు గోవు పాలధారలు కురిపించినట్లు అశ్వములు, గోవులు, అన్నముతో కూడిన ధనము ఇచ్చును గాత.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - విభ్రాట్ సౌర్యుడు

1. సూర్యుడు దేదీప్యమానుడు. అతడు యజ్ఞపతికి ఆయువు నిచ్చుచు మరింత సోమ మధువును త్రాగును గాత.

అతడు వాయు ప్రేరణ గలవాడు. స్వయముగనే జగములను పాలించుచున్నాడు. ప్రజలను రక్షించుచున్నాడు. **బహుధా విరాజతి** బహువిధముల విరాజిల్లుచున్నాడు.

2. సూర్యుడు దేదీప్యమానుడు. అన్నదాత. వాయువును ధరించు ద్యులోకమున ఉన్నవాడు. సత్యస్వరూపుడు. అమిత్రహంత. దస్యు, అసుర సంహారి. బంధురూప శత్రుహంత. అట్టి మహాజ్యోతి వెలువడినాడు.

3. సూర్యుడు శ్రేష్ఠుడు, జ్యోతులకే జ్యోతి, ఉత్తముడు, విశ్వజిత్తు, ధనజిత్తు, మహామహుడని చెప్పుచున్నారు. స్వయంప్రకాశుడగు, విశ్వప్రకాశక మహా సూర్యుని దృష్టి వలన అంధకారము నశించుచున్నది. సూర్యుడు అవినాశ్యమగు తేజస్సును వ్యాపింప చేయుచున్నాడు.

రెండవ తృచ : ఋషి - శక్తి.

1. ఇంద్రా! మా క్రతువును పూర్తి చేయించుము. తండ్రి పుత్రులకు ధనము నిచ్చినట్లు మాకు ధనము నిమ్ము. యజ్ఞమున మేము నిత్యము సూర్యుని దర్శింతుము గాక.

2. అజ్ఞాతులు, పాపచరిత్రులు, దుష్టబుద్ధులు, అశుభులు మమ్ము గెలువకుందురు గాక. శూర ఇంద్రా! నీ వలన మేము రక్షించ బడుచున్నాము. మేము మహా జలములను దాటగలుగుదుము గాక.

మూడవ తృచ : ఋషి - భర్గుడు.

1. ఇంద్రదేవా! నేడు నేడు, రేపు రేపు ఆపైన కూడ మమ్ము రక్షించుము. సజ్జనపాలకా! అన్నిరోజులందు రాత్రింబవళ్ళు మమ్ము - స్తోతలను రక్షించుము.

2. ఈ ఇంద్రుడు ధనవంతుడు. వీర్యవంతుడు. శత్రువును దెబ్బకొట్టగల పరాక్రమశాలి. అపార సంపన్నుడు. అందరితో కలసి పోవువాడు. శతక్రతు ఇంద్రా! నీ ఉభయ బాహువులు వజ్రము ధరించి యున్నవి. రెండు చేతులు అర్థించువారికి దానవృష్టి కలిగించుచున్నవి.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసిష్ఠుడు

1. మేము భార్యార్థులము. పుత్రార్థులము. దాతల శరణు వేడుచు నేడు సరస్వతిని ఆహ్వానించుచున్నాము.

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1.   సరస్వతి మాకు ప్రియాతి ప్రియ. సప్తఛందస్సులు - సప్తనదుల సోదరి. సనాతన. '**స్తోమ్యాభూత్**' స్తుతి యోగ్య అయిఉన్నది.

మూడవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి |
ధియో యోనః ప్రచోదయాత్ ||

1.   యః = ఎవడు, నః ధియః ప్రచోదయాత్ = మమ్ము కర్మలకు ప్రోత్సహించుచున్నాడో, దేవస్యసవితుః = అట్టి సవితా దేవతను, వరేణ్యం భర్గః = వరేణ్యుడగు భర్గుని, ధీమహి = ధ్యానించుచున్నాము.

(భర్గుడనగా - అయంవైలోకోభర్గః. 2. పృథివ్యేవ భర్గః. 3. ఋగ్వేదోవైభర్గః. 4. హోతైవభర్గః. 5. అగ్నిర్వై భర్గః. 6. వసవ ఏష భర్గః. 7. వాగ్వై భర్గః. 8. వసన్త ఏవ భర్గః. 9. గాయత్రేవ భర్గః. 10. ఆదిత్యోవై భర్గః. 11. చంద్రమావై భర్గః. 12. వీర్యంవై భార్గ ఏష విష్ణుర్యజ్ఞః.)

2.   సోమానాం స్వరణం కృణుహి బ్రాహ్మణస్పతే |
కక్షీవన్తం య ఔశిజః ||

పూర్వార్చిక, ఐన్ద్రపర్వపు మూడవ ఖండమున అయిదవ మంత్రము తెనిగించబడినది.

3.   అగ్నీ! మా ఆయువులను పవిత్రము చేయుము. మా వద్దకు అన్నమును, బలమును చేర్చుము. కుక్కల వంటి రక్కసులను బాధించుము.

నాలుగవ తృచ : ఋషి - యజతుడు.

1.   మిత్రావరుణులు మాకు భూలోక, ద్యులోకములందలి బహు ధనములను ఇవ్వగల శక్తి మంతులు. దేవతలందు ప్రసిద్ధమైన మిత్రావరుణుల బలమును స్తుతించుచున్నాము.

2.   జలమును యజ్ఞములకు తాకించుచు, యజమానులను రక్షించుచు, ద్రోహము నెరుగని మిత్రావరుణులు వర్ధిల్లుచున్నారు.

3.   ఎవరు వృష్టి కొరకు స్తుతించబడుచున్నారో - ఎవరికీ కోరినవి లభ్యమగుచున్నవో - ఎవరు దానయోగ్య

అన్నములకు స్వాములో - అట్టి మిత్రావరుణులు బృహద్రథము మీద ఆశీనులు అగుచున్నారు.

ఐదవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. ఇంద్రుడు ఆదిత్యరూపమున ఉన్నాడు. రోషరహిత అగ్ని రూపమున ఉన్నాడు. వాయు రూపమున సర్వత్ర సంచరించుచున్నాడు. ముల్లోకములు అతనిని భజించుచున్నవి. అతని వెలుగే ఆకసమున ప్రకాశించుచున్నది.

2. ఇతని రథమునకు అభిలషణీయ, శోణవర్ణ, ప్రగల్భ హర్యశ్వములు సారథిచే కట్టబడును.

3. నరులారా! చూసినారా చిత్రము! సూర్య రూప ఇంద్రుడు ఉషః కాలమున ఉదయించి వెలుగులేని రాత్రికి వెలుగును, రాత్రులందు రూపము కనిపించని వానికి రూపమును కలిగించుచున్నాడు!!

ఐదవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఉశనుడు.

1. **"అయం సోమ ఇన్ద్ర తుభ్యం సున్వే"** - ఈ సోమము, ఇంద్రా! నీ కొరకు సంస్కరించబడినది. ఇది నీ కొరకే పవిత్రమైనది. నీవు దీనిని త్రాగుము.

ఇంద్రా! నీవే కదా సోమమును చేసినావు! నీవే దానిని మాదకముగను, సహాయకముగను వరించినావు.

2. ఇంద్రుడు మహామహుడు. మరిన్ని బరువులు మోయు రథము వలె ఇంద్రుడు మాకు మరింత ధనము కలుగ జేయుటకు యజ్ఞమున చేరును గాక. తదుపరి మాకు విరోధులుగా పుట్టిన వారు ఊర్ధ్వముఖులై యుద్ధములకు పోవుదురు గాక.

3. సోమమా! నీవు బలశాలివి. మరుత్తుల వంటి పవిత్రమగుము. దివ్య ప్రజ నిందలు లేనివారై అట్లే పవిత్రులగుదురు కదా! జలము వంటి వేగము గల నీవు మా విషయమున మంచి మనసు కల దానవగుము. అనేక రూపములు గల నీవు సేనలను నిర్లక్ష్యము చేయు ఇంద్రుని వంటి పూజనీయవు.

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. అగ్నిదేవా! నీవు సమస్త యజ్ఞములకు హోతవు. ఏలననగా దేవతలు నిన్ను మానవహితము కొరకు నియమించినారు కదా!

2. అట్టి అగ్నిదేవా! మా యజ్ఞములందు - స్తుతి యోగ్యుడవై - ప్రజ్వరిల్లుము. దేవతలను యజించుము. దేవతలను ఆహ్వానించుము. వారికి తృప్తి కలిగించుము.

3. అగ్నిదేవా! నీవు విధాతవు. సుక్రతువవు. యజ్ఞపు మహా మార్గములను, అల్పమార్గములను ఎరుగుదువు. కావున యజమానికి చక్కని మార్గము చూపుము.

మూడవ తృచ : ఋషి - దేవశ్రవుడు లేక దేవవీతుడు.

1. అగ్ని హోత అమరుడు. ప్రకాశవంతుడు. కర్మలకు ప్రేరణ కలిగించువాడు. అతడు జ్ఞాన సహితుడై కర్మ ఆరంభమునకు ముందే మా వద్దకు విచ్చేయును.

2. బలశాలి అగ్నిని విజయము కొరకు యుద్ధములందు ప్రతిష్టించుచున్నారు. అధ్వరములందు స్థాపించుచున్నారు. అందుకే విప్రుడగు అగ్ని యజ్ఞసాధకుడు అగుచున్నాడు.

3. అగ్ని ఆహవనీయుడు అగుచున్నాడు. వరేణ్యుడు అగుచున్నాడు. సకల భూతముల గర్భము లందున్నారు. అట్టి అగ్నిని దక్షపుత్రి వేది రూప భూమి మీద ధరించుచున్నది.

(భూమేర్దక్షదుహితృత్వే మన్త్రవర్ణః - భూమియే దక్షపుత్రియని మంత్రభావము.)

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రగాథ.

1. అధ్వర్యులారా! అవు పాలలో ద్యావాపృథ్వులను ఆశ్రయించి ఉన్న మేక యొక్క పాలను కలపండి. అట్లు కలిపినా మేక పాలలో అగ్నిని స్థాపించండి.

2. దూడలు తల్లి ఆవులను చేరినట్లు గోవులు తమ స్థానమునకు బందువుల సహితముగా చేరును గాక.

3. అగ్ని తన జ్వాలా రూపమున ఆరగించు ఆవు పాలకు ఇంద్రుడు అగ్ని చేత ధరించబడు మేక పాలను అంతరిక్షమున అర్పించుచున్నాడు. అట్టి ఇంద్రాగ్నులకు ఆవు పాలు, మేకపాల రూపమగు అన్నమును అర్పించుచున్నాము.

రెండవ తృచ : ఋషి - బృహద్దివుడు.

1. అతడు ఆద్యుడు. అతడు సకల లోకములందు ప్రదీప్తుడైనాడు. అతడే ఉగ్రుడగు సూర్యునిగ ఉదయించినాడు. అతడు ఉదయించినంతనే ఉపాసకుల శత్రువులను పరిమార్చుచున్నాడు. ఇతడు తమ మేలుకే ఉదయించినాడని సకల ప్రాణులు సంబరపడుచున్నవి.

2. ఇంద్రుడు పుట్టినదే బలములందు. అందుకే బలశాలి, శత్రుహంత అయినాడు. దస్యులకు భయంకరుడు అయినాడు. అతడు శ్వాసించు శ్వాసించని ప్రాణులను పరిశుద్ధులను చేయుచున్నాడు. వారు అట్టి ఇంద్రుని స్తుతించుటకును, హవి అర్పించుటకును కూడుచున్నారు.

3. ఇంద్రదేవా! సకల కర్మలు నీ కొరకే సంపూర్ణములు అగుచున్నవి. సకల భూతముల మనస్సులందు నీవే నిండి యున్నావు.

ఇంద్రదేవా! నిన్ను అర్చించువారు తొలుత ఒకరుగా ఉండి, భార్యతో కూడి ఇద్దరై, పుత్రునితో కూడ ముగ్గురు అగుచున్నారు. ప్రియమగు గృహము, ధనము మున్నగు వానికన్న ప్రియమగు సంతానమును ఎంతో ప్రేమించు తల్లిదండ్రులతో చేర్చుము. ఈ మధుర సంతానమును పౌత్రులతో ఆడుకొను నట్లు చేయుము.

మూడవ తృచ : ఋషి - గృత్సమదుడు.

1. ఇంద్రుడు పూజనీయుడు. బలవంతుడు. సంతృప్తుడు. అతడు జ్యోతి, గోవు, ఆయువు అను అభిప్లవ దినములందు అభిషుతమును యువసత్తుచే కలసినది యగు సోమమును విష్ణువుతో కూడి యథేచ్ఛగా పానము చేయుచున్నాడు.

ఆ సోమము గొప్పది. విశాల తేజోవంతము. ఇంద్రుడు ఘన కార్యములు చేయుటకు హర్షము కలిగించునది. సత్యస్వరూప, భిందువులుగా రాలు, ద్యోతమాన సోమము సత్య స్వరూపుడగు ఇంద్రుని యందు వ్యాపించుచున్నది.

2. ఇంద్రదేవా! నీవు ప్రజ్ఞాసహితుడవై ఆవిర్భవించినావు. బలశాలివై విశ్వభారమును వహించదలచినావు. జ్ఞానవాన్ ఇంద్రా! నీవు శౌర్య, పరాక్రమములచే వర్ధిల్లినావు. యుద్ధములను లక్ష్య పెట్టని వాడవు అగుచున్నావు.

ఇంద్రా! నిన్ను స్తుతించు వారికీ ఇష్ట కామ్య సాధకమగు ధనమును ఇచ్చుచున్నావు. సత్య స్వరూప, బిందువులుగా రాలు, ద్యోతమాన సోమము సత్య స్వరూపుడగు ఇంద్రుని యందు వ్యాపించుచున్నది.

3. ఇంద్రుడు సోమపానము చేసినాడు. ప్రదీప్తుడైనాడు. బలము పెంచుకున్నాడు. 'కృని' నామక అసురుని యుద్ధమున గెలిచినాడు. తన తేజస్సుతో ద్యావాపృథ్వులను నింపినాడు. ఇప్పుడు త్రావిన సోమముచే ఇంద్రుడు తన బుద్ధిబలమును పెంచుకున్నాడు. అతడు సోమమును రెండు భాగములు చేసినాడు. ఒక భాగమును పొట్టలో పోసుకున్నాడు. రెండవ భాగమును దేవతల కొరకు మిగిల్చినాడు.

ఇంద్రా! ఆ దేవతలను సోమపానమునకు ప్రోత్సహించుము.

సత్యస్వరూప, బిందువులుగా రాలు, ద్యోతమాన సోమము సత్యస్వరూపుడగు ఇంద్రుని యందు వ్యాపించుచున్నది.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పదమూడవ
అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదునాలుగవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రియమేధ.

అభిప్ర గోపతిం గిరేన్ద్రమర్చ యథావిదే|
సూనుం సత్యస్య సత్పతిం ||

1. ఇంద్రుడు సత్యపుత్రుడు. సజ్జన పాలకుడు. గోవులకు ప్రభువు. అట్టి ఇంద్రుని చక్కగా అర్చించండి. అతడు వినునట్లుగా స్తుతించండి.

2. ఇంద్రుని అశ్వములు మెరుపులు మెరయుచు కుశలపై నిలుచును గాక. ఆ కుశలపై నిలిచియే గదా మేము ఇంద్రుని స్తుతించుచున్నాము!

3. ఇంద్రుడు సమీపము నందలి సోమమును సకల దిశలందు పానము చేసినపుడు గోవులు వజ్రి కొరకు మధుర దుగ్ధములను అందించుచున్నవి.

రెండవ తృచ : ఋషి - నృమేధ.

1. సకల అసుర యుద్ధములందు తమను రక్షించుమని ఆహ్వానించ దగినవాడు ఇంద్రుడు. అతడు వృత్రహంత. పరమ పూజ్యుడు. స్తుతులకు ప్రత్యక్షమగువాడు. అట్టి ఇంద్రుని యజ్ఞ సంబంధ క్రతువులందు విరాజిల్లు చేయండి.

2. ఇంద్రదేవా! ధన దాతలందరిలో ప్రథముడవు. సత్యమును ఐశ్వర్యవంతము చేసిన వాడవు. ధనవంతుడవు. బలవంతుడవు. బలముల పుత్రుడవు. మహానుడవు. నిన్ను దాహ్నాములు అర్థించుచున్నాము.

మూడవ తృచ : ఋషి - త్రసదస్యుడు.

1. ఇది సోమము. స్వర్గవాసుల పీయూషము. పురాతనము. ప్రశంసనీయము. ఈ పురాతన సోమమును గాయకులూ దివి నుండి ఆహ్వానించుచున్నారు. తదుపరి ఇంద్రునికై పుట్టిన సొమ్మును స్తుతించుచున్నారు.

2. తదుపరి ద్యులోకవాసులగు 'వసురుచి' అనువారు సోమమును దర్శించినారు. బాంధవ్య యోగ్యమగు సోమమును స్తుతించుచున్నారు. సూర్యుని కన్న మున్నే సోమమును ఆరాధించుచున్నారు.

3. తదుపరి సోమము ద్యావాపృథ్వులందును, సకల ప్రాణులందును, బలములందును విరాజిల్లుచున్నది. గోసమూహములందు వృషభసమమై ఉన్నది.

నాలుగవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. అగ్నీ! నీవు మాతో సమానుడవు. అట్లయ్యు మేము సమర్పించు హవిస్సులను గురించియు, ఉచ్చరించు నవీన స్తుతులను గురించియు దేవతలకు విశేషముగ వివరింపుము.

2. అగ్నిదేవా! నీ కిరణములు విచిత్రములు. నీవు విశిష్ట ధనదాతవు. నదీ తరంగములు తీరమున గుంటలు ఏర్పరచినట్లు హవి సమర్పించు వారికి వెంటనే ఫలములు కలిగించుచున్నావు.

(నది వరకు పోకముందే గుంతలలో నీరు దొరికినట్లు.)

3. అగ్నిదేవా! మమ్ము ఉత్తమ ద్యులోక భోగములకు చేర్చుము. అంతరిక్ష భోగములకు చేర్చుము. భూలోక ధనములను ప్రసాదించుము.

(భూమి మీద ధనమే భోగమని.)

అయిదవ తృచ : ఋషి - వత్సుడు.

1. నేను సత్యమునకు తండ్రి వంటి ఇంద్రుని అనుగ్రహమున చేరినాను. అహం సూర్య ఇవాజని - నేను సూర్యుని వలె ప్రకాశించుచున్నాను.

(1. ఇంద్రుని అనుగ్రహము కలవాడు సూర్యుని వలె ప్రకాశించునని 2. ఇంద్రుని అనుగ్రహముననే సూర్యుడు ప్రకాశించుచున్నాడని.)

2. నేను సహితము కణ్వుని వలెనే సనాతనుడనై ఇంద్రునకు శత్రునాశక బలము కలిగించు స్తుతులను వచించుచున్నాను.

3. ఇంద్రా! నిన్ను స్తుతించని వారు ఉన్నారు. స్తుతించిన ఋషులున్నారు. వారందరిలో నా స్తుతులే ఉత్తమములు, బుద్ధివర్ధకములు అగును గాత.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - అగ్ని.

1. బలములందు పుట్టిన అగ్నిదేవా! సమస్త అర్చనీయ అగ్ని సహితుడవై హవిస్సులు సేవించుము. దేవతలందున్న అగ్నియు, మానవులందున్న అగ్నియు, ఇతర అగ్నులతో కలిసి మా స్తుతులు ఆలకించును గాక.

2. ఏ అగ్నికి హవిస్సులు అర్పించువారు అనేకులు ఉన్నారో ఆ అగ్ని సమస్త అర్చనీయ అగ్నుల సహితుడై మాకు అన్నములు అందించుటకు సరియైన సమయమునాకు విచ్చేయును గాత. ఆ అగ్ని మా పుత్ర పౌత్రుదుల వద్దకు కూడ చేరునుగాక.

3. అగ్నిదేవా! నీవు సకల అగ్నులతో కూడిన వాడవై మా స్తుతులను, యజ్ఞములను వర్ధిల్లచేయుము. దేవకార్యములకు గాను మాకు ధనము లిమ్మని దేవతలకు ప్రేరణ కలిగించుము.

రెండవ తృచ : ఋషి - అసదస్యుడు

1. సోమమా! నీవు సర్వ ప్రథమవు. కుశచ్ఛేదవు. అన్నవంతవు. మహా బుద్ధిశాలివి. వీరుడవు.
మాకు బాల పరాక్రమములు కలిగింపుము.

2. గుండమందు నీరు నింపుటకు నీటి కట్టను తెంపినట్లు - నీరు నింపువాడు జలాశయపు అడ్డు తొలగించినట్లు - సోమము అన్నము కొరకని పవిత్రమును తెంపుచున్నది.

3. సోమమా! నీవు అమృతమవు. ఋతమును, అమృతమును ధరించు అంతరిక్షమున నరుల కొరకని సూర్యుని సృష్టించినావు. దేవతలను సేవించుచున్నావు. నిత్యము సంగ్రామములకు సాగుచున్నావు.

మూడవ తృచ : ఋషి - విశ్వమనువు.

1. సోమమును ఇంద్రుని కొరకు సిద్ధము చేయండి. సోమపు మధుర రసమును ఇంద్రుడు పానము చేయును గాత. ఇంద్రుడు తన మహిమచే ధనములు ఇచ్చును గాక.

2. హర్యశ్వ స్వామియు ధన ప్రదాతయునగు ఇంద్రుని నేను స్తుతించుచున్నాను. అశ్వర్షి పుత్రుడనగు నా స్తుతులను ఇంద్రుడు ఆలకించును గాత.

3. ఇంద్రదేవా! నీ కన్న ముందు పుట్టినవాడు లేడు. సమర్ధ ఇంద్రా! నిన్ను మించిన వీరుడు మరొకడు లేడు. యుద్ధములందు దండెత్తుటలో కూడా నిన్ను మించిన వాడు మరొకడు లేడు. స్తుతి యోగ్యతలో కూడ నిన్ను మించిన వాడు లేకున్నాడు.

నాలుగవ తృచ : ఋషి - ప్రియమేధ.

1. ఇంద్రుడు ఆదిత్యరూప ఉషస్సుల ఉత్పాదకుడు. అట్టి ఇంద్రుని మీ కొరకు ఆహ్వానించుచున్నాను. ఇంద్రుడు చంద్ర కిరణముల ఉత్పాదకుడు. అట్టి వానిని నీ కొరకు ఆహ్వానించుచున్నాను. ఇంద్రుడు గోవులకు ప్రభువు. అతనిని నీ కొరకు ఆహ్వానించుచున్నాను. నీవు గోవుల పాలరూప అన్నమును అర్ధించువాడవు కదా!

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. అగ్ని ధనదాతయగు దేవత. అతనిని హవి నిండిన స్రుక్కుతో అర్చించండి. మరింత సోమము సమర్పించండి. పాత్రలను హవి పూర్ణము చేయండి. తదుపరి అగ్నిదేవుడు మిమ్ము పరిపూర్ణులను చేయును.

2. దేవతలు అగ్నిని జ్ఞానవంతుని, హవ్యా వాహనుని చేసినారు. అట్టి అగ్ని ఉపాసకులకు సువీర్యము, రమణీయమగు ధనమును ఇచ్చుచున్నాడు.

రెండవ తృచ : ఋషి - సౌభరి.

1. ఏ వ్రతమున కర్మలు అర్చించ బడినవో అచట సకల మార్గ జ్ఞాతయగు అగ్ని ప్రత్యక్షమగుచున్నాడు. సుజాతయు, ఆర్య వర్ధనుడు అగ్ని మా వాగ్రూప స్తుతులను ఆలకించును గాత.

2. కర్మలు నిర్వహించు నరునకు మరొక మానవుడు సాయపడిన రీతి - వేలగోవులు, ధనములను ఇచ్చునట్టి అగ్నిని యజ్ఞము, కర్మలు నిర్వహించుచు స్వయముగా ప్రణమిల్లండి.

3. ప్రదైవోదాసో అగ్ని ర్దేవ ఇంద్రోన మజ్మనా|
అను మాతారం పృథివీం వి వావృతే తస్థౌ నాకస్య శర్మణి ||

పూర్వార్చిక 1వ అధ్యయము 5వ ఖండము 9వ మంత్రము పునరావృతము. అనువాదము అక్కడ చూడండి.

మూడవ తృచ : ఋషి - వైఖానసుడు.

1. అనువాదమునకు 13వ అధ్యాయము 4వ ఖండము 3వ తృచ 3వ మంత్రము చూడండి.

2. పంచ జనులకు ఫలప్రదాత, సర్వద్రష్టయగు అగ్నిని పురోహితువిగా ఏర్పరచినాము. మహా మహుడగు ఆ అగ్నిని యజ్ఞశాల యందు అర్చించుచున్నాము.

3. అగ్నీ! నీవు శ్రేష్ఠ కర్మల వాడవు. మాకు వర్చస్సు ప్రసాదించుము. మాకు ధనము, బలిష్టములగు గోవులను ప్రసాదించుము.

నాలుగవ తృచ : ఋషి - వసూయవుడు.

1. పావక అగ్నీ! నీవు దీప్తిమంతుడవు. హర్షము కలిగించు మాటల వాడవు. వానితో దేవతలను ఆహ్వానించుము. యజింపుము.

2. నేతిలో పుట్టిన, వింత వెలుగుల అగ్నిదేవా! హవిస్సులు అందుకొనుటకు దేవతలను ఆహ్వానించుమని సర్వద్రష్టవగు నిన్ను అర్థించుచున్నాము.

3. అగ్నిదేవా! నీవు కవివి. యజ్ఞప్రేమివి. దీప్తిమంతుడవు. మహానుడవు. నిన్ను యజ్ఞమున ప్రజ్వరిల్లచేయుచున్నాము.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి గోతముడు.

1. అగ్నీ! నీవు సకల కర్మములందు వందనీయుడవు. గాయత్రి ఛందమున నుతించుచున్నాము. మమ్ము నీ ఆయుధములచే రక్షింపుము.

2. అగ్నిదేవా! వెంటనే దరిద్రమును దూరము చేయునట్టియు, వరణీయమును, యుద్ధములందు శత్రువులకు దుస్తరమునగు ధనమును ప్రసాదించుము.

3. అగ్నిదేవా! మా జీవితమునకు గాను చక్కని జ్ఞానయుక్తము, జీవితాంతము దేహపోషకము, సుఖప్రదయగు ధనమును ప్రసాదించుము.

రెండవ తృచ : ఋషి - కేతువు.

1. మా స్తుతులు, కర్మలు అగ్నిని యుద్ధమునకు అశ్వమును ఉద్యమింప చేసినట్లు యజ్ఞమునకు ఉద్యమింప చేయును గాత. అగ్ని మూలమున మేము ధనములను జయింతుము గాత.

2. అగ్నిదేవా! నీ సేవలచే గోవులను రక్షించినట్లు ఆ రక్షణలతోనే మాకు ధనము కలుగు ప్రేరణ కలిగించుము.

3. అగ్నిదేవా! అనేక గోవులు, అనేక అశ్వములు గల ధనము నిమ్ము. ఆకసమున వెలుగులు నింపుము. నీ ఆయుధములను మా శత్రువుల మీద ప్రయోగింపుము.

4. అగ్నిదేవా! సమస్త ప్రాణులకు వెలుగు ప్రసాదించువాడును. నిరంతర గమనుడును, జరా రహితుడగు సూర్యుని ఆకాశమున స్థాపించినావు.

5. అగ్నిదేవా! నీవు యజమానులకు జ్ఞానదాతవు. ఇష్టుడవు. శ్రేష్ఠతముడవు. యజ్ఞశాలకు విచ్చేసి ఉన్నావు మాస్తోత్రములను వినుము. మాకు అన్నము నిమ్ము.

మూడవ తృచ : ఋషి - విరూపుడు.

1. అగ్ని దేవతలందు శ్రేష్ఠుడు పృథివీపతి. అగ్ని జలములకు బీజరూపమగు సకల స్థావర జంగమ ప్రాణులకు ప్రేరణ కలిగించుచున్నాడు.

2. అగ్ని స్వర్గపతి. వరణీయ, దానయోగ్య ధనస్వామి సుఖములు కలుగుటకు గాను నేను అగ్నికి స్తోతను అగుదును

గాక.

3. అగ్నిదేవా! పరిశుద్ధ, శ్వేతవర్ణ, దీప్యమాన కాంతులు నీ తేజస్సునాకు ప్రేరణ కలిగించుచున్నవి.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పదునాలుగవ
అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదిహేనవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - గోతముడు.

కస్తే జామిర్జనానా మగ్నే కో దాశ్వధ్వరః |
కోహ కస్మిన్నసి శ్రితః ||

1. అగ్నిదేవా! మనుష్యులందు నీకు బంధువు అగువాడు ఎవడు? వాస్తవ దానమున నిన్ను యజించు వాడెవ్వడు? అసలు నీవు ఎవ్వరవు? దేనిని ఆశ్రయించి ఉన్నావు?

2. అగ్నిదేవా! నీవు అచింత్యుడవయ్యు ప్రభావశాలివి. జనులకు మిత్రుడవు. తృప్తి కలిగించువాడవు. స్తుతి యోగ్యుడవగు నీవు మిత్రుని వంటి ప్రియంకరుడవు.

3. అగ్నిదేవా! మా కొరకు మిత్రావరుణులను యజింపుము. దేవతలను యజింపుము. ఋతమును యజింపుము. అందుకొరకు ఈ మహా యజ్ఞశాలయందు ప్రవేశింపుము.

రెండవ తృచ : ఋషి - దేవశ్రవ లేక దేవవాత.

1. అగ్ని స్తవనీయుడు. పూజనీయుడు. తిమిర ధ్వంసి. దర్శనీయుడు. వరదుడు. అతడు ఆహుతులచే ప్రజ్వలింప బడుచున్నాడు.

2. అగ్ని వరదుడు. అశ్వము వలె దేవవాహనుడు. ఆహుతులచే ప్రజ్వలితుడు. అట్టి అగ్నిని హవిష్మంతులు స్తుతించుచున్నారు.

అగ్నీ! నీవు వరదుడవు. మేము హవిస్సులు అర్పించు వారలము. ఆహుతులు అర్పించుచున్నాము. దీపితుడ వగు నిన్ను ఎంతో ప్రజ్వలింపచేయుచున్నాము.

మూడవ తృచ : ఋషి - విరూపుడు.

1. వెలుగులు చిమ్ము అగ్నీ! నిన్ను మండించుచున్నాము. నీ జ్వాలలు నాల్కలు చాచుచున్నవి.

2. అర్థించబడు అగ్నీ! నేయి నిండిన మా స్రుక్కులు నిన్ను చేరును గాక. మా హవిస్సులను స్వీకరించుము.

3. అగ్ని ఆహ్లాదకర్త. దేవతల ఆహ్వాత. హోత. విశేష ఋతువున యజనయోగ్యుడు. విచిత్రకిరణుడు. దీప్తిరూప ధనశాలి. అతడు మా స్తుతులను తప్పక ఆలకించుచున్నాడు.

నాలుగవ తృచ : ఋషి - భర్గుడు.

1. అగ్నీ! మమ్ము ఒక ఋక్కుచే రక్షించుము. రెండు ఋక్కులచే రక్షింపుము. మూడు వాక్కులచే రక్షించుము. బలపతీ! విశాలములగు నాలుగు వాక్కులచే రక్షించుము.

2. అగ్నీ! సమస్త రాక్షసుల నుండియు, అదాతల నుండియు మమ్ము రక్షింపుము. యుద్ధములందు మమ్ము రక్షించుము. మాకు దగ్గరి వాడవగు నిన్నే యజ్ఞసిద్ధి కొరకును అభ్యుదయము కొరకును శరణు వేడినాము కదా!

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - ఆప్త్యత్రిత.

1. అగ్నీ! నీవు ఈశానుడవు. హవి అందించువాడవు. మంటలు మండువాడవు. అరి భయంకరుడవు. భక్త శుభంకరుడవు. యజమానులకు ధనవర్ధనుడవు. సర్వ జ్ఞాతవు. విచిత్ర దీప్తవు. తెలుపు వెలుగులు అన్ని దిక్కులందు పరచువాడవు. మహా జ్వాలలతో సాయం హోమమునాకు సిద్ధి కలిగించి రాత్రిలోనికి జారి పోవుచున్నావు.

2. అగ్ని తంద్రివంటివాడు. సకల జగత్తుల మహాపాలకుడు. అతడు సూర్యునిచే ఉత్పన్నమగు ఉషస్సుగా ప్రకాశించుచు రాత్రి రూప అంధకారములను అణచి వేయుచున్నాడు. అప్పుడు అగ్ని సంచారశీలుడై తన మహా

తేజస్సున ద్యులోకమును క్రమ్మి సూర్యుని అడ్డుకొని దేదీప్యమానుడగు చున్నాడు.

3. కళ్యాణ రూపయై, సేవణీయ ఉషస్సుచే సేవించబడు అగ్ని గార్హ్వ పత్యము నుండి ఆహవనీయమునకు చేరుచున్నాడు. పిదప శత్రునాశకుడగు అగ్ని ఉష యందు చేరుచున్నాడు. సచేతన కేతనములచే సర్వత్ర వార్తమానుడగు అగ్ని సాయం సవనము కొరకు తెల్లని తన వెలుగులను పరచి రాత్రి చీకట్లను తొలగించి నిలిచి ఉన్నాడు.

రెండవ తృచ : ఋషి - ఉశనుడు.

1. అగ్నీ! నీవు సర్వత్రగామివి. సూర్యశక్తికి ప్రపౌత్రుడవు. ద్యోతమానుడవు. అందరకు వరణీయుడవు. శత్రువు పై మండిపడువాడవు. నీకు ఎట్టి స్తోత్రములను అర్పించవలెను?

2. బలపుత్ర అగ్నిదేవా! ఏ యజ్ఞపు మనసుతో నీకు హవిస్సులు అర్పింతురు? ఏ వచనముచే నీకు నమస్కరింతును?

3. అగ్నిదేవా! ఇక నీవే మా సమస్త స్తుతులను స్వీకరింపుము. మమ్ము పుత్ర, పౌత్రాది ధనయుక్తులను చేయుము.

మూడవ తృచ : ఋషి - భర్గుడు.

1. అగ్నిదేవా! హోతవగు నిన్ను అర్చించుచున్నాము. సకల అగ్నుల సహితుడవై విచ్చేయుము. హవిస్సులు కుశలపై ఉంచబడినవి. అవి నీకు చేరును గాక.

2. బలపుత్రుడు, సర్వత్రగామి అగ్నిని యజ్ఞమునకు తెచ్చుటకు స్రుక్కు సాగుచున్నది. సూర్యశక్తికి ప్రపౌత్రుడు, ఘ్రుతకేశి, సనాతనుడగు అగ్నిని యజ్ఞములందు స్తుతించుచున్నాము.

(**ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నంతతః ప్రజాః** అని మనుస్మృతి. సూర్యుని నుండి వర్షము. వర్షము సూర్యపుత్రుడైనది. వర్షము నుండి అన్నము. అన్నము సూర్యునకు పౌత్రుడైనాడు. అన్నము నుండి ప్రజ అనగా అగ్ని. అప్పుడు అగ్ని ఆదిత్యునకు ప్రపౌత్రుడు అగుచున్నాడు.)

నాలుగవ తృచ : ఋషి - పురుమీఢుడు.

1. మా స్తుతులు అజ్ఞానమును దహించువాడును, దర్శనీయుడును అగు అగ్ని సమ్ముఖమునకు చేరును గాత. మమ్ము రక్షించుటకు గాను యజ్ఞమందలి మా ప్రణామములు అధిక ధనవంత, అత్యంత ప్రశంసనీయ అగ్ని ముందుకు

చేరును గాత.

2. అగ్ని రెండు రూపముల వాడు. అతడు దేవతలందు అమృత రూపమున, మానవులందు మర్త్య రూపమున ఉన్నాడు. అతడు యజమానికి యజ్ఞసిద్ధిని, పరమానందమును కలిగించుచున్నాడు. బలపుత్రుడు, సర్వజ్ఞుడగు అగ్నికి ఆహుతులు అర్పించుటకు ఆహ్వానించుచున్నాను.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. అగ్ని మానవులకు సన్మార్గదర్శి. ఆహుతులను చేర్చుట యందు రథము వంటివాడు. నిత్య నూతనుడు. అగ్ని ఎదురు లేనివాడు.

2. హవిస్సులర్పించువాడు హవ్యవాహక అగ్ని వలన అన్ని దిశల నుంచి అన్నములు అందుకొనుచున్నాడు. పవిత్ర కాంతుల అగ్ని అతనికి నివాసము కలిగించుచున్నాడు.

3. దండెత్తివచ్చు సేనలను తన బలమున లొంగదీయు వాడును, ఎంతటి శత్రువున కైనను లొంగని వాడును - దేవతలను పోషించువాడును అగు అగ్ని అనేక రకముల అధిక అన్నము కలవాడు అగుచున్నాడు.

రెండవ తృచ : ఋషి - సౌభరి

1. **భద్రోవో అగ్నిరాహుతో భద్రారాతిః సుభగభద్రో అధ్వరః భద్రా ఉత ప్రశస్తయః ||**

ఆహుతులచే తృప్తుడైన అగ్ని మాకు శుభప్రదుడు అగును గాక. ధనవంతుడగు అగ్ని యొక్క కళ్యాణ రూపధానము మాకు అందును గాక. మా యజ్ఞము శుభప్రదము అగును గాక. మా స్తుతులు మంగళప్రదములు అగును గాత.

2. అగ్నిదేవా! యుద్ధములందు మా మనసులను మంగళప్రదములు చేయుము. ఏ మనసుతో నీవు శత్రువులను ఓడించుచున్నావో ఆ మనసుతోనే శత్రువులను ఓడించగల సేనలను పరాజితము చేయుము. మాకు ఫలములు ప్రసాదించుమని నిన్ను అర్థించుచున్నాము.

మూడవ తృచ : ఋషి - గోతముడు.

1. బలపుత్ర అగ్నీ! నీవు అనేక గోవుల అన్నములకు స్వామివి. జాతవేదా! మాకు మరింత ధనము ప్రసాదించుము.

2. అగ్ని దీప్తిమంతుడు. నివాసప్రదుడు. కవి. స్తుతియోగ్యుడు. అన్నవంతుడు అతడు మాకు అన్నము అందించుచు ప్రజ్వరిల్లును గాత.

3. విరాజిల్లు అగ్నీ! రాత్రింబవళ్ళు నీ వారితో రాక్షసులను పీడింపచేయుము. నీవు కూడ పీడించుము. జ్వాలా ముఖుడవగు నీవు రాక్షసులను ఒక్కొక్కరిని భస్మము చేయుము.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - గోపవనుడు.

1. అగ్ని అందరకు అతిథి వంటి వాడు ప్రీతుడు. అతనిని స్తుతించండి. అగ్ని మాకు ధనము లిచ్చువాడు. గుహయందున్న వాడు. అతనిని స్తుతించండి.

2. మీరు జాతవేదస అగ్నిని ప్రశంసించి మంచి పని చేసినారు. అగ్ని దేవయజ్ఞములందలి హవిస్సులను దేవతలకు చేర్చువాడు కదా!

రెండవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. సమిధలచే మండుచున్న అగ్నిని వేదవాణిచే స్తుతించండి. శుచివంతుడు, స్థిరుడు, పావకుడగు అగ్నిని యజ్ఞపు అగ్రమున స్థాపించండి. విప్రుడు, హోత, సర్వవరేణ్యుడు, సర్వానుకూలుడగు అగ్నిని ధనము అర్థించుచున్నాము.

2. అగ్నిదేవా! నీవు పాలకుడవు. స్తుతియోగ్యుడవు. నిన్ను దేవతలు, మానవులు యజ్ఞములందలి హవి వహించుటకు దూతను చేసినారు. అప్రమత్తుడవు, వ్యాప్తుడవు, ప్రజారక్షకుడ వగు నిన్ను మనుష్యులు, దేవతలు ఉభయులు నమస్కరించుచున్నారు.

3. అగ్నీ! నీవు దేవ, మానవులను ఇరువురిని శోభిల్లచేయుచున్నావు. వ్రతములందు దేవతలకు దూతవు అగుచున్నావు. ఈ లోకము నుండి హవిస్సు తీసికొని వెళ్లుటకు దానిని ద్యులోకమునకు చేర్చుటకు తిరుగుచున్నావు. నిన్ను కర్మలు, స్తుతులు భజించుచున్నవి కదా!

మూడవ తృచ : ఋషి - ప్రయోగుడు.

1. అగ్నీ! యజమాని పక్షమున వేదవాణి నీ గుణగణములను అక్క చెల్లెండ్ర వలె కీర్తించుచున్నది. వాయు సమీపమునకు నిన్ను చేర్చుచున్నది.

2. అగ్ని త్రిధాతువు. ఆవృతము. అగ్ని కట్టులేని కుశల మీద నిలిచినాడు. అందు నీరు సహితము అడుగు పెట్టుచున్నది.

3. అగ్ని ఫలప్రదాత ద్యోతమానుడు. అగ్ని స్థానము సురక్షితము. అది సేవించబడుచున్నది. ఈ అగ్నిస్థానము సూర్యుని వంటి పూజనీయము.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పదిహేనవ
అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదహారవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - మేధాతిథి

అభిత్వా పూర్వసీతయే ఇంద్ర సోమేభిరాయవః |
సమీచీనాస ఋషభః సమస్వరన్ రుద్రా గృణన్త పూర్వ్యమ్ ||

1. ఇంద్రా! నిన్ను తొలి సోమము త్రాగుమని మానవులు స్తోత్రములచే స్తుతించుచున్నారు. "ఋభువులు" ఒకచోట చేరి నిన్ను స్తుతించుచున్నారు. రుద్రపుత్రులు పూర్వ పురుషుడవగు నిన్ను స్తుతించినారు.

2. ఇంద్రుడు అభిషుత సోమము సేవించును. అది అతని శరీరమందు వ్యాపించును. అప్పుడు ఇంద్రుడు యజమాని వీర్యమును, బలమును పెంపొందించుచున్నాడు. మానవులు నేడు పూర్వకాలము వలెనే ఇంద్రుని మహిమలను గానము చేయుచున్నారు.

రెండవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ఇంద్రాగ్నులారా! వేద విధులు నిన్ను స్తుతులచే అర్చించుచున్నారు. తమకు ఫలము కలుగవలెనని ఉద్గాతలు అర్చించుచున్నారు. అన్నము ప్రసాదించుమని నేను ప్రార్థించుచున్నాను.

2. ఇంద్రాగ్నులారా! తొంబది తొమ్మిది శత్రు పురములను ఒకే దెబ్బకు గడగడలాడించిన మిమ్ము ఆహ్వానించుచున్నాము.

3. ఇంద్రాగ్నులారా! హోతలు సత్యమార్గమును అనుసరించి మా యజ్ఞమును సకల విధముల నిర్వర్తించుచున్నారు.

4. ఇంద్రాగ్నులారా! మీ యందు బలము, అన్నము పరస్పరము కలసి ఉన్నవి. వర్షధారల ప్రేరణ సహితము మీ యందే ఉన్నది.

మూడవ తృచ : ఋషి - భర్గుడు.

1. ఇంద్రదేవా! మాకు అభీష్ట ఫలములను ఇమ్ము. శచీపతి వగు శూర ఇంద్రా! నీవు సమస్త రక్షణలు కలవాడవు. భాగ్యము వంటి తేజస్వివి, ధనదాతవు. అట్టి నిన్ను మేము ఉపాసించుచున్నాము.

2. ఇంద్రా! నీవు అశ్వసంఖ్యను పెంచువాడవు. గోవులను మరింత పెంచువాడవు. నీవు బంగారము ప్రవాహము వలె తృప్తి కలిగించువాడవు. నీవు చేసిన దానమును నష్టపరచ గలవాడు లేడు. "యద్యద్యామి తదాభర" కావున నేను కోరిన వాటిని తెచ్చి ఇమ్ము.

నాలుగవ తృచ : ఋషి - భర్గుడు.

1. ఇంద్రదేవా! నాకు ధనము లిచ్చుటకు తప్పక విచ్చేయుము. నేను సదాచారిని. నాకు సంపద ప్రసాదించుము. మఘవా! గోవులు కోరువారికి గోవులు, అశ్వములు కోరువారికి అశ్వములు ప్రసాదించుము.

2. ఇంద్రదేవా! నీవు అనేక వేల, వందల గో సమూహములను యజమానులకు ఇచ్చుచున్నావు. పురందరుడగు ఇంద్రుని మమ్ము రక్షింపుమని స్తుతించుచున్నాము. మంది మాటలతో ఇంద్రుని ప్రత్యక్షము చేసికొనుచున్నాము.

ఐదవ తృచ : ఋషి - సౌభరి.

1. అగ్ని హోత ఆనందప్రదుడు. అతడు జనులకు సమస్త ధనములు ఇచ్చుచున్నాడు. అట్టి అగ్నికి సోమపూర్ణ పాత్రను, స్తుతులను సమర్పించండి.

2. అగ్నిదేవా! నీవు దర్శనీయుడవు. విశ్వపతివి. ధానము లిచ్చువారు, దేవతలను సేవించువారు రథమును అశ్వముల వలె - నిన్ను స్తుతులచే సేవించుచున్నారు. మా పుత్ర పౌత్రులకు ధనవంతులంతటి ధనము నిమ్ము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. వరుణ దేవా! నా ఈ ఆహ్వానము ఆలకింపుము. నేడే మాకు సుఖములు కలిగించుము. నీ ఎదుట నిలిచి రక్షించుమని నిన్ను ప్రార్ధించుచున్నాను.

రెండవ తృచ : ఋషి - సుకక్షి.

1. వరద ఇంద్రా! ఏ రక్షణలచే మాకు పరమానందము కలిగించుచున్నావు? ఏ విధముగా వచ్చి మమ్ము ధనములతో నింపుచున్నావు?

మూడవ తృచ : ఋషి - మేదాతిథి.

1. యజ్ఞము కొఱకు దేవతలందు ఇంద్రునే ఆహ్వానించుచున్నాము. యజ్ఞము జరుగచుండ ఇంద్రునే ఆహ్వానించుచున్నాను. యజ్ఞసమాప్తియందు సేవకులమగు మేము ఇంద్రునే ఆహ్వానించుచున్నాము. ధనలాభమునకు ఇంద్రునే ఆహ్వానించుచున్నాము.

2. ఈ ఇంద్రుడే తన బలమహిమచే ద్యావాపృథ్వులను నింపినాడు. ఈ ఇంద్రుడే సూర్యుని ప్రకాశింపచేసినాడు. ఈ ఇంద్రుని యందే సకల భువనములు నిలిచియున్నవి. అభిషుత సోమము ఈ ఇంద్రుని యందే చేరి ఉన్నది.

నాలుగవ తృచ : ఋషి - విశ్వకర్మ.

1. విశ్వకర్మా! హవిస్సులర్పించి నిన్ను వర్ధిల్ల చేయుటకు తన శరీరమే ఆహుతిగా గల అగ్నియందు హవిస్సులు అర్పించుచున్నాము. యజ్ఞము చేయని వారు సకల దిశలందు మోహ వశ్యులు అగుదురు గాక. మేము అర్పించిన హవిస్సులందుకొని ఆ ధనశాలి మాకు స్వర్గము నిచ్చును గాక.

ఐదవ తృచ : ఋషి - అనానతుడు.

1. పవమాన, హరిత వర్ణ సోమ్ము దీప్యమాన ధారలచే - సూర్యుడు చీకట్లను వలెను విద్వేషులను నశింపచేయును. దశా పవిత్రపు సోమధారలు దీపించును. రసగ్రాహ్యములగు సోమధారలు స్తుతిముఖ తేజస్సున నక్షత్రములందు వ్యాపించి ఉన్నవి.

2. సోమమా! నీవు జ్ఞానివి. పూర్వ దిశకు సాగుచున్నావు. దివ్యము, దర్శనీయమగు నీ రథము సూర్య కిరణములను

కలసి కొనుచున్నది.

పౌరుషస్తుతులు ఇంద్రుని చేరుచున్నవి. జయప్రదములగు ఈ స్తుతులు ఇంద్రుని ప్రసన్నుని చేయుచున్నవి. వజ్రము ఇంద్రుని చేరుకొనుచున్నది.

సోమము, ఇంద్రుడు యుద్ధములందు శత్రువులచే పరాజితులు కాని వారు అగుచున్నారు. విజేతలగు చున్నారు.

3. సోమమా! పణులు దాచిన ధనమును తెచ్చినావు. యజ్ఞమును ధరించు మాతృసమ జలములందు పరిశుద్ధవైనావు. దూరము నుండి సామనధము వంటి నీ ధ్వని విని యజమానులు ఆనందభరితులు అగుచున్నారు. ముల్లోకములను వెలిగించగల వెలుగులు గల సోమము స్తోతలకు అన్నము ప్రసాదించుచున్నది. యజమానులకు అన్నము ప్రసాదించుచున్నది.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - భరద్వాజుడు.

1. పూషదేవా! నీవు గోవులను, అశ్వములను, అన్నములను, పుత్రులను, సేవకులను ఇచ్చువాడవు. నీ బుద్ధి అంతటి ఉదారము. ఆ బుద్ధితో మాకు రక్షణ కలిగించుము.

రెండవ తృచ : ఋషి - గోతముడు.

1. అమోఘ బలశాలులగు మరుత్తులారా! మిమ్ము స్తుతించి, స్తుతించి స్తోతలకు చెమటలు పట్టినవి. వారికి కోరిన ఫలములు ప్రసాదించండి.

మూడవ తృచ : ఋషి - ఋజిశ్వ.

1. అమృత పుత్రులగు విశ్వేదేవతలు మా స్తుతులు ఆలకింతురు గాక. మాకు చక్కని సుఖములు కలిగింతురు గాక.

నాలుగవ తృచ : ఋషి - వామదేవుడు.

1. శుచి మంతలగు ద్యావాపృథ్వులారా! మిమ్ము ప్రశంసించువారు మీ దరికి చేరినారు. ద్యోతమానులగు మీ కొరకు ఉత్తమ స్తోత్రములు సముపార్జించుచున్నారు.

2. ద్యావాపృథ్వులారా! మీ బుద్ధితోను, బలము తోను యజ్ఞమును, యజమానిని పవిత్రము చేయుచున్నారు. మీరు

రాజిల్లుచున్నారు. నిత్యము సత్యమును నిర్వహించుచున్నారు.

3. మహా ద్యావాపృథ్వులారా! మీరు మిత్రులకు సిద్ధి కలిగించుచున్నారు. సత్యమును తరింపచేసి యజ్ఞమును పూర్తి చేయుచున్నారు.

ఐదవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. ఇంద్రా! ఈ సోమము నీ కొరకు సిద్దము చేయబడినది. మగపావురము గర్భము ధరించు ఆడ పావురమును చేరినట్లు - ఈ సోమము నిన్ను చేరుకున్నది. అట్లే మా స్తుతులు సహితము నిన్ను చేరుచున్నవి.

2. ధనపతి, స్తుతివాహక, శూర ఇంద్రా! నీ స్తుతులు ఏవి కలవో అవి నీకు సంపన్నములు, సత్యస్వరూపములు అగును గాత.

3. శతక్రతూ! ఈ సంగ్రామమున మమ్ము రక్షించుటకు ఉత్తిష్ఠ, మనము కలిసి అన్య కార్యములను గురించి ఆలోచింతము గాక.

ఆరవ తృచ : ఋషి - హర్యతుడు.

1. గోవులారా! యజ్ఞములందు మంత్రములచే పితుకబడు గోవుల, మేకల పాలు ఎంతో అవసరమై ఉన్నవి. మీబు అవటమునకు చేరండి. మీ రెండు చెవులలో ఒకటి బంగారపుది ఒకటి వెండిది అయి ఉన్నవి.

2. అధ్వర్యాదులు దరికిచేరి మిగిలిన మధువును పాత్రలో పోయుచున్నారు. విసర్జించునపుడు అవటమున చేర్చుచున్నారు.

3. పైన చక్రము, క్రింద ద్వారము కలిగిన, అక్షయ మగు అవటమునకు నమస్కరించి హోమము చేయుచున్నారు.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - దేవాతిథి.

1. ఇంద్రా! నీవు ఉగ్రుడవు. నీ మైత్రి లభించినంత మాకు శత్రుభయము లేకుండును గాక. వరదుడగు నీ చరిత్ర స్తవనీయము. యదు, తుర్వశులు నీ అనుగ్రహము వలననే జీవించి ఉన్నారు!

2. ఇంద్రా! నీవు వరదుడవు. నీ కుడి భాగము సకల ప్రాణులను ఆచ్ఛాదించుచున్నది. ఎంతటి శత్రువైనను నిన్ను

బాధించజాలడు. తేనె వంటి పాలనిచ్చు గోవు వంటి సోమమా! త్వరగా రమ్ము ద్రవించుము. ఇంద్రా! సేవింపుము.

రెండవ తృచ : ఋషి - మేధాతిథి.

1. అనంత ధనవంత ఇంద్రా! నా స్తుతులు నిన్ను వర్ధిల్ల చేయును గాత. అగ్ని వంటి తేజోవంతులు, పవిత్రులగు స్తోతలు నిన్ను స్తోత్రములచే నుతించుచున్నారు.

2. ఈ ఇంద్రుడు వేలమంది ఋషులచే బలవంతునిగా చేయబడినాడు. ఇంద్రుడు సముద్రమంతటి విశాలుడు అయినాడు. ఇంద్రుని సత్యమును, బలమును, మహిమలను యుద్ధములందును, యజ్ఞములందును కొనియాడు చున్నారు.

మూడవ తృచ : ఋషి - శ్రుష్టిగుడు.

1. ఈ విశ్వములు యజ్ఞమునకు ప్రభువులు అగుచున్నవి. అవియే సేవకులై విధులను రక్షించుచున్నవి. సరస్వతి పిత స్వామియు నియంతవు అగుచున్నాడు. అయినను ఇంద్రా! ఈ హవిరూప ధనము నీకే చెందుచున్నది.

2. తొందరపడు ఋత్విజులు మధుక్షీరాది ఆహుతులు అర్పించియు, ఘృతము సమర్పించియు ఇంద్రుని యజించుచున్నారు. కావున మా ధనములు ప్రసిద్ధములగును గాక. సోమపు వర్షక శక్తి ప్రసిద్ధమగును గాక. మా వద్దనున్న సంస్కృత సోమములు ప్రసిద్ధములగును గాక.

నాలుగవ తృచ : ఋషి - అప్వృద్ధితుడు.

1. బలశాలి సోమమా! అభిషుత వైన నీవు మాకు గోరూప, అశ్వరూప ధనములను ప్రసాదించుము. తదుపరి పవిత్రము, దీప్యమానమగు నీ యొక్క రసమునందు ఆవు పాలు కలుపుదును.

2. దివ్యసోమమా! నీవు మా పశువులకు అధిపతివి. దీప్తవు. రసమయివి. ఋత్విజుల హితకారివి. నీవు మమ్ము మిత్రునకు మిత్రుని వలె కాంతి మంతులను చేయుము.

3. సోమమా! మా విషయమున నీ పురాతన మైత్రిని వెల్లడించుము. మా దీప్తులను అడ్డువారిని దూరము చేయుము. శత్రు తిరస్కర్త వాగు నీవు మమ్ము బాధించువారిని నష్టపరచుము. ద్వంద్వ స్వభావులను దూరము చేయుము.

అయిదవ తృచ : ఋషి - అత్రి.

1. ఆ సోమమును ఋత్విజులు ఆవుపాలలో కలుపుదురు. బాగుగా కలుపుదురు. కలసిపోవునట్లు కలుపుదురు. దేవతలు సోమరసమును ఆస్వాదింతురు. తదుపరి దానిలో మధుర గోరసమును కలుపుదురు. దానిని ఎత్తున ఉంచి, దిగుచున్న ద్రష్టయగు సోమమును బంగారముచే శుద్ధిచేసి జలము నందు చేర్చెదరు.

2. మేధావి, పవమాన సోమాపు స్తుతులు గానము చేయండి. సోమము - వర్షధారలవలె- అన్నము కలిగించుచున్నది. పాము కుబుసము విడిచినట్లు - సోమము అభిషవాదుల వలన - తన పాతరూపమును విడుచును. సొమ్ము అశ్వము వలె క్రీడించుచు ద్రోణకలశమున చేరును.

3. సోమము అగ్రగామి. విరాజమాన. అది నీట చేరి స్తుతించబడుచున్నది. అది దినములను కొలత వేయుచున్నది. హరిత వర్ణయై నీట వ్యాపించుచున్నది. సోమము సుందరము. దర్శనీయము. జ్యోతిర్మయ రథము కలది.

సోమము ధనము కలిగించుచున్నది. నివాసములు ఏర్పరచుచున్నది.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పదహారవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్నీ రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పదిహేడవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - శునశ్శేపుడు.

విశ్వేభిరగ్నే అగ్నిభిరిమం యజ్ఞమిదం వచః |
చనో ధా సహసో యాహో ||

1. బలపుత్ర అగ్నీ! సమస్తమగు అగ్నుల సహితుడవై మా యజ్ఞమునకు రమ్ము. మా మాటలు వినుము. మాకు అన్నము ప్రసాదించుము.

2. మేము నిత్యము, విస్తారమగు హవిచే అనేక దేవతలను యజించుచున్నాము. అయినను వానిని అన్నింటిని అగ్నివగు నీ యందే హోమము చేయుచున్నాము.

3. అగ్నీ! నీవు విశ్వపతివి. హోతవు. ప్రసన్నుడవు. వరేణ్యుడవు. **"నః ప్రియః అస్తు"** మాకు ప్రియతముడవు అగుము. **"స్వగ్నయః వయం ప్రియాః"** అగ్నులందరకు మేము ప్రియతమములము అగుదుము.

రెండవ తృచ : ఋషి - మధుచ్ఛందుడు.

1. ఇంద్రుడు సకలలోకముల పైన ఉన్నవాడు. మేము ఇంద్రుని ఆహ్వానించుచున్నాము. **"అస్మాకం కేవలః అస్తు"** ఇంద్రుడు కేవలము మావాడు కావలెను.

2. ఇంద్రా! నీవు సమస్త కోరికలు తీర్చువాడవు. వరదుడవు. ప్రసిద్ధుడవగు నీవు మా యజ్ఞమును ఆవిష్కరించుము. మాకు విముఖుడవు కాకుండుము.

3. ఇంద్రుడు ఈశానుడు. అప్రతిష్కృతుడు. వరదుడు. అతడు స్వబలమున మానవులను అనుగ్రహించుటకు వచ్చుచున్నాడు.

మూడవ తృచ : ఋషి - తృణపాణి.

1. అగ్నిదేవా! నీవు ధనికుడవు. విచిత్రుడవు. దర్శనీయుడవు. మాకు రక్షణల సహిత ధనములను ప్రసాదించుము. నీవు ధనములు అందించువాడవు కదా! మా పుత్రులకు శీఘ్రముగ కీర్తి కలిగించుము.

2. అగ్నిదేవా ! నీవు అపరాజితుడవు. పిత్రుస్థానమున నిలిచి మా పుత్ర, పౌత్రాదులను రక్షించుము. దేవతల కోపమును మా దరికి చేరనీయకుము. మానవుల హింసను దూరమున నిలుపుము.

నాలుగవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. విష్ణూ ! ఆ నీ పేరు ఎంతో విఖ్యాతము. నీ పేరు కిరణ యుక్తమని చెప్పుచున్నావు కదా! అట్టి రూపమును మా నుండి దాచకుము. యుద్ధమున నీవు మరొక రూపము దాల్చుచున్నావు. మాకు దర్శనము ఇచ్చుచున్నావు.

2. కిరణ్మయమూర్తీ! నీవు హవిస్సులకు స్వామివి. జ్ఞాతవ్యుడవు. విద్వాంసుడవు. ఆహ్వానయోగ్యుడవు. అట్టి నిన్ను స్తుతించుచున్నాను. నీవు మహితాత్ముడవు. ఈ లోకమునకు దూరముగా ఉన్నవాడవు. నిన్ను కీర్తించుచున్నాను.

3. విష్ణుదేవా! నీకు సుఖము కలుగుటకు అభిముఖుడనై వషట్కారము ద్వారా హవిని హోమము చేయుచుచున్నాను. కిరణ్మయమూర్తీ! దానిని స్వీకరించుము. మా స్తుతులు నిన్ను వర్ధిల్లచేయును గాత. మీరు మాకు

శుభములు కలిగించుచు నిత్యము మమ్ము రక్షించండి.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - వామదేవుడు.

1. వాయుదేవా! నీవు సంబంధించిన వ్రతములు చేసి దీప్తుడను అయినవాడను. స్వర్గసుఖములను కోరుచున్న వాడను. నీకు అందరికన్నముందు సోమము సమర్పించుచున్నాను. నీవు నీ నియుతనామక అశ్వములపై సోమపానము చేయుటకు విచ్చేయుము.

2. వాయుదేవా! ఇంద్రుడు, నీవు సోమపానార్హులు. నీరు గుంతలోనికి చేరినట్లు సోమము మిమ్మే చేరుచున్నది.

3. ఇంద్ర, వాయువులారా! మీరు బలములకు స్వాములు. శక్తిమంతులు. నియుతాశ్వవంతులు. మమ్ము రక్షించుటకును, సోమపానమునకును ఒకే రథము మీద విచ్చేయండి.

రెండవ తృచ : ఋషి - సూనుడు లేక రేభుడు.

1. రాత్రి గడచినంత జలములందు శోభిల్లు సోమమా! నీవు అన్నములవైపు సాగుచున్నావు. యాజ్ఞికులు హరితవర్ణవాగు నిన్ను సవనములకు చేర్చుచున్నారు.

2. ఏది మదకము, రసరూపమగునో, ఏది ఇంద్రునకు పానయోగ్యమగునో, దేనిని స్తోతలు పూర్వము, ఇప్పుడు సేవించుచున్నారో, దేనిని గోవులు గడ్డిరూపమున మేయుచున్నవో అట్టి సోమరసము శుద్ధిచేయబడుచున్నది.

3. పవమాన సోమమును సనాతనస్తుతులచే స్తోతలు కీర్తించుచున్నారు. కర్మచేయుటకు వినమ్రములైన అంగుళులు దేవతలకు హవి సమర్పించుచున్నవి.

మూడవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. అధ్వర సామ్రాట్టువగు అగ్నీ! నిన్ను స్తుతించియు, హవిస్సులు అర్పించియు ప్రణమిల్లుచున్నాము. గుర్రము తన తోకతో దోమలను తోలినట్లు నీవు నీ జ్వాలలచే మా విరోధులను తొలగించుము.

2. అగ్ని మాకు మంగళమయము, సుఖప్రదము అగునుగాత. బలపుత్రుడు, వేగవంతుడగు అగ్ని మా కోరికలు తీర్చువాడు అగునుగాక.

3. అగ్నీ! నీవు విశ్వవ్యాప్తివి. మాకు నష్టము కలిగించువారు దూరమందున్నను, దగ్గర ఉన్నను వారి నుండి మమ్ము రక్షించుము.

మూడవ తృచ : ఋషి - నృమేధ.

1. ఇంద్రదేవా! యుద్ధములందు ఎంతటి శత్రువునైనను లక్ష్యపెట్టవు. నీవు శత్రుబాధకుడవు. దేవతల ఆపదలను పరిహరించుచు అసురులకు ఆపదలు కలిగించుచున్నావు. వృత్రహంతా! బాధించు వారికీ సకల బాధలు కలిగించుచున్నావు.

2. ఇంద్రాదేవా! నీ బలము శత్రునాశకము. తల్లిదండ్రులు పిల్లల వెంట వెళ్ళినట్లు ద్యావాపృథ్వులు నీ బలమును అనుసరించుచున్నవి. నీవు వృత్రుని వధించినావు కదా! నీ క్రోధమునకు సకల సంగ్రామములందలి సేనలు గడగడలాడుచున్నవి.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - గోషూక్త్యుడు లేక అశ్వసూతి.

1. ఇంద్రుడు ఆకాశమున మేఘములను ఏర్పరచుచున్నాడు. భూమి మీద వర్షము కలిగించుచున్నాడు. యజ్ఞము అట్టి ఇంద్రుని వర్ధిల్ల చేయుచున్నది.

2. ఇంద్రుడు సోమము త్రాగినాడు. ఉత్సాహము కలిగినాడు. మేఘములను భిన్నము చేసినాడు. దీపించు అంతరిక్షమును మరింత సంపన్నము చేసినాడు.

3. ఆ ఇంద్రుడు గుహలందు దాచిన గోవులను విడిపించినాడు. వానిని ఋషులకు ఇచ్చినాడు. బలాసురుని తలవంచి పారగొట్టినాడు.

రెండవ తృచ : ఋషి శ్రుతకక్షి లేక సుకక్షి.

1. స్తోతలారా! ఇంద్రుడు సకల శత్రు తిరస్కర్త అతడు మీ సమస్త స్తుతులందు పరివ్యాప్తుడై ఉన్నాడు. అట్టి ఇంద్రుని మమ్ము రక్షించుమని యజ్ఞమునకు ఆహ్వానించండి. మాకు ప్రత్యక్షము గావించండి.

2. శత్రువు మీద దండెత్త గలిగిన అపరిహార్య సేనల యుద్ధములందు తలవంచనివాడును, సోమపాయియు, ఏమ్తతి శూరులును పరాక్రమమును గ్రహించజాలనట్టి ఇంద్రుని మా యజ్ఞమునాకు ఆహ్వానించండి.

3. ఇంద్రా! నీవు దర్శనీయుడవు. విద్వాంసుడవు. దానములను శత్రువులనుండి హరించుము. మాకు మరల మరల ప్రసాదించుము. శత్రువునుండి గుంజిన ధనముతో మమ్ము రక్షించుము.

మూడవ తృచ : ఋషి - గోషూక్త్యుడు లేక అశ్వసూక్తి.

1. ఇంద్రా! ఈ స్తుతి నీ మహాబలమును, శౌర్యమును, పరాక్రమమును, వరణీయ వజ్రమును తీక్షతరము చేయుచున్నది.

2. ఇంద్రా! ద్యులోకము నీ బమును భూలోకము నీ యశస్సును పెంచుచున్నవి. మేఘములు, జలములు నిన్ను తమ స్వామిగా భావించి నిను చేరుచున్నవి.

3. ఇంద్రా! పరమ ధామమును ఇవ్వగల విష్ణువు, మిత్రుడు, వరుణుడు నిన్ను స్తుతించుచున్నారు. మరుత్తులు తమ బలముచే నీకు హర్షము కలిగించుచున్నారు.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - విరూపుడు.

1. అగ్నిదేవా! యజమానులు తమకు బలము కలుగుటకు నిన్ను స్తుతించి ప్రణమిల్లు చున్నారు. నీవు నీ పరాక్రమమున శత్రువులను నాశము చేయుము.

2. అగ్నిదేవా! మేము మా గోవుల కోరికలు తీర్చ వలసి ఉన్నది. అందుకు మాకు మరింత ధనము అందించుము **"ఉరు కృదురు ణస్కృధి"** నీవు గొప్పలు చేయువాడవు నన్ను గొప్ప వానిని చేయుము.

3. బరువులు మోయువాడు మధ్యంతరమున బరువును విడువనట్లు ఇంద్రా! నీవు మమ్ము సంగ్రామ మధ్యమున విడువకుము. "సంవర్గం సం రయిం జయ" శత్రువులు కూడబెట్టిన ధనమును మా నిమిత్తము జయించుము.

రెండవ తృచ : ఋషి - వత్సుడు.

1. సముద్రమునకు నదులు తలలు వంచి చేరుచున్నవి. అట్లే ఇంద్రుని క్రోధము ముందు విశ్వప్రజ వినమ్రమగు చున్నది.

2. లోకములను గడగడలాడించిన వాడు వృత్రుడు. అట్టి వృత్రుని శిరమును ఇంద్రుడు తన శౌర్యమున సహస్రధారల వజ్రముచే తెగవేసినాడు.

3. అదిగో ఇంద్రుని బలము ప్రదీప్తమైనది. ఇంద్రుడు ఆ బలముతోనే ఉభయలోకములను చర్మమును వలె - తన అదుపునందుంచినాడు.

మూడవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. ఇంద్రా! నీ అశ్వములు జ్ఞానవంతములు, ధనవంతములు, రమణీయములు వాని నేత్రములు సుందరములు.

2. ఇంద్రా! నీవు సమరూపివి. అభీష్ట ప్రదుడవు. నీ అశ్వములు భద్రములు. వాహనయోగ్యములు. వానిని రథమున పూన్చి వెంటనే మా యజ్ఞమునకు రమ్ము. మేము నిన్ను, నీ అశ్వములను సేవించగలవారము.

3. తన దశాంగుళులతో కోరిన వానిని ఇచ్చువాడు ఇంద్రుడు. అతడు యజ్ఞమున సోమమధ్యమున నిలిచి ఉన్నాడు. అతనిని దర్శించండి. అతడు కలిగించు శుభములను తల దాల్చండి.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత ఉత్తరార్చిక యందలి
పదిహేడవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పద్దెనిమిదవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - మేధాతిథి.

పన్యం పన్యమిత్సోతార ఆ ధావత మద్యాయ |
సోమం వీరాయ శూరాయ ||

1. ఇంద్రుడు హర్షణీయుడు. వీరుడు. శూరుడు. స్తోతలారా! సర్వత్ర ప్రశంసనీయమగు సోమమును ఇంద్రునకు ప్రత్యక్షముగా సమర్పించండి.

2. ఇంద్రుని హర్యశ్వములు స్తుతి, హవిస్సుతో రథమున కూర్చబడునవి. సమర్ధములు. అవి ఈ యజ్ఞమునకు

మిత్రుడు, మంత్ర స్తుత్యుడగు ఇంద్రుని తీసికొని రావలెను.

3. ఇంద్రుడు సోమపాయి. వృత్రహంత అతడు తన అశ్వముల మీదనే రావలెను. మాకు దూరమున ఉండవలదు. వచ్చి మమ్ము బహువిధముల రక్షించవలెను. శత్రునాశము చేయవలెను.

రెండవ తృచ : ఋషి - శ్రుతకక్షి లేక సుకక్షి.

1. ఇంద్రా! నదులు సముద్రమునకు చేరినట్లు ఈ సోమములు నిన్ను చేరును గాత. నిన్ను మించిన వారు లేకున్నారు.

2. ఇంద్రా! నీవు అప్రమత్తుడవు. వరదుడవు. నీ ఉదరమున చేరు సోమ పానమునకు నీవు లోకమంతటను వ్యాపించి ఉన్నావు.

3. వృత్రహంత ఇంద్రా! మా సోమము నీ ఉదరమునాకు సరిపోవును గాత. నీ ప్రభావమున అది దేవతలందరకు చాలును గాత.

మూడవ తృచ : ఋషి - శునశ్శేపుడు.

1. అగ్నిదేవా! నీవు స్తుతులకు ప్రజ్వరిల్లువాడవు. ప్రతి యుద్ధమునకు యజ్ఞశాలకు చేరుము. ఉగ్రుడవగు నిన్ను స్తుతించుచున్నాము.

2. అగ్ని మహానుడు. అపరిచ్ఛిన్నుడు. పొగ గలవాడు. ఆనందప్రదుడు. అతడు మాకు సాహసము అన్నము కలిగించును గాత.

3. విశ్వపతి, దివ్యుడు, దూత, బృహద్భానుడగు అగ్ని - రాజువలె - మా స్తుతులు ఆలకించును గాత.

నాలుగవ తృచ : ఋషి - శంయుడు.

1. స్తోతలారా! సోమము అభిషుతము అయినది కదా! పురుహూత, శత్రుంజయ ఇంద్రుని గుమిగూడి స్తుతులు పాడండి. గోవునకు గడ్డి సుఖము కలిగించునట్లు - ఆస్తోత్రము ఇంద్రునకు సుఖకరమగును గాత.

2. ఇంద్రుడు సర్వవ్యాప్తి. అతడు మా స్తుతులు విన్నంత బహు ధన గోదానములకు వెనుకంజ వేయడు.

3. ఇంద్రుడు దైత్యనాశకుడు. అతడు దైత్యులు దాచిన గో వ్రజమును వశపరచుకున్నాడు. ఆ దైత్యులే కదా మా గోవులను అపహరించి దాచినది!

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - మేధాతిథి.

1. విష్ణువు ఈ సమస్త జగత్తును ఆక్రమించినాడు. అప్పుడు అతడు మూడు అడుగులు వేసినాడు. కావున ఈ సమస్త జగత్తు అతని పాదరేణువై ఉన్నది.

2. విష్ణువు ఎదురు లేనివాడు. జగద్రక్షకుడు. మూడు లోకములందు అగ్ని మున్నగు వానిని స్థాపించినాడు. అతడు మూడు అడుగులచే ఆక్రమించినాడు.

3. విష్ణువు మహిమలు కాంచండి. అతని వలననే యజ్ఞయాగాదులు జరుగుచున్నవి. అతడు ఇంద్రునకు మిత్రుడు అయి ఉన్నాడు.

4. విద్వాంసులు - నేత్రము ఆకాశపు అన్ని దిశలను చూచినట్లు - విష్ణువు యొక్క పరమ పదమును సదా దర్శించుచున్నారు.

5. విష్ణువు యొక్క ఏ పరమపదమైతే ఉన్నదో దానిని విశిష్టముగా స్తుతించునట్టియు, అప్రమత్తులైనట్టియు విద్వాంసులు దీప్తము చేయుచున్నారు.

6. విష్ణువు భూలోకమున కన్న పై లోకమున అడుగుల మోపుచు భూలోకమున ఉన్న మమ్ము రక్షించును గాత.

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. ఇంద్రదేవా! ఈ ఋత్విజులు కూడ నిన్ను మాకు దూరముగా రమింప చేయకుందురు గాక. దూరమునందున్నను మా యజ్ఞమునకు విచ్చేయుము. విచ్చేసి మా స్తుతులను ఆలకింపుము.

2. ఇంద్రదేవా! సోమము అభిషుతమైనంత స్తోతలు తేనెతీగల వలె నీ చుట్టు కూర్చుందురు. ధనము కోరు స్తోతలు తమ కోరికలను రథము మీద అడుగు పెట్టినట్లు నీకు విన్నవింతురు.

మూడవ తృచ : ఋషి - ఆయువు.

1. ఇంద్రుని కొరకు పురాతనములు, మననీయములగు స్తుతులు గానము చేయండి. ప్రాచీన, యజ్ఞసంబంధ బృహత్సామములను ఉచ్చరించండి. స్తోతకు స్తుతించు బుద్ధి కలుగును గాక.

2. ఇంద్రుడు మాకు ధనములు మరిన్ని ఇచ్చును గాత. భూములు ఇచ్చును గాత. సూర్యుని వంటి దీప్తమగు నిర్మల సోమము ఇంద్రుని చేరుచున్నది. గో దుగ్ధ సహిత సోమము ఇంద్రుని ప్రసన్నుని చేయుచున్నది.

నాలుగవ తృచ : ఋషి - అంబరీషుడు.

1. సోమమా! వృత్రహంత ఇంద్రుని పానము కొరకు పాత్రలందు నిండుము. దక్షిణ లందు కొను ఋత్విజులు ఇంద్రునకు హవి అర్పించుచున్నారు. యజ్ఞశాలయందున్న యజమానికి యజ్ఞఫలము కలుగును గాక.

2. మిత్రులారా! విద్వాంసులగు మీరు, మేము కలసి దీప్తము, బలకరము, సుగంధి యగు సోమమును ఆస్వాదింతము. బలకర సోమమును త్రాగుదుము.

3. **పరిత్యం హర్యతం హరిం బభ్రుం పువన్తి వారేణ |**
యో దేవాన్ విశ్వాం ఇత్పరి మదేన సహ గచ్ఛతి ||
పూర్వార్చిక 5వ అధ్యాయము 8వ ఖండము 8 మంత్రము పునరావృతము.

ఐదవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. **కస్తమిన్ద్ర తవ వసవా మర్త్యో దధర్షతి |**
శ్రద్ధాహితే మఘవన్ పార్యే దివి వాజీ వాజం సిషాసతి ||
పూర్వార్చిక 3వ అధ్యాయము 5వ ఖండము 8వ మంత్రము పునరావృతము.

2. ఇంద్రా! నీకు హవిస్సులు అర్పించు వారిని శత్రువధకు పురి కొల్పుము. హర్యశ్వ ఇంద్రా! నీచే ప్రోత్సహించబడిన స్తోతలు, పుత్రాది సహితముగ దుఃఖములను దాటుదురు గాక.

మూడవ ఖండము.

మొదటి తృచ : ఋషి - విశ్వమనువు.

1. అధ్వర్యులారా! మధుర సోమరూప అన్నమును, ఆనందదాయక సోమ రసమును ఇంద్రునకు సమర్పించండి. ఇంద్రుడు సమర్థుడు. బలమును పెంచుకొనువాడు. ఇతడే కదా! స్తుతించ దగినవాడు!

2. హర్యశ్వస్వామి ఇంద్రా! ప్రాచీన స్తుతులన్నియు నీవే యగును. మరొకడు స్వబలమున వానిని సాధించజాలడు. తేజోరూప ధనము సహితము నీదేయగును. మరొకడు సాధించజాలడు.

3. మేము అన్నార్దులము. ఇంద్రుడు అన్నముల స్వామి. మేము నిర్విఘ్నముగ యజ్ఞములు జరిపి వర్ధిల్లువారలము. మీ ఇంద్రుని ఆహ్వానించుచున్నాము.

రెండవ తృచ : ఋషి - సౌభరి

1. స్తోతలారా! ప్రసిద్ధుడగు అగ్నిని స్తుతించండి. దేవతలను యజించు వారు యోగ్య ధనమును పొందుచున్నారు.

అగ్నిదేవా! నీవు దేవతలకు సకల దిశల నుండి హవిస్సులు అందించుచున్నావు.

2. అగ్ని బృహత్ ధనవంతుడు. విచిత్ర కిరణముల వాడు. సోమ సాధకుడు. యజ్ఞ పూర్తి కర్త. పురాతనుడు. దేవతలకు హవి అర్పించు విప్రులారా! యజ్ఞ నిమిత్తము ఆ అగ్నిని స్తుతించండి.

మూడవ తృచ : ఋషి - భౌమఅత్రిః.

1. సోమమా! రాళ్లచే అభిషవించబడుచు, ఉన్ని పాత్రల నుండి జల్లించబడి, హరిత వర్ణవై కలశమున చేరుచున్నావు. జనులు పురమున ప్రవేశించినట్లు - చెక్క పాత్రలందు చేరుము.

2. అన్నాభిలాషియు, వీర్య అశ్వము వలె హర్షదాయకమగు సోమము ఉన్ని పాత్రలందు జల్లించబడి, ఋక్కులు చదువు విప్రులచే స్తుతించబడుచున్నది. శుద్ధిచేయబడుచున్నది.

నాలుగవ తృచ : ఋషి - కలి.

1. వజ్రియగు ఇంద్రుని గతమందునను, వర్తమానమునను సోమము సమర్పించి తృప్తుని చేయుచున్నాము. ఈ ఇంద్రుని కొరకే యజ్ఞమున సోమము అభిషవించబడుచున్నది. దీనిని వినగనే ఇంద్రుడు ఇచటికి చేరును గాత.

2. ఇంద్రుని మార్గములు జ్ఞానము ప్రశస్తములు. అవి ధారి దోపిడీ గాండ్రను సహితము అనుకూలురను చేయుచున్నవి. అటువంటి ఇంద్రా! మా స్తుతులు వినుము. అనేక ఫలముల నిచ్చు మనసుతో విచ్చేయుము.

ఐదవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ఇంద్రాగ్నులారా! మీరు దివిని ప్రకాశింప చేయువారు. యుద్ధములందు మీరు అందరిని తిరస్కరింతురు. మీ పరాక్రమమె యుద్ధములందు విజయము కలిగించుచున్నది.

2. **ఇంద్రాగ్నీ అపసస్పర్యుప ప్ర యాన్తి ధీతయః |**
ఋతస్య పథ్యా అను.
ఉత్తరార్చిక అ. 16. ఖం. 1. తృ 2. మం. 3. పునారావృతం.

3. **ఇంద్రాగ్నీ తవిషాణి వాం సధస్థాని ప్రయాంసిచ |**
యువారపూర్త్యం హితమ్.
అధ్యాయాదులు 2 వలెనే. మంత్రము 4

ఆరవ తృచ : ఋషి - మేధాతిథి / మేధ్యాతిథి

1. **క ఈం వేద సుతే సచా పిబంతం కద్వయో దధే |**
అయం యః పురో విభినత్త్యోషసా మందానః శిప్ర్యంధసః ||

2. ఇంద్రుడు శత్రువును వెదకి పట్టువాడు. గజము వంటి మదము గలవాడు. సకల యజ్ఞములకు సంచరించువాడు.

ఇంద్రా! నిన్ను నియంత్రించ గలవాడు లేడు. సోమము అభిషుతమైనది. విచ్చేయుము. నీవు మాకు పూజనీయుడవు. స్వబలమున సంచరించుచున్నావు.

3. ఇంద్రుడు ఉగ్రుడై శత్రువులను తుద ముట్టించువాడు. నిశ్చలుడు. యుద్ధము కొరకు ఆయుధములు ధరించువాడు. ధనవంతుడు. ఇంద్రుడు స్తోతల ఆహ్వానము విన్నంత మరొక చోటికి పోడు. ఇచటికే విచ్చేయును.

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - నిధ్రువి.

1. సోమము ఉజ్జ్వలము. దీప్యము. పూయమానము. అది సకల స్తుతులచే శుద్ధి చేయబడుచున్నది.

2. పవమానము అంతరిక్షము నుండి భూమి యొక్క ఉన్నత ప్రదేశమగు యజ్ఞ వేదికి చేరుచున్నది.

3. వేగవంతము, శ్వేతవర్ణమగు పవమాన సోమము సకల విద్వేషులను వధించుచు వర్ధిల్లుచున్నది.

రెండవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ఇంద్రాగ్నులు శత్రు బాధకులు - పాపనాశకులు. సమాన విజేతలు. అన్న ప్రదాతలు. వారిని ఈ యజ్ఞమునకు సోమపానమునకు ఆహ్వానించుచున్నాము.

2. **ప్ర వామర్చన్త్యుక్థినో నీథా విదో జరితారః |**
ఇంద్రాగ్నీ ఇషా ఆవృణే
ఉ.అ. 16 అ. 1. ఖం. 4. తృ. 1వ మంత్రము.

3. **ఇంద్రాగ్నీ నవతిం పురో దాసపత్నీ రధూమతమ్ |**
సాకమకేణ కర్మణా ||
ఉ. అ. 16 అ. 1. ఖం. 4తృ. 2వ మంత్రము.

మూడవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. బలముల నుండి ఆవిర్భవించిన అగ్నీ! మేము హవిస్సులు పట్టుకొని ఉన్నాము. రమణీయుడవు. దర్శనీయుడ వగు నిన్ను స్తుతించుచున్నాము.

2. అగ్నిదేవా! నీది బంగారు వన్నె. వెలుగొందు వాడవు. ఎండకు మాడిన వాడు నీడకు చేరినట్లు నీ శరణు జొచ్చినాము.

3. అగ్నిదేవా! నీవు పరమ బలశాలురను ధ్వంసము చేయగల ధనుస్సు వంటివాడవు. శీఘ్రగామివి. తీక్ష్ణశృంగుడవు. నీవు మూడు అసుర పురములను ధ్వంసము చేసినావు.

నాలుగవ తృచ : ఋషి - భరద్వాజుడు.

1. అగ్నిదేవా! నీవు యజ్ఞసంబంధివి. వైశ్వానరుడవు. జ్యోతిషస్పతివి. అవిచ్ఛిన్నుడవు. దీప్యమానుడవు. నిన్ను వరములు వేడుచున్నాము.

2. జగముల యజ్ఞముల ఆటంకములు తొలగించు అన్నింటిని వశము నందుంచుకొను అగ్ని రుతువులను కలిగించుచున్నాడు.

3. భూత భవిష్యత్కామి, సామ్రాట్టు అగు ఒకే అగ్ని భూమండలమున విరాజిల్లుచున్నాడు.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పద్దెనిమిదవ అధ్యయము సమాప్తము

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

పందొమ్మిదవ అధ్యాయము

మొదటి ఖండము

తొలి తృచ : ఋషి - విరూపుడు.

అగ్నిఃప్రత్నేన జన్మనా శూమ్భానస్తన్వాం స్వామ్ |
కవిర్విప్రేణ వావృధే ||

1. అగ్ని అనుభవజ్ఞుడు. సనాతన స్తోత్రములచే శోభయమానుడు అగుచున్నాడు. విప్రులచే వర్ధిల్ల చేయబడుచున్నాడు.

2. అన్నములకు పుత్రుడు, పావకుడు, దీప్తి మంతుడగు అగ్నిని స్వధ్వరమగు ఈ యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాను.

3. అగ్నిదేవా! నీవు మిత్రులచే పూజించబడువాడవు. జ్వాలలచే ప్రకాశించువాడవై దేవతలతో కూడి ఈ యజ్ఞమునకు విచ్చేయుము.

రెండవ తృచ : ఋషి - అవత్సారుడు.

1. రాతితో నలిగిన సోమమా! నీ వేగమున రాక్షసులను చిందర వందర చేసి నిలుచుచున్నావు. బాధించు శత్రువులను పీడించుము.

2. సోమమా! నీ బలము అపారము. నీవు శత్రువులకు నష్టము కలిగించుచున్నావు. అందువలన నేను భయము లేకున్నాను. శత్రునాశమునకు రథములతో సిద్ధపడినాము. ధనము కొరకు స్తుతించుచున్నాను.

3. పవమాన సోమాపు వ్రతములకు ఆటంకము కలిగించువాడులేదు. సోమమా! నిన్ను ఎదిరించు శత్రువులను బాధల పాలు చేయుము.

4. సోమము హర్షదాయకము. పాపహారి. బలయుక్త. మదకారి. ఆ సోమమును ఇంద్రుని కొరకని జలములందు చేర్చుచున్నారు.

మూడవ తృచ : ఋషి - విశ్వామిత్రుడు.

1. ఇంద్రా! నీ అశ్వములు ఆనంద దాయకములు. నెమలి పింఛము వంటి రోమములు కలవి. పాపహారులు అట్టి అశ్వములు గల నీవు యజ్ఞమునకు విచ్చేయుము. వేటగాడు త్రాళ్ళచే పక్షులను నిలిపినట్లు నిన్ను ఎవరును నిలుప కుందురు గాత. ఎడారిని దాటినట్లు వారిని ఉల్లంఘించి వెంటనే విచ్చేయుము.

2. ఇంద్రుడు వృత్రహంత. మేఘ విదీర్ణుడు. శత్రుపుర ధ్వంసి. జల ప్రేరకుడు. హర్యశ్వ రథమున ఆసీనుడగువాడు. బలవంతులగు శత్రువులను సహితము పరిమార్చువాడు.

3. ఇంద్రదేవా! నీవు గభీర సముద్రములను జలములచే పుష్టి కలిగించినట్లు యజ్ఞములకు పుష్టి కలిగించుచున్నావు. మంచి గోపాలుర వలన గోవులకు తృణాదికములు లభించినట్లు నీకు సోమము లభించుచున్నది. కుల్యములకు జలమువలె సోమము నీకు అందుచున్నది.

నాలుగవ తృచ : ఋషి - దేవాతిథి.

1. ఇంద్రా! గౌరమృగము దప్పి గొన్నపుడు జలాశయము వైపు వెళ్ళినట్లు మైత్రిగల నీవు మావద్దకు వెంటనే విచ్చేయుము. కణ్వులమగు మేము సిద్ధము చేసిన సోమమును త్రాగుము.

2. మఘువ ఇంద్రా! సోమాభిషవన కర్తలకు ధనము ప్రసాదించునట్లు నిన్ను సోమము ప్రసన్నుని చేయును గాత. మిత్రావరుణు జలముచే సంస్కరించిన సోమమును బలవంతముగా గుంజుకొని పానము చేయుచున్నావు. అందువలననే నీవు మహా బలశాలివని కీర్తించబడుచున్నావు.

ఐదవ తృచ : ఋషి - గోతముడు.

1. బలశాలి ఇంద్రా! దీప్యమానుడవగు నీవు మానవస్తోతలను ప్రశంసించుచున్నావు. ధనశాలి ఇంద్రా! నీవు తప్ప సుఖదాత లేడు. బ్రవీమి తే వచః - కావున నిన్నే కీర్తించుచున్నాను.

2. వ్యాపక ఇంద్రా! నీ భూతము మమ్ము ఎప్పటికి నష్ట పరచకుండును గాత. నీ వాయువులు మమ్ము నష్టపరచకుండును గాత. మేము మంత్రద్రష్టలము. మాకు సంస్థ ధనములు తెచ్చిఇమ్ము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - పురుమీఢుడు లేక అజామీఢుడు.

1. ప్రాణులకు ప్రేరణ కలిగించు, ఫలములు కలిగించు, తన సోదరి రాత్రి తిమిరములను ధ్వంసము చేయు ఉషస్సు అందరకు దర్శనము ఇచ్చుచున్నది.

2. అశ్వము వలె విచిత్ర వర్ణ, దీప్యమాన, కిరణ కారిణి, యజ్ఞవంత ఉష అశ్వినులతో కూడి స్తుతివంత అయినది.

3. ఉషాకుమారీ! నీవు అశ్వినీ కుమారుల సహచరివి. **"ఉత మాతా గవా మసి"** ఇంకను కిరణములకు తల్లి వంటిదానవు. మరి ధనములకు స్వామివి అగుచున్నావు.

రెండవ తృచ : ఋషి - ప్రస్కణ్వుడు.

1. ఈమె ఉష. దృశ్యమాన. ప్రియతమ. రాత్రి చివరన అవతరించునది. దివినుండి దిగి చీకట్లను దూరము చేయుచున్నది.

అశ్వినులారా! మిమ్ము మరింతగా స్తుతించుచున్నాను.

2. అశ్వినులు దేవతలు దర్శనీయులు సముద్రమున ఆవిర్భవించిన వారు. ధనములను మనసా ఇచ్చువారు. కర్మ చేసి దానములను ఇచ్చువారలు అగుచున్నారు.

3. అశ్వినులారా! మీ రథము అస్త్ర శస్త్ర సహితమై ప్రశంసనీయ స్వర్గమునకు అశ్వసహితమై చేరినపుడు స్తుతించబడుచున్నది. స్తుతులు మిమ్ము చేరుచున్నవి.

మూడవ తృచ : ఋషి - గోతముడు.

1. ఉషోదేవీ! నీవు అన్నయుక్తవు. మేము పుత్రపౌత్రులను పోషించదగిన విచిత్ర ధనమును అందించుము.

2. గోమతి, అశ్వవతి, సూనృతవతి, విభావరి ఉషా! మేము కర్మలు చేసుకొనుటకు చీకట్లను పోగొట్టుము.

3. అన్నవతి ఉషా! అరుణాశ్వములను రథమునకు కట్టుము. **"అథానో విశ్వా సౌభాగ్యా న్యావహ"** ఇక మాకు సకల సౌభాగ్యములను తెచ్చి ఇమ్ము.

నాలుగవ తృచ : ఋషి - గోతముడు.

1. అశ్వినులారా! మీరు శత్రుధ్వంసకులు. మా ఇంటికి విచ్చేయండి. గోవులు, హిరణ్యముతో కూడిన రథమును - సమమనస్కులై - మా ముందునకు తెచ్చి నిలుపండి.

2. అశ్వినులు శత్రునాశకులు. ఉపాసకులకు ఆరోగ్య ప్రదులు. సుఖప్రదులు. వారి అశ్వములు వేకువనే మేల్కొనునవి. అవి బంగారు రథమునకు తగులవలెను. వారిని సోమపానమునకు తీసికొని రావలెను.

3. అశ్వినులారా! మీరు ద్యులోకము నుండి ప్రశంసనీయ తేజస్సును తెండి. దానిని మాకు ఉపయోగ కరము చేయండి. మాకు బలము కలిగించు అన్నము ప్రసాదించండి.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - వసుశ్రుతుడు.

1. సర్వత్ర వ్యాపక అగ్నిని - ఆశ్రయ భూతమై ధేనువులకు తృప్తి కలిగించు అగ్నిని ఆశ్రయభూతమై శీఘ్రగామి అశ్వములను కలిగించు అగ్నిని - యజ్ఞకర్తలు ఆశ్రయించు అగ్నిని స్తుతించుచున్నాను.

అగ్నీ! స్తోతలమగు మాకు అన్నము తెచ్చి ఇమ్ము. **"ఇషం స్తోతృభ్య ఆ భర"**

2. అగ్ని మాత్రమే జనులకు అన్నము నిచ్చు చున్నాడు. అగ్నిని సమస్త జనులు అర్చించుచున్నారు. అట్టి అగ్ని ప్రసన్నుడు అయినాడు. అగ్ని సర్వత్ర వ్యాప్తము. సర్వ ప్రార్ధనీయమగు ధనమును ఇచ్చుటకు వచ్చినాడు.

"ఇషం స్తోతృభ్య ఆభర"

3. అతడు అగ్ని అగ్ని వ్యాపకుడు. స్తుత్యుడు అగ్నిని ధేనువులు యజ్ఞమునకు చేర్చుచున్నవి. అశ్వములు మెల్లమెల్లగా చేర్చుచున్నవి. సద్వంశజ విద్వాంసులు చేర్చుచున్నారు.

"ఇషం స్తోతృభ్య ఆభర"

రెండవ తృచ : ఋషి - సత్యశ్రవుడు / వత్సుడు.

1. ఉషా! నీవు దీప్తిమతివి. మాకు ధనము కలిగించుటకు నేడు పూర్వము వలెనే వెలుగులు ప్రసాదించుము. నీవు మంచి జన్మ కలదానవు. సత్యప్రియ వాణివి. వయ్యపుత్రుడను సత్యశ్రవుడనగు నన్ను అనుగ్రహించుము.

2. సూర్య పుత్రి ఉషా! శుచద్రథ పుత్రుడగు సునీథుని అంధకారమును దూరము చేయుము. నీవు సుజతహవు. సూనృత వాణివి. వయ్య పుత్రుడను సత్యశ్రవుడనగు నన్ను అనుగ్రహించుము.

3. ద్యులోక పుత్రీ - ఉషా! నీవు ఎంతో బలవంతవు. ధనదాత్రివి. నీవు పూర్వము అంధకారమును దూరము చేసినావు కదా! అట్లే నేడు మాకొరకని అంధకారమును దూరము చేయుము.

ఉషోదేవీ! నీవు సుజాతవు. సత్యవాణివి. నేను వయ్య పుత్రుడను. సత్యశ్రవుడను. నన్ను అనుగ్రహించుము.

మూడవ తృచ : ఋషి - అవస్యుడు.

1. అశ్వినులారా! మీరు ఫలప్రదాతలు. ధనమును అందించువారు. పరమ ప్రియమగు మీ రథమును ఋషులగు స్తోతలు స్తుతులచే శోభిల్ల చేయుచున్నారు.

"మాధ్వీ మమ శృతం హవమ్" మధు విద్యా విశారదులారా! మా ఆహ్వానమును ఆలకించండి.

2. అశ్వినులారా! మీరు శత్రునాశకులు. బంగారు రథముల వారు. శ్రేష్ఠ ధనవంతులు. నదులను ప్రవహింప చేయువారు. నన్ను సమస్త శత్రు తిరస్కర్తను చేయండి.

"మాధ్వీ మమ శృతం హవమ్"

3. అశ్వినులారా! మీరు ఉగ్రులు. హిరణ్మయ రథవంతులు. అన్న, ధనవంతులు. యజ్ఞమును సేవించుచు విచ్చేయండి.

"మాధ్వీ మమ శృతం హవమ్"

నాలుగవ ఖండము

మొదటి తృచ : ఋషి - బుధుడు లేక గవిష్ఠురుడు.

1. ప్రాతః కాలమున - పాలిచ్చు ఆవు వలె - అగ్ని జనుల సమిధలచే సచేతనుడు అగుచున్నాడు. ఉషః కాలము తీరునపుడు అట్టి అగ్ని కిరణములు - మహా వృక్షపు శాఖల వలె - అంతరిక్షమున వ్యాపించుచున్నవి.

2. హోతయగు అగ్ని దేవతలను యజించుటకు సచేతనుడు అయినాడు. సుమనస్కుడై పైకి ఎదుగుచున్నాడు. ప్రజ్వలిత, ప్రకాశమాన జ్వాలారూప అగ్ని తన బలమును కనబరచుచున్నాడు. **"మహాం దేవస్తమసో విరమోచి"** ఆ మహాదేవత తమస్సు నుండి ముక్తి కలిగించినాడు.

3. చీకట్ల త్రాళ్ళచే కట్టిన ఈ లోకమును ఈ మహాగ్ని విడిపించి తన కిరణములచే ప్రకాశింప చేయుచున్నాడు. తదుపరి ఘ్రుతధారలు జుహువునందు చేరి ఎగయుచున్నవి. అట్లు ఎగిసిన ఘ్రుత ధారలను ఆ మహాగ్ని సేవించుచున్నాడు.

రెండవ తృచ : ఋషి - కుత్సుడు.

1. **"ఇదం శ్రేష్ఠం జ్యోతిషాం జ్యోతిః"** ఈ ఉషస్సు వెలుగొందు గ్రహ నక్షత్రాదులన్నింటిలో శ్రేష్టము. అదిగో ఆ ఉషస్సు తూర్పున ఉదయించినది! సూర్యుని వలన కలిగిన రాత్రి ఉషస్సుకు కారణమైనట్లు దీని కిరణములు సమస్తమునకు వెలుగు నిచ్చుచున్నవి.

2. ఉష దీప్త. శ్వేతవర్ణ ఆమె తనకు పూర్వ రూపమగు రాత్రినుండి వెలువడినది. ఉషారాత్రులు సమాన బంధువులు. అమృత స్వరూపలు. అవి ఒకదాని తరువాత ఒకటిగా ఆవిర్భవించునవి. ఒకటి మరొక దానికి తావిచ్చుచు ఆకసమున సంచరించుచున్నవి.

(ఉషా, రాత్రులు సూర్యుని వలెనే కలుగుచున్నవి. కావున 'సమాన బన్దువులగు చున్నవి.)

3. ఉషా రాత్రులు అక్క చెల్లెండ్రు. వారిది ఒకే ఆకాశమార్గము. వారు అనంతలు. సూర్యునిచే శిక్షణ పొంది వారు ఆ మార్గమున సంచరించుచున్నారు. ఉషారాత్రులు అనన్యలు. స్పర్ధించరు. కలసి ఉండరు.

మూడవ తృచ : ఋషి - అత్రి.

1. ఉషస్సుల ముఖస్వరూప అగ్ని అవతరించినాడు. విప్రుల దేవతాస్తుతులు ఉదయించుచున్నవి. రథములు గల అశ్వినులారా! నేడు మాకు ప్రత్యక్షము కండి. పరిపూర్ణ యజ్ఞమునకు విచ్చేయండి.

2. అశ్వినులారా! సంస్కారమును, సంప్రదాయమును చెరపకండి. ఈ యజ్ఞమునకు విచ్చేయండి. స్తుతులను స్వీకరించండి. ప్రాణము పోవు వానికి అన్నము దొరికినట్లు ప్రాతః కాలమున వచ్చుచున్నారు. హవి అర్పించు వారికి సుఖములు కలిగించుచున్నారు.

3. అశ్వినులారా! ఉదయించు ప్రాతః సంధ్యలందు, మండుచుండు మధ్యాహ్నములందు, క్రుంగుచుండు అపరాహ్నములందు, రాత్రులందును మాకు సుఖములు కలిగించి, మమ్ము రక్షించుటకు విచ్చేయండి. ఇప్పుడు ఇతర దేవతలతో సమానముగా సోమపానము చేయండి.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - గోతముడు.

1. ఇవి ఉషస్సులు. చీకట్లు నిండిన లోకమున వెలుగులు నింపుచున్నవి. భూమి పూర్వార్ధమును ప్రకాశింప చేయుచున్నవి. సంస్కరించునట్టియు, సంచరించునట్టియు, మాతృమూర్తులగు ఉషస్సులు నిత్యము అవతరించుచున్నవి. రక్షించుచున్నవి.

2. అరుణకాంతుల ఉషస్సులు అనాయాసముగ ఉదయించుచున్నవి. సులభముగ రథమునకు కూర్చగల వృషభముల వంటి తెలుపు వెలుగులను రథమునకు పూన్చి ఉషస్సులు జనులకు తెలివి కలిగించుచున్నవి. తదుపరి అరుణ ఉషస్సులు శ్వేతవర్ణ సూర్యునిలో లీనమగుచున్నవి.

3. సత్కర్మలు చేయువారికీ, మంచిదాతలకు, అభిషవించు యజమానులకు ఉషస్సులు సమస్త అన్నములు కలిగించుచున్నవి. ప్రేరణ కలిగించు ఉషస్సులు తమ కాంతులచే సమస్త ఆకాశమును యుద్ధమున వ్యాపించు వీరుని వలె - వ్యాపించుచున్నవి.

రెండవ తృచ : ఋషి - దీర్ఘతముడు.

1. అగ్ని స్థాపితుడై ప్రజ్వరిల్లినాడు. సూర్యుడు ఉదయించినాడు. మహా ఉషస్సు చీకట్లను తరిమినది. అశ్వినులారా! అశ్వములను రథమునకు కట్టండి.

ప్రాసావీద్దేవః సవితా జగత్పృథక్ - సవితా దేవత విశ్వమును పనులకు పంపును గాక.

2. అశ్వినులారా! మీరు ఫలప్రదమగు మీ రథమును సిద్దపరచినపుడు మా బలమును ఘ్రుతమును వలె అమృతాయమానము చేయుచున్నారు. మా సంతానమునకు బ్రహ్మతేజము ప్రసాదించుడు. **"వయం ధనా శూరసాతా భజా మహే"** శూరులు చేయు యుద్ధమున మేము ధనమును అనుభవింతుము గాక.

3. అశ్వినుల రథము మా ముందుకు వచ్చును గాక. ఆ రథము మూడు చక్రములది. అమృతము ధరించినది. వడి గల గుర్రములు చేరినది. మాచే స్తుతించబడినది. త్రిబంధుర. ధనవంతము. విశ్వసౌభాగ్య అది మా మనుషులకు, పశువులకు సుఖము కలిగించును గాత.

మూడవ తృచ : ఋషి - అవత్సారుడు.

1. సోమమా! దివి నుండి కురియు వర్షము వలె నీ నిరంతర ధారలు మాకు అపరిమిత అన్నమును ప్రసాదించుచున్నవి.

2. హరిత వర్ణ సోమము జగత్కళ్యాణ కార్యములను వీక్షించుచు, ఆయుధములు ధరించుచు అరుదెంచుచున్నది.

3. పవమాన సోమమా! ద్యులోక, భూలోకములందున్న సకల ధనములను మాకు తెచ్చి ఇమ్ము.

దాశరథి రంగాచార్య విరచిత
శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత
ఉత్తరార్చిక యందలి పందొమ్మిదవ
అధ్యయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

ఇరువదవ అధ్యాయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - నృమేధ

ప్రాస్య ధారా అక్షరన్ వృష్ణః స్తుత స్యౌజసః |
దేవాం అను ప్రభూషతః ||

1. సోమము అభీష్టప్రద. అభిషుతము. దేవతలను అనుసరించ దలచినది. సోమము బలముచే ధారగా క్షరించబడినది.

2. సోమము **"జ్యోతిః".** వర్ధిల్లునది. ప్రవహించునది. యజ్ఞకర్తలగు అధ్వర్యాదులు వేదవాణిచే సోమమును స్తుతింతురు. శుద్ధి చేయుదురు.

3. బహు ధనవంత, స్తుతియోగ్య సోమమా! పునీతములగు నీ తేజస్సులు రక్షణ కలిగించుచున్నవి. నీవు సముద్రము

వలె వర్ధిల్లుము.

రెండవ తృచ : ఋషి - నృమేధ / వామదేవుడు.

1. ఏ ఇంద్రుని పేరు ప్రసిద్ధమో, ఎవడు ఋతువులను ఏర్పరచినాడో అతనిని స్తుతించుచున్నాను.

2. బలాధిపతి ఇంద్రా! నిష్ఠగల వాని స్తుతులు నిన్నే చేరుచున్నవి.

3. రాజమార్గముల నుండి పిల్ల బాటలు పోయినట్లు ఇంద్రా! నీ ధన దానములు నిన్ను అర్చించు వారి వైపు వెళ్ళుచున్నవి.

మూడవ తృచ : ఋషి - ప్రియమేధ.

1. ఇంద్రా! నీ పనులు అనేకములు నీవు హింసకులను తిరస్కరించు వాడవు. ఎంతో బలవంతుడవు. సజ్జన రక్షకుడవు. మమ్ము రక్షించుమని, సుఖములు కలిగించుమని రథమువలె నీకు ప్రదక్షిణ చేయుచున్నాము.

2. మహా బలశాలి, ఆశ్చర్యకార్యములు చేసినవాడు, పరాక్రమవంతుడు, పూజనీయుడగు ఇంద్రుడు విశ్వవ్యాప్తమగు తన మహిమచే లోకములను పూరించినాడు.

3. ఇంద్రుని హస్తములు మహా గొప్పవి. అవి భూమియందు సర్వత్ర వ్యాపించి ఉన్న బంగారమును, వజ్రాయుధమును పట్టి ఉన్నవి.

నాలుగవ తృచ : ఋషి - దీర్ఘతముడు.

1. అగ్ని యజమానుల యజ్ఞ వేదికలను వెలిగించువాడు. వాయువు వలె కోరిన చోటునకు చేరువాడు. కవి. అనేక యజ్ఞములందు అనేక రూపములు ధరించువాడు. అట్టి అగ్ని సూర్యుని వలె ప్రకాశించుచున్నాడు.

2. ఈ అగ్ని 'ద్విజన్మ' - రెండు అరణులు మధించగా పుట్టిన వాడు. ఇతడు ముల్లోకములను ప్రకాశింప చేయుచున్నాడు. అతడు హోత. పరమ పూజ్యుడై జల స్థానమున నిలిచి ఉన్నాడు.

3. 'ద్విజన్మ' హోతయగు అగ్ని సకల సత్కర్మలు చేయుచున్నాడు. హవి రూప అన్నమును ధరించుచున్నాడు. ఏ నరుడు ఈ అగ్నికి హవి అర్పించుచున్నాడో అతడు పుత్రవంతుడు అగుచున్నాడు.

ఐదవ తృచ : ఋషి - వామదేవుడు.

1. ఇంద్రునకు చేర్చవలసిన స్తుతులను అశ్వము వలె వహించువాడును, యజ్ఞము వలె పూజనీయుడును, హృదయమును ప్రియము కలిగించు వాడును అగు అగ్నిని స్తోతలమగు మేము వర్ధిల్ల చేయుచున్నాము.

2. అగ్నిదేవా! నీవు ఇప్పుడే సేవనీయుడవు, వర్ధిల్లువాడవు, అభీష్ట ఫలసాధకుడవు, సత్యస్వరూపి వగుచు **"బృహతః క్రతోః రథీ బభూథ** - మహా యజ్ఞమునకు సారథివి అగుచున్నావు.

3. అగ్నిదేవా! నీవు తేజస్సున సూర్య సముడవు. సమస్త తేజస్సులందు నీవే మనసున్న వాడవు. మా స్తుతులు వినుము. పూజ్యులగు ఇంద్రాదులు సహితుడవై మాకు దర్శనము కలిగించుము.

రెండవ ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రస్కణ్వుడు.

1. అగ్నిదేవా! నీవు అమరుడవు. జాతవేదివి. ఉషస్సు నడిగి యజమానులకు వివస్వతము, విచిత్రమగు ధనమును తెచ్చిఇమ్ము. నేటి ఉషః కాలమున దేవతలను యజ్ఞమునకు చేర్చుము.

2. అగ్నిదేవా! నీవు సేవించువాడవు. దూతవు. హవ్యా వాహనుడవు. యజ్ఞసారథివి. నీవు అశ్వినులు, ఉషోదేవీ సహితుడవై మమ్ము సువీర్యమగు బృహత్ అన్నమున స్థాపించుము.

రెండవ తృచ : ఋషి - బృహదుక్థః.

(ఇంద్రుడు కాల స్వరూపునిగా స్తుతించబడుచున్నాడు.)

1. ఇంద్రుడు సంస్థ కార్యకర్త. వేల శత్రువుల గుండెలు బ్రద్దలు చేయువాడు. అతడు తలచిన యువతను వార్ధక్యము మ్రింగుచున్నది. కవులారా! అట్టి ఇంద్రుని మహిమలను దర్శించండి.

అద్యమమార సహ్యః సమాన - నేడు మరణించిన వాడు రేపు వ్యక్తమగుచున్నాడు.

(పునర్జన్మ చెప్పుట ఇప్పుడే.)

(ఇంద్రుడు పక్షి రూపమున స్తుతించబడుచున్నాడు.)

2. ఒక శ్రేష్ఠ పక్షి. అరుణ వర్ణ. అది తన బలమున సమర్ధ. అది వచ్చినది. అది పరాక్రమశాలి. సనాతన. ఎచ్చటను గూడులేనిది. ఆ పక్షి ఏ కార్యము చేయునో అది ఫలించుచున్నది. నిష్ఫలము కాకున్నది. అది చెప్పుకొన దగిన ధనమును శత్రువుల నుండి జయించుచున్నది. ఉపాసకులకు ఇచ్చుచున్నది.

3. ఇంద్రుడు మరుత్తుల సహితముగ వర్షము కలిగించు వారిని ఆధీనమునందుంచు కొనును. అతడు మరుత్తులతో కూడియే వృత్రుని వధించినాడు. మహాకార్యములు చేయు ఇంద్రునకు సాయపడు మరుత్తులు వర్షము కలిగించునపుడు వెలువడుదురు.

మూడవ తృచ : ఋషి - బిందుడు / పూతదక్షుడు.

1. ఈ సోమము అభిషుతమై ఉన్నది. దీనిని తమ తేజస్సున వెలుగొందు మరుత్తులు, అశ్వినులు సేవించుచున్నారు.

2. మిత్ర, వరుణ, ఆర్యమ ఈ ముగ్గురు దశాపవిత్రమున శుద్ధమై మూడు పాత్రలందుండి స్తుతులచే సమర్పించిన సోమమును పానము చేయుచున్నారు.

3. ఇక ఇంద్రుడు అభిషుతమై, గోష్రుతాదులచే కలిసిన సోమమును హోతల వలె ప్రాతః కాలమున అభిలషించుచున్నారు.

(స్తోతలు ప్రాతః కాలమున స్తుతించ కోరుదురు.)

నాలుగవ తృచ : ఋషి - జమదగ్ని.

1. సూర్యదేవా! నీవు మహానుడవు - ఇది నిజము. ఆదిత్యదేవా! నీవు మహా బలశాలివి - ఇది నిజము. మహామహులగు స్తోతలు నీ మహిమను స్తుతించుచున్నారు. స్తుతియోగ్య సూర్యా! నీ మహిమలచే నీవు పూజనీయుడవైనావు.

2. సూర్యదేవా! అన్నవంతులలో నీవు గొప్ప వాడవు. ఇది సత్యము. దేవా! దేవతలందు నీ మహత్తు కారణముగా అధికుడవు. ఇది సత్యము. నీవు అసుర నాశకుడవు. దేవతలకు హితకారివి. "విభుజ్యోతి రదాభ్యం" వ్యాప్తమగు నీ తేజము ఇతరులకు లొంగనిది.

మూడవ ఖండము

మొదటి తృచ : ఋషి - సుకక్షి.

1. సోమముల స్వామీ ఇంద్రా! మేము సోమము అభిషవించినాము, హర్యశ్వముల మీద విచ్చేయుము. విచ్చేయుము హర్యశ్వముల మీద - మా అభిషుత సోమము సేవించుటకు.

(**ఉపనో హరిభిః సుతమ్** రెండు సార్లు చెప్పినాడు.)

2. ఇంద్రుడు వృత్రహంత శతక్రతువు. అతడు ఉగ్ర - శాంతి రెండు రూపముల వాడు అగుచున్నాడు.

"ఉపవో హరిభిః సుతమ్"

3. ఇంద్రా! నీవు పాపనాశకుడవు. ఏలనన నీవు సోమపాయివి గదా!

"ఉపవో హరిభిః సుతమ్"

రెండవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. మహా ధనములను సహితము పెంచగల మహా ఇంద్రునకు సోమము సమర్పించండి. మంచి బుద్ధి గల ఇంద్రుని మంచి స్తుతులచే కీర్తించండి. మానవుల అభీష్టములు తీర్చు ఇంద్రా! హవి సమర్పించు వారి వద్దకు విచ్చేయుము.

2. విప్రులారా! మహా వ్యాప్తి గల ఇంద్రుని గొప్పగా స్తుతించండి. ఎంతటి వీరులును ఇంద్రుని దీక్షను నివారించజాలరు.

3. ఇంద్రుడు సమస్తమునకు ప్రభువు. అతని కోపము ముందు నిలువగలవారు లేరు. అతడు శత్రుహంత. అందుకే స్తుతులన్నియు ఇంద్రునే చేరుచున్నవి. స్తోతా! నీవు సహితము ఇంద్రుని స్తుతించుటకు నీ బందువులను ప్రోత్సహించుము.

మూడవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. ఇంద్రా! నీవు ఎంతటి ధనస్వామివో నేను అంతటి ధనస్వామిని అగుదును గాక. కేవలము ధనహీనులకు కాక స్తోతలకు ధనదాతను అగుదును గాక.

2. ఇంద్రా! నిన్ను స్తుతించు వారు ఎక్కడ ఉన్నను వారికి రోజు ధనము ఇచ్చుచున్నాను. నీవు వినా బంధువులు లేకున్నారు. ప్రశంసనీయ పాలకుడు కూడా నిన్ను వినా మరొకడు లేకున్నాడు.

నాలుగవ తృచ : ఋషి - వసిష్ఠుడు.

1. ఇంద్రా! నీవు సోమపాయివి. నేను ఉపాసకుడను. నా పిలుపు వినుము. అర్చించు విప్రుని స్తుతులను స్వీకరించుము. మేము నిన్ను సేవించుచున్నాము. మాకు దగ్గరి వాడవగుము. సహాయకుడవై మా సేవల నందుకొనుము.

2. ఇంద్రా! నీవు శత్రు నాశకుడవు. స్తుతి మంతుడవు. నేను నీ శక్తి తెలిసినవాడను. నిన్ను విడువను. మహా స్తుతులను మరువను. కీర్తిశాలి వగు నీ స్తుతులను సదా ఉచ్చరించుచుందును.

3. మఘవా! మానవులందు నీ కొరకు సోమభిషేకము చేయువారు అనేకులున్నారు. మానవులు నిన్నే ఎక్కువగా ఆహ్వానించుచున్నారు. అట్లని ఎంతో కాలము మాకు దూరము కాకుము.

నాలుగవ ఖండము

తొలి తృచ : ఋషి - సుదాముడు.

1. స్తోతలారా! మన ఇంద్రుని రథము బలోపేతమై వచ్చుచున్నది. దాని ఎదుట నిలిచి పూజించండి. సంగ్రామములందు శత్రువు మీదకు వచ్చినను లోకమును రక్షించు వాడును, శత్రునాశకుడగు ఇంద్రుడు మాకు ధనములను ఇచ్చును గాత. మమ్ము గుర్తుంచుకొను గాత.

శత్రువుల ధనుస్సుల అల్లెత్రాళ్ళు తెగును గాక. **"నభన్తా మన్యకేషాం జ్యాకా అధిధన్వసు"**

2. ఇంద్రా! నీవు అంతరిక్షమునకు పోవు మేఘమును భిన్నము చేసినావు. అధోముఖము గల మేఘములను కురిపించుము.

ఇంద్రా! నీవు శత్రురహితుడవు అగుచున్నావు. అట్టి నిన్ను **"పరిష్వజామహే"** ఆలింగనము చేసి కొనుచున్నాము.

"నభన్తా మాన్య కేషాం జ్యాకా అధిధన్వసు"

3. మా అన్నములను, దానములను పెంపొందనీయకుండు శత్రువులు నశించినారు.

ఇంద్రా! మా కర్మములు కొనసాగును గాత. మమ్ము వధించదలచిన శత్రువు మీదకు నీ ఆయుధములు విసరుచున్నావు. నీవు ధనప్రదాతవు. మాకు ధనములు ప్రసాదించుము. **"నభస్త మన్య కేషాం జ్యాకా అధిధన్వసు"**

రెండవ తృచ : ఋషి - మేధాతిథి / ప్రియమేధి.

1. హర్యశ్వవంత ఇంద్రా! ధనవంతుడనగు నిన్ను స్తుతించువాడు ధనవంతుతుడు అగును గాత. నిన్ను మించిన ధనవంతుడగు స్తోత మరింత ధనవంతుడు అగును గాత.

2. ఇంద్రదేవా! ఇప్పుడు నీవు స్తుతించని వానిని తెలియుచున్నావు. చేయ బడుచున్న స్తుతులను తెలియుచున్నావు. గానము చేయబడు 'గాయత్రి' సమమును తెలియుచున్నావు.

3. ఇంద్రా! హింసించు వాని కొరకు మమ్ము వీడకుము. తిరస్కరించు వాని కొరకు మమ్ము వీడకుము. శక్తిశాలి ఇంద్రా! నీ పరాక్రమమున మాకు కోరిన ధనము నందించుము.

మూడవ తృచ : ఋషి - తిరశ్చి.

1. ఇంద్రా! స్తోతల స్తుతులు వినుటకు హర్యశ్వముల మీద విచ్చేయుము. నీ శాసనమున మేము సుఖముగా ఉన్నాము. దీప్త ధనవంతా! నీవు స్వర్గమునకు వెళ్ళుము.

2. ఈ యజ్ఞమున అభిషవ పాషాణ ధారలు - మగ గొర్రె ఆడ గొర్రెను వడికించినట్లు వడకించుచున్నవి.

ఇంద్రా! నీ శాసనమున మేము సుఖముగా ఉన్నాము. దీప్తధనవంతా! ఇక నీవు స్వర్గమునకు వెళ్ళుము.

3. ఇంద్రా! సోమమును అభిషవించు పాషాణములు ధ్వని సహితముగ నీకు సోమము అందించును గాత.

ఇంద్రా! నీ శాసనమున మేము సుఖముగా ఉన్నాము. దీప్త ధనవంతా! ఇక నీవు స్వర్గమునకు వెళ్ళుము.

నాలుగవ తృచ : ఋషి - జమదగ్ని.

1. సోమమా! నీవు మధుర రసమవై, ఆనంద దాయకవై ఇంద్రుని వద్దకు చేరుము.

2. సోమమా! బుద్ధివర్ధకము, అభిషుతము, నిర్మలమవై వాయువు వద్దకు చేరుము.

3. యజమానులకు అన్నము అందించ దలచిన దేవతల కొరకు రథము వలె సోమము సిద్ధముగా ఉన్నది.

అయిదవ ఖండము

మొదటి తృచ : ఋషి - పురుచ్ఛేపుడు.

1. అగ్ని పరమదాత. నివాసము ఏర్పరచువాడు. బలసూనుడు. జాతవేది. బ్రాహ్మణుని వలె పూజ్యుడు. యజ్ఞమును చక్కగా నిర్వహించువాడు. అత్యుత్తముడు. దేవతలకు చేర్చగలవాడు. దీప్తిమంతుడు. యజన యోగ్యుడు. ప్రవహించునదియు లేపన ఘ్రుతమున కాంతిమంతుడు.

"అగ్నీం హోతారు మన్యే" అగ్నిని హోమ సాధకుడని భావించుచున్నాను.

2. అగ్నీ! నీవు విప్రుడవు. జ్వాలవు అగ్నులందు జ్యేష్టుడవు. మేము నిన్ను పూజించదలచినాము. మననమే సాధనముగా గల ఋత్విజుల సమంత్రకముగా పరమ పూజ్యుడవగు నిన్ను ఆహ్వానించుచున్నారు.

అగ్నీ! నీవు సూర్య కిరణముల వలె సర్వత్ర వ్యాపించువాడవు. మానవులకు హోతవు. జ్వాలా కేశివి. వరదుడవు. స్వర్గాదులు కోరు జనులు నిన్ను సంతృప్తుని చేయుచున్నారు.

3. అగ్ని ఎంతో దీప్తివంతుడు. జ్వాలా రూప బలశాలి. మరిన్ని వెలుగులు చిమ్మువాడు. ద్రోహులకు పరశువంటివాడు. మాకు ద్రోహము తలపెట్టు శత్రువులను నాశనము చేసినాడు.

ఎవనితో కూడిన కఠిన శిలలు సహితము బ్రద్దలగునో, పర్వతములు కరిగి నీరై పారునో అట్టి అగ్ని శత్రుశేషము లేకుండ చేసి క్రీడించుచున్నాడు. అతడు పారిపోడు. ధనుర్ధారి శత్రువు ముందు నిలిచినను కదలడు.

రెండవ తృచ : ఋషి - అగ్ని.

1. అగ్నీ! నీ వద్దగల అన్నములు ప్రశంసనీయములు. దీప్తిరూప ధనశాలీ! నీ కాంతులు శోభాయ మానములు. బృహద్భానూ! కవీ! బలసమేతములగు ప్రశంసనీయ అన్నములను యజమానులకు ఇచ్చుచున్నావు.

2. అగ్నిదేవా! నీ జ్యోతులు పావకములు. నీ జ్యోతులు నిర్మలములు. నీ జ్యోతులు పరిపూర్ణములు. నీవు తేజోవంతుడవై ప్రత్యక్షమగుచున్నావు. నీవు పుత్రుని వలెను, మాతృమూర్తి వలెను దగ్గర ఉండి రక్షించుచున్నావు. ద్యావాపృథ్వులను హవిస్సులు అందించి కలుపుచున్నావు.

3. అరణ్య పుత్రా! జాతవేదీ! అగ్నీ! మేము నిన్ను చక్కగా స్తుతించుచున్నాము. మా స్తుతులను స్వీకరించుము. మేము అగ్నిహోత్రాదులు నిర్వహించుచున్నాము. తృప్తి చెందుము.

అనేక రూపములు కలదియు, తృప్తి కలిగించునదియు, సుజాతయునగు అన్నములను యజమానులు నీ కొరకు

హోమించుచున్నారు.

4. అగ్నీ! నీవు అమరుడవు. నీ కాంతుల వలన నీవు ఈశ్వరుడవు అగుచున్నావు. మా దానములను పెంపొందించుము.

అగ్నీ! తేజోమయ రూపమున కాంతులు విరజిమ్ముచున్నావు. దర్శనీయ కర్మములను ఫలయుక్తము చేయుచున్నావు.

5. అగ్నీ! నీవు అధ్వరములను సంస్కరించు వాడవు. శ్రేష్ఠ. జ్ఞానవంతుడవు. ధనస్వామివి. ధనదాతవు. అట్టి నిన్ను మేము స్తుతించుచున్నాము. నీవు స్తోతలకు మరింత ధనము, సౌభాగ్య ధనము, అనుభవయోగ్య ధనము ఇచ్చుచున్నావు.

6. అగ్నీ! నీవు సత్యస్వరూపివి. పూజనీయుడవు. విశ్వ దర్శనీయుడవు. తమకు సుఖము కలుగ వలెనని జనులు నిన్ను తూర్పు దిక్కున మొదట స్థాపించుచున్నారు.

అగ్నీ! నీవు స్తుతులను శ్రద్ధగా ఆలకించువాడవు. ఎంతో కీర్తి శాలివి. దేవతా సంబంధివి. మానవ దంపతులు నిన్ను వేదవాణిచే నుతించుచున్నారు.

ఆరవ ఖండము

మొదటి తృచ : ఋషి - సౌభరి.

1. అగ్నీ! నీవు ఎవరితో స్నేహము చేయుదువో అతడు వీరపుత్రవంతుడు, అన్నవంతుడు, బలవంతుడు అగుచున్నాడు. అతడు నీ రక్షణలందు వర్ధిల్లుచున్నాడు.

2. సోమము ప్రవహించునది. శకట రూపమున స్థిరపడునది. శబ్దించునది. వసంతమున వర్ధిల్లునది. దీపించునది. అగ్నిదేవా! నీ కొరకు హోమము చేయుటకు అధ్వర్యులు అట్టి సోమమును గ్రహించుచున్నారు. నీవు మహా ఉషస్సులకు మిత్రుడవు. రాత్రులందు వస్తువులను ప్రకాశింపచేయుచున్నావు.

రెండవ తృచ : ఋషి - అరుణుడు.

1. రుతువులందు పుట్టు ఓషధులు అగ్నిని తమ గర్భమున దాల్చుచున్నవి. ఆ అగ్నిని తల్లి వంటి జలములు ప్రసవించుచున్నవి. అరణ్యములు సహితము అగ్నిని ఆవిర్భవింప చేయుచున్నవి. గర్భవతులగు ఓషధులు సహితము విశ్వదాహ అగ్నిని ఉత్పన్నము చేయుచున్నవి.

మూడవ తృచ : ఋషి - అగ్ని/ప్రజాపతి.

1. అగ్ని ఇంద్రుని కొరకు జ్వలించుచున్నాడు. తెల్లని వెలుగుతో అంతరిక్షమున ప్రకాశించుచున్నాడు. గేదె గడ్డి తిని పాలిచ్చినట్లు - అగ్ని దేవతల కొరకు అన్నము కలిగించుచున్నాడు.

నాలుగవ తృచ : ఋషి - అవత్సారుడు.

1. ఎవడు అప్రమత్తుడో వానిని ఋక్కులు వరించుచున్నవి. ఎవడు అప్రమత్తుడో వానిని సామములు చేరుచున్నవి. ఎవడు అప్రమత్తుడో వానికి సోమము చెందుచున్నది. అగ్నీ! నీవు అట్టి వాడవు. నీ మైత్రి కలిగినంత నేను స్థిరనివాసిని అగుచున్నావు.

ఐదవ తృచ : ఋషి - అవత్సారుడు.

1. అగ్ని జాగృతుడు. అతనిని ఋక్కులు వరించుచున్నవి. అగ్ని జాగృతుడు. అతనిని సామములు చేరుచున్నవి. అగ్ని జాగృతుడు. అతనికి సోమము చెందుచున్నది. అగ్నీ! నీ మైత్రి కలిగినంత నేను స్థిరనివాసిని అగుచున్నాను.

ఆరవ తృచ : ఋషి - భృగువు.

1. పూర్వ సదస్యులగు మిత్రులకు నమస్కారము. ఇప్పుడు వెంట ఉన్నవారికి నమస్కారము. నూర్ల పదముల వచనములు పలుకుచున్నాను.

2. శతపద వచనము వల్లించుచున్నాను. గాయత్రి, త్రిష్టుప్, జగతి చందస్సుల సహస్ర పద సామమును గానము చేయుచున్నాను.

3. గాయత్రి, త్రిష్టుప్, జగతి ఛందో సామములను ఉద్గాతలు గానము చేయుచున్నారు. అనేక విధ స్థానములను దేవతలు కల్పించుచున్నారు.

ఏడవ తృచ : ఋషి - అవత్సారుడు.

1. అగ్ని జ్యోతి. జ్యోతి అగ్ని. ఇంద్రుడు జ్యోతి. జ్యోతి ఇంద్రుడు. సూర్యుడు జ్యోతి. జ్యోతి సూర్యుడు.

2. అగ్నిదేవా! బలసహితుడవై మాకు మరల లభించుము. అన్నము, ఆయువు సహితుడవై మాకు మరల

లభించుము. పాపముల నుండి మమ్ము మరల రక్షించుము.

3. అగ్నిదేవా! రమణీయ ధన సహితువై మమ్ము చేరుకొనుము. విశ్వము పైన నిలిచి విశ్వమును తడుపు ధారలు కలిగించుము.

ఏడవ ఖండము

మొదటి తృచ : ఋషి - గో సూక్తి. / అశ్వసూక్తి.

1. ఇంద్రా! ఎట్లు నీవు ఒక్కడవే ధనస్వామివి అగుచున్నావో అట్లే నేను ధనవంతుడను అగుదును గాక. అట్లయిన నన్ను స్తుతించువారు గోవులు కలవారు అగుదురు గాక.

2. శచీపతీ! నేను గోవులు కలవాడనైనచో నన్ను స్తుతించువారికి ధనము ఇవ్వదలచుదును ఇచ్చెదను.

3. ఇంద్రా! నిన్ను గురించిన స్తుతి సత్యస్వరూపము, మధురము, గోరూపము అగుచున్నది. అది యజమానుని వృద్ధి కోరుచున్నది. అభిషవ కర్తయగు యజమానికి గోవులను, అశ్వములను ఇచ్చుచున్నది.

రెండవ తృచ : ఋషి - త్రిశిరుడు. / సింధుద్వీపుడు.

1. జలములారా! మీరు సుఖములు కలిగించువారు. మాకు అన్నము కలిగించు సమర్థులు అగుదురు గాక. మమ్ము మహాజ్ఞాన యోగ్యులను చేయండి.

2. జలములారా! ఈ లోకమున మీ యొక్క రసములు పరమ సుఖస్వరూపలు అగుచున్నవి. తల్లులు పిల్లలకు చన్నిచ్చినట్లు మాకు మీ రసములను అందించండి.

3. జలమా! ఏ పాపము నాశమగుటకు నీవు మాకు ప్రేరణ కలిగించుచున్నావో, ఆ పాపక్షయము నకు గాను నేను నిన్ను తలదాల్చుచున్నాను. మాకు పుట్టించు శక్తి కలిగించుము.

మూడవ తృచ : ఋషి - ఉల్వుడు.

1. వాయువు మాకు హృదయానంద కరము అగునట్లును, ఔషధరూపము అగుచును వీచును గాక. మా ఆయువులను పెంచును గాక.

2. వాయువా! నీవు మాకు తండ్రివి, సోదరుడవు, సఖుడవు అగుచున్నావు. అట్టి నీవు మమ్ము జీవించు సమర్థులను

చేయుము.

3. వాయువా! నీ ఇంట ఏ అమృతము దాగి ఉన్నదో దానిని ప్రకాశవంతుడవై మాకు అందించుము.

నాలుగవ తృచ : ఋషి - సుపర్ణుడు.

1. సూర్యుడు వేగవంతుడు. బలవంతుడు. విశ్వరూపి పక్వము చేయువాడు. అతడు ఉదయించి వ్యాపించును. బంగారము మీద బట్ట కప్పినట్లు రాత్రిళ్ళు కనిపించకున్నాడు. యజ్ఞము కొరకు మరల ఆవిర్భవించుచున్నాడు.

2. జలమును ఆశ్రయించియే రేతస్సున్నది, విశ్వరూపమగు తేజస్సు ఉన్నది. ఏది భూమి మీద ఉన్నదో అది తన మహిమచే ఆకాశమున ప్రకాశించుచున్నది. అది సోమపు ఆహ్వానము విని గర్జించుచున్నది.

3. అగ్ని స్వర్గలోక, భూలోకములను భరించుచున్నాడు. జనులకు పాలించుచున్నాడు. యాచకులకు వందలు, వేలుగా భూరి దానములు చేయుచున్నాడు.

యజించు ఈ అగ్ని సహస్ర కిరణుడై సకల దిశల వ్యాపించి రాత్రులందు సూర్య ప్రకాశము కలవాడగుచున్నాడు.

ఐదవ తృచ : ఋషి - వేనుడు.

1. నీవు సుపర్ణుడవు. అంతరిక్షపువాడవు. బంగరు రెక్కల వాడవు. వరుణుని దూతవు. మెరుపులా నిలయమగు ఆకసమున ఉన్నవాడవు. జగత్ పోషకుడవు. పక్షి వలె ఆకసమున దర్సనమిచ్చుచున్నావు. అట్టి నిన్ను స్తోతలు అభిలషించినపుడు లభించుచున్నావు.

2. అతడు పైన ఉన్నాడు. జలములు ధరించి ఉన్నాడు. ప్రత్యక్షమగు చున్నాడు. ఆశ్చర్యకర ఆయుధములు ధరించి, తన కాంతులను సర్వత్ర నింపి అంతరిక్షమున నిలిచి ఉన్నాడు. తదుపరి హర్షము నిచ్చు వర్షము కలిగించుచున్నాడు.

3. అతడు ఆకసమున ఉన్నవాడు. జలబిందువులు దాల్చువాడు. సూర్య నేత్రమున చూచినాడు. అతడు మేఘము వైపు సాగినపుడు సూర్యుడు స్వచ్ఛ కాంతిచే ప్రకాశించును. మూడవ లోకమున దీప్తుడై వర్షము కలిగించుచున్నాడు.

దాశరథి రంగాచార్య విరచిత

శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత

ఉత్తరార్చిక యందలి ఇరువదవ అధ్యాయము సమాప్తము.

భద్రోనో అగ్ని రాహుతో భద్రారాతిః సుభగ భద్రో అధ్వరః |
భద్రా ఉత ప్రశస్తయః ||

ఇరువది ఒకటవ అధ్యయము

మొదటి ఖండము

మొదటి తృచ : ఋషి - ప్రజాపతి.

ఆశుః శిశానో వృషభో వభీమో ఘనాఘనః క్షోభణశ్చర్షణీనామ్ |
సంక్రందనో2నిమిష ఏకవీరః శతం సేనా అజయత్సాకమిన్ద్రః ||

1. ఇంద్రుడు త్వరపడువాడు. భయంకరుడు. వృషభము వలె అరి భీషణుడు. పాపులను నాశము చేయువాడు. ద్వేషులను క్షోభ పెట్టువాడు. దేవ ద్వేషులను ఏడిపించువాడు. యజ్ఞములకు ఆలసింపని వాడు. అతడు వందల సేనలను ఒకే దెబ్బతో గెలుచుచున్నాడు.

2. ఇంద్రుడు దేవ విద్వేషులను ఏడిపించువాడు. ఆలసింపనివాడు. జయశీల. యోద్ధ అన్యుల ముందు చలింపని వాడు. ధనుర్ధారి.

నరయోద్ధలారా! ఆ ఇంద్రుని వలన యుద్ధమును జయించండి. శత్రువుణు తరిమి కొట్టండి.

3. ఆ ఇంద్రుడు ధనుర్ధారులను వశపరచుకొనును. ఖడ్గదారులను వశపరచు కొనును. యుద్ధమున శత్రు మూకల మీదికి దూకును. కలిసి పోరాడు వారిని జయించును. సోమపానము చేయును.

ఇంద్రుడు భుజబలశాలి. నిత్యము ధనుస్సును సిద్ధముగ ఉంచును. విడిచిన బాణమున వధించక మానడు.

రెండవ తృచ : ఋషి - అప్రతిరథుడు.

1. అనేకులను రక్షించు ఇంద్రా! రథము మీద రమ్ము. వచ్చి రాక్షసులను హతమార్చుము. శత్రువులను పీడించుము. సేనలను చిందర వందర చేయుము. యుద్ధములను గెలువుము. మా రథములకు రక్షకుడవు అగుము.

2. ఇంద్రా! నీవు అందరి బలములు తెలిసిన వాడవు. మహానుడవు. పరమవీరుడవు. సాహసివి. అన్నవంతుడవు.

శత్రుంజయుడవు. ఉగ్రుడవు. నలుదిశలందు సేవకులు గలవాడవు. శక్తిశాలివి. బలములకు పుట్టిన వాడవు. స్తుత్యుడవు. జైత్రరథమున అధిష్టించుము.

3. ఇంద్రుడు కొండలు విరుచువాడు. స్తుతులు అందుకొనువాడు. వజ్రబాహువు. యుద్ధవిజేత. స్వబలమున శత్రువును ధిక్కరించువాడు.

సహవీరులారా! ఇంద్రుని పరాక్రమమును అనుసరించండి. మిత్రులారా! ఇంద్రునితో పాటు క్రోధము ప్రదర్శించండి.

మూడవ తృచ : ఋషి - అప్రతిరథుడు.

1. ఇంద్రుడు మబ్బులలోనికి చొరబడువాడు. శత్రు విషయమున నిర్ధయుడు. పరాక్రమశాలి. శతక్రతువు. క్రోధనుడు. అకంపనుడు. శత్రుసేనలను లక్ష్య పెట్టని వాడు. అప్రతిహతుడు.

"అస్మాకం సేనా అవతు ప్రయుత్సు" - యుద్ధములందు మా సేనలను భద్రముగా రక్షించును గాత.

2. ఇంద్రుడు మాకు నాయకుడు అగును గాక. బృహస్పతి దక్షిణమున ఉండును గాక. యజ్ఞ, సోమములు అగ్రమున ఉండును గాక. శత్రు మర్దన, విజేత దేవసేనల ముందు మరుత్తులు నడిచెదరు గాక.

3. వరద ఇంద్రుని, వరుణుని, ఆదిత్యుల, మరుత్తుల మహాబలము మాది అగును గాక. మహా మహులు, లోకపోషకులు, విజేతలగు దేవతల జయ జయ ధ్వానములు ఘోషించును గాక.

నాలుగవ తృచ : ఋషి - అప్రతిరథుడు.

1. మఘువా! మా ఆయుధములకు తీవ్ర ఉత్సాహము కలిగించుము. మా సేనలకు ఉత్సాహము కలిగించుము.

వృత్రహంతా! అశ్వము వేగములను ప్రకటించును. **'రథానాం జయతాం యస్తు ఘోషః'** రథముల జయ ధ్వానము ఘోషించును గాక.

2. శత్రుసేనలోనికి దూసుకొని పోయిన మా ధ్వజధారి సేనలను ఇంద్రుడు రక్షించును గాక. మా బాణములు జయించును గాక. మా వీరులు ఇతరులను మించుదురు గాక.

"అస్మాం ఉదేవా అవతా హవేషు" దేవతలు యుద్ధములందు మమ్మే రక్షింతురు గాత.

3.   మరుత్తులారా! బలమున స్పర్ధించు శత్రుసేన మా మీద దండెత్తుచున్నది. వారు ఒకరిని మరొకరు గుర్తించనట్లు గాఢాంధకారము కలిగించండి.

ఐదవ తృచ : ఋషి - అప్రతిరథుడు.

1.   పాపదేవతలారా! మాకు దూరముగా ఉండండి. శత్రువుల చిత్తములను ప్రలోభపెట్టండి. వారి అవయవములను పట్టుకొనండి. వారి మీద దండెత్తండి. వారి హృదయములందు దుఃఖ పరితాపము కలిగించండి.
"అన్ధేనామిత్రాస్తమసా సచన్తామ్"- శత్రువు చీకట్లలో పడి పోవును గాక.

2.   యోద్ధలారా! దండెత్తండి. జయించండి. ఇంద్రుడు మీకు సుఖము కలిగించును గాత. మీ భుజదండములు ఉగ్రములు అగును గాక. మీరు ఎవరికీ లొంగకుందురు గాత.

3.   బాణములారా! మీరు మంత్రములచే పదును పెట్ట బడిన వారు. హింసించగలవారు. విడిచినంత మీరు శత్రువునకు తాకండి. **"అమీషాం కంచానా మా ఉచ్ఛిషః"** పగ వారిలో ఏ ఒక్కరిని విడువకండి.

ఆరవ తృచ : ఋషి - ప్రజాపతి.

1.   వడిగల రెక్కల పక్షులు శత్రువు వెంట పడును గాత. ఈ శత్రుసేన గ్రద్దలకు తిండి అగును గాక. వీరిలో ఏ ఒక్కరు మిగులరాదు. ఇంద్రా! ఎక్కువ పాపము చేయని వానిని కూడ విడువ వద్దు. **"వయాం స్యేనానను సంయన్తు సర్వాన్"** పక్షులు వీరి నందరిని వెంబడించును గాత.

2.   మఘువ, వృత్రహంత ఇంద్రా! అగ్ని నీవు ఉభయులు కలసి మమ్ము ఎదిరించు శత్రుసేనను భస్మము చేయండి.

3.   ఎచట శిఖలు లేని కుమారుల వంటి శరములు పడునో అచట బ్రహ్మణస్పతి, అదితి మాకు సుఖములు కలిగించును గాక. **"విశ్వాహా శర్మ యచ్ఛతు"** నిరంతరము సుఖములు కలిగింతురుగాత.

ఏడవ సూక్తము - ఋషి - భరద్వాజుడు.

1.   ఇంద్రా! రాక్షసులను నాశము చేయుము. యుద్ధము చేయువారిని నాశము చేయుము. మా శత్రువుల తలలు రాల్చుము. మాకు మరింత హాని కలిగించు శత్రువుల క్రోధమును సహితము నష్టపరచుము.

2.   ఇంద్రా! మాతో యుద్ధము చేయు శత్రువులను వధించుము. యుద్ధము చేయు సేనల తలలు వంచి త్రిప్పిపంపుము. మమ్ము చుట్టుముట్ట దలచిన వారిని నికృష్ట అంధకారమున త్రోయుము.

3.   అసురుల మహా బలమున గెలిచిన ఇంద్రుని స్థూల, తరుణ, అప్రతిహత, ఏనుగు తొండము వంటి భుజ దండములను - యుద్ధము సంభవించినంత - తొలుత ప్రయోగించండి.

ఎనిమిదవ తృచ : ఋషి - అప్రతిరథుడు.

1.   రాజా! నీ శరీర మందలి మర్మ స్థానములను కవచముచే కప్పుచున్నాను. సోమరాజు నిన్ను అమృతమున ముంచును గాక. వరుణుడు నీకు మహా సుఖములు కలిగించును గాక. విజయుడవగు నీకు సమస్త దేవతలు ఆనందము కలిగింతురు గాక.

2.   శత్రువులరా! మీరు కుబుసము కప్పిన పాముల వలె అంధులు అగుదురు గాక. అగ్ని భస్మము చేయగా మిగిలిన వరిష్ట శత్రువులను ఇంద్రుడు పరిమార్చును గాక.

3.   మా విషయమున అభిమానము లేని బంధువులను చాటున ఉండి దూరము నుంచి హింసించు వారిని సకల దేవతలు నష్టపరతురు గాక. మాత్రమే నాకు బాణముల నుండి రక్షించు కవచము అగుచున్నది. కళ్యాణమయ కవచము నాకు రక్షణ అగును గాత.

తొమ్మిదవ తృచ : ఋషి - అప్రతిహతుడు.

1.   ఇంద్రా! నీవు గుహమందలి హింసక సింహము వంటి భయంకరుడవు. దూరము నుంచి ద్యులోకము నుండి విచ్చేయుము. వచ్చి దూరమునకు చేరు, తీక్ష్ణ వజ్రముచే మా శత్రువులను బాదుము. యుద్ధమునకు సిద్ధమగు వైర్ని నష్టపరచుము.

2.   భద్రం కర్ణేభిః శృణుయామ దేవా భద్రం పశ్యే మాక్షిభిర్యజత్రాః |
స్థిరైరఙ్గైస్తు ష్టువాం సస్తమా భిర్వ్యశే మహి దేవహితం యదాయుః ||

యజించబడు దేవతలారా! మేము చెవులతో శుభములనే విందుము గాక. కనులతో శుభములనే కాంచుదుము గాక. స్థిరమగు అవయవములు దేహములు కలిగి నిన్ను స్తుతించుచు దేవతలు నిర్ణయించిన ఆయువును పొందుదుము గాక.

(**యదాయుః షోడశాధికశత ప్రమాణం వింశతాధిక శతప్రమాణం నా దేవాయుః**" అని సాయణుని వ్యాఖ్య. దేవతలు నరులకు ఇచ్చిన ఆయువు నూట పదహారు లేక నూట ఇరువది సంవత్సరములు. అందుకే భారతీయులు సంపూర్ణ ఆయువులో సగమగు షష్టిపూర్తి జరుపుకొనుచున్నారు. పాశ్చాత్యులకు తెలిసిన పరిపూర్ణ ఆయువు నూరు

సంవత్సరములు. అందుకే వారు HALF WAY అని అర్ధ శతాబ్ది ఉత్సవము జరుపు కొనుచున్నారు.)

3. స్వస్తిన ఇన్ద్రో వృద్ధ శ్రవాః స్వస్తినః పూషా విశ్వవేదాః |
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తినో బృహస్పతి ర్దధాతు ||

ఇంద్రుడు బహుస్తుతులవాడు. అతడు మాకు అక్షయ శుభములు కలిగించును గాక. సర్వజ్ఞాని యగు పూషా మాకు అక్షయ శుభములు కలిగించును గాక. తిరుగులేని ఆయుధముల గరుత్మంతుడు మాకు అక్షయ శుభములు కలిగించును గాక. మహా మహా దేవతలకు ప్రభువు అగువాడు మాకు అక్షయ శుభములు కలిగించును గాక.

("బృహస్పతిః బృహతాం దేవానాం పతిః" అని సాయాణాచార్యులు.)

విద్వాంసుడు, బహుభాషావేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటక కర్త, బాలసాహిత్య కారుడు, విమర్శకుడు, సినీ రచయిత, వ్యాసకర్త, అనువాదకుడు, వక్త, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రగతి పథగామి, ప్రసన్నుడు, శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత, శుక్ల యజుర్వేద సంహిత, కృష్ణ యజుర్వేద సంహిత, శ్రీమద్రామాయణ శ్రీమహాభారత శ్రీమద్భాగవతాద్యనేక గ్రంథకర్తయునగు దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన సామవేద సంహిత సమాప్తము.

సర్వేభవన్తు సుఖినః - అందరు సుఖింతురు గాత.
సర్వేసన్తు నిరామయాః - అందరు రోగ రహితులు అగుదురు గాత.
సర్వేభద్రాణి పశ్యన్తు - అందరు శుభములనే చూచెదరు గాత.
నాకశ్చిద్దుఃఖ భాగ్భవేత్ - ఏ ఒక్కడు దుఃఖభాజనుడు కాకుండును గాత.

28-2-97
శుక్రవారం.

తథాస్తు